# యోహాను శుభవార్త

## పరిచయం

**రచయిత:**

యోహాను యేసు ప్రథమ శిష్యులలో ఒకడు. మత్తయి 4:21,22 చూడండి. ఈ శుభవార్తలో తనను తన పేరు పెట్టి పిలుచుకోడు కానీ "యేసు ప్రేమించిన శిష్యుడు" అని రాసుకుంటాడు (21:24 నోట్ చూడండి).

**వ్రాసిన కాలం:**

ఈ శకంలోని మొదటి శతాబ్దంలో.

**ముఖ్యాంశం:**

యోహాను తనకు తానే ఈ శుభవార్త ఎందుకు రాశాడో తెలియజేశాడు. 20:31 చూడండి. యేసు క్రీస్తు దేవుడనీ, అభిషిక్తుడనీ, లోక రక్షకుడనీ యోహాను రాసిన ఆయన మాటలను బట్టి, కార్యాలను బట్టి తేటతెల్లంగా అర్థం అవుతుంది.

**విషయసూచిక**


దేవుని వాక్కు, మనుషులకు వెలుగైన క్రీస్తు ............................ 1:1-18
బాప్తిసం ఇచ్చే యోహాను సాక్ష్యం ...................................... 1:19-34
క్రీస్తు మొదటి శిష్యులు ................................................ 1:35-51
క్రీస్తు నీటిని ద్రాక్షరసంగా మార్చాడు .................................. 2:1-11
క్రీస్తు ఆలయాన్ని ఖాళీ చేశాడు ......................................... 2:12-17
యూదులు సూచన అడిగారు ............................................ 2:18-25
క్రీస్తు, నీకొదేము ........................................................ 3:1-21
బాప్తిసం ఇచ్చే యోహాను మళ్ళీ ఇచ్చిన సాక్ష్యం ........................ 3:22-36
క్రీస్తు, సమరయ స్త్రీ ..................................................... 4:1-42
క్రీస్తు అధికారి కుమారుణ్ణి బాగు చేశాడు .............................. 4:43-54
క్రీస్తు బెతెస్థ కోనేరు దగ్గర ఒక మనిషిని బాగు చేశాడు ............... 5:1-15
క్రీస్తు తాను ఎవరో తెలియజేశాడు...................................... 5:16-30
క్రీస్తు దేవత్వానికి నిదర్శనం ............................................ 5:31-47
క్రీస్తు 5 వేల మందికి ఆహారం పెట్టాడు ............................... 6:1-15
క్రీస్తు నీటిమీద నడిచాడు ............................................... 6:16-24
క్రీస్తే జీవాహారం ......................................................... 6:25-59
క్రీస్తును అనేకమంది శిష్యులు వదలి వేశారు........................... 6:60-71
క్రీస్తు జెరుసలంలో విందుకు వెళ్ళి అక్కడ ఉపదేశించాడు .............. 7:1-52
క్రీస్తు పాపి అయిన ఒక స్త్రీని క్షమించాడు ............................. 8:1-11
క్రీస్తు యూదుల అధికారులతో వాదన చేశాడు ........................ 8:12-59
    లోకానికి వెలుగు.................................................... 8:12
    పరలోకంనుంచి పరలోకానికి........................................ 8:14-30
    క్రీస్తు మనుషులకు విడుదల కలిగించాడు ........................... 8:31-41
    సైతాను సంతానం ................................................... 8:42-47
    క్రీస్తే యెహోవా, "ఉన్నవాడను" అనేవాడు ......................... 8:54-59
క్రీస్తు పుట్టు గ్రుడ్డివాణ్ణి బాగు చేశాడు .................................. 9:1-34
ఆధ్యాత్మిక గ్రుడ్డితనం .................................................... 9:35-41
క్రీస్తు మంచి గొర్రెల కాపరి ............................................... 10:1-30
క్రీస్తు తానెవరో మళ్ళీ తెలియజేశాడు .................................... 10:31-42
క్రీస్తు చనిపోయిన లాజరును బ్రతికించాడు ............................. 11:1-44

క్రీస్తును చంపాలని యూదుల అధికారుల కుట్ర ........................ 11:45–57
క్రీస్తును బేతనీకి చెందిన మరియ అత్తరుతో అభిషేకించినది .......... 12:1–11
క్రీస్తు జెరుసలంలో ప్రవేశం ............................................ 12:12–19
క్రీస్తు తన మరణాన్ని గురించి మాట్లాడాడు ............................ 12:20–36
క్రీస్తును నమ్మడానికి యూదులు  నిరాకరించారు ...................... 12:37–43
క్రీస్తు అవిశ్వాసులను వేడుకొన్నాడు ..................................... 12:44–50
క్రీస్తు తన శిష్యుల పాదాలను కడిగాడు ............................... 13:1–17
క్రీస్తు, యూదా తనను పట్టి ఇస్తాడని ముందుగా చెప్పాడు............ 13:18–30
క్రీస్తు, పేతురు అబద్ధం చెప్తాడని ముందుగా చెప్పాడు................. 13:31–38
క్రీస్తు తన శిష్యులను ఓదార్చాడు ....................................... 14:1–4
క్రీస్తు దేవుని దగ్గరకు మార్గం .......................................... 14:5–14
క్రీస్తు దేవుని పవిత్రాత్మను వాగ్దానం చేశాడు ........................... 14:15–31
ద్రాక్షచెట్టు, తీగెల ఉదాహరణ .......................................... 15:1–17
ఈ లోకం లక్షణాలు..................................................... 15:18 – 16:4
దేవుని పవిత్రాత్మ జరిగించే పనులు ................................... 16:5–16
క్రీస్తు మళ్ళీ ఓదార్చి వాగ్దానాలు ఇవ్వడం ............................... 16:17–33
క్రీస్తు తనకోసం, విశ్వాసులకోసం,
తన శిష్యులకోసం ప్రార్థన చేశాడు ................................ 17:1–26
క్రీస్తు బంధించబడ్డాడు .................................................. 18:1–11
క్రీస్తు యాజుల సమక్షంలో.............................................. 18:12–24
క్రీస్తును పేతురు ఎరుగనన్నాడు ....................................... 18:15–18, 25–27
క్రీస్తు పిలాతు సమక్షంలో................................................ 18:28 – 19:16
క్రీస్తు సిలువలో ......................................................... 19:17–37
క్రీస్తు సమాధి............................................................ 19:38–42
క్రీస్తు చనిపోయిన వారిలోనుంచి లేచాడు .............................. 20:1–9
క్రీస్తు తన శిష్యులకు ప్రత్యక్షం అయ్యాడు .............................. 20:10–31
మగ్దలేనే మరియకు .............................................. 20:10–18
తన శిష్యులకు ..................................................... 20:19–22
తోమాకు ........................................................... 20:24–29
క్రీస్తు గలలీలో ప్రత్యక్షం అయి చేప అద్భుతాన్ని చూపాడు ....... 21:1–14
క్రీస్తు, పేతురు, యోహాను .............................................. 21:15–25

1 ఆదిలో “వాక్కు” ఉన్నాడు. “వాక్కు” దేవునితో ఉన్నాడు.
“వాక్కు” దేవుడే. 2 ఆయన ఆదిలో దేవునితో కూడా
ఉన్నాడు. 3 సమస్తమూ ఆయన మూలంగా కలిగింది. కలిగిన
దానంతటిలో ఆయన లేకుండా కలిగినది ఏదీ లేదు.

4 ఆయనలో జీవం ఉంది. ఈ జీవం మనుషులకు వెలుగు.
5 ఈ వెలుగు చీకటిలో ప్రకాశిస్తూ ఉంది గానీ చీకటి దానిని
గ్రహించలేదు.

6 దేవుడు పంపిన మనిషి ఒకడు ఉన్నాడు. అతని పేరు
యోహాను. 7 అతని మూలంగా అందరికీ నమ్మకం కుదరాలని
ఆ వెలుగును గురించి సాక్ష్యం చెప్పడానికి అతడు సాక్షిగా
వచ్చాడు. 8 అతడు ఆ వెలుగు కాదు. ఆ వెలుగును గురించి
సాక్ష్యం చెప్పడానికి వచ్చాడు.

9 ఆ వెలుగు లోకంలోకి వస్తూ ప్రతి ఒక్కరినీ వెలిగించే
వాస్తవమైన వెలుగు. 10 ఆ వెలుగుగా ఉన్న ఆయన లోకంలో
ఉన్నాడు. లోకం ఆయనమూలంగా కలిగిందే. అయినా లోకం
ఆయనను గుర్తించలేదు. 11 ఆయన తన సొంతదాని దగ్గరికి
వచ్చాడు గానీ తన స్వజనం ఆయనను స్వీకరించలేదు.
12 అయితే ఆయనను స్వీకరించినవారికి – అంటే, ఆయన

---

**1:1,2** “ఆదిలో” – 17:5; ఆది 1:1; 1 యోహాను 1:1,2. దేవుడు ఈ విశ్వాన్ని చేసినప్పుడు వాక్కు అంతకు ముందునుంచే ఉన్నాడు. విశ్వానికి ఆరంభం ఉంది గానీ వాక్కు శాశ్వతుడు, అన్నిటినీ సృష్టించినవానితో సంపూర్ణ ఐక్యత ఉన్నవాడు. తరువాత వస్తున్న వచనాలు, ముఖ్యంగా 14వ వచనం, వాక్కు అంటే ప్రభువైన యేసు క్రీస్తు అని స్పష్టం చేస్తున్నాయి. వాక్కు అనే మాట సూచించేదేమంటే ఒక భావాన్ని ఇతరులకు చెప్పడం, మాట్లాడడం, సందేశాన్ని తెలియజేయడం. దేవుని మనసులో ఏమున్నదో అది వాక్కుగా యేసు క్రీస్తు మూలంగా ప్రత్యక్షం అయింది. ఆయన తన వ్యక్తిత్వంలో దేవుని హృదయం, స్వభావం బహిరంగంగా వెల్లడి చేసినవాడు (వ 18; 10:30; 14:9; హీబ్రూ 1:3).

ఈ వచనాల్లో దేవుడు అంటే తండ్రి అయిన దేవుడు అని అర్థం (వ 18 చూడండి). తండ్రిని గురించి నోట్ మత్తయి 5:16. త్రిత్వం గురించి నోట్స్ 5:30; మత్తయి 3:16,17; 28:19; 2 కొరింతు 13:14.

“వాక్కు దేవునితో ఉన్నాడు” అంటే వాక్కు, తండ్రి ఒకటే వ్యక్తి కాదన్నమాట. ఇక్కడ ఇద్దరు వ్యక్తులు కనిపిస్తున్నారు.

“వాక్కు దేవుడే” అంటే ఆయనకు దేవుని స్వభావంలో సంపూర్ణమైన భాగస్వామ్యం ఉన్నదని అర్థం. ఈ సత్యం గురించి ఇతర రిఫరెన్సులు ఫిలిప్పీ 2:6; లూకా 2:11 నోట్స్‌లో ఉన్నాయి.

దేవుని “తోకూడా” అనేదాన్ని “ముఖాముఖిగా” అని అనువదించవచ్చు. ఇది సంపూర్ణ సహవాసాన్నీ సూచిస్తున్నది. 1వ వచనం “వాక్కు ఒక దేవుడు” అని చెప్పడం లేదు. లేక “వాక్కు కొంతవరకు దైవ లక్షణాలు ఉన్నవాడు” అనడం లేదు. ఇలా చెప్పే అనువాదం ఏదైనా మూల భాషకు ద్రోహం చేస్తున్నది. మూలభాష గ్రీకులో స్పష్టంగా “వాక్కు దేవుడే” అని రాసి వుంది.

**1:3** ఆది 1వ అధ్యాయం; 1 కొరింతు 8:6; కొలస్సయి 1:16; హీబ్రూ 1:2. విశ్వాన్ని సృష్టించడానికి తండ్రి అయిన దేవుడు కుమారుడైన దేవునితో, ఆయన ద్వారా పని చేశాడు. ఈ లోకం ఎవరో ఒక ఉపదేవుడు, ఒక చిల్లర దేవుడు చేసిన పని కాదు. ఇది ఏకైక దేవుని సృష్టి.

**1:4** వాక్కు కేవలం దేవుని మనసులోని ఒక భావం కాదు. దేవుని చర్యల్లో కనిపించే ఒక సూత్రమూ కాదు. వాక్కు సజీవుడైన ఒక వ్యక్తి. ఆయన ద్వారానే ఈ విశ్వమంతా, అందులో ఉన్నదంతా ఉనికిలోకి వచ్చాయి. 5:26; 6:57; 11:25 చూడండి. ఇప్పుడు ఆయన ద్వారానే మనుషులు నూతన, ఆధ్యాత్మిక, శాశ్వత జీవాన్ని పొందగలరు. – వ 12, 13; 3:16; 5:24; 20:31. యోహాను శుభవార్త అంతటా కనిపిస్తూ ఉండే ముఖ్యాంశాల్లో “జీవం” ఒకటి. ఈ పదం 36 సార్లు ఈ పుస్తకంలో కనిపిస్తుంది. యోహానుకు ఇష్టమైన మరో మాట “వెలుగు”. వెలుగు అంటే యోహాను ఉద్దేశం సత్యం, ఆధ్యాత్మిక వాస్తవికత. దేవుని వెలుగును మనుష్యులకు తెచ్చినది యేసు ప్రభువే (8:12; 9:5; 12:36,46). ఆయన దేవుణ్ణి గురించిన సత్యాన్నీ మన గురించి, పాపవిముక్తి గురించిన సత్యాలనూ ఆధ్యాత్మిక జీవనం గురించిన ప్రాముఖ్య సత్యాలన్నిటినీ మనం గ్రహించేలా చేస్తాడు.

**1:5** దేవుని వెలుగు ఎడతెగక ప్రసరిస్తూనే ఉంటుంది. మనుషులు దాన్ని అర్థం చేసుకోలేకపోవడానికి కారణం 3:19; రోమ్ 1:18-21; 2 కొరింతు 4:4లో ఉంది.

**1:6** ఈ యోహాను ఈ శుభవార్త రచయిత యోహాను కాదు. బాప్తిసమిచ్చే యోహాను. మత్తయి 3:1; 11:1 నోట్స్ చూడండి

**1:7,8** వ 15-36; 5:33.

**1:9** వ 4 – యేసుప్రభువు నిజమైన వెలుగు. అంటే ఆయనకూ, వెలుగు కాకపోయినా తాము వెలుగని చెప్పుకున్నవారికీ ఇతరుల దృష్టిలో వెలుగుగా చెలామణి అయినవారికీ ఎన్నో వ్యత్యాసాలు ఉన్నాయి. దేవుణ్ణి గురించిన సత్యం మొదలైనవాటిని మనుషులకు కనిపించేలా చెయ్యగలడు కాబట్టి యేసు నిజమైన వెలుగు. ఆయన అందరిమీదా, లోకమంతటిమీదా (8:12) వెలుగును ప్రసరింపజేస్తాడు. అయితే అందరూ ఆ వెలుగును స్వీకరించరు.

**1:10** “లోకంలో” అనే మాటలు ఈ లోకంలో ఆయన జననం, జీవితాలను సూచించేవి. మనుషులు తమ సృష్టికర్తను గుర్తించలేదు. పాపం వారి మనసులు బండబారిపోయేలా చేసింది. వారి ఆధ్యాత్మిక వివేచనను చంపేసి దేవుని నుంచీ, ఆయన విధానాల నుంచీ వారిని వేరు చేసింది. యెషయా 1:2,3; ఎఫెసు 4:18; కొలస్సయి 1:21 పోల్చి చూడండి.

**1:11** “తన స్వజనం” అంటే ఇస్రాయేల్‌వారు, యూదులు. లోకం ఆయన్ను గుర్తించలేకపోవడం మాత్రమే కాదు చాలావరకు ఆయన సొంత జాతే ఆయన్ను ఒప్పుకోలేదు (5:18,40; 7:47; 8:59; 19:6-15). అయితే తరువాతి వచనం స్పష్టం చేస్తున్న విధంగా వారిలో కొందరు ఆయన్ను స్వీకరించారు.

**1:12** బైబిలంతటిలోని గొప్ప వాగ్దానాల్లో ఇది ఒకటి. ఇందులో కొన్ని ప్రాముఖ్యమైన సత్యాలున్నాయి. మనుషులు సహజంగా దేవుని పిల్లలు కారు. వారు ఆయన పిల్లలుగా కావలసి ఉంది. 3:6; 8:44; ఎఫెసు 2:1,2; మొ॥ పోల్చి చూడండి. స్వభావ రీత్యా వారు తమ సృష్టికర్తపై తిరగబడి, దేవునికి వేరైన జీవులు (యిర్మీయా 17:9; ఆది 8:21; యెషయా 24:5; 59:1,2; రోమ్ 3:9-19). దేవుడు మనుషుల దగ్గరికి పంపిన వెలుగు, వాక్కు, రక్షకుడు, ముక్తిదాత అయిన యేసుప్రభువును స్వీకరించడం ద్వారానే వారు దేవుని పిల్లలు కాగలరు. ఆయన్ను స్వీకరించడం అంటే ఆయన మీద నమ్మకం ఉంచడం.

“నమ్మకం” ఈ శుభవార్తలో అతి ప్రాముఖ్యమైన పదాల్లో ఒకటి. “నమ్మకం అని తర్జుమా చేసిన గ్రీకు పదం రకరకాల ప్రయోగాలు ఈ శుభవార్తలో సుమారు 100 సార్లు కనిపిస్తాయి.

పేరుమీద నమ్మకం ఉంచినవారికి – దేవుని సంతానం కావడానికి ఆయన అధికారమిచ్చాడు. 13 వీరు రక్తంవల్ల గానీ శరీరేచ్ఛవల్ల గానీ మానవ సంకల్పంవల్ల గానీ కాక, దేవుని వల్లే పుట్టినవారు.

14 "వాక్కు" శరీరి అయ్యాడు. ఆయన కృపతో సత్యంతో నిండినవాడై కొంతకాలం మనమధ్య ఉన్నాడు. మేము ఆయన మహాత్యం చూశాం. ఆ మహాత్యం తండ్రి ఒకే ఒక కుమారుని దానిలాంటిది.

15 యోహాను ఆయనను గురించి సాక్ష్యం చెపుతూ ఇలా బిగ్గరగా అన్నాడు: "నా తరువాత వచ్చేవాడు నాకు మునుపు ఉన్నవాడు గనుక ఆయన నన్ను మించినవాడని నేను చెప్పినవాడు ఈయనే."

16 మేమందరమూ ఆయన సంపూర్ణతలో నుంచి కృప వెంబడి కృప పొందాం. 17 ఎందుకంటే, ధర్మశాస్త్రం మోషేద్వారా ఇవ్వడం జరిగింది; కృప, సత్యం యేసు క్రీస్తు ద్వారా కలిగాయి. 18 ఎవరూ ఎన్నడూ దేవుణ్ణి చూడలేదు. ఒకే ఒక దేవుని కుమారుడు తండ్రి రొమ్మున ఉన్నాడు. ఆయన దేవుణ్ణి వెల్లడి చేశాడు.

---

బైబిలులో మరి ఏ పుస్తకంలోనూ ఇన్ని సార్లు ఈ మాట కన్పించదు. మనం ఆయన్ను నమ్మకం ద్వారానే స్వీకరిస్తాం, నమ్మకం ద్వారానే దేవుని పిల్లలమౌతాం (3:15,16,36; 5:24; 6:47; అపొ కా 16:31; రోమ్ 10:9; గలతీ 3:26). ఆయన పేరు మీద నమ్మకం ఉంచడమంటే ఆయన పై నమ్మకం ఉంచడమే, బైబిల్లో వెల్లడి అయిన ఆయన గుణశీలాలపై, లక్షణాలపై నమ్మకం ఉంచడమే.

"అధికారమిచ్చాడు" – మొదటి నుంచి చివరివరకు పాపవిముక్తి దేవుడు ఉచితంగా ఇచ్చినదే. 4:10; రోమ్ 3:24; 4:4,5; 6:23; ఎఫెసు 2:8 చూడండి.

**1:13** "పుట్టినవారు" – దీని అర్థం కొత్త జన్మ, దేవుని నుంచి నూతన ఆధ్యాత్మిక జీవం పొందడం. యోహాను 3:3; 5:21,24; ఎఫెసు 2:1–5; యాకోబు 1:18; 1 పేతురు 1:23; 2:2; 1 యోహాను 3:9. ఇది వంశ పారంపర్యంగా వచ్చేది కాదు. ఒక వ్యక్తి తల్లిదండ్రులు లేక పూర్వీకులు దేవుని పిల్లలు కాబట్టి అతడు కూడా దేవుని సంతానమని అనుకోరాదు (3:6). ప్రతి మనిషీ వ్యక్తిగతంగా క్రీస్తును ప్రభువుగా రక్షకుడుగా స్వీకరించి దేవుని నుంచి కొత్త జీవాన్ని పొందాలి (మత్తయి 3:9 పోల్చి చూడండి). ఆధ్యాత్మిక జీవం శారీరకమైన పద్ధతి ద్వారా ఎవరికీ రాదు. ఏ వ్యక్తీ కూడా తన సంకల్పం చేత మరో వ్యక్తిని దేవుని సంతానంగా చెయ్యలేడు. దేవుడొక్కడే అలా చేయగలడు. యేసు ప్రభువును మనుషులు స్వీకరిస్తేనే అలా చేస్తాడు (వ 12). ఆధ్యాత్మిక సంతానాన్ని దేవుడు మాత్రమే పుట్టించగలడు. మానవజాతి అంతా రెండు గుంపులుగా ఉంది – దేవుని మూలంగా పుట్టినవారు, ఆ విధంగా పుట్టనివారు.

**1:14** "వాక్కు" – వ 1. దేవుడు మనిషి అయ్యాడు. రక్తమాంసాలు, నిజమైన మానవ స్వభావం కలిగినవాడయ్యాడు. ఆయన పేరు యేసు. క్రీస్తులో రెండు స్వభావాలు ఉన్నాయి. ఆ ఒకే వ్యక్తిలో దేవుని స్వభావం, మానవ స్వభావం పరిపూర్ణమైన విధంగా ఏకమయ్యాయి (మత్తయి 1:18–23; లూకా 1:26–35; గలతీ 4:4; హీబ్రూ 2:14,17). క్రీస్తు వ్యక్తిత్వం దేవుడు వెల్లడి చేసిన గొప్ప రహస్య సత్యం. అందువల్ల దాని గురించి మనం ఎక్కువగా అర్థం చేసుకోలేకపోయినప్పటికీ మనం నమ్మకంద్వారా ఆ సత్యాన్ని స్వీకరించాలి.

"మహత్యం" – అంటే బహుశా క్రీస్తు స్వరూపం మారిపోయిన సందర్భాన్నీ (2 పేతురు 2:16,17; మత్తయి 17:1,2), మొదటి నుంచి చివరిదాకా కృప, సత్యాలతో నిండి వున్న ఆయన జీవితం, పరిచర్యలను రెంటినీ సూచిస్తున్నది.

"కృప" – రోమ్ 1:7 నోట్. ఇది కొత్త ఒడంబడిక గ్రంథంలోని గొప్ప మాటల్లో ఒకటి. దేవుని కృప, అనుగ్రహం గురించి 100 కన్నా ఎక్కువ సార్లు కనిపిస్తుంది. కృప అంటే అర్హత లేని పాపులకు దేవుడు పాపవిముక్తినీ కొత్త జన్మనూ ఆధ్యాత్మిక జీవితానికి అవసరమైన అన్నిటినీ ఉచితంగా ఇవ్వడమే. మన కోసం చనిపోయేందుకు తన కుమారుణ్ణి ఇవ్వడమూ, మనలో జీవించేందుకు తన ఆత్మను ఇవ్వడమూ కృప. దేవుని కృప ఎంతో తేటతెల్లంగా యేసు క్రీస్తులో వెల్లడి అయింది. 2 కొరింతు 8:9 చూడండి. కృప గురించి కొన్ని ప్రాముఖ్యమైన రిఫరెన్సులు వ 17; అపొ కా 15:11; 18:27; 20:24; రోమ్ 1:7; 3:24; 5:2,15,20,21; 6:1,14; 2 కొరింతు 8:9; గలతీ 1:6; ఎఫెసు 1:6; 2:5–10; 2 తెస్స 2:16; తీతు 2:11; 3:7; హీబ్రూ 2:9; 4:16; యాకోబు 4:6; 2 పేతురు 3:18.

"సత్యం" – క్రీస్తు అవతారం అంటే సత్యాన్ని వెల్లడి చేయడమే. యోహాను ఒక్కడే సత్యం అనే మాట దాదాపు 25 సార్లు ఉపయోగించాడు (4:24; 8:31,32; 14:6,17; 16:13; 18:37 చూడండి). పాత ఒడంబడిక గ్రంథంలో కూడా దేవుడు సత్యస్వరూపి అయిన దేవుడు – కీర్తన 31:5. యేసు ఆయన అవతారం.

"ఒకే ఒక" – క్రీస్తు ఒక ప్రత్యేకమైన వ్యక్తి అని గట్టిగా నొక్కి చెప్పే విధానం ఇది. తండ్రి అయిన దేవునికి ఆయన దైవస్వభావంలో, శాశ్వతమైన ఉనికిలో పాలుగొన్న ఒకే ఒక కుమారుడు ఉన్నాడు. ఈ శుభవార్తలో దేవుణ్ణి 122 సార్లు "తండ్రి" అనడం జరిగింది. ఇతర శుభవార్తల్లో కంటే ఇది చాలా ఎక్కువ సార్లు. మత్తయి 5:16 నోట్ చూడండి.

**1:15** వ 6,30 యోహాను యేసుకన్నా ముందు జన్మించాడు. అతని పరిచర్య కూడా ముందే ఆరంభం అయింది. ఇక్కడ యేసు ఈ లోకంలోకి రాకముందే ఆయన ఉన్నాడని చెప్తున్నాడు రచయిత.

**1:16** ఈ వచనం గ్రీకు మూలం అస్తమానం ప్రవహించే కృపను సూచిస్తూ ఉంది. సముద్రం అలల్లాగా ఒక కృప చర్య తరువాత మరో కృప చర్య వస్తూ ఉండడమన్నమాట. ఈ కృప ప్రవహించే మార్గం యేసు క్రీస్తు.

**1:17** ధర్మశాస్త్రం అంటే దేవుడు మోషే ద్వారా సీనాయి పర్వతం పై చేసిన పాత ఒడంబడిక. అది దాదాపు పాత ఒడంబడిక గ్రంథమంతటికీ పునాది. నిర్గమ 19 అధ్యాయం నోట్స్ చూడండి. మోషే రచనల్లో దేవుని కృప, సత్యం బొత్తిగా వెల్లడి కాలేదని కాదు యోహాను ఉద్దేశం. క్రీస్తులో కృప, సత్యం రూపు దిద్దుకున్నాయనీ, ఆధ్యాత్మిక వెలుగు ప్రకాశమానంగా కనిపించిందనీ, కృప ప్రదర్శన అయిందనీ అతని భావం. క్రీస్తు శుభవార్త, మోషే ధర్మశాస్త్రం అనే ఈ రెండు మార్గాలకున్న తేడాను అతడు ఎత్తిచూపుతున్నాడు. ధర్మశాస్త్రం మనుషులకు పాపవిముక్తి కలిగించలేకపోయింది. మనుషులకు అవసరమైన సత్యమంతటినీ అది వెల్లడి చేయలేకపోయింది.

**1:18** కొందరు వ్యక్తులు అప్పుడప్పుడు దేవుని మహిమ ప్రత్యక్షాన్నీ, మానవ రూపంలో ఆయన స్వరూపాన్నీ చూశారు (నిర్గమ 24:9–11; 33:22,23; యెషయా 6:1). అయితే ఆత్మ స్వరూపిగా ఉన్న దేవుణ్ణి, మిరుమిట్లు గొలిపే ఆయన మహిమాన్విత తేజోరూపమైన తత్వాన్ని ఎవరూ చూడలేదు

19 “మీరెవరు?” అని అడగడానికి యూదులు జెరుసలం నుంచి యాజులనూ లేవిగోత్రికులనూ యోహానుదగ్గరికి పంపారు. అప్పడతడు చెప్పిన సాక్ష్యమిదే: 20 “అభిషిక్తుణ్ణి కాను” అని ఒప్పుకొన్నాడు. అలా ఒప్పుకోవడానికి నిరాకరించలేదు.

21 “అలాగైతే మీరు ఎవరు? ఏలీయా?” అని వారు అతణ్ణి అడిగారు.

అతడు “కాను” అన్నాడు.

“మీరు ఆ ప్రవక్తా?” అని వారు అడిగారు.

“కాను” అని జవాబిచ్చాడు.

22 “మీరు ఎవరైనట్టు? మమ్మల్ని పంపినవారికి మేము జవాబివ్వాలి. మీ గురించి ఏమని చెప్పుకొంటున్నారు?” అని వారు అతనితో అన్నారు.

23 అతడు “యెషయాప్రవక్త చెప్పినట్టు, ప్రభువుకోసం మార్గం తిన్ననిది చేయండి అంటూ అరణ్యంలో ఘోషిస్తూ ఉన్న ఒకని స్వరాన్ని నేను” అన్నాడు.

24 వారిని పంపినది పరిసయ్యులు. 25 వారతణ్ణి ఇలా అడిగారు: “మీరు అభిషిక్తుడు గానీ ఏలీయా గానీ ఆ ప్రవక్త గానీ కాకపోతే ఎందుకు బాప్తిసం ఇస్తున్నారు?”

26 యోహాను “నేను నీళ్ళలో బాప్తిసం ఇస్తున్నాను గాని మీరెరుగనివాడొకడు మీ మధ్య నిలుచున్నాడు. 27 నా తరువాత వచ్చేవాడు ఆయనే. ఆయన నన్ను మించినవాడు. ఆయన చెప్పుల వారును విప్పడానికి కూడా నేను తగను” అని వారితో బదులు చెప్పాడు.

28 ఇది యొర్దాను నదికి అవతల ఉన్న బేతబరలో జరిగింది. యోహాను అక్కడ బాప్తిసం ఇస్తూ ఉన్నాడు.

29 మరుసటి రోజున యేసు తనవైపు రావడం చూచి యోహాను “ఇదుగో, లోక పాపాన్ని మోసి తీసివేసే దేవుని గొర్రెపిల్ల! 30 ఈయనను ఉద్దేశించే నేను ఈ మాట చెప్పాను: నా తరువాత ఒక మనిషి వస్తాడు. ఆయన నాకు మునుపు ఉన్నవాడు గనుక నన్ను మించినవాడు. 31 నేను ఆయనను గుర్తుపట్టలేదు గానీ ఆయన ఇస్రాయేల్ ప్రజలకు ప్రత్యక్షం కావాలని నీళ్ళలో బాప్తిసం ఇస్తూ వచ్చాను” అన్నాడు.

32 యోహాను ఇలా సాక్ష్యం చెప్పాడు: “పరలోకంలో నుంచి దేవుని ఆత్మ పావురంలాగా దిగిరావడం, ఆయన మీద నిలిచి ఉండడం నేను చూశాను. 33 నేనాయనను గుర్తుపట్టలేదు గాని నీళ్ళలో బాప్తిసం ఇమ్మని నన్ను పంపినవాడు నాతో ఇలా అన్నాడు: ఎవరిమీద ఆత్మ దిగివచ్చి నిలిచి ఉండడం నీవు చూస్తావో ఆయనే పవిత్రాత్మలో బాప్తిసం ఇస్తాడు. 34 దానిని నేను చూశాను. ఆయన దేవుని కుమారుడని సాక్ష్యం చెప్పాను.”

35 మరుసటి రోజు యోహాను, అతని శిష్యులలో ఇద్దరు

---

(1 తిమోతి 6:16).

“తండ్రి రొమ్మున” – ఇది తండ్రి కుమారుల మధ్య ఉన్న సాన్నిహిత్యాన్ని, ప్రేమను సూచిస్తున్నది. వీరిద్దరూ వేరువేరు ప్రత్యేక వ్యక్తులని కూడా గమనించండి. మనుషులు దేవుణ్ణి చూడలేరు. కానీ యేసుప్రభు జీవితం, చర్యలు, మాటల్లో దేవుని లక్షణాలు మనకు సంపూర్ణంగా వెల్లడి అయ్యాయి. ఆయన ఈ లోకానికి రావడంలో ఆయనకున్న గొప్ప ఉద్దేశాల్లో ఒకటి తండ్రి అయిన దేవుడు ఎలాంటివాడో వెల్లడించడమే (8:19; 10:30; 14:9; 17:6).

**1:19** యోహాను కీర్తి వ్యాపిస్తున్నది. అందువల్ల విషయమేమిటో తెలుసుకోదలిచారు నాటి ఇస్రాయేల్ మతాధిపతులు. యాజుల గురించి నోట్ నిర్గమ 28:1.

“లేవీ గోత్రికులు” – సంఖ్యా 1:47–50.

**1:20** “క్రీస్తు” గురించి నోట్ మత్తయి 1:1. తాను ఆ వ్యక్తిని కాదని యోహానుకు తెలుసు. అలాంటి గౌరవం తనదని చెప్పడానికి అతడు ప్రయత్నించలేదు.

**1:21** క్రీస్తు రాకడకు ముందు ఏలీయా మరో సారి వస్తాడని యూదులు నమ్మారు (మలాకీ 4:5). మత్తయి 11:14; 17:10–12 నోట్ చూడండి. “ప్రవక్త” గురించిన ఈ ప్రశ్నను యూదులు ద్వితీ 18:15–19ను ఆధారం చేసుకుని అడిగారు.

**1:23** యెషయా 40:3; మత్తయి 3:3. అందరి దృష్టి తనవైపు మరలించుకోవాలని గానీ గొప్ప వాణ్ణనిపించుకోవాలని గానీ యోహాను ఉద్దేశం కాదు. యేసుప్రభువు కోసం దారి సిద్ధం చేసే ఒక స్వరంగా కేవలం ఉండడానికి అతనికి సమ్మతమే. మనుషుల పాలిట యేసు క్రీస్తు అన్నీ అయితే తాను వారికి ఏమీ కానివాడుగా ఉండడం అతనికి సంతోషమే (వ 27; 3:30). ఇందులో ఇతడు మనందరికీ ఆదర్శం. దేవుడు మనలో చూడాలనుకునేది అణకువే గాని గొప్పవాళ్ళం కావాలనీ, కీర్తి ప్రతిష్ఠలు కలగాలనీ తాపత్రయం కాదు.

**1:24** పరిసయ్యుల గురించి నోట్ మత్తయి 3:7.

**1:25** బాప్తిసం గురించి నోట్ మత్తయి 3:6.

**1:26** ఈయన యేసుప్రభువు అని అతని ఉద్దేశం. ఇంతవరకు ఎవరూ ఆయన్ను అభిషిక్తుడుగా, దేవుని కుమారుడుగా గుర్తించలేదు. వ 10,11 పోల్చి చూడండి.

**1:27** మత్తయి 3:11 చూడండి.

**1:28** జెరుసలం దగ్గర మరో బేతనీ ఉంది.

**1:29** పాత ఒడంబడిక గ్రంథంలో వర్ణించిన బలులను “గొర్రెపిల్ల” అనేమాట గుర్తుకు తెస్తూవుంది. లేవీ 1:2,10–14; 3:6–8; 14:12,21,24; నిర్గమ 12:3–13; ఆది 22:7–14. తండ్రి అయిన దేవుడు పాపాలను తీసివేసేందుకు యేసుప్రభువును బలిగా చేస్తాడని యోహాను ఉద్దేశం. రోమ్ 3:25; 1 కొరింతు 5:7; ఎఫెసు 5:2; హీబ్రూ 9:26; 10:12; 1 పేతురు 1:19 పోల్చి చూడండి. ఈ బలి పాత ఒడంబడిక బలుల్లాగా ఇస్రాయేల్‌లోని వ్యక్తుల కోసమో, ఆ జాతి అంతటి కోసమో కాదు. ఇది మానవ జాతి అంతటికోసం. యేసుప్రభువు మానవ పాపాన్నీ, దేవునికి మనిషి చెల్లించవలసిన రుణాల భారమంతటినీ తీసివేశాడు. అంటే మనుషులంతా పాపవిముక్తి పొందారని కాదు. రక్షణ మార్గం, పరిపూర్ణ క్షమాపణ మనుషులందరికీ అందుబాటులోకి వచ్చింది అని అర్థం.

**1:30** వ 15.

**1:31** దేవుడు అతనికి వెల్లడి చేసేంతవరకు యోహాను యేసును అభిషిక్తునిగా గుర్తించలేదు. కానీ తన పని ఏమిటో అతనికి తెలుసు – వ 23.

**1:32** మత్తయి 3:16. దేవుని ఆత్మను గురించి నోట్స్ 14:16,17.

**1:33** మత్తయి 3:11.

**1:34** దేవుని కుమారుని గురించి నోట్స్ 3:16; 5:18–23; మత్తయి 3:16,17; 11:27.

**1:35–37** “శిష్యులు” అని తర్జుమా చేసిన గ్రీకు పదానికి “నేర్చుకునేవారు” అని అర్థం. మత్తయి 10:1 నోట్ చూడండి. యోహాను తనకు శిష్యుల గుంపును ఏర్పరచుకుందాం

మళ్ళీ అక్కడ నిలుచున్నారు. 36 ఆ దారిన నడుస్తూ ఉన్న యేసును చూచి అతడు “ఇదుగో, దేవుని గొర్రెపిల్ల!” అన్నాడు.

37 అతడు చెప్పినది ఆ ఇద్దరు శిష్యులు విని యేసును అనుసరించారు. 38 యేసు వెనక్కు తిరిగి, వారు తనను అనుసరించడం చూచి “మీరు దేనిని వెతుకుతున్నారు?” అని వారినడిగాడు.

వారు “రబ్బీ! మీరు ఎక్కడ నివాసం చేస్తున్నారు?” అని ఆయనను అడిగారు. (రబ్బీ అంటే బోధకుడని తర్జుమా).

39 “వచ్చి చూడండి” అని ఆయన వారితో అన్నాడు గనుక వారు వెళ్ళి ఆయన ఉన్న స్థలం చూశారు. అప్పటికి సుమారు నాలుగు గంటలైంది గనుక వారు ఆ రోజు ఆయనతో ఉండిపోయారు.

40 యోహాను చెప్పినది విని యేసువెంట వెళ్ళిన ఆ ఇద్దరిలో ఒకడు అంద్రెయ. అతడు సీమోను పేతురుకు తోబుట్టువు. 41 అతడు మొట్టమొదట తన తోబుట్టువు సీమోనును కనుక్కొని అతనితో “మేము అభిషిక్తుణ్ణి చూశాం!” అన్నాడు. (అభిషిక్తుడు అంటే క్రీస్తు అని తర్జుమా.) 42 అతణ్ణి యేసు దగ్గరికి తీసుకువచ్చాడు. యేసు అతణ్ణి చూచి “నీవు యోనా కుమారుడైన సీమోనువు. నిన్ను ‘కేఫా’ అంటారు” అన్నాడు (కేఫా అంటే రాయి అని తర్జుమా).

43 మరుసటి రోజు యేసు గలలీకి వెళ్ళాలని ఉండి ఫిలిప్పును చూచి “నా వెంట రా” అన్నాడు. 44 ఫిలిప్పు బేత్‌సయిదా వాడు. అది అంద్రెయ, పేతురుల గ్రామం.

45 ఫిలిప్పు నతనియేలును కనుక్కొని “ధర్మ శాస్త్రంలో మోషే, ప్రవక్తలు కూడా ఎవరిని గురించి రాశారో ఆయనను చూశాం. ఆయన యోసేపు కుమారుడైన యేసు. ఆయన నజరేతు గ్రామంవాడు” అన్నాడు.

46 అందుకు నతనియేలు “నజరేతునుంచి మంచిది ఏదైనా రాగలదా?” అని అతనితో అన్నాడు.

ఫిలిప్పు అతనితో “వచ్చి చూడు” అన్నాడు.

47 తన దగ్గరకు నతనియేలు రావడం చూచి యేసు అతణ్ణి గురించి “ఇదుగో, అసలైన ఇస్రాయేల్‌వాడు! అతనిలో కపటమేమీ లేదు” అన్నాడు.

48 “నేను మీకు ఎలా తెలుసు?” అని నతనియేలు ఆయనను అడిగాడు.

యేసు అతనితో జవాబిస్తూ “ఫిలిప్పు నిన్ను పిలవకముందే నీవు అంజూరచెట్టు క్రింద ఉన్నప్పుడు నిన్ను చూశాను” అన్నాడు.

49 “గురువర్యా! మీరు దేవుని కుమారులే! ఇస్రాయేల్ రాజే!” అని నతనియేలు ఆయనకు బదులు చెప్పాడు.

50 “నిన్ను అంజూరచెట్టు క్రింద చూశానని నేను నీతో చెప్పినందుచేత నమ్ముతున్నావా? వీటికి మించిన వాటిని చూస్తావు” అని యేసు అతనికి జవాబు చెప్పాడు. 51 ఆయన ఇంకా అన్నాడు, “మీతో ఖచ్చితంగా చెపుతున్నాను, ఇకమీదట ఆకాశం తెరుచుకోవడమూ దేవదూతలు మానవ పుత్రుని మీదుగా ఎక్కిపోవడమూ దిగిరావడమూ మీరు చూస్తారు.”

---

అనుకోలేదు. మనుషులు యేసు శిష్యులు కావాలని అతని ఆశ. 3:26-30 చూడండి. ఇందులో కూడా మనం అనుసరించదగిన ఆదర్శాన్ని ఇతడు చూపిస్తున్నాడు.

**1:38** సరైన కారణం లేకుండా ఎవరైనా తనను అనుసరించడం యేసుప్రభువుకు ఇష్టం లేదు. ఏదో విచిత్రాన్ని చూద్దాం అనే మనస్తత్వం నిజమైన శిష్యుణ్ణి చేయదు. లూకా 9:57-62; 14:25-27 పోల్చి చూడండి.

“రబ్బీ” – ఒక గురువును సంబోధించడానికి యూదులు సాధారణంగా ఉపయోగించే పదం. ‘నా ఉపదేశకుడు’ అని దీనికి అర్థం. తమ మాటల ద్వారా ఈ ఇద్దరూ ఆయనతో ఉండి, ఆయన దగ్గర నేర్చుకోవాలన్న అభిలాష కనపరచుకున్నారు. ఇది అందరికీ ఉండాలి గాని కొద్దిమందిలోనే కనిపిస్తుంది.

**1:39** ఈ ఇద్దరికీ అందిన దయామయమైన ఆహ్వానం వేరే మాటల్లో ఇప్పుడు అందరికీ అందుతున్నది (7:37; మత్తయి 11:28; ప్రకటన 22:17). ఈ ఆహ్వానాన్ని అంగీకరించడం ద్వారా ఆయన శాశ్వత నివాసం తండ్రి ప్రక్కన (వ 18) అని మనం తెలుసుకుంటాం, ఆయనతో అనంత కాలం అక్కడ జీవిస్తాం.

**1:40** మత్తయి 16:17,18.

**1:41** సత్యం ఈ భూమిపై ఇప్పటికీ వ్యాపిస్తున్న విధానం ఒకరు మరొకరికి చెప్పడం ద్వారా. వ 45; 4:28-30; 15:27 చూడండి.

“అభిషిక్తుణ్ణి” – నోట్ మత్తయి 1:1.

**1:42** అరమేయక్ భాషలో కేఫా అంటే రాయి. గ్రీకులో పేతురు (పెట్రొస్) అన్నా అదే అర్థం.

**1:43** మత్తయి 4:19-22; 9:9 పోల్చి చూడండి.

**1:44** గలలీ సరస్సుకు ఉత్తరాన ఉన్న ఊరు బేత్సయిదా.

**1:45** ఇలా మాట్లాడేందుకు పాత ఒడంబడిక గ్రంథంతో బాగా పరిచయం అవసరం. లూకా 24:27,44 పోల్చి చూడండి. ఇతడు యోసేపును యేసు తండ్రిగా చెప్తున్నాడు. ఆయన అసలైన తండ్రి దేవుడు (5:17,18; లూకా 1:35). యేసు ఈ లోకంలో ఉన్నప్పుడు యోసేపు ఆయనకు చట్టబద్ధమైన తండ్రి.

**1:46** నతనియేలు ప్రశ్నను బట్టి నజరేతు ఊరికి ఏమాత్రం మంచి పేరు లేదనీ, బొత్తిగా గుర్తింపులేని అల్పమైన ఊరనీ అర్థం అవుతున్నది.

“వచ్చి చూడు” – క్రీస్తును గురించి సందేహాలున్న వారందరికీ చెప్పదగిన మంచి మాట. వారంతా వచ్చి రుచిచూస్తే ఆయన గొప్పతనం, మంచితనం అర్థం అవుతుంది (కీర్తన 34:8).

**1:47** అసలైన ఇస్రాయేల్‌వాడు అంటే హృదయంలోనూ, జీవిత విధానంలోను ఇస్రాయేల్‌వాడు ఎలా కపటం లేకుండా ఉండాలో అలా ఉండేవాడు అని అర్థం. రోమా 2:28,29; మత్తయి 3:9,10 పోల్చి చూడండి.

**1:48,49** మనుషులకు సహజంగా లేని శక్తి యేసుకు ఉంటే తప్ప నతనియేలును చూడడం గానీ అతని మాటలు వినడం గానీ సాధ్యం కానంత దూరంలో అంజూరు చెట్టు ఉన్నట్టుంది. నతనియేలు దీన్ని వెంటనే అర్థం చేసుకుని యేసును “దేవుని కుమారుడు” అన్నాడు.

“ఇస్రాయేల్ రాజు” – మత్తయి 1:1; కీర్తన 2:6; యెషయా 9:6,7 నోట్స్.

**1:50** నతనియేలు మాటలను నిజమేనని అంగీకరిస్తూ, అవి సత్యమేననడానికి మరింత గొప్ప రుజువులు చూపుతానని యేసు అన్నాడని గమనించండి. 20:28,29 పోల్చి చూడండి.

**1:51** “మీతో ఖచ్చితంగా చెప్తున్నాను” (“నిశ్చయముగా చెప్పుచున్నాను” – పాత అనువాదం) అనే మాటలను యేసు యోహాను శుభవార్తలో 25 సార్లు ఉపయోగించాడు. ఇవి చాలా గంభీరంగా నొక్కి చెప్పేందుకు వాడే మాటలు. వింతగానూ, నమ్మడానికి కష్టసాధ్యంగానూ అనిపించే సత్యాన్ని ఆయన చెప్పినప్పుడు ఈ మాటలు పలికేవాడు. ఇక్కడ యేసు ఆది

2 మూడో రోజున గలలీలోని కానాలో పెండ్లి జరిగింది.
యేసు తల్లి అక్కడ ఉంది. 2 యేసునూ ఆయన
శిష్యులనూ కూడా పెండ్లికి పిలిచారు. 3 ద్రాక్షరసం
అయిపోయినప్పుడు యేసు తల్లి ఆయనతో “వారిదగ్గర
ద్రాక్షరసం లేదు” అంది. 4 యేసు ఆమెతో “అమ్మా, నీతో
నాకేమి పని? నా సమయం ఇంకా రాలేదు” అన్నాడు.
5 ఆయన తల్లి పనివారితో “మీతో ఆయన చెప్పినది చేయండి”
అంది. 6 అక్కడ ఆరు రాతి బానలు ఉన్నాయి. ఒక్కొక్కటీ
సుమారు డెబ్భయి, లేదా నూరు లీటర్ల నీళ్ళు పట్టేది. అవి
యూదుల శుద్ధి ఆచారం కోసం. అక్కడ ఉంచారు. 7 యేసు
వారితో “ఈ బానల నిండా నీళ్ళు పోయండి” అన్నాడు. అంచుల
వరకు వారు నీళ్ళు నింపారు. 8 అప్పుడాయన వారితో “ఇప్పుడు
ముంచి విందు యజమాని దగ్గరికి తీసుకువెళ్ళండి” అన్నాడు.
అలాగే వారు తీసుకువెళ్ళారు. 9 ద్రాక్షరసంగా మారిన ఆ నీరు
ఎక్కడనుంచి వచ్చిందో ఆ నీళ్ళు తోడిన పనివారికి మాత్రమే
తెలిసింది. విందు యజమానికి తెలియదు. అతడు దానిని రుచి
చూచి పెండ్లి కొడుకును పిలిచి ఇలా అన్నాడు: 10 “ప్రతి
ఒక్కరూ మొదట్లోనే మంచి ద్రాక్షరసం వడ్డిస్తారు. అతిథులు
బాగా త్రాగాక రుచి తక్కువది పోస్తారు. మీరైతే ఇప్పటివరకు
మంచి ద్రాక్షరసమే ఉంచారు.”
11 యేసు చేసిన సూచనకోసమైన అద్భుతాలలో ఈ
మొదటిది గలలీలోని కానాలో చేసి తన మహాత్యం
వ్యక్తపరిచాడు. ఆయన శిష్యులు ఆయనమీద నమ్మకం
ఉంచారు.

---

29:12లో రాసి ఉన్న యాకోబు కల గురించి మాట్లాడుతున్నాడు. ఆ కలలో పరలోకానికి, భూమికీ ఒక నిచ్చెన వేసి ఉంది. ఆ నిచ్చెన తానే అని యేసు అంటున్నాడు. దేవుడు మనుషులకు చెప్పదలచుకున్న సందేశాలూ, ఇవ్వదలచుకున్న దీవెనలూ వారికి చేరే మార్గం క్రీస్తే అన్నమాట. మనుషులు దేవుని సన్నిధికి ఎక్కివెళ్ళే మార్గం కూడా ఆయనే. నతనియేలు (క్రీస్తు శిష్యులందరూ కూడా) కాలక్రమేణ దీన్ని గ్రహిస్తారు అంటున్నాడు. దేవదూతల గురించి నోట్ ఆది 16:7. “మానవ పుత్రుడు” గురించి నోట్ మత్తయి 8:20.

**2:1** నజరేతుకు ఉత్తరాన సుమారు 15 కి.మీ. దూరంలో ఉన్న చిన్న ఊరు కానా. తరువాతి వచనాలను బట్టి యేసు తల్లి మరియ ఈ పెళ్ళివారికి సహాయం చేస్తున్నట్టు కనిపిస్తున్నది.

**2:2** వివాహమనే వ్యవస్థను యేసుప్రభువు ఆమోదించాడు. దానికి తాను హాజరు కావడం ద్వారా దానిపట్ల తన గౌరవాన్ని ప్రకటించాడు (మత్తయి 19:4-6; హీబ్రూ 13:4 పోల్చి చూడండి).

**2:3** వేడుకైన, ఆనందకరమైన సందర్భంలో ఉన్నట్టుండి ఇలా జరగడం ఆ ఇంటి యజమానికి చాలా తలవంపులు కలిగించే విషయం. మరియ అందుకు ఆందోళన కనపరుస్తూ యేసుప్రభువు ఆ విషయంలో ఏమైనా చెయ్యాలని పరోక్షంగా సూచించింది. ఇప్పటివరకు యేసు ఏ అద్భుతాలు బహిరంగంగా చెయ్యలేదు (వ 11. రహస్యంగా కూడా చేసినట్టు ఏమీ సూచన లేదు). అయితే ఆయన సాధారణ వ్యక్తి కాదని మరియకు తెలుసు (లూకా 1:35).

**2:4** “నీతో నాకేమి పని?” – దీని అర్థం ఇది కావచ్చు – యేసుప్రభువు దేవుని కుమారుడుగా ఇస్రాయేలువారి అభిషిక్తుడుగా తన పరిచర్య ఆరంభిస్తున్నాడు. మునుపు తమ ఊరు నజరేతులో తన తల్లితో తనకున్న పాత అనుబంధం ఇకపై కొనసాగదు. అప్పటినుంచి ఆమెకు ఆయన పై ఎలాంటి అధికారం ఉండదు. ఇకపై ఆయన నిర్ణయాలను చేస్తుంటే ఆమె మాటలు ఆయనపై ఏమీ ప్రభావం చూపవు. ఆయన ఏమేమి చేయాలో తండ్రి అయిన దేవుడే ఆయనకు తెలియజేస్తాడు (4:34; 5:36; 8:28,29; 17:4; మత్తయి 12:46-50 పోల్చి చూడండి).

**2:5** యేసు మాట్లాడిన విధానాన్ని బట్టి ఆయన ఏదో చేయనున్నాడని మరియకు అనిపించింది. ఆ సమయానికి ఆ సేవకులతో మరియ చెప్పిన మాటలు చక్కగా సరిపోయే మాటలు. ఈ మాటలే మరింత ఉన్నతమైన పరిపూర్ణమైన స్థాయిలో మనుషులందరూ ఎప్పుడూ అనుసరించదగినవి. యేసుప్రభువు మనతో చెప్పినది చేస్తే మనం ఎన్నడూ తప్పటడుగు వేసే అవకాశం ఉండదు.

**2:6** మార్కు 7:1-5.

**2:9** ఈ అద్భుతం గురించి వివరణ ఏమీ లేదు. బానల్లో నీళ్ళు పోశారనీ, ద్రాక్షరసం ముంచుకుని తీసుకువెళ్ళారనీ మాత్రం రాసి ఉంది. అంతకుముందంతా తాగిన ద్రాక్షరసానికీ దీనికీ తేడా ఏమీ ఉన్నట్టుగా చెప్పలేదు. దానికంటే ఇదే ఎక్కువ రుచిగా ఉందని మాత్రం రాసి ఉంది. యేసు ఈ ద్రాక్షరసాన్ని చేశాడంటే కొందరు విశ్వాసులు కొద్దిగా ఆందోళన చెందుతుంటారు. అయితే ఆ రోజుల్లో భోజన సమయంలో ద్రాక్షరసం తాగడం సర్వసాధారణమే. ఇది హానికరంగా ఎంచబడలేదు. మామూలుగా వారు ద్రాక్షరసంలో నీళ్ళు కలిపేవారు – ఒక పాలు ద్రాక్షరసానికి మూడు పాళ్ళు నీరు కలిపేవారు. త్రాగుబోతు తనాన్ని మాత్రం బైబిల్లో అంతటా ఖండించడం చూడవచ్చు. ఆది 9:21; మొ॥ నోట్స్ చూడండి. బైబిల్లో కొన్ని సార్లు ద్రాక్షరసం అనేమాటను మంచిదానికి గుర్తుగా వాడారు (సామెత 9:1,2,5; యెషయా 55:1; మత్తయి 26:37-39). మత్తయి 9:17లో యేసుప్రభువు శుభవార్తకు చిహ్నంగా కొత్త ద్రాక్షరసాన్ని చెప్పాడు. ధర్మశాస్త్ర సంబంధమైన పాత ఒడంబడికకు వేరుగా ఆయన తెచ్చిన శుభవార్త కొత్త ద్రాక్షరసం వంటిది. ఇక్కడ యూదులు తమ మతాచారం సంబంధంగా కాళ్ళు కడుక్కునే నీరు ఉంచిన బానల్లోనుంచి యేసుప్రభువు కొత్త ద్రాక్షరసం రప్పించాడు. యేసు ఏ పని చేసేందుకు వచ్చాడో దానికి ఇది ఒక చిన్న సాదృశ్యం కావచ్చు. పాత ఒడంబడిక స్థానంలో తన కృప, ఆనంద రాజ్యాన్ని స్థాపించేందుకు ఆయన వచ్చాడు.

**2:10** ఈ మనిషి విందుల్లో సామాన్యంగా జరిగే సంగతి గురించి చెప్తున్నాడు. అక్కడ జరుగుతున్న విందులో మనుషులు మత్తెక్కి తూలుతున్నారని చెప్పడం లేదు. అతిథులు మత్తెక్కిపోయేలా తాగుతున్న విందులో యేసు పాల్గొనేవాడు కాదు, అలాంటివారికోసం ద్రాక్షరసం చేసి ఇచ్చేవాడూ కాదు.

**2:11** యోహాను శుభవార్తలో యేసుప్రభువు చేసిన అద్భుతాలను “సూచనకోసమైన అద్భుతాలు” అనడం 11 సార్లు కనిపిస్తుంది. ఎందుకంటే అవి చాలా అంతరార్థంతో నిండి ఉన్నాయి. ఆధ్యాత్మిక సత్యాలను అవి చూపిస్తున్నాయి. యేసుప్రభువు ద్వారా దేవుడే పని చేస్తున్నాడనీ, యేసుప్రభువు ఇస్రాయేల్‌వారి అభిషిక్తుడనీ, దేవుని కుమారుడనీ, పరలోకం నుంచి వచ్చినరాజు అనీ అవి తెలియజేస్తున్నాయి. అవి ఆయన ప్రభావాన్నీ, కృపనూ, ప్రేమనూ వెల్లడి చేస్తున్నాయి. క్రీస్తు ఎవరో మనుషులు అర్థం చేసుకోగలిగేలా సహాయం చేయడమే వీటి ఉద్దేశం. వ 23; 3:2; 20:30,31 చూడండి. అవి ఉదాహరణలు – మాటల్లో కాదు, చేతల్లో. తండ్రి అయిన దేవుణ్ణి యేసుప్రభువు వెల్లడి చేసిన పద్ధతుల్లో ఇదొకటి (1:17,18). అద్భుతాల గురించి మత్తయి. 8:1 నోట్ చూడండి.

12 ఆ తరువాత యేసు, ఆయన తల్లి, ఆయన తమ్ముళ్ళు, ఆయన శిష్యులు కపెర్నహూం వెళ్ళారు. వారు అక్కడ అనేక రోజులు ఉండిపోలేదు.

13 యూదుల పస్కా పండుగ దగ్గరపడింది. యేసు జెరుసలం వెళ్ళాడు.

14 దేవాలయంలో ఎద్దులనూ గొర్రెలనూ పావురాలనూ అమ్మేవారినీ కూర్చుని ఉన్న డబ్బు మారకందారులనూ ఆయన చూశాడు.

15 ఆయన త్రాళ్లతో కొరడా చేసి వాళ్ళందరినీ గొర్రెలతో ఎద్దులతోపాటు దేవాలయంనుంచి వెళ్లగొట్టాడు. డబ్బు మారకందారుల నాణేలు వెదజల్లివేశాడు. వాళ్ళ బల్లలు పడద్రోశాడు.

16 పావురాలు అమ్మేవారితో ఆయన "వీటిని బయటికి తీసుకువెళ్ళండి. నా తండ్రి ఇంటిని వ్యాపార గృహంగా చేయకండి!" అన్నాడు.

17 "నీ ఇంటిని గురించిన ఆసక్తి నన్ను తినివేసింది" అని వ్రాసి ఉందని ఆయన శిష్యులు జ్ఞాపకం చేసుకొన్నారు.

18 అప్పుడు యూదులు జవాబిస్తూ ఆయనతో "నీవు ఈ క్రియలు చేస్తూ ఉన్నావే. సూచనగా ఏ అద్భుతం మాకు చూపుతావు?" అన్నారు.

19 "ఈ దేవాలయాన్ని నాశనం చేయండి, మూడు రోజులలో దీనిని లేపుతాను" అని యేసు వారికి బదులు చెప్పాడు.

20 అందుచేత యూదులు "ఈ దేవాలయాన్ని కట్టడానికి నలభై ఆరేళ్ళు పట్టిందే. నీవు దాన్ని మూడు రోజులలో లేపుతావా?" అన్నారు.

21 అయితే ఆయన తన శరీరం అనే దేవాలయాన్ని ఉద్దేశించి అలా చెప్పాడు.

22 కనుక చనిపోయిన వారిలో నుంచి ఆయన సజీవంగా లేచిన తరువాత, ఆయన తమతో అలా చెప్పాడని ఆయన శిష్యులకు జ్ఞప్తికి వచ్చింది. యేసు చెప్పిన మాట, లేఖనం వారు నమ్మారు.

23 ఆయన పస్కా పండుగ సమయాన జెరుసలంలో ఉన్నప్పుడు ఆయన చేసిన సూచనకోసమైన అద్భుతాలు చూచి అనేకులు ఆయన పేరుమీద నమ్మకం ఉంచారు. 24 కానీ యేసు తనను వారి వశం చేసుకోలేదు. ఎందుకంటే అందరూ ఆయనకు తెలుసు. 25 మనిషిలో ఉన్నదంతా ఆయన తెలిసినవాడు గనుక మనిషిని గురించి ఎవరి సాక్ష్యమూ ఆయనకు అక్కర లేదు.

3 పరిసయ్యులలో నీకొదేము అనే పేరు గల మనిషి ఉన్నాడు. అతడు యూదులకు ఒక అధికారి. 2 ఈ

---

"మహత్యం" – 1:14. ఆయన శిష్యులు ఇప్పటికే నమ్మడం మొదలు పెట్టారు. ఈ సూచన మూలంగా వారి నమ్మకం ఎక్కువై స్థిరపడింది.

**2:12** కపెర్నహూం గలలీ సరస్సు తీరాన ఉన్న ఊరు. గలలీ ప్రాంతంలో యేసు ఈ ఊర్లో నివసిస్తూ అక్కడనుంచి ఆయా చోట్లకూ వెళ్తూ పరిచర్య జరిగించాడు (మత్తయి 9:1). యేసు తమ్ముళ్ళు గురించి 7:3; మత్తయి 12:46; 13:55లో ఉంది.

**2:13** పస్కా గురించి నోట్స్ నిర్గమ 12వ అధ్యాయం; లేవీ 23:4-8.

**2:14-16** మత్తయి, మార్కు, లూకా ముగ్గురూ ఇలాంటి సంఘటనే క్రీస్తు సిలువ మరణానికి కొద్ది కాలానికి ముందు జరిగినట్టుగా రాశారు. మత్తయి 21:12,13 నోట్స్ చూడండి. యోహానైతే క్రీస్తు పరిచర్య ఆరంభంలో ఇది జరిగినట్టు రాస్తున్నాడు. ఆలయానికి చెందనివాటిని యేసు రెండు పర్యాయాలు అక్కడినుంచి తొలగించినట్టుంది.

**2:16** ఆలయం సరైన ఉపయోగాన్ని వారు వక్రం చేశారు. దానిద్వారా తమకు ఏం లాభం కలుగుతుందా అని మాత్రమే చూశారు. 1 తిమోతి 6:5 పోల్చి చూడండి.

**2:17** కీర్తన 69:9.

**2:18** వ 11.

**2:19-22** యేసు పలికిన ఈ మాటలను తరువాతి కాలంలో ఆయన శత్రువులు వక్రం చేసి ఆయనకు తీర్పు తీర్చేటప్పుడు ఆయనకు వ్యతిరేకంగా ఉపయోగించారు (మత్తయి 26:61). ఇక్కడ తన పరిచర్య ప్రథమ దశలోనే యేసు తన మరణం గురించీ, తిరిగి సజీవంగా లేవడం గురించీ చెప్తున్నాడు. ఆయన దేహం దేవునికి నివాస స్థలమైన ఆలయం (1 కొరింతు 6:19,20 పోల్చి చూడండి). వారు దాన్ని చంపేస్తారు గానీ ఆయన దాన్ని తిరిగి బ్రతికించి లేపుతాడు. యూదులు ఆయన్ను సరిగా అర్థం చేసుకోలేక ఎగతాళి చేశారు. ఆయన శిష్యులు సైతం ఆయన సజీవంగా తిరిగి లేచిన సమయం వరకు ఆయన మాటల్లోని అర్థాన్ని గ్రహించలేదు. మత్తయి 16:21,22; లూకా 18:31-34 చూడండి.

**2:22** 14:26. లేఖనం అంటే ఇక్కడ పాత ఒడంబడిక గ్రంథం అని అర్థం. లేఖనం అని ఏకవచనం వాడితే ఒక్క వచనాన్ని, లేక కీర్తన 16:10 లాంటి ఒక వాగ్దానాన్ని సూచించవచ్చు.

**2:23** వ 12. ఆయన పేరుమీద నమ్మకం ఉంచడమంటే ఆయనను నమ్మి స్వీకరించడమే (1:12).

**2:24,25** కొందరు ఆయన పేరులో నమ్మకం ఉంచారు గాని ఆయన వారిలో నమ్మకం ఉంచలేదు. యేసు శరీరంతో ఉన్న దేవుడు (1:14). మానవ స్వభావం గురించి దేవుని కున్న జ్ఞానం ఆయనలో ఉంది – 1 రాజులు 8:39; యిర్మీయా 17:9,10. ఈ శుభవార్తలో ఆయనకున్న మానవాతీత జ్ఞానం గురించిన అనేక ఉదాహరణలున్నాయి (1:48,49; 4:17,18; 5:42; 6:26; మొ॥). మనుషులందరిలోనూ భ్రష్ట స్వభావం ఉన్నదనీ విశ్వాసులు సైతం కొన్నిసార్లు తమ నమ్మకంలో చంచలంగా, అపనమ్మకంగా, లోతు లేకుండా ఉంటారనీ ఆయనకు తెలుసు. ఆయన సన్నిహితులూ, శిష్యులందరిలో ప్రధాన శిష్యులైనవారు కూడా కొన్నిసార్లు ఆత్మ విషయాల్లో మందమతులుగా ఉండి ఆయన మార్గాలను అనుసరించలేదు. ఆయనకు గొప్ప అత్యవసర స్థితి వాటిల్లినప్పుడు కూడా ఎంతమాత్రం ఆయనకు తోడ్పడలేదు (మత్తయి 26:36-56).

**3:1** పరిసయ్యుల గురించి మత్తయి 3:7 నోట్. ధర్మశాస్త్రాన్ని పాటించడం, ఆచారాలు, మత కార్యకలాపాలూ ఆచరించడంతో కూడిన యూదుల మతానికి నీకొదేము చక్కటి ప్రతినిధి. ఇక్కడ మనం చదవబోతున్న సంభాషణలో యేసుప్రభువు ఒక విషయం స్పష్టం చేశాడు. అదేమంటే అలాంటి మతం అంతటినీ కలిపినా ఎవరినీ దేవుని సంతానంగా చెయ్యడం దానికి సాధ్యం కాదు.

**3:2** నీకొదేము రాత్రివేళ ఎందుకు వచ్చాడో మనకు తెలియదు, గానీ యేసు అతణ్ణి ఉన్నది ఉన్నట్టుగా మామూలుగా స్వీకరించాడనీ (యోహాను 6:37 పోల్చి చూడండి), అతనికో గొప్ప సత్యాన్ని నేర్పించాడనీ మాత్రం తెలుసు. ఈ సత్యం కొత్త

మనిషి రాత్రివేళ యేసు దగ్గరికి వచ్చి ఆయనతో ఇలా అన్నాడు: "గురువర్యా, మీరు దేవుని దగ్గరనుంచి వచ్చిన ఉపదేశకులని మాకు తెలుసు. ఎందుకంటే దేవుని తోడ్పాటు ఉంటేనే తప్ప మీరు చేసే సూచకమైన అద్భుతాలు ఎవరూ చేయలేరు."

3 అందుకు యేసు జవాబిస్తూ "మీతో ఖచ్చితంగా చెపుతున్నాను, క్రొత్తగా జన్మించితేనే తప్ప ఎవరూ దేవుని రాజ్యాన్ని చూడలేరు" అని అతనితో చెప్పాడు.

4 నీకొదేము ఆయనతో "ముసలితనంలో ఉన్న మనిషి ఎలా జన్మించగలడు? అతడు రెండో సారి తల్లి గర్భంలో ప్రవేశించి పుట్టలేడు గదా!" అన్నాడు.

5 యేసు ఇలా జవాబిచ్చాడు: "మీతో ఖచ్చితంగా చెపుతున్నాను, ఒకడు నీళ్ళమూలంగా, దేవుని ఆత్మమూలంగా

---

ఒడంబడికలో దేవుడు వెల్లడించినదానికి ఆయువుపట్టు.

"ఉపదేశకుడా (రబ్బీ)" – 1:38 నోట్. యేసును దేవుని నుంచి వచ్చిన ఉపదేశకుడుగానే నీకొదేము ఎంచినట్టుంది గాని అభిషిక్తుడుగా దేవుని కుమారుడుగా కాదని తెలుస్తున్నది. అయితే యేసు చేసిన అద్భుతాలు ఆయనకు దేవునితో ఉన్న సంబంధాన్ని తెలియజేస్తున్నాయని అతడు గుర్తించగలిగాడు. 2:11; మత్తయి 8:1 నోట్స్ చూడండి.

**3:3** యేసు జవాబు చాలా ముక్తసరిగా టూకీగా ఉంది. "నీవు అలా నిజంగా అనుకొంటున్నావా? అయితే నీవు నేర్చుకోవలసిన సంగతి ఒకటి నీకు నేర్పుతాను" అన్నట్టుగా ఉంది ఆయన జవాబు. యేసు దేవుని నుంచి వచ్చిన ఉపదేశకుడని ఇప్పుడు మనం అంటున్నామా? అలాగైతే మనక్కూడా ఆయన్ను బోధించనివ్వాలి. బైబిల్లో ఆయన చెప్పిన ప్రతి మాటనూ చాలా జాగ్రత్తగా పరిశీలించాలి.

"మీతో ఖచ్చితంగా చెప్తున్నాను" అనే మాట గురించి 1:51 నోట్ చూడండి. కొత్తగా జన్మించడం గురించి 1:13 నోట్ చూడండి. "కొత్తగా" అని తర్జుమా చేసిన గ్రీకు పదానికి "మళ్ళీ" లేక "పైనుంచి" అని కూడా అర్థం ఉంది. కొత్తగా జన్మించడమంటే పునర్జన్మ కాదు. మనుషులు శరీరంతో భౌతికంగా ఈ లోకంలో మళ్ళీ మళ్ళీ జన్మిస్తూ ఉంటారనే సిద్ధాంతం బైబిలు ఉపదేశానికి విరుద్ధం (9:1-3; యోబు 11:12 నోట్స్ చూడండి). ఒక వేళ మనుషులు మళ్ళీ మళ్ళీ పుట్టడం సాధ్యమైనప్పటికీ దానివల్ల నూతన ఆధ్యాత్మిక జన్మ సాధ్యం కాదు. మనుషులంతా పాపులే. మళ్ళీ మళ్ళీ జన్మిస్తూ ఉండడమంటే పాప భరిత జీవితాలను మళ్ళీ మళ్ళీ గడుపుతూ ఉండడమే. ఇది మనుషుల దోషాన్ని విపరీతంగా పెంచుతూ పోతుంది. నూతన జన్మ అంటే ఈ జీవితంలోనే ఇక్కడే జరిగేది. పరలోకం నుంచి దేవుడు చేసే నూతన సృష్టి కార్యమది. దేవుని ఘనమైన కార్యం మనుషులను నూతన సృష్టిగా, ఆధ్యాత్మిక జీవం గలవారుగా హృదయంలో అద్భుతమైన మార్పు పొందినవారుగా చేస్తుంది. అది మరణం నుంచి జీవం లోకి వెళ్ళినట్టే (5:24; 2 కొరింతు 5:17,18; ఎఫెసు 2:1-5). ఇది లేకుండా దేవుని రాజ్యంలో ఎవరికీ భాగం లేదు. యూదుడుగా పుట్టి, ఆచారాలన్నీ పాటిస్తూ, మతనిష్ఠతో ఉండడం ఇదంతా నూతన జన్మ లేకుంటే వ్యర్థమే అని యేసు నీకొదేముతో చెప్తున్నాడు. దేవుని రాజ్యం గురించి మత్తయి 4:17 నోట్ చూడండి.

**3:4** యేసు చెప్తున్నదేమిటో నీకొదేముకు అర్థం కాలేదు. లేదా, అది అసంభవం అంటూ "ముసలివారిలో అంత గొప్ప మార్పు కలగడం సాధ్యమా?" అని అడుగుతున్నాడు. ఇప్పటికీ మతనాయకులు అనేకమంది నీకొదేము ఉన్న స్థితిలోనే ఉన్నారు.

**3:5-8** నూతన జన్మ ఎలా జరుగుతుందో ఈ వచనాల్లో యేసుప్రభువు వెల్లడిస్తున్నాడు. ఒక వ్యక్తిలో దేవుని ఆత్మ ద్వారా ఇది కలుగుతుంది. "ఆత్మమూలంగా జన్మించడం" గురించి ఇక్కడ 3 సార్లు కనిపిస్తున్నాయి (వ 5,6,8).

వ 5లో "నీళ్ళ మూలంగా" అనే మాటల విషయంలో వేరు వేరు అభిప్రాయాలు ఉన్నాయి. పాత ఒడంబడిక గ్రంథంలో తరచుగా ఉన్నట్టుగానే ఇక్కడ కూడా నీళ్ళు శుద్ధీకరణకు గుర్తుగా ఉన్నాయని కొందరన్నారు. నిర్గమ 30:17-21; సంఖ్యా 19:9; 31:23; కీర్తన 51:7-10; యెషయా 44:3; యిర్మీయా 4:14; యెహెజ్కేలు 37:25 చూడండి. యెహెజ్కేలు 36:25,26ను "నీళ్ళమూలంగా దేవుని ఆత్మమూలంగా జన్మిస్తేనే" అనేమాటలతో పోల్చి చూడండి. యెహెజ్కేలులో నీళ్ళు చిలకరించడం దేవుడు చేసే పనే గానీ మనుషులది కాదని గమనించండి. అందువల్ల హృదయంలో నుంచి పాపాల కల్మషాన్ని కడిగివేయడం గురించే గానీ నీటి బాప్తిసం గురించి అది చెప్పడం లేదని స్పష్టం అవుతున్నది. తీతు 3:5 పోల్చి చూడండి. అక్కడ కొత్త జన్మాన్ని "స్నానం" అని రాసి ఉంది. నీరు శరీరాన్ని ఎలా శుభ్రం చేస్తుందో అలానే కొత్త జన్మం హృదయాన్ని శుభ్రపరుస్తుందన్న మాట. తీతు 3:5లో నీటి బాప్తిసం గురించిన మాట లేనే లేదు.

నీళ్ళమూలంగా అంటే దేవుని వాక్కుమూలంగా అని మరి కొందరు భావించారు. ఇక్కడ నీరు దేవుని వాక్కుకు సూచనగా ఉందని వారి అభిప్రాయం. దీనికి ఆధారంగా 15:3; ఎఫెసు 5:26; యాకోబు 1:18; 1 పేతురు 1:23 మొదలైన వచనాలను వీరు చూపిస్తారు.

మరి కొందరు ఇక్కడ నీళ్ళు 7:37-39లో లాగే దేవుని ఆత్మకు గుర్తుగా ఉందంటారు. "నీళ్ళమూలంగా, ఆత్మమూలంగా" అనడం ఒకే సంగతిని మరింత నొక్కి చెప్పిన విధానం అని వీరి ఉద్దేశం.

మరి కొందరు నీళ్ళు ఈ లోకంలో శారీరికంగా పుట్టడానికి గుర్తు అంటారు. "మనిషి మొదటి పుట్టుక సరిపోదనీ, దేవుని రాజ్యంలో ప్రవేశించాలంటే దేవుని ఆత్మమూలంగా కూడా జన్మించడం అవసరం" అని ఇక్కడ యేసు చెప్తున్నాడని వీరి అభిప్రాయం.

మరి కొందరు పశ్చాత్తాపాన్నీ, పాపాలను ఒప్పుకొనే సంగతినీ గురించి చెప్పేందుకు "నీళ్ళమూలంగా" అనేమాట యేసు ఉపయోగించాడంటారు. వాటికి చిహ్నం నీటి బాప్తిసం గదా (మత్తయి 3:6 నోట్స్ చూడండి).

మరి కొందరు ఇక్కడ నీళ్ళు అంటే నీటి బాప్తిసం అనీ, నూతన జన్మకు నీటి బాప్తిసం తప్పనిసరి అని బల్లగుద్ది వాదిస్తారు. నీటి బాప్తిసం జరుగుతున్న సమయంలో దేవుని ఆత్మ దాన్ని ఉపయోగిస్తూ దాని ద్వారా పని చేస్తూ దాన్ని తీసుకున్నవారిలో నూతన జీవం కలిగిస్తాడని వారంటారు.

ఈ చివరిది తప్ప పైన చెప్పిన వివరణలన్నిటిలో ఏదైనా నిజం కావచ్చునని ఈ నోట్స్ రచయిత అభిప్రాయం. నూతన జన్మకు బాప్తిసం అవసరమని యేసుప్రభువు ఎక్కడా చెప్పలేదు. వ్యక్తులు నమ్మకం ద్వారా యేసుప్రభువును స్వీకరించినప్పుడు నూతన జన్మ కలుగుతుంది (1:12,13) గానీ బాప్తిసం ఆచారంలో పాల్గొన్నప్పుడు కాదు. నూతన జన్మ తరువాత బాప్తిసం తీసుకోవాలి గానీ బాప్తిసంవల్ల నూతన జన్మ కలగదు. దేవుడు మాత్రమే నూతన జన్మ అనే అద్భుతాన్ని చేయగలడు. మనుషులు యేసుప్రభువును నమ్మినప్పుడే వారిలో ఆయన ఈ అద్భుతాన్ని జరిగిస్తాడు. పాపవిముక్తీ దేవుని రాజ్యంలో ప్రవేశించడమూ ఇది లేకుండా సాధ్యం కాదు (వ 7).

జన్మిస్తేనే తప్ప అతడు దేవుని రాజ్యంలో ప్రవేశించలేడు. 6 శరీరం మూలంగా పుట్టినది శరీరం. దేవుని ఆత్మ మూలంగా పుట్టినది ఆత్మ. 7 మీరు క్రొత్తగా జన్మించాలని నేను మీతో చెప్పినందుకు ఆశ్చర్యపడకండి. 8 గాలి ఎటు వీచాలని ఉంటే అటు వీస్తుంది. దాని శబ్దం మీకు వినబడుతుంది గాని అది ఎక్కడనుంచి వస్తుందో, ఎక్కడికి పోతుందో మీకు తెలియదు. దేవుని ఆత్మమూలంగా జన్మించిన ప్రతి ఒక్కరూ అలాగే ఉంటారు."

9 "ఈ విషయాలు ఎలా సాధ్యం?" అని నీకొదేము ఆయనకు చెప్పిన జవాబు.

10 యేసు అతనికిలా సమాధానం చెప్పాడు: "మీరు ఇస్రాయేల్ ప్రజలకు ఉపదేశకులై ఉండి కూడా ఈ విషయాలు గ్రహించరా? 11 మీతో ఖచ్చితంగా చెపుతున్నాను, మాకు తెలిసినవే చెపుతాం, చూచినవాటిని గురించే సాక్ష్యం చెపుతాం. మా సాక్ష్యం మీరు అంగీకరించడం లేదు. 12 నేను ఈ లోక సంబంధమైన విషయాలు చెప్పినప్పుడు మీరు నమ్మకపోతే నేను పరలోక సంబంధమైన విషయాలు చెపితే ఎలా నమ్ముతారు? 13 పరలోకంనుంచి వచ్చినవాడు, అంటే పరలోకంలో ఉన్న మానవ పుత్రుడు తప్ప ఇంకెవరూ పరలోకానికి ఎక్కలేదు.

14 "ఎడారిలో మోషే కంచు పామును పైకెత్తినట్టే మానవపుత్రుణ్ణి పైకెత్తడం తప్పనిసరి. 15 ఆయన మీద నమ్మకం ఉంచేవారెవరైనా సరే నాశనం కాకుండా శాశ్వత జీవం పొందేలా *ఈ విధంగా జరగాలి.*

16 "దేవుడు ఈ లోకాన్ని ఎంతో ప్రేమించి తన ఒకే ఒక కుమారుణ్ణి ఇచ్చాడు. ఆ కుమారుని మీద నమ్మకం

---

**3:6** ఇక్కడ శరీరం అంటే మనిషి స్వభావసిద్ధంగా ఏమై ఉన్నాడో అదంతా అన్నమాట. రోమ్ 7:5,18 నోట్స్ చూడండి. మనిషి తన పోలికలో పిల్లల్ని పుట్టించగలడు గానీ నూతన ఆధ్యాత్మిక జీవాన్ని ఇవ్వలేడు. అలా చెయ్యాలన్న అతని ప్రయత్నాలన్నీ వ్యర్థమే. దేవుని ఆత్మ మాత్రమే ("నీళ్ళమూలంగా" అనే మాటలు ఈ వచనంలో లేవు, చూడండి) ఎవరిలోనైనా ఆధ్యాత్మిక జీవాన్ని కలిగించగలడు.

**3:8** దేవుని ఆత్మ కార్యం, ఆత్మమూలంగా జన్మించినవారి అంతరంగ జీవితం రెండూ చాలా నిగూఢమైనవి. గాలి కనిపించదు. దాని కదలికలు మనుషుల ఊహకు అందకుండా ఉంటాయి. గాలి వల్ల కలిగే ఫలితాల మూలంగా మాత్రమే అది మనుషులకు తెలుసు. దేవాత్మ వల్ల జన్మించినవారి సంగతి కూడా అంతే.

**3:9** నీకొదేము ఇంకా అయోమయంలోనే ఉన్నాడు. అతడు అడిగిన ప్రశ్నను బట్టి మనం సంతోషించాలి, ఎందుకుంటే దీనికి జవాబు చెప్పడంలో యేసుప్రభువు ఒక మనోహరమైన, ప్రాముఖ్యమైన సత్యాన్ని తెలియజేశాడు.

**3:10** ఇస్రాయేల్‌వారికి ఉపదేశకుడుగా, పాత ఒడంబడికతో పరిచయం ఉన్నవాడుగా నీకొదేముకు ఈ సంగతులు ఇంత వింతగా అనిపించనవసరం లేదు. పాత ఒడంబడిక గ్రంథంలో అనేక చోట్ల చెప్పినట్టు మనుషుల భ్రష్ట స్థితి అతనికి తెలిసి ఉండాలి. అంతేగాక హృదయంలోను, బ్రతుకులోను మౌలికమైన మార్పులు వారికి అవసరమని కూడా తెలిసి ఉండాలి (ఆది 8:21; కీర్తన 51:5; యిర్మీయా 17:9). యిర్మీయా 31:31–33; యెహెజ్కేలు 11:19; 18:31; 36:26 మొదలైన వచనాలు తప్పకుండా అతనికి తెలుసు. అతి ప్రాముఖ్యమైన సత్యాన్ని తాము తెలుసుకోకుండా ఇతరులకు బోధించడానికి బయలుదేరేవాళ్ళు దురదృష్టవశాత్తూ అనేకమంది ఇప్పటికీ ఉన్నారు. పాండిత్యం, పేరు ప్రఖ్యాతులు ఉన్నవారిలో కూడా ఎంతో ఆత్మసంబంధమైన అజ్ఞానం పేరుకుపోయి ఉండవచ్చు!

**3:11** యేసుప్రభువు ఉపదేశిస్తున్నప్పుడు కేవలం మత విషయాలపై ఏవేవో తన అభిప్రాయాలను తెలియజేయడం లేదు. తాను మాట్లాడుతున్నదేమిటో ఆయనకు తెలుసు. దైవికమైన అధికారంతో ఆయన మాట్లాడాడు (7:16,17; 8:38; 12:49,50; మత్తయి 7:28,29). మనం ఆయన మాటలు వినకపోతే ఆ నష్టం మనదే.

**3:12** యేసు నీకొదేముతో నీటిని గురించీ గాలిని గురించీ, ఈ భూమిపైన, భూనివాసులైన మనుషుల్లో జరిగే నూతన జన్మను గురించీ మాట్లాడాడు. పరలోక సంబంధమైన విషయాల గురించి ఈ క్రింది వచనాల్లో ఆయన మాట్లాడుతున్నాడు – పరలోకంలో తన శాశ్వత నివాసం (వ 13), తాను స్వయంగా బలి కావడంద్వారా మనుషుల పాపాన్ని తీసివేయడం (వ 14), శాశ్వత జీవం (వ 15), దేవుని ప్రేమ, ఆ ప్రేమ ఆయనచేత చేయించిన సంగతి (వ 16) మొదలైనవి పరలోక సంబంధమైన విషయాలు.

**3:13** ఈ వచనంలో యేసు తాను అంత అధికారంతో పరలోక సంబంధమైన విషయాల గురించి ఎలా మాట్లాడ గలుగుతున్నాడో వెల్లడిస్తున్నాడు. అత్యున్నతమైన పరలోకంలో దేవుని సొంత నివాసంలో దేవుని చెంతనే నివసించిన ఏకైక వ్యక్తి యేసు. అక్కడినుంచి మనుషులకోసం దేవుణ్ణి గురించిన సత్యం తెలియజేసేందుకు ఆయన దిగివచ్చాడు. వ 31; 1:1,14; 6:38; 8:23 పోల్చి చూడండి.

"పరలోకంలో. . .తప్ప" – 1:18 పోల్చి చూడండి. యేసు పరలోకంనుండి దిగివచ్చి మనుషుల్లో మనిషిగా ఉన్నాడు. అదే సమయంలో ఆయన పరలోకంలోనూ ఉన్నాడు. దేవుని విషయంలో తప్ప ఇది మరెవరి విషయంలోనూ నిజం కాదు, ఎందుకంటే ఒక సమయంలో ఒకటికంటే ఎక్కువ చోట్ల ఉండడం దేవునికి మాత్రమే సాధ్యం.

"మానవ పుత్రుడు" గురించిన నోట్ మత్తయి 8:20.

**3:14,15** సంఖ్యా 21:4–9 నోట్స్‌ను చూడండి. మోషే కంచు పామును పైకెత్తినప్పుడు చనిపోతున్నవారు బ్రతికారు. పాపంలో చనిపోయిన మనుషులు (ఎఫెసు 2:1) ఆత్మ సంబంధంగా తిరిగి బ్రతకాలంటే యేసును పైకెత్తడం జరగాలి. ఇలా పైకెత్తడం సిలువ మీదికే (12:32,33 పోల్చి చూడండి). ఈ వచనాల్లో యేసుప్రభువు మనుషుల పాపాలకోసం తాను చేసే బలికీ వారి నూతన జన్మకూ ఉన్న సంబంధాన్ని చూపుతున్నాడు. యేసు దేవుని గొర్రెపిల్లగా లోకమంతటి పాపాలను మోసుకుపోయాడు గనకనే మనుషులు నూతన జన్మ, శాశ్వత జీవం పొందడానికి సాధ్యం అయింది. పాపం మనుషుల్ని పాడు చేసి వారిని శిక్షకు గురి చేస్తుంది. అయితే ఎవరైనా పశ్చాత్తాపపడి క్రీస్తులోను, తమకోసం ఆయన చేసిన బలిలోను నమ్మకం ఉంచితే దేవుని ఆత్మ వారిలో నూతన జీవాన్ని ఇస్తాడు (వ 5). ఈ పవిత్రమైన ఆధ్యాత్మిక జీవం శాశ్వత కాలం నిలిచి ఉంటుంది.

**3:16** యోహాను శుభవార్తకూ, మొత్తం బైబిలంతటికీ ప్రాణం అనదగిన వచనం ఇది. తమ పాపాల్లో దారి తప్పిపోయి నశించిపోతూ ఉన్న మనుషులపట్ల దేవునికి జాలి, కనికరం ఉన్నాయి. మనుషులు మంచివారనీ తన ప్రేమకు యోగ్యులనీ కాదు ఆయన వారిని ప్రేమిస్తున్నది. ఆయన ప్రేమ గలవాడు కాబట్టే ప్రేమిస్తున్నాడు (నిర్గమ 34:6,7; 1 యోహాను 4:8).

ఉంచేవారెవరైనా సరే నాశనం కాకుండా శాశ్వత జీవం పొందాలని ఇందులో దేవుని ఉద్దేశం.

17 "తన కుమారుని ద్వారా లోకానికి విముక్తి, రక్షణ లభించాలని దేవుడు ఆయనను లోకంలోకి పంపాడు గాని లోకానికి శిక్ష విధించడానికి కాదు. 18 ఆయన మీద నమ్మకం ఉంచేవానికి శిక్షావిధి లేదు. నమ్మకం పెట్టనివానికి ఇంతకు ముందే శిక్ష విధించడం జరిగింది. ఎందుకంటే అతడు దేవుని ఒకే ఒక కుమారుని పేరుమీద నమ్మకం పెట్టలేదు. 19 ఆ శిక్షావిధికి కారణం ఇదే – వెలుగు లోకంలోకి వచ్చింది గాని తమ క్రియలు చెడ్డవి అయి ఉండడం వల్ల మనుషులకు ప్రీతిపాత్రమైనది చీకటే, వెలుగు కాదు. 20 దుర్మార్గత చేస్తూ ఉన్న ప్రతి ఒక్కరికీ వెలుగు అంటే గిట్టదు. తన పనులు బయటపడుతాయేమో అని అలాంటివాడు వెలుగు దగ్గరికి రాడు. 21 గానీ సత్యాన్ని అనుసరించి చేసేవాడు తన పనులు దేవుని మూలంగా జరిగాయని వెల్లడి అయ్యేలా వెలుగు దగ్గరికి వస్తాడు."

---

ఆయన ప్రేమ కేవలం మాటల్లో మాత్రమే కాదు, క్రియల్లో కూడా కనిపించింది. తన కుమారుణ్ణి ఇచ్చివెయ్యడంద్వారా ఒకేసారి ఎప్పటికీ ఆయన తన ప్రేమను రుజువు పరచుకున్నాడు. (రోమ్ 5:8; తీతు 3:3-5; 1 యోహాను 3:16; 4:9,10). దేవుని ప్రేమ ఒక్క జాతికే పరిమితం కాదు (చాలామంది యూదులు ఇలా అనుకున్నారు). మానవాళినంతటినీ ఆయన ప్రేమించాడు (2 కొరింతు 5:19; 1 యోహాను 2:2; 1 తిమోతి 2:3,4).

"ఒక్కగానొక్క" – క్రీస్తుకు పోలిక అంటూ ఎవరూ లేరు. ఆయన సాటి లేని వ్యక్తి. దేవుని స్వభావమంతటిలో ఆయన భాగస్వామ్యం గలవాడు (1:18; మత్తయి 3:17; ఫిలిప్పీ 2:6). లోకంకోసం చనిపోవడానికి దేవుడు అనేక మంది కుమారుల్లో ఒకర్ని ఇవ్వలేదు. తనకున్న ఒకే ఒక కుమారుణ్ణి ఇచ్చాడు. గొప్పతనంలోనూ, విలువలోను వర్ణనాతీతమైన ఉచిత వరం ఇది (2 కొరింతు 9:15).

యేసుప్రభువును పంపడంలో దేవుని ఉద్దేశం ఇక్కడ స్పష్టంగా వెల్లడి అయింది. మనుషులు పాపంలో నశించిపోతున్నారు. వారికి శాశ్వత జీవాన్ని ఇవ్వాలని దేవుని కోరిక. శాశ్వత జీవం కేవలం ఎప్పటికీ ఉండే జీవం మాత్రమే కాదు. అది మామూలు జీవానికి భిన్నంగా ఉత్తమంగా ఉన్నది. శాశ్వత జీవమంటే పవిత్రమైనది, ఆత్మ సంబంధమైనది. అది పాపం, మరణం నీడ కూడా లేకుండా దేవునితో సహవాసంలోని జీవం. ఆ జీవాన్ని పొందాలంటే ఒకటే మార్గమని యేసుప్రభువు ఇక్కడ మరోసారి అతి స్పష్టంగా చెప్తున్నాడు. ఆయనలో నమ్మకముంచడమే ఆ మార్గం (వ 36; 1:12; 5:24; 6:47; 8:24 కూడా చూడండి). శాశ్వతంగా నరకంలో నశించిపోవడానికీ, దేవునితో అనంతకాలం జీవించడానికీ ఉన్న తేడా క్రీస్తులో నమ్మకం ఉంచడంలోనే ఉంది.

**3:17** 12:47. దేవుడు ఈ విశ్వానికంతటికీ న్యాయమైన తీర్పరి. తీర్పుకోసం ప్రతి ఒక్కరూ ఆయన ఎదుట నిలబడవలసిన సమయం రాబోతున్నది (ఆది 18:25; ద్వితీ 32:36; 1 సమూ 2:10; కీర్తన 7:8; 9:8; 82:8; 96:13; అపొ కా 17:30,31; 2 కొరింతు 5:10; ప్రకటన 20:11-13). అయితే దేవుడు క్రీస్తును ఈ లోకానికి పంపిన ఉద్దేశం పూర్తిగా వేరు. వారి పాపాలకు న్యాయంగా రావలసిన శిక్షనుంచి వారిని విడిపించి రక్షించడమే ఆ ఉద్దేశం. మనుషుల పాపాలనూ శిక్షనూ తానే భరించడంద్వారా క్రీస్తు దేవుని ఉద్దేశాన్ని నెరవేర్చాడు (1:29; 3:15; 2 కొరింతు 5:21; 1 పేతురు 2:24).

దేవుడు తనను పంపించాడని యేసు యోహాను శుభవార్తలో 40 సార్లు చెప్పాడు.

**3:18** రోమ్ 8:1. క్రీస్తు విశ్వాసులకు సంపూర్ణమైన పాపక్షమాపణ దొరికింది. క్రీస్తు బలి అర్పణగా చనిపోవడం వల్ల వారి పాపాలు సమసిపోయాయి. ఆయనెంత నిర్దోషో, న్యాయవంతుడో దేవుని లెక్కలో వారూ అంతే (రోమ్ 3:24,25; 5:1; ఎఫెసు 1:7; కొలస్సయి 2:13; 1 యోహాను 2:12). అందువల్ల వారికిక శిక్షావిధి లేదు. క్రీస్తును నమ్మనివారి సంగతి దీనికి పూర్తిగా వ్యతిరేకం. వారి పాపాలకు దేవుడు చూపిన ఏకైక నివారణను వారు నిరాకరిస్తున్నారు. దేవుని అతి శ్రేష్ఠమైన ఉచిత వరాన్ని విసర్జించడం ద్వారా తమ పాపాల జాబితాలో పాపాలను ఇంకా కలుపుతూ, తమ అపనమ్మకం మూలంగా దేవుణ్ణి అబద్ధికుడుగా చేస్తున్నారు (1 యోహాను 5:10). ఇలాంటివారికి శిక్ష విధించడం తప్ప మరేదీ మిగలదు. బైబిలు ఉపదేశంలో నమ్మకానికి ఉన్న ప్రాధాన్యతను మళ్ళీ గమనించండి.

**3:19,20** మొత్తం లోకం ఇప్పటికీ దేవుని ఎదుట దోషిగా తీర్చబడి శిక్షావిధికి గురై ఉంది (రోమ్ 1:18-20; 3:9,19). క్రీస్తును నమ్మనివారు తమ ప్రవర్తన చెడ్డదని చెప్పే తీర్పు కోసం దేవుని మహా తీర్పుదినం వరకు ఎదురు చూడనవసరం లేదు. ఈ రెండు వచనాల్లో ఈ తీర్పు రాసి ఉన్నది. వారు ఎలాంటివారో, తీర్పుకూ శిక్షకూ ఎంత అర్హులో తమ క్రియల ద్వారానే బయట పెడుతున్నారు. క్రీస్తు అనే వ్యక్తి రూపంలో వెలుగు ఈ లోకంలోకి వచ్చింది. 1:4-9; 8:12 పోల్చి చూడండి. దేవుణ్ణి గురించి మనుషుల గురించి పాపవిముక్తి గురించి అద్భుతమైన సత్యాలను ఆయన లోకంలోకి తెచ్చాడు. కానీ మొత్తం మీద మనుషులు ఆయన్ను గానీ ఆయన తెచ్చిన సత్యాన్ని గానీ ఇష్టపడలేదు. వారికి వేరొకటి ప్రీతిపాత్రంగా ఉంది – చీకటి. చీకటి దాపరికానికీ కపటానికీ అజ్ఞానానికీ అసత్యానికీ దుర్మార్గతకూ సూచన. అలాంటి చీకటిని అంటే ఇష్టమున్నవారికి వెలుగు అంటే ఇష్ట ముండదు.. వారు నరకానికి పాత్రులైన పాపులనీ, క్రీస్తు మాత్రమే వారిని దాని నుంచి తప్పించగలడనీ వారి స్థితిని ఉన్నదున్నట్టుగా ఆ వెలుగు బయటపెడుతుంది. అంతేగాక వారు చేయడానికి ఇష్టపడే చెడు కార్యాల్లో మునిగి తేలుతూ ఉండకుండా వెలుగు అడ్డుపడుతుంది. అందువల్ల వెలుగంటే వారికి ద్వేషం. అంటే వారు క్రీస్తునూ, ఆయన సత్యాన్నీ ద్వేషిస్తున్నారు (ఇది అతిశయోక్తి, అతివాదం కాదు. యేసు అనేకసార్లు చెప్పిన గంభీర సత్యమిది – 7:7; 15:18,23-25). దీన్ని బట్టి మనం గ్రహించవలసినది ఏమంటే, మనుషుల అపనమ్మకానికి కారణం అందుకు సరైన హేతువులు వారికి ఉండడం కాదు. లేక, వారి బుద్ధి ఎంతో ఎక్కువ గనక నమ్మలేకపోతున్నారనీ కాదు. వారిలోని పాపం, చీకటి కారణంగానే వారు నమ్మరు. ఈ పొరపాటుకు మూలం వారి ఆలోచనల్లో లేదు గాని వారి ఆశల్లో, అంతరంగంలోనే. క్రీస్తులో నమ్మకం అనేది చీకటికి బదులు మంచితనాన్ని, పవిత్రతను, సత్యాన్ని నీతిని ఎన్నుకోవడమే. చాలామంది ఇలా ఎన్నుకునేందుకు ఇష్టపడరు. పవిత్రత కంటే పాపాన్నీ, క్రీస్తుకంటే స్వార్థాన్నీ వారు కోరుకుంటారు.

**3:21** అయితే సత్యాన్ని కోరుకుని, దాన్ని ఆచరించేందుకు ప్రయత్నించేవారు కొందరున్నారు. వారు దేవుని వాక్కుకు కొంతవరకైనా విధేయత చూపుతారు. దేవుడు అలాంటి వారి హృదయాల్లో పని చేస్తున్నాడు. వెలుగుకు వారు భయపడరు. దాని దగ్గరకు వస్తారు. అందుచేత వీరు శుభవార్తను నమ్మి క్రీస్తును స్వీకరిస్తారు. నాలుగు శుభవార్తల్లోనూ శిష్యులు,

22 ఆ తరువాత యేసు, ఆయన శిష్యులు యూదయ ప్రదేశానికి వెళ్ళారు. అక్కడ ఆయన వారితో కొంత కాలం గడుపుతూ బాప్తిసం ఇప్పిస్తూ ఉన్నాడు. 23 సాలీము దగ్గర ఉన్న ఐనోనులో చాలా నీళ్ళు ఉన్నాయి గనుక యోహాను కూడా అక్కడ బాప్తిసం ఇస్తూ ఉన్నాడు. ప్రజలు అక్కడికి వచ్చి బాప్తిసం పొందుతూ ఉన్నారు. 24 యోహానును ఇంకా చెరసాలలో వేయడం జరగలేదు. 25 యోహాను శిష్యులకూ యూదులకూ మధ్య శుద్ధి ఆచారాల గురించిన వివాదం పుట్టింది. 26 వారు యోహాను దగ్గరికి వచ్చి "గురువర్యా! మునుపు యొర్దాను అవతల నీతో ఉన్నవాడు – నీవు సాక్ష్యం చెప్పిన ఆ వ్యక్తి – ఇప్పుడు బాప్తిసం ఇస్తూ ఉన్నాడు, అందరూ ఆయన దగ్గరికి వస్తూ ఉన్నారు" అన్నారు.

27 యోహాను ఇలా సమాధానం చెప్పాడు: "పరలోకం నుంచి ఇవ్వడం జరిగితే తప్ప ఏ మనిషికీ ఏమీ లభించదు. 28 నేను క్రీస్తును కాననీ ఆయనకు ముందుగా పంపబడ్డవాణ్ణనీ నేను చెప్పినట్టు మీరే సాక్షులు. 29 పెండ్లి కుమారునికే పెండ్లి కుమార్తె ఉంటుంది. అయితే పెండ్లి కుమారుని స్నేహితుడు నిలబడి పెండ్లి కుమారుని స్వరం విన్నప్పుడు ఆ స్వరాన్ని బట్టి అధికంగా సంతోషిస్తాడు. అలాగే నా సంతోషం సంపూర్ణం అయింది. 30 ఆయన హెచ్చాలి, నేను తగ్గాలి.

31 "పైనుంచి వచ్చినవాడు అందరికీ పైవాడే. భూమినుంచి వచ్చినవాడు భూమికి చెందినవాడు, భూమి నుంచి వచ్చినట్టు మాట్లాడుతాడు. పరలోకం నుంచి వచ్చినవాడు అందరికీ పైగా ఉన్నాడు. 32 ఆయన చూచినవాటిని, విన్నవాటిని గురించి సాక్ష్యం చెప్తాడు గానీ ఆయన సాక్ష్యం ఎవరూ అంగీకరించడం లేదు. 33 ఆయన సాక్ష్యం అంగీకరించినవాడు తద్వారా దేవుడు సత్యవంతుడని రూఢి చేస్తున్నాడు. 34 దేవుడు పంపిన ఆయన దేవుని వాక్కులు పలుకుతాడు. ఎందుకంటే దేవుడు ఆయనకు పరిమితంగా ఆత్మను ఇచ్చేవాడు కాడు. 35 కుమారుణ్ణి తండ్రి ప్రేమిస్తున్నాడు, సమస్తమూ ఆయన చేతికి అప్పచెప్పాడు. 36 కుమారుని మీద నమ్మకం ఉంచినవాడు శాశ్వత జీవం గలవాడు. కానీ కుమారుణ్ణి నమ్మడానికి నిరాకరించేవాడికి జీవం చూపుకు కూడా అందదు. దేవుని కోపం అతని మీద

---

ఇతరులు మరికొందరు ఇందుకు ఉదాహరణలు. ప్రపంచంలో ఈనాడు ఇలాంటివారు అనేకమంది ఉన్నారు.

**3:22** 4:1,2.

**3:23** "సాలీము" ఖచ్చితంగా ఎక్కడున్నదీ తెలియదు. యోహాను అక్కడ బాప్తిసం ఇస్తున్నాడని చెప్పడంలో గల కారణం అతడు ముంచడం ద్వారా బాప్తిసమిచ్చేవాడని సూచిస్తున్నది (మత్తయి 3:6).

**3:24** మత్తయి 14:1-12.

**3:25** మార్కు 7:1-4.

**3:26** "గురువర్యా" – 1:38. క్రీస్తుకు సాక్షిగా ఉండేందుకు యోహాన్ను దేవుడు పంపాడు (1:6-8). తరువాతి వచనాల్లో ఎంత అద్భుతంగా అతడీ పని చేస్తూ ఉన్నాడో చూడగలం. యోహాను క్రీస్తును గురించి అసూయపడేవాడు కాదు, పైగా ప్రజలు క్రీస్తును గుర్తించినందుకు ఉప్పొంగిపోతున్నాడు. తన పరిచర్య అంతటి నెరవేర్పును అందులో చూడగలిగాడు. తనవైపుకు ప్రజలను ఆకర్షించుకోవడం అతని ఉద్దేశం ఎన్నటికీ కాదు. వారికి యేసుప్రభువును చూపించడమే అతని పని. ఇందులో ఇతడు మనకందరికీ ఆదర్శం.

**3:27** తన ప్రజల్లో ప్రతి ఒక్కరికీ ఒక స్థానాన్ని, ఒక పరిచర్యను దేవుడు ఏర్పాటు చేశాడని యోహానుకు బాగా తెలుసు. ఒకడు మరొకటి స్థానంకోసం ప్రాకులాడ్డం గానీ మరొకణ్ణి చూచి అసూయ చెందడం గానీ తగదనీ, తనకోసం దేవుని ఏర్పాటుతో తృప్తిపడాలనీ కూడా అతనికి తెలుసు. సంఖ్యా 11:26-29; కీర్తన 75:6,7; యిర్మీయా 45:5 పోల్చి చూడండి.

**3:28,29** యోహానుకు తన స్థానమేమిటో తెలుసు. దాన్నిబట్టి అతనికెంతో సంతోషం. 1:19-27లో తన పరిచర్య ఏమిటో స్పష్టంగా అతడు చెప్పాడు. ఇక్కడ క్రీస్తును పెళ్ళికుమారుడుగా, ఆయన ప్రజలను పెళ్ళికూతురుగా అతడు వర్ణిస్తున్నాడు. తనను పెళ్ళికుమారునికి ఒక స్నేహితుడుగా మాత్రమే వర్ణిస్తున్నాడు. పెళ్ళిలో వధూవరులే ప్రాముఖ్యమైన వ్యక్తులు. పెళ్ళికొడుకు స్నేహితునికి అంత ప్రాముఖ్యత లేదు. పాత ఒడంబడిక గ్రంథంలో ఇస్రాయేల్‌జాతిని యెహోవాదేవుని భార్యగా వర్ణించిన సంగతి యోహానుకు తెలుసు (యెషయా 54:5; 62:4,5; యిర్మీయా 2:2; 3:20; యెహె 16:8; హోషేయ 2:19,20). క్రొత్త ఒడంబడిక గ్రంథంలో క్రీస్తు తనను తాను పెళ్ళికుమారునిగా చెప్పుకున్నాడు (మార్కు 2:19). ఆయన సంఘం పెళ్ళి కుమార్తెకు పోల్చబడింది (2 కొరింతు 11:2; ఎఫెసు 5:32; ప్రకటన 19:7).

**3:30** క్రీస్తుపట్ల ప్రేమ, నిస్వార్థ త్యాగం, అణకువ చూపడం యోహాను జీవితంలో కనిపిస్తున్నాయి. ఈ సుగుణాలు దేవుని దృష్టిలో అతి విలువ గలవి (మత్తయి 3:11; 10:37-39; 18:4; 20:25-28).

**3:31** పైనుంచి వచ్చినవాడు యేసుప్రభువు – వ 13; 8:23; 1 కొరింతు 15:47. భూమికి చెందినవాడు యోహాను. యేసుప్రభువుకూ మిగతా మనుషులందరికీ ఉన్న ఒక తేడా ఇదే.

**3:32** వ 11-13.

**3:33** మనం క్రీస్తు మాటలపై నమ్మకం ఉంచితే దేవుడు సత్యవంతుడని చెప్తున్నామన్న మాట. అలా నమ్మకపోతే దేవుణ్ణి అబద్ధికుడు అని చెప్పినట్టే (1 యోహాను 5:10).

**3:34** 7:16,17; 8:38; 12:49,50 పోల్చి చూడండి. ఇక్కడ "ఆత్మ" అంటే పవిత్రాత్మ – 1:32; మత్తయి 3:16; యెషయా 11:1,2; 61:1. దేవుని ఆత్మ గురించి నోట్స్ 14:16,17.

**3:35** తండ్రి అయిన దేవునికీ, కుమారుడైన దేవునికీ మధ్య ఉన్న పరస్పర ప్రేమ, అంటే దేవత్వంలోని వ్యక్తుల మధ్య ఉన్న ప్రేమ శుభవార్తలన్నిటిలోనూ కనిపిస్తున్నది గానీ మిగతావాటిలో కన్నా యోహాను శుభవార్తలో మరింత తేటగా ఇది వెల్లడి అయింది (మత్తయి 3:17; మార్కు 1:11; లూకా 3:22; యోహాను 5:20; 10:17; 14:31; 15:9,10; 17:23,24,26). తండ్రి అధికారమంతా కమారునికి ఇచ్చాడు. 5:22-27; 17:2,6; మత్తయి 28:18; అపొ కా 2:36; హీబ్రూ 1:2; కీర్తన 2:6-12 చూడండి.

**3:36** పైనున్న వచనాల తరువాత సహజంగానే ఈ మాటలు వస్తున్నాయి. క్రీస్తులో నమ్మకం ఉంచినవారికి క్రీస్తు శాశ్వత జీవాన్ని ఇవ్వాలని దేవుడు ఆదేశించాడు. దాన్ని ఇవ్వగలవాడు ఆయనొక్కడే. పొందవలసిన మార్గమూ ఇదొక్కటే. వ 16లో శాశ్వత జీవం గురించి నోట్ చూడండి.

"విధేయులు కానివారికి" – ఈ గ్రీకు పదాన్ని "నిరాకరించినవారికి", లేక "తిరగబడినవారికి" అని కూడా

ఎప్పుడూ ఉంటుంది.”

4 యేసు యోహానుకంటే ఎక్కువమందిని శిష్యులుగా
చేసుకొన్నట్టు, వారికి బాప్తిసం ఇస్తున్నట్టు పరిసయ్యులకు
వినవచ్చింది. ఈ సంగతి ప్రభువుకు తెలిసింది. 2 (యేసు
తానే బాప్తిసం ఇవ్వలేదు – ఆయన శిష్యులే ఇస్తూ ఉండేవారు.)
3 అప్పుడు ఆయన యూదయను విడిచి గలలీకి తిరిగి
వెళ్ళాడు.
4 ఆయన సమరయ మీదుగా వెళ్ళవలసివచ్చింది.
5 సమరయలో సుకారు అనే ఊరికి ఆయన వచ్చాడు. అది
యాకోబు తన కొడుకైన యోసేపుకు ఇచ్చిన భూమిదగ్గర
ఉంది. 6 యాకోబు బావి అక్కడ ఉంది. కనుక యేసు
ప్రయాణంవల్ల అలసి అలాగే బావి దగ్గర కూర్చున్నాడు.
అప్పటికి మధ్యాహ్నం సుమారు పన్నెండు గంటలయింది.
7 సమరయ స్త్రీ ఒకతె నీళ్ళు చేదుకోవడానికి అక్కడికి
వచ్చింది. ఆమెతో యేసు “నాకు త్రాగడానికి నీళ్ళివ్వు” అన్నాడు.
8 ఎందుకంటే, ఆయన శిష్యులు భోజన పదార్థాలు
కొనుక్కోవడానికి ఊరిలోకి వెళ్ళారు.
9 “నేను సమరయ స్త్రీని. మీరు యూదులై ఉండి
తాగడానికి నీళ్ళిమ్మని నన్ను అడుగుతారేమిటి?” అని ఆ
సమరయ స్త్రీ ఆయనతో అంది. (యూదులు సమరయ
దేశస్థులతో సహవాసమేమీ చేయరు.)
10 యేసు ఆమెతో ఇలా సమాధానం చెప్పాడు: “నీకు
దేవుని కృపావరం తెలిసి ఉంటే, త్రాగడానికి నీళ్ళిమ్మని నిన్ను
అడిగినది ఎవరో అది కూడా తెలిసి ఉంటే, ఆయనను అడిగి
ఉండేదానివే. ఆయన నీకు జీవ జలం ఇచ్చి ఉండేవాడు.”
11 ఆ స్త్రీ ఆయనతో “అయ్యా, ఈ బావి లోతైనది.
చేదుకోవడానికి మీ దగ్గర ఏమీ లేదు. మీకు ఆ జీవజలం ఎక్కడ

---

అనువదించవచ్చు. క్రీస్తును నిరాకరించడమంటే, ఆయనకు విధేయత చూపకపోవడమంటే పాపాన్ని కోరుకోవడమే. పాపమంతటి మీదా పాపులందరి మీదా దేవుని కోపం ఎప్పుడూ నిలిచే ఉంటుంది (మత్తయి 3:7; రోమ్ 1:18; ఎఫెసు 5:6; 1 తెస్స 1:10; ప్రకటన 6:16,17; 19:15. సంఖ్యా 25:3; ద్వితీ 4:25; కీర్తన 90:7–11 నోట్స్ చూడండి.) పవిత్రమైన న్యాయ బద్ధమైన ఆయన స్వభావం దుర్మార్గతనంతటినీ అసహ్యించుకోవడమే ఆయన కోపానికి కారణం. ప్రతి వ్యక్తీ శాశ్వత జీవాన్ని పొందాలి, లేదా దేవుని కోపాన్ని అనుభవించాలి. మనుషుల ఎదుట ఈ రెండు మాత్రమే ఉన్నాయి.

**4:1** “పరిసయ్యులు” – మత్తయి 3:7. ఇక్కడ యోహాను యేసుకు “ప్రభువు” అనే బిరుదు వాడుతున్నాడు. క్రొత్త ఒడంబడిక గ్రంథంలో యేసును ప్రభువని వందల సార్లు అనడం కనిపిస్తున్నది. అనేక చోట్ల ఈ మాటకు అర్థం మనుషులందరికి ఏకైక ప్రభువు, విశ్వానికంతటికీ మహామహుడైన ప్రభువు అని (1 కొరింతు 8:6; ప్రకటన 1:16). పాత ఒడంబడిక గ్రంథం గ్రీకు అనువాదంలో “ప్రభువు” అనే పదానికి గ్రీకు పదం కురియొస్‌ను యెహోవా అనే పేరును అనువదించడానికి ఉపయోగించారు. (యెహోవా – నిర్గమ 3:14,15 నోట్ చూడండి.) పాత ఒడంబడికలో యెహోవాను ప్రభువు అన్నారు, క్రొత్త ఒడంబడికలో యేసును ప్రభువు అన్నారు. లూకా 2:11 నోట్ చూడండి.

**4:2** శుభవార్త పుస్తకాల్లో పరిసయ్యులు దాదాపు ఎప్పుడూ యేసుప్రభువుకు విరోధులుగానే కనిపిస్తారు. చివరికి వారు ఆయన్ను హతమార్చేందుకు కుట్ర పన్నారు (7:32; 11:57; 18:3). యేసుకు వారి హృదయాలు తెలుసు (2:24,25). పాపులకోసం తాను జెరుసలంలో చనిపోవలసిన సమయం ఇంకా రాలేదని ఆయనకు తెలుసు. అందువల్ల వారితో అనవసరమైన వివాదాలెందుకని యూదయ ప్రాంతం విడిచి వెళ్ళిపోయాడు.

**4:4** యూదయ, గలలీ ప్రాంతాలమధ్య ఉన్న ప్రాంతం సమరయ. ఆ ప్రాంతం ప్రజలను యూదులు సాధారణంగా అసహ్యించుకునేవారు (వ 9. సమరయవారి గురించి నోట్ 2 రాజులు 17:24; మత్తయి 10:5). యూదయనుంచి గలలీ ప్రాంతానికి వెళ్ళాలంటే సమరయ మీదుగా వెళ్ళేది దగ్గర దారి. కానీ చాలామంది యూదులు సమరయ ప్రజలను తప్పించుకొనేందుకు ఆ ప్రదేశం బయటగా చుట్టు దారిన ప్రయాణించేవారు. యేసు సమరయ మీదుగా “వెళ్ళవలసి వచ్చింది” అంటున్నాడు యోహాను. హడావుడిగా గలలీకి చేరుకోవలసి ఉంటే, లేక సమరయలో చెయ్యవలసిన పనేదైనా ఉంటే ఈ విధంగా ప్రయాణించడం అవసరం. వ 40లో యేసు తొందరగా ప్రయాణం చేయడం లేదని కనిపిస్తుంది. అయితే ఈ అధ్యాయం మిగతా భాగమంతా సమరయ ప్రాంతంలో చెయ్యాలనుకున్న ఒక పని ఆయనకు ఉందని తెలియజేస్తున్నది. ఎంత మంచి పని అది! అలా ప్రయాణం చెయ్యడానికి మరో కారణం బహుశా ఆ ప్రజలపై యూదులకు సామాన్యంగా ఉండే ద్వేషం తనకు లేదని చూపించుకోవడానికి కావచ్చు.

**4:5** ఆది 33:19; 48:22; యెహో 24:32.

**4:6** యేసు ఇలా అలసిపోవడం ఆయనలోని నిజమైన మానవ స్వభావాన్ని తెలియజేస్తున్నది. దేవుడుగా ఆయనకు అలసట ఉండదు (యెషయా 40:28). మనిషిగా కాలినడకన సుదీర్ఘ ప్రయాణం వల్ల ఆయన అందరిలాగే అలసిపోయాడు. క్రీస్తుకున్న రెండు స్వభావాల గురించి 1:14; హీబ్రూ 2:14–17 చూడండి.

**4:7** ఇక్కడ మళ్ళీ ప్రభువులోని మానవ స్వభావం బహిర్గతమైంది. దాహం మనుషులకే వేస్తుంది గాని దేవునికి కాదు.

**4:9** మొదట్లో ఈమె యేసును దాహంతో ఉన్న ఒక యూదుడుగానే చూచింది. అయితే కథ ముందుకు సాగుతున్న కొద్దీ ఆయనెవరో అన్న విషయం ఆమెకు మరింతగా తెలుస్తూ రావడం చూడవచ్చు – గొప్ప వాగ్దానాలు చేసేవాడు (వ 10–15), ఒక ప్రవక్త (వ 19), చివరగా అభిషిక్తుడు (వ 25,26,29). క్రీస్తు ఎవరో దశలవారీగా అర్థం కావడం అన్నది విశ్వాసులంతా ఎరిగిన అనుభవమే.

**4:10** ఈ స్త్రీని దేవుని రాజ్యంలో చేర్చాలన్నదే క్రీస్తు ఉద్దేశం. తన మాటల్లో ఆమెకు ఏవిధంగా ఆసక్తి పెరిగేలా చేశాడో చూడండి. “జీవజలం” అంటే ఆయనిచ్చే నూతన జీవం. ఇందులో నూతన జన్మ (3:5), శాశ్వత జీవం (3:16), విశ్వాసుల హృదయాల్లో నివసించే దేవుని ఆత్మ (7:37–39) మొదలైన భావాలన్నీ ఇమిడివున్నాయి. ఇది యేసు ఉచితంగా ఇచ్చేదే అన్న విషయం గమనించండి (ప్రకటన 22:17). యేసుప్రభువును అడగడం ద్వారా దీన్ని పొందగలమని కూడా గమనించండి. నిజానికి దాన్ని ఇవ్వగలిగినది ఆయనొక్కడే. పాత ఒడంబడిక గ్రంథంలో కూడా నీరు ఆధ్యాత్మిక జీవానికి సూచనగా ఉంది – కీర్తన 36:9; యెషయా 55:1; యిర్మీయా 2:13; 17:13.

**4:11,12** ఈ స్త్రీ యేసు మాటను పూర్తిగా అపార్థం చేసుకున్నట్టుంది. ఇది అప్పుడూ ఇప్పుడూ కూడా తరుచుగా జరుగుతూ ఉంది. ఆయన మాటలను అక్షరాలా అర్థం

దొరుకుతుంది? 12 మన పూర్వికుడు యాకోబు ఈ బావి మాకిచ్చాడు. తాను తన పశువులు, తన కొడుకులు ఈ నీళ్ళు తాగారు. ఆయనకంటే మీరు గొప్పవారా?" అంది.

13 యేసు జవాబిస్తూ "ఈ నీళ్ళు త్రాగే ప్రతి ఒక్కరికీ మళ్ళీ దాహం అవుతుంది. 14 గానీ నేను ఇచ్చే నీళ్ళు త్రాగే ఎవరికైనా మరెన్నడూ దాహం కాదు. నేను వారికిచ్చే నీళ్ళు వారిలో ఉండి శాశ్వత జీవితానికి ఊరుతూ ఉండే ఊట అవుతుంది" అని ఆమెతో అన్నాడు.

15 "అయ్యా, నాకు దప్పిక కాకుండా, చేదుకోవడానికి ఇక్కడికి రాకుండా ఆ నీళ్ళు నాకివ్వండి" అని ఆ స్త్రీ ఆయనతో అంది.

16 ఆయన ఆమెతో "వెళ్ళి నీ భర్తను పిలుచుకొని ఇక్కడికి రా!" అన్నాడు.

17 "నాకు భర్త లేదు" అని ఆమె జవాబిచ్చింది.

యేసు ఆమెతో ఇలా అన్నాడు: "'నాకు భర్త లేదు' అని నీవు చెప్పినది సరిగానే ఉంది. 18 నీకు అయిదుగురు భర్తలు ఉండేవారు. ఇప్పుడున్నవాడు నీ భర్త కాదు. దాని గురించి నిజం చెప్పావు."

19 అప్పుడా స్త్రీ ఆయనతో "అయ్యా, మీరు ప్రవక్తలని గ్రహిస్తున్నాను. 20 మా పూర్వీకులు ఈ కొండ మీద ఆరాధించేవారు, గానీ ఆరాధన చేయవలసిన స్థలం జెరుసలంలోనే ఉందని మీరు అంటారు" అంది.

21 యేసు ఆమెతో ఇలా అన్నాడు: "అమ్మా, నన్ను నమ్ము. ఒక కాలం వస్తూ ఉంది. అప్పుడు ఈ కొండ మీద గానీ జెరుసలంలో గానీ పరమ తండ్రిని మీరు ఆరాధించరు. 22 మీరు ఆరాధించేది మీకే తెలియదు. మేము ఆరాధించేది మాకు తెలుసు. విముక్తి యూదులలోనుంచే వస్తుంది. 23 నిజమైన ఆరాధకులు ఆత్మలో సత్యంలో తండ్రిని ఆరాధించే కాలం వస్తూ ఉంది. అది రానే వచ్చింది. అలాంటి వారు తనను ఆరాధించాలని తండ్రి వారిని వెదకుతూ ఉన్నాడు. 24 దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించేవారు ఆత్మలో సత్యంలో ఆరాధించాలి."

25 ఆ స్త్రీ ఆయనతో ఇలా అంది: "అభిషిక్తుడు వస్తాడని నాకు తెలుసు. ఆయనను 'క్రీస్తు' అంటారు. ఆయన

---

చేసుకుందామె. అప్పటి వాడుకలో జీవజలం అంటే వాగు లేక నదిలాగా ఎప్పుడూ ప్రవహిస్తూ ఉండే నీరు. యేసు ఆధ్యాత్మిక విషయం గురించి మాట్లాడుతున్నాడని ఆమె గ్రహించినట్టు లేదు.

**4:13,14** ఇప్పుడు యేసు తాను మామూలు నీళ్ళ గురించి కాక, ఆధ్యాత్మిక విషయాల గరించి మాట్లాడుతున్నానని ఆమెకు చూపించే ప్రయత్నం చేస్తున్నాడు. శాశ్వతంగా దాహాన్ని తీసివేసి, శాశ్వత జీవాన్ని కలిగించే మామూలు నీరు ఎక్కడా లేదు.

"దాహం కాదు" – అంటే విశ్వాసులు దేవుణ్ణి మరింత లోతైన అనుభవంకోసం ఆశించరని గానీ సత్యం, నీతిన్యాయాల కోసం దాహం అనుభవించరని గానీ అర్థం కాదు (కీర్తన 40:1,2; 119:131; మత్తయి 5:6). దీని అర్థం కొత్త జన్మనూ కొత్త జీవాన్నీ దేవుని ఆత్మమూలంగా అనుభవించిన తరువాత వాటికోసం మళ్ళీ దప్పిగొనక్కర్లేదు. వారిలోని లోతైన అభిలాషలను సంతృప్తి పరచగలిగే ఒక ఊట వారిలో ఉంటుంది. యేసు ఇచ్చే జీవం జలజల పారే నీటిలాంటిది. విశ్వాసి హృదయంలో పెల్లుబికే ఊటలాంటిది. అది సమృద్ధి జీవం (10:10). ఈ నీరు త్రాగడమెలా? నమ్మకంతో క్రీస్తుచెంతకు వచ్చి ఆయన్ను ప్రభువుగా ముక్తిదాతగా రక్షకుడుగా మన హృదయాల్లోకి స్వీకరించడమే.

**4:15** యేసు ఆధ్యాత్మిక విషయాల గురించి మాట్లాడు తున్నాడని ఈ స్త్రీ గ్రహించిందా? గ్రహించినట్టయితే బయట పెట్టడం లేదు. అయితే ఆధ్యాత్మిక జీవం గురించిన ఆశ బహుశా ఆమె మనసులో మొగ్గ తొడిగింది.

**4:16** ఈ మాటలకూ ఇంతవరకు మాట్లాడినదానికీ ఎక్కడా పొంతన ఉన్నట్టు కనిపించదు. కానీ తప్పకుండా సంబంధం ఉంది, సందేహం లేదు. తాను సాధారణ వ్యక్తిని కానని ఆమె గ్రహించేలా చేస్తున్నాడు యేసు. ఆమె పాపభరితమైన జీవితం ఆమెకు గుర్తు చేస్తున్నాడు కూడా. ఆ జీవజలం కావాలంటే ఆ జీవితాన్ని విడిచి పెట్టేందుకు ఆమె ఇష్టపడాలి.

**4:19** "ప్రవక్త" గురించి నోట్ ఆది 20:7. దేవుడు కొన్నిసార్లు ఇతరుల గురించిన సత్యాలను తన ప్రవక్తలకు వెల్లడి చేసిన సంగతి ఆమెకు తెలుసు (లూకా 7:39 కూడా చూడండి).

**4:20** తన జీవితంలోని అనేకమంది మగవాళ్ళ గురించి మాట్లాడ్డం ఆమెకు ఇష్టం లేదు. అందుకని మాట మారుస్తున్నది.

**4:21-24** "మీరు అంటారు" – అంటే సాధారణంగా యూదులు ఇలా అంటారు. ఆమె మాట మార్చడంవల్ల ఆరాధన గురించిన ఒక గంభీర సత్యాన్ని ఆమెకు తెలిపే అవకాశం యేసుకు లభించింది. దేవుణ్ణి ఎక్కడైనా ఆరాధించవచ్చు (వ 21). ఇప్పుడు ఆరాధన స్థలానికి ప్రాధాన్యత ఏమీ లేదు (ఒకప్పుడు కొంతవరకు అలాంటి ప్రాధాన్యత ఉండేది – ద్వితీ 12:5; 2 దిన 6:6,7 చూడండి.

దేవుణ్ణి పరమ తండ్రిగా ఆరాధించాలి (వ 21,23; మత్తయి 5:16 నోట్). సమరయవారు (అంటే యూదేతర ప్రజలంతా అని అర్థం చేసుకోవచ్చు) తాము దేన్ని ఆరాధిస్తున్నదీ నిజంగా ఎరుగరు (వ 22). అపొ కా 17:23; రోమ్ 1:21-23. దేవుడు తన గురించి వెల్లడించిన సత్యాల ప్రకారం వారు ఆరాధించడం లేదు.

"విముక్తి. . .వస్తుంది" – దేవుడు లోకానికి తన గురించి వెల్లడించడానికీ, తాను సిద్ధం చేసిన పాపవిముక్తిని తేవడానికి యూద జాతే కాలువలాంటిది. యేసుప్రభువు యూదుడుగా జన్మించాడు. దేవుడు కోరుతున్న ఆరాధనకు భౌతిక వస్తువులు, గుడులు, స్థలాలు, ప్రదేశాలతో ఎలాంటి సంబంధమూ లేదు (వ 23,24; అపొ కా 17:24,25).

నిజమైన ఆరాధన ఆత్మలో చెయ్యవలసినదే. దేవుని ఆత్మమూలంగా తిరిగి జన్మించినవారి హృదయాల్లో నుండే అది రావాలి (3:5. దేవునికి అర్పించదగ్గ నిజమైన ఆరాధన ఏదో వేరెవరికీ తెలియదు). దేవుడు ఆత్మ గనక భౌతిక వస్తువులేవీ నిజంగా ఆయనకు ప్రతినిధులుగా ఉండలేవు. ఏకైక శాశ్వతాత్మ దేవుణ్ణి ఆత్మ ద్వారా మాత్రమే నిజంగా ఆరాధించడం సాధ్యం.

అలాంటి ఆరాధన సత్యానికి అనుగుణంగా ఉండాలి. అంటే దేవుడు తన గురించి వెల్లడి చేసిన దానికి అనుగుణంగా ఉండాలి. మనఃపూర్వకంగా, వాస్తవంగా కపటం లేకుండా అది ఉండాలి. దేవుడు ఇలాంటి అరాధకుల కోసమే చూస్తున్నాడు. దేవుడు ప్రేమామయుడు గనకే ఇలా వెదకుతున్నాడు (1 యోహాను 4:8). ఆయన మనుషుల్ని ప్రేమిస్తూ వారి ప్రేమను ఆశిస్తున్నాడు. వారికి ఉన్నతమైన మేలు జరగాలనే ఆయన కోరిక. నిజ దేవుని నిజ ఆరాధకులయితేనే ఇది సాధ్యం. లోకంలో అంతటా కనిపించే ఆచారపరమైన శూన్య ఆరాధనకంటే మరింత శ్రేష్ఠమైన ఆరాధనను ఆయన కోరుతున్నాడు. కీర్తన 50:8-15; యెషయా 1:11-17 పోల్చి చూడండి.

**4:25** "అభిషిక్తుడు" – మత్తయి 1:1. యూదుల్లాగే

వచ్చేటప్పుడు అన్ని విషయాలు మాకు తెలియజేస్తాడు.”
26 “నీతో మాట్లాడుతున్న నేను ఆయనను” అని యేసు ఆమెతో అన్నాడు.
27 ఇంతలో ఆయన శిష్యులు వచ్చారు. ఒక స్త్రీతో ఆయన మాట్లాడడం చూచి వారు ఆశ్చర్యపడ్డారు. అయితే “నీకేం కావాలి” అని గానీ “ఆమెతో ఎందుకు మాట్లాడుతున్నావు?” అని గానీ ఎవడూ అడగలేదు.
28 ఆ స్త్రీ తన కుండ విడిచిపెట్టి ఊరిలోకి వెళ్ళి అక్కడి మనుషులతో ఇలా అంది:
29 “నేను చేసినవన్నీ ఓ మనిషి నాకు చెప్పాడు. రండి, ఆయనను చూడండి. ఆయన అభిషిక్తుడు కాడా?”
30 వారు ఊరినుంచి బయలుదేరి ఆయన దగ్గరకు వస్తూ ఉన్నారు.
31 ఈలోగా ఆయన శిష్యులు “గురువర్యా, తినండి” అని ఆయనను కోరారు.
32 అందుకాయన వారితో “తినడానికి మీకు తెలియని ఆహారం నాకు ఉంది” అన్నాడు.
33 కనుక శిష్యులు “ఈయనకు తినడానికి ఎవరైనా ఏదైనా తెచ్చారా ఏమిటి?” అని ఒకనితో ఒకడు చెప్పు కొన్నారు.
34 యేసు వారితో “నన్ను పంపినవాని చిత్తం నెరవేర్చి ఆయన పని ముగించడమే నా ఆహారం!
35 ఇంకా నాలుగు నెలల తరువాత కోతకాలం వస్తుందని మీరు అంటారు గదా. ఇదిగో వినండి, నేను మీతో అంటున్నాను, మీ తలలెత్తి పొలాలను చూడండి. ఇప్పటికే అవి తెల్లబారి కోతకు తయారయ్యాయి.
36 విత్తనాలు వేసేవాడూ పంట కోసేవాడు కలిసి సంతోషించాలని ఇప్పుడే కోసేవాడు జీతం పుచ్చుకొంటున్నాడు. శాశ్వత జీవం కోసం ఫలం సమకూర్చు కొంటున్నాడు.
37 విత్తనాలు చల్లేవాడొకడు, కోసేవాడు ఇంకొకడు అనే మాట ఈ విషయంలో నిజమే.
38 మీరు కష్టపడనిదాని పంట కోయడానికి నేను మిమ్ములను పంపాను. ఇతరులు కష్టపడ్డారు. వారి కష్ట ఫలితంలో మీరు ప్రవేశించారు” అన్నాడు.
39 “నేను చేసినవన్నీ ఆయన నాకు చెప్పాడ”ని ఆ స్త్రీ

---

సమరయవారు కూడా రానున్న అభిషిక్తుని కోసం ఎదురు చూచేవారు. యేసు ఆ అభిషిక్తుడై ఉండవచ్చున్న తలంపు ఈ స్త్రీలో ఆరంభమైందేమో. అలా కాకపోయినా ఆయన మాటలు మాత్రం ఆమె మనస్సులో బలంగా నాటుకున్నాయి (వ 29).

**4:26** అంతా ఎదురు చూస్తున్న అభిషిక్తుడు తానే అని యేసు తేటతెల్లంగా చెప్పాడు. 1:49,50; 9:37; 10:24,25; మత్తయి 26:63,64 కూడా చూడండి.

**4:27** ఆ రోజుల్లో యూదుల ఉపదేశకులు ఒక స్త్రీతో అంత సేపు మాట్లాడరు, ఆమెతో ఒంటరిగా ఉండడం ఎవరైనా చూచే ప్రమాదం కొనితెచ్చుకోరు. యేసుప్రభువైతే ఆ స్త్రీని చిన్నచూపు చూడడం లేదు. వారి అవసరతలో వ్యక్తులందరినీ సమానంగా ఆయన చూచేవాడు. తన గురించి ఇతరులు ఏమనుకుంటారో అన్న ఆందోళన ఆయనకు లేదు. శిష్యులు ఆయన్నేమీ ప్రశ్నించలేదు. ఆయన చేసే ప్రతి పనికీ సరైన కారణాలు ఉంటాయని వారికి ముందే తెలుసు.

**4:29** వ 25.

**4:30** ఆమె సాక్ష్యం ఆ ఊళ్ళో పెద్ద కుతూహలం, ఆసక్తి రేపింది. మనుషులను క్రీస్తు చెంతకు తీసుకురావడానికి దేవుడు ఇప్పటికీ ఉపయోగించే పద్ధతి ఇలా సాక్ష్యం చెప్పడం.

**4:32,33** ఆధ్యాత్మిక ఆహారం అని యేసు ఉద్దేశం. కానీ వారు ఆయన మాటలను అక్షరాలా అర్థం చేసుకున్నారు. చెప్పిన ప్రతి మాటనూ ఈ విధంగా అక్షరార్థంగా తీసుకునేవారికి యేసు చెప్పిన అనేక మాటలు అభ్యంతరకరంగా అనిపిస్తాయి (ఉదాహరణగా 6:52–58 చూడండి).

**4:34** దేవుని సంకల్పం ప్రకారం ఆయన పని చెయ్యడంలోనే యేసుకు అసమానమైన సంతృప్తి ఉంది (5:30; 6:38; 8:29; 9:4; 14:31; 15:10; 17:4 పోల్చి చూడండి. దేవునికి విధేయత చూపుతూ, హృదయ పూర్వకంగా ఆయన పనిలో నిమగ్నమై, ఇతరులను క్రీస్తుపై నమ్మకంలోకి నడిపిస్తూ ఉండడంలో ఉన్న ఆనందంతో ఈ లోకంలో ఉన్న అన్ని శ్రేష్ఠమైన పదార్థాలతో విందుల్లో మునిగి తేలడం సాటి రాదు.

**4:35** ఇస్రాయేల్ దేశంలో విత్తనాలు చల్లే కాలం ముగిసిన తరువాత కోతకాలం ఆరంభం కావడానికి ముందు నాలుగు నెలల వ్యవధి ఉంది. వారు అంత కాలం వేచి ఉండనక్కర్లేదని యేసు అంటున్నాడు. అప్పుడే అక్కడే కోసుకోవడానికి పంట కోతకు వచ్చి సిద్ధంగా ఉంది. సత్యాన్ని విన్నప్పుడు తనలో నమ్మకం ఉంచడానికి అక్కడ సిద్ధంగా ఉన్న కొందరు సమరయవారి గురించి (ఇతరుల గురించి కూడా) ఆయన ఈ మాటలు చెప్తున్నాడు. ఈ రోజుల్లో కూడా పంట ఎక్కడో ఒక చోట సిద్ధంగానే ఉంటుంది. యేసుప్రభువును స్వీకరించడానికి దేవుడు సిద్ధపరచిన మనుషులు ఎప్పుడూ ఉంటారు. దేవుని సేవకులు ఆసక్తితోను, దేవునిపై నమ్మకంతోనూ అలాంటివారి కోసం వెతకాలి. క్రీస్తు కాలం నుంచి ఇప్పటివరకు ఉన్న ఈ రెండు వేల సంవత్సరాలూ ఈ భూమిపై ఆగకుండా ఆత్మ సంబంధమైన పంటకోత జరుగుతూనే ఉంది.

**4:36–38** ప్రభువు ఇక్కడ దేవుని సేవ గురించి కొన్ని సాధారణ సత్యాలు తెలియజేస్తున్నాడు. కోత పనివారికి (క్రీస్తు చెంతకు అనేకమందిని తీసుకువచ్చేవారు) జీతాలుంటాయి (వ 36). అవేమిటో ఇక్కడ చెప్పలేదు గాని వారు “ఇప్పుడే” జీతం పుచ్చుకుంటున్నారు అని రాసి ఉంది కాబట్టి క్రీస్తుకోసం ఇతరుల్ని సంపాదించడంలోని సంతృప్తి సంతోషాలనూ, ప్రేమ సహవాసాలనే అనుబంధాలనూ సూచించేందుకు జీతం అనేమాట వాడుతున్నాడని అనుకోవచ్చు (ఫిలిప్పీ 4:1 చూడండి). అయితే వారి జీతాలు పరలోకంలో అనంత కాలంలో కూడా కనిపిస్తాయి (దానియేలు 12:3; 1 తెస్స 2:19,20; 1 పేతురు 5:4; ప్రకటన 22:12). ఈ పంట (అంటే కోత పనివారి ప్రయత్నాలవల్ల క్రీస్తుపై నమ్మకంలోకి వచ్చేవారు) అంటే కేవలం ఈ లోకంలో ఈ కొద్ది కాలానికి మాత్రమే కాదు. అది ఎప్పటికీ ఉంటుంది. (వ 36).

పంట కోతకు రావాలంటే ముందు ఎవరో ఒకరు దేవుని వాక్కు అనే మంచి విత్తనాలు చల్లాలి. చల్లేదీ పంట కోసేదీ ఒకే వ్యక్తి కావచ్చు గాని తరచుగా వేరువేరు వ్యక్తులు ఈ పనులు చేస్తారు (వ 37,38; 1 కొరింతు 3:5,9). విత్తనాలు చల్లేవాడు పంట కోసేవాణ్ణి చూచి అసూయపడకూడదు. ఇద్దరూ కలిసి సంతోషించాలి (వ 36). పరలోకంలో ఆ పంట కోత విషయంలో క్రీస్తుకు ఉన్న ఆనందంలో వారిద్దరూ శాశ్వతంగా పాలుగొంటారు. ఇదంతా చక్కగా గ్రహించి మనం కూడా జ్ఞానం కలిగి (సామెత 11:30), మనకు అవకాశం ఉన్నప్పుడే పట్టుదలతో ప్రయాసపడదాం (9:4).

**4:39** ఒక్క స్త్రీ సాక్ష్యంవల్ల కలిగిన ఫలితం ఎంతో చూడండి. క్రీస్తు పక్షంగా మాట్లాడేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటూ, దేవుడు ఏం చేస్తాడో చూద్దాం. దేవుని సేవకులంతా ఆయనకు

చెప్పిన సాక్ష్యం కారణంగా ఆ ఊరిలో సమరయవారు అనేకులు ఆయనమీద నమ్మకం పెట్టారు. 40 అందుచేత ఆ సమరయవారు ఆయనదగ్గరకు వచ్చినప్పుడు తమ దగ్గర ఉండాలని ఆయనకు విన్నవించుకొన్నారు గనుక రెండు రోజులు ఆయన అక్కడ ఉండిపోయాడు. 41 ఆయన మాటల కారణంగా ఇంకా అనేకులు ఆయన్ను నమ్ముకొన్నారు. 42 వారు ఆ స్త్రీతో “మేమిప్పుడు నమ్మడం నీవు చెప్పిన దాన్నిబట్టి కాదు. మా మట్టుకు విన్నాం, ఆయన నిజంగా అభిషిక్తుడు, లోకరక్షకుడని తెలుసుకొన్నాం” అన్నారు.

43 ఆ రెండు రోజుల తరువాత ఆయన అక్కడనుంచి గలలీకి వెళ్ళిపోయాడు. 44 స్వదేశంలో ప్రవక్తకు గౌరవం ఉండదు అని యేసు తానే సాక్ష్యం చెప్పాడు. 45 ఆయన గలలీకి వచ్చినప్పుడు గలలీ ప్రజలు ఆయనను స్వీకరించారు. ఎందుకంటే, జెరుసలంలో పస్కా పండుగ సమయంలో ఆయన చేసినవన్నీ వారు చూశారు. వారు కూడా ఆ పండుగకు వెళ్ళారు.

46 మరో సారి ఆయన గలలీలోని కానాకు వచ్చాడు. ఆయన అక్కడే నీళ్ళను ద్రాక్షరసంగా చేశాడు. అక్కడ ఒక రాజ్యాధికారి ఉండేవాడు. కపెర్నహూంలో అతని కొడుకుకు జబ్బు చేసింది. 47 యేసు యూదయనుంచి గలలీకి వచ్చాడని విన్నప్పుడు ఆ రాజ్యాధికారి ఆయన దగ్గరకు వెళ్ళాడు, తన కొడుకును బాగు చేయడానికి రావాలని మనవి చేసుకొన్నాడు. ఎందుకంటే అతని కొడుకు చావు బ్రతుకుల్లో ఉన్నాడు.

48 యేసు అతనితో “మీరు సూచనలూ అద్భుతాలూ చూడకపోతే ఎంత మాత్రమూ నమ్మరు” అన్నాడు.

49 రాజ్యాధికారి ఆయనతో “స్వామీ, నా కొడుకు చనిపోకముందు రండి” అన్నాడు.

50 యేసు అతనితో “నీ దారిన వెళ్ళు! నీ కొడుకు బ్రతుకుతాడు” అన్నాడు. తనతో యేసు చెప్పిన మాట నమ్మి ఆ మనిషి తన దారినవెళ్ళాడు.

51 అతడు వెళ్ళిపోతూ ఉండగానే అతని దాసులు అతనికి ఎదురుగా వచ్చి అతని కొడుకు బ్రతికాడని చెప్పారు. 52 అతడు బాగుపడడం మొదలైనప్పుడు ఎన్ని గంటలైందని వారిని అడిగాడు. వారు అతనితో “నిన్న ఒంటి గంటకు అతని జ్వరం పోయింది” అన్నారు.

53 “నీ కొడుకు బ్రతుకుతాడు” అని యేసు తనతో చెప్పిన గంట అదే అని ఆ తండ్రికి తెలుసు, గనుక అతడూ అతని ఇంటివారంతా యేసును నమ్ముకొన్నారు.

54 యూదయనుంచి గలలీకి వచ్చి యేసు చేసిన అద్భుతమైన సూచనలలో ఇది రెండోది.

**5** ఆ తరువాత యూదుల పండుగ ఒకటి వచ్చింది గనుక యేసు జెరుసలం వెళ్ళాడు. 2 జెరుసలంలో ‘గొర్రెల ద్వారం’ దగ్గర ఒక కోనేరు ఉంది. హీబ్రూ భాషలో దాని పేరు బెతెస్థ. దానికి అయిదు మంటపాలు ఉన్నాయి. 3 వాటిలో రోగులూ గుడ్డివారూ కుంటివారూ కాళ్ళు చేతులు

---

సాక్షులుగా ఉండాలి (అపో కా 1:8 చూడండి).

**4:42** క్రీస్తే ముక్తి ప్రదాత అని మొత్తంగా యూదులు నమ్మడానికి నిరాకరించగా (1:11), యూదుల దృష్టిలో అంటరాని వారైన ఈ సమరయవారు సత్యాన్ని గ్రహించిన ధన్య స్థితిలోకి వచ్చారు. “ముక్తిప్రదాత”, “రక్షకుడు” గురించి నోట్ లూకా 1:47 చూడండి. యేసులో నమ్మకం ఉంచిన వారందరికీ, వారు ఏ జాతి, ఏ దేశం వారైనప్పటికీ, ఆయన ముక్తిప్రదాతే (1 తిమోతి 2:3-6; రోమ్ 1:16,17; అపో కా 4:12; మార్కు 16:15,16).

**4:44** మత్తయి 13:57; మార్కు 6:4; లూకా 4:24.

**4:45** ఆయన చేస్తున్న అద్భుతాలను బట్టి ఆయన్ను వారు స్వీకరించారు గానీ అభిషిక్తుడుగా, దేవుని కుమారుడుగా, లోక రక్షకుడుగా గౌరవించలేదు.

**4:46** 2:1-11.

**4:47,48** ఈ అధికారి యేసును ప్రవక్తగా ఎంచినట్టున్నాడు. గానీ దేవుని కుమారుడుగా లోకరక్షకుడుగా ఆయన్ను నమ్మలేదు. యేసు అతనితో అన్న మాటలు ఒక మందలింపులాంటివి. మత్తయి 12:38,39; 16:4; 1 కొరింతు 1:22 పోల్చి చూడండి. నిజమైన విశ్వాసం సూచనల, అద్భుతాల అవసరమేమీ లేకుండా క్రీస్తు వ్యక్తిత్వం, మాటల మీద నమ్మకం ఉంచుతుంది. వ 41 పోల్చి చూడండి.

**4:49** ఈ అధికారి తనలో లోపం లేదని తనను తాను సమర్థించుకోలేదు. కేవలం క్రీస్తు జాలి కోసం వేడుకున్నాడు. విశ్వాసం బలహీనంగా ఉన్నా యేసుప్రభువు ఈ లోకంలో పరిచర్య చేసిన రోజుల్లో ఇలాంటి విన్నపాలను ప్రతి సారి ఆయన ఆలకించి అనుగ్రహించాడు.

**4:50** వ 48లో యేసు మందలింపునుంచి ఈ అధికారి పాఠం నేర్చుకున్నాడు. ఎలాంటి సూచనా అవసరం లేకుండానే ఆయనలో నమ్మకం ఉంచడానికి సిద్ధమయ్యాడు.

**4:51,52** యేసు సాక్షాత్తూ ఒక ప్రదేశంలో ఉండడం ఎంత శక్తివంతమో ఆయన మాట అంత శక్తివంతమైనది. కీర్తన 107:20 పోల్చి చూడండి. చావుబ్రతుకుల్లో ఉన్న పిల్లవాణ్ణి బాగుచేయాలంటే యేసు అక్కడికి వెళ్ళాలని మొదట్లో ఆ అధికారి అనుకున్నాడు. అయితే యేసుకు తన ఎదుట ఉన్నవారిని బాగు చెయ్యడం ఎంత తేలికో దూరాన ఉన్న వారిని బాగు చేయడమూ అంతే. ఆయన శరీరంతో ఈ లోకంలో ఉన్నట్టుగానే ఇప్పుడు పరలోకంనుంచి కూడా మనుషుల్ని బాగు చెయ్యగలడు. ఆయన ప్రతి సారి అలా చెయ్యకపోతే అందుకు కారణం అడిగేవారికి నమ్మకం లోపం కావచ్చు, లేదా అలాంటివారి విషయంలో వారిని బాగుచేయకపోవడానికి ఆయనకు వేరే జ్ఞానయుక్తమైన ఉద్దేశాలు ఉండడం కారణం కావచ్చు.

**4:53** “నమ్ముకొన్నారు” – అంటే బహుశా యేసు అభిషిక్తుడని నమ్మారు అని అర్థం. ఈ మనిషి నమ్మకం అభివృద్ధి చెందిన దశలు చూడండి. అతడు యేసు దగ్గరికి వచ్చినప్పుడు ఆయన వ్యాధి నయం చేయగలడన్న నమ్మకం కొంత అతనిలో ఉంది. ఆ నమ్మకం యేసు చేసిన అద్భుతాలమీద ఆధారపడింది. అది కొంచెం పెరిగి సూచన ఏదీ అవసరం లేకుండానే యేసు మాటపై నమ్మకం ఉంచగలిగాడు. తరువాత అతని నమ్మకం స్థిరపడి అభివృద్ధి చెంది అతని కుటుంబమంతటి మీదా ప్రభావం చూపింది. క్రీస్తు ఆ పిల్లవాడి జ్వరాన్ని, ఆ అధికారిలోని బలహీనమైన నమ్మకమనే ఆధ్యాత్మిక జ్వరాన్నీ కుదిర్చాడు.

**4:54** “సూచనలు” – 2:11; మత్తయి 8:1 నోట్స్. యేసు వ్యాధులు బాగు చేసి ప్రాణాన్ని సంరక్షించే యెహోవాదేవుని అవతారం (కీర్తన 103:1-4), తన ప్రజల్లో సజీవమైన గట్టి నమ్మకాన్ని సృష్టించేవాడు (హీబ్రూ 12:2).

**5:1** “పండగ” – లేవీ 23వ అధ్యాయం.

**5:2** “బెతెస్థ” – దీని అర్థం “కరుణగృహం” కావచ్చు

**5:3,4** ఇది వ్యాధులు నయం కావడం పరలోకంనుంచే

ఊచబారిపోయినవారూ గుంపులుగా పడి ఉన్నారు. వారు నీళ్ళ
కదలికకోసం ఎదురు చూస్తూ ఉన్నారు. 4 ఎందుకంటే,
ఒకానొక సమయంలో ఒక దేవదూత కోనేటిలోకి దిగివచ్చి
నీళ్ళు కదలించిన తరువాత మొట్టమొదట నీళ్ళలో దిగిన రోగి –
ఎలాంటి రోగంతో ఉన్నా – పూర్తిగా నయం కావడం జరిగేది.
5 అక్కడ ఒక మనిషి ఉన్నాడు. అతని దుర్బలత ముప్ఫయి
ఎనిమిదేళ్ళ నుంచి ఉంది. 6 అతడు అక్కడ పడి ఉండడం
యేసు చూశాడు. అతడు చాలా కాలంనుంచి ఆ స్థితిలోనే
ఉన్నాడని ఆయనకు తెలుసు.

“నీకు బాగుపడాలని ఇష్టం ఉందా?” అని ఆయన అతణ్ణి
అడిగాడు.

7 ఆ రోగి ఆయనతో ఇలా బదులు చెప్పాడు: “అయ్యా,
నీళ్ళను కదిలించడం జరిగితే కోనేటిలో నన్ను దించడానికి
నాకెవరూ లేరు గనుక నేను వచ్చేంతలోనే ఇంకెవరో నాకంటే
ముందుగా దిగుతారు.”

8 యేసు అతనితో “లేచి నీ పడక ఎత్తుకొని నడువు”
అన్నాడు.

9 వెంటనే ఆ మనిషి బాగుపడి తన పడక ఎత్తుకొని
నడవసాగాడు. 10 ఆ రోజు విశ్రాంతి దినం గనుక యూదులు
బాగుపడిన ఆ మనిషితో “ఇది విశ్రాంతి దినం. నువ్వు నీ పడక
మోయడం ధర్మశాస్త్రానికి విరుద్ధం” అన్నారు.

11 అందుకు అతడు “నన్ను బాగు చేసినవాడు ‘నీ పడక
ఎత్తుకొని నడువు’ అని నాతో చెప్పాడు” అన్నాడు.

12 “నీ పడక ఎత్తుకొని నడవమని నీతో చెప్పినదెవరు?”
అని వాళ్ళు అతణ్ణి అడిగారు.

13 ఆయన ఎవరో బాగుపడినవానికి తెలియదు.
ఎందుకంటే, అక్కడ ఉన్న పెద్ద గుంపులోనుంచి యేసు
తప్పుకొన్నాడు.

14 తరువాత యేసు అతణ్ణి దేవాలయంలో చూచి అతనితో
“ఇదిగో విను, నీవు బాగయ్యావు. మునుపటి కంటే ఎక్కువ
కీడు నీ మీదికి రాకుండా ఇకనుంచి అపరాధం చేయకు”
అన్నాడు.

15 ఆ మనిషి వెళ్ళి తనను బాగు చేసినవాడు యేసు అని
యూదులకు తెలియజేశాడు.

16 యేసు విశ్రాంతి దినాన ఈ పనులు చేసినందుచేత
యూదులు ఆయనను హింసించారు, చంపడానికి చూశారు.
17 అయితే యేసు వారికిలా బదులు చెప్పాడు: “ఇప్పటి వరకు
నా తండ్రి పని చేస్తూ ఉన్నాడు, నేనూ పని చేస్తూ ఉన్నాను.”

18 ఈ కారణంచేత యూదులు ఆయనను చంపడానికి
మరి ఎక్కువగా కోరారు – ఆయన విశ్రాంతి దినాచారాలు
మీరడం మాత్రమే గాక, దేవుణ్ణి తన తండ్రి అంటూ తనను
దేవునితో సమానుడుగా చేసుకొన్నాడు.

---

జరుగుతుందనీ, తానింకా వారిని బాగు చేసే దేవుడుగానే ఉన్నాననీ (నిర్గం 15:26) దేవుడు ఇస్రాయేల్‌ప్రజలకు గుర్తు చేస్తూ ఉన్న విధానం కావచ్చు. ప్రభువు వ్యాధులు నయం చేయడంలో నీటిని ఉపయోగించిన ఇతర సందర్భాల గురించి 9:7; 2 రాజులు 5:13,14 చూడండి.

**5:5** 7వ వచనాన్ని బట్టి ఇతడికి పక్షవాతమో కుంటితనమో ఉన్నట్టుంది.

**5:6** యేసుప్రభువు ఒక అద్భుతం చేయబోతుంటే కొన్నిసార్లు తానే చొరవ తీసుకునేవాడు గానీ అన్ని సార్లూ కాదు. ఇక్కడ ఆయన ఈ ప్రశ్న అడగడంలో ఆ మనిషిలో ఆశాభావాన్ని రేకెత్తించడం ఆయన ఉద్దేశం కావచ్చు. 38 సంవత్సరాలు, అనేక నిరాశల తరువాత ఈ ఆశ బాగా అడుగంటిపోయి ఉండాలి. ఆధ్యాత్మిక విషయాల్లో కూడా క్రీస్తు మనందరినీ ఇదే ప్రశ్న అడుగుతాడు “నీకు నీ పాపాలనుంచి బాగుపడాలని ఇష్టం ఉందా? పాపవిముక్తి పొందాలని కోరిక ఉందా?” దేవుడిచ్చే పాపవిముక్తి గురించిన ఆకలి, దాహం ఉన్నవారే దాన్ని స్వీకరిస్తారు. ఆయన మనకు ఇవ్వదలచుకున్నదాని విషయం మనలో కోరిక కలిగేలా ఆయన చేస్తాడు.

**5:7** పేదలు, రోగులు, అనాథలు అనేకమందిలో ఉండే నిస్సహాయత ఇక్కడ కళ్ళకు కట్టినట్టు కనిపిస్తున్నది. మానవ స్వభావంలోని స్వార్థ బుద్ధిని కూడా ఇది చూపిస్తున్నది. ప్రతివాడూ కోనేట్లోకి అందరికన్నా ముందు తానే దిగాలని తాపత్రయపడుతున్నారు. బైబిలులోని దేవుడైన యేసుప్రభువు నిస్సహాయులకు సహాయుడు, స్నేహితులు లేని వారికి స్నేహితుడు (కీర్తన 10:14; 54:4; 72:12,13; 113:5-7; యెషయా 40:29; 41:17). ఆయన చేసిన అద్భుతాలు చాలా వరకు పేదల పట్ల, అవసరతలో ఉన్నవారి పట్ల కరుణా క్రియలే.

**5:8,9** రోగాలు నయం చేసే ప్రభావం యేసు మాటలో ఉందని గమనించండి. మత్తయి 8:8 చూడండి. నిస్సత్తువగా ఉన్నవాడు తన పడక తీసుకుని నడవడం అసాధ్యం. కానీ యేసు అలా చేయమని అతణ్ణి ఆజ్ఞాపించినప్పుడు అలా చేయగలిగే శక్తిని కూడా ఇచ్చాడు. ఆ ఆజ్ఞకు లోబడడంలోనే ఆ వ్యక్తికి స్వస్థత కలిగింది. మార్కు 3:5; లూకా 17:14 పోల్చి చూడండి.

**5:10** యూదులకు ఇలాంటి సూత్రాలు, నిషేధాలు చాలా ఉన్నాయి. మత్తయి 12:2; 15:2 చూడండి.

**5:13** నమ్మకం లేని ఆ యూదులతో వాదించాలని గానీ తన పేరు అంతటా ప్రచారం కావాలని గానీ యేసుకు ఎంతమాత్రం కోరిక లేదు (4:3).

**5:14** యేసుప్రభువు తాను ఆరంభించిన పనిని కొనసాగిస్తున్నాడు. పాపవిముక్తి విషయంలోనూ ఇదే చేస్తున్నాడు (ఫిలిప్పీ 1:6). ఆ మనిషి ఆధ్యాత్మిక స్థితిని గురించి శ్రద్ధ కలిగి అతణ్ణి వెదికాడు (లూకా 19:10 పోల్చి చూడండి). అతనితో మాట్లాడిన మాటల్లో ఈ క్రింది భావం ధ్వనిస్తూ ఉంది – అతనికి ఉండిన వ్యాధి అతని పాప ఫలితం; అతడు పాపంలో అలానే కొనసాగే ప్రమాదం ఇప్పటికీ ఉంది; అతనికి (ఎవరికైనా) అతని వ్యాధి నయం కావడం కంటే అతనికి పాపాల నుంచి విముక్తి కలగడం మరింత ప్రాముఖ్యం.

**5:15** ఈ మనిషి తెలివితక్కువగా ప్రవర్తించాడు. ఇదంతా యూదులకు చెప్పడం వల్ల యేసుప్రభువుకు ఇబ్బంది వస్తుందని అతడు గ్రహించలేకపోయాడా?

**5:16** యేసు విశ్రాంతి దినాన్ని మీరడం లేదు. దాని విషయంలో మనుషులు చేసిన నియమాలను మాత్రమే మీరాడు. మత్తయి 12:1-3 నోట్స్ చూడండి. అందరూ విశ్రాంతి దినం గురించి వారు చేసిన సూత్రాల్ని పాటిస్తూ ఉంటే ఎంతమంది వ్యాధులతో, సహాయం లేకుండా, తమ పాపాల్లో సాగిపోతూ ఉన్నా, వారికి ఫర్వాలేదు. వారి గుణశీలాలను మత్తయి 23 అధ్యాయంలో చూడవచ్చు.

**5:17** తండ్రి అయిన దేవుడు విశ్రాంతిదినంలో సహా ఎప్పుడూ చేతులు ముడుచుకుని కూర్చుని ఉండడు. దేవుని కుమారుడైన యేసు విశ్రాంతి దినానికి ప్రభువు (మత్తయి 12:8). మనుషులు చేసిన నియమాలకు ఆయన కట్టుబడడు.

**5:18** దీన్ని గురించి యూదుల ఆలోచన సరైనదే. దేవుడు

19 అందుచేత యేసు వారికి ఇలా జవాబిచ్చాడు: “మీతో ఖచ్చితంగా చెపుతున్నాను, తండ్రి చేసేది చూచి కుమారుడు అది మాత్రమే చేస్తాడు. తనంతట తానే ఏదీ చేయలేడు. తండ్రి ఏవి చేస్తే కుమారుడు ఆ విధంగానే చేస్తాడు. 20 కుమారుడంటే తండ్రికి ప్రేమ. తాను చేసేదంతా ఆయనకు చూపుతాడు. మీరు ఆశ్చర్యపడాలని వీటికంటే గొప్ప పనులు ఆయనకు చూపుతాడు. 21 తండ్రి చనిపోయినవారిని బ్రతికించి లేపే ప్రకారమే కుమారుడు కూడా తనకు ఇష్టం వచ్చినవారిని బ్రతికిస్తాడు. 22 తండ్రి ఎవరికీ తీర్పు తీర్చడు గాని తీర్పు తీర్చే అధికారమంతా కుమారునికి అప్పగించాడు. 23 అందరూ తండ్రిని గౌరవించినట్లే కుమారుణ్ణి గౌరవించాలని ఇందులో ఆయన ఉద్దేశం. కుమారుణ్ణి గౌరవించని వ్యక్తి ఆయనను పంపిన తండ్రిని గౌరవించడం లేదు.

24 “మీతో ఖచ్చితంగా చెపుతున్నాను, నా మాట విని నన్ను పంపినవానిమీద నమ్మకముంచేవాడు శాశ్వత జీవం గలవాడు. అతడు తీర్పులోకి రాడు. మరణంలోనుంచి జీవంలోకి దాటాడు.

25 “మీతో ఖచ్చితంగా చెపుతున్నాను, చనిపోయినవారు దేవుని కుమారుని స్వరం వినే కాలం వస్తూ ఉంది. అది రానే

---

ఏమై ఉన్నాడో తానే అదై ఉన్నాననీ దేవుని తత్వంలో, ఆయన స్వభావంలో తనకూ భాగం ఉందనీ యేసు అంటున్నాడు. దేవుడు ఒక ప్రత్యేకమైన రీతిలో, వేరెవరికీ వర్తించని రీతిలో తన తండ్రి అని చెప్పుకొంటున్నాడు (3:16; మత్తయి 3:17). 10:30-37 పోల్చి చూడండి. ఆయన సాక్షాత్తూ దేవుని కుమారుడని వారు నమ్మకపోవడంవల్ల ఆయన దేవదూషణ చేస్తున్నాడన్న నేరం మోపారు. మనుషులు తాము దేవుణ్ణని చెప్పుకోవడం అన్నిటికన్నా ఘోరమైన దేవదూషణ అనీ దీనికి శిక్ష మరణమే అనీ వారికి తెలుసు (మత్తయి 26:65 చూడండి)

**5:19-47** ఈ భాగంలో యేసుప్రభువు తాను దేవుని కుమారుణ్ణి అన్న విషయాన్ని వివరిస్తున్నాడు (వ 19,20), తాను చేయగలిగిన, చేయబోయే కొన్ని విషయాల గురించి మాట్లాడుతున్నాడు (వ 21-30), తాను దేవుని కుమారుణ్ణే అని చెప్పుకునేందుకు కొన్ని ఆధారాలను చూపి, ఆ యూదులు తననెందుకు నమ్మలేదో చెప్తున్నాడు (వ 38-47). ఇక్కడ అతి గంభీరమైన, ప్రాముఖ్యమైన సత్యాలు ఉన్నాయి.

**5:19** “మీతో. . .చెపుతున్నాను” - 1:51 చూడండి. స్వభావం, సంకల్పం, ఉద్దేశాలలో యేసు పరమ తండ్రితో ఎంత ఐక్యంగా ఉన్నాడంటే తనకు తాను సొంతగా ఏ పనులైనా చేయడం అసాధ్యమని నేర్పుతున్నాడు. ఆయన తనంతట తానే ఏమీ చెయ్యలేనిది ఎందుకంటే ఏమీ చెయ్యడు కాబట్టే. ఆయన అలా చేస్తాడన్నది కనీసం ఆలోచనకు కూడా అందరానిది. అయితే తండ్రి అయిన దేవుడు చేసేదంతా ఆయన చేస్తాడు. అంటే అన్ని చోట్లా ఏకకాలంలో ఉండి పని చేసేందుకు కావలసిన ప్రభావం, జ్ఞానం, శక్తిసామర్థ్యాలు తండ్రియైన దేవునిలో లాగే కుమారుడైన యేసులో కూడా ఉన్నాయన్నమాట. అలా లేని పక్షంలో తండ్రి చేసేదంతా చేయడం ఆయనకు సాధ్యం కాదు. యేసుకు దేవుని స్వభావంలో సంపూర్ణ భాగస్వామ్యం ఉందనీ, ఆయన దేవుని అవతారమనీ ఇందువల్ల తెలుస్తున్నది (ఫిలిప్పీ 2:6; లూకా 2:11 నోట్స్‌లో రిఫరెన్సులు చూడండి). ఈ విశ్వంలో ఏది జరిగినా తండ్రి, కుమారుడు, పవిత్రాత్మ ఐక్యంగానే జరిగిస్తారు. త్రిత్వం గురించి నోట్స్ మత్తయి 3:16,17; 28:19; 2 కొరింతు 13:14.

**5:20** 3:35; 17:24. క్రొత్త ఒడంబడిక గ్రంథంలో తరచుగా తండ్రి, కుమారుల మధ్య ఉన్న పరస్పర ప్రేమను చూడవచ్చు. లోకం సృష్టించడానికి ముందే ఆ ప్రేమ ఉంది. అది అనంత కాలం కొనసాగుతూ ఉంటుంది. తండ్రి ఈ విశ్వాన్ని నడిపిస్తూ లోకాన్ని పాలిస్తూ ఉన్నప్పుడు కుమారుని దృష్టి ఎప్పుడూ తండ్రి మీదే ఉంటుంది. తండ్రి కుమారుడి నుంచి దేన్నీ దాచిపెట్టడు.

“వీటికంటే గొప్ప పనులు” - అంటే తాను ఇంతవరకు చేసిన అద్భుతాలకంటే గొప్పవి అని అర్థం.

**5:21** ఇది చనిపోయిన వ్యక్తులను బ్రతికించిన సంగతి గురించి చెప్పిన మాట కావచ్చు (11:43,44; మార్కు 5:35-43; లూకా 7:11-15). అయితే ఆయన ఆధ్యాత్మికంగా శాశ్వత జీవాన్ని ఇచ్చి పాపంలో చనిపోయిన వారిని బ్రతికిస్తాడన్న సంగతి కూడా నిజమే.

**5:22** మనుషులనందరి తీర్పు యేసుప్రభువు చేతిలోనే ఉంటుంది. అలాగని తండ్రికి ఇందులో ఎలాంటి జోక్యమూ లేదని కాదు (అపో కా 17:31). అన్నిటిలోనూ వారిద్దరూ కలిసే పని చేస్తారు.

**5:23** తీర్పును యేసుప్రభువు చేతుల్లో పెట్టడంలో తండ్రి ఉద్దేశం చూడండి. తండ్రి అయిన దేవుణ్ణి ఘనపరచినట్టుగానే మనుషులు యేసును ఘనపరచాలి. కుమారుడిలో దేవుని తత్త్వం, స్వభావం పరిపూర్ణంగా లేకపోతే తండ్రి గానీ కుమారుడు గానీ ఎన్నడూ ఇలా కోరరు. దేవునికి మాత్రమే చెందే ఘనతను సృష్టించబడిన ఎవరికీ దేనికీ మనుషులు ఇవ్వరాదు. యేసు ఇక్కడ చెప్తున్నదాన్ని గమనించండి. మనుషులు దేవుని కుమారుణ్ణి ఘనపరచకపోతే వారు దేవుణ్ణి అసలు ఘనపరచడం లేదన్నమాట. అలా చేస్తున్నామని వారు అనుకోవచ్చు, చెప్పుకోవచ్చు గానీ వాస్తవంగా అలా చేయడం లేదు.

**5:24** దేవుడు మనుషులకు ఇచ్చిన అతి గొప్ప వాగ్దానాల్లో ఇది ఒకటి. “మీతో ఖచ్చితంగా చెపుతున్నాను” అనే గంభీరమైన వాక్కులు ఈ వాగ్దానానికి ముందు ఉన్నాయి. శాశ్వత జీవం గురించి నోట్స్ 3:16,36. శాశ్వత జీవం అనేది విశ్వాసికి ఇప్పుడే ఉందని గమనించండి. 3:36లో కుమారునిలో నమ్మకం ఉంచినవారికి ఇది లభిస్తుందని రాసి ఉంది. ఇక్కడైతే అయన్ను పంపిన తండ్రిలో నమ్మకం ఉంచినవారికి అది లభిస్తుందని రాసి ఉంది. ఇందులో మళ్లీ తండ్రి, కుమారుల ఐక్యతను చూస్తున్నాం. వారిలో ఒకరిమీద నమ్మకం ఉంచడమంటే మరొకరిమీద ఉంచడమే. మనుషుల పాపాలను బట్టి దేవుడు వారికి శిక్ష విధిస్తాడు. విశ్వాసులందరి పాపాలకూ క్షమాపణ ఉంది. క్రీస్తే వారి శిక్షను భరించాడు. అందువల్లే వారికి శిక్షావిధి లేదు. 3:18; రోమ్ 8:1 చూడండి. ఇది శాశ్వత భద్రతను సూచిస్తున్నది. అలాగని వారు విశ్వాసులైన తరువాత చేసిన పనులకు తీర్పు ఉండదని కాదు. 2 కొరింతు 5:10 చూడండి. అయితే ఈ తీర్పు బహుమతులు ఇవ్వడం, ఇవ్వకపోవడం, వీటికి సంబంధించి ఉంటుంది. (1 కొరింతు 3:10-15).

వారి పాపాల కారణంగా మనుషులంతా ఆత్మసంబంధమైన మరణ స్థితిలో ఉన్నారు (ఆది 2:17; ఎఫెసు 2:1-3). మనుషులు క్రీస్తులో నమ్మకం ఉంచినప్పుడు దేవుడు వారిని ఆధ్యాత్మికంగా బ్రతికిస్తాడు (1:12,13; ఎఫెసు 2:5). తక్షణమే వారు మరణ స్థితినుంచి జీవంలోకి మార్పు చెందుతారు. “దాటారు” అనే ఈ మాట భూతకాలంలో ఉండడం గమనించండి. ఈ ఒక్క వచనంలో శాశ్వత జీవాన్ని పొందడం, నిర్దోషుల లెక్కలోకి రావడం, నూతన జన్మ, ఇదంతా నమ్మకం మూలానే అని తెలుస్తున్నది. మనుషుల ముక్తిదాతగా రక్షకుడుగా కుమారుణ్ణి ఈ లోకానికి పంపిన తండ్రిలో నమ్మకం ఉంచడం మూలానే అన్నమాట.

**5:25** ఇక్కడ “చనిపోయినవారు” అంటే బహుశా వ 24లో లాగానే ఆధ్యాత్మిక జీవం లేనివారు అనే అర్థం కావచ్చు, వారి

వచ్చింది. ఆయన స్వరం వినేవారు బ్రతుకుతారు.
26 ఎందుకంటే, తండ్రి ఎలాగు స్వయంగా జీవం గలవాడో
అలాగే కుమారుడు కూడా స్వయంగా జీవం కలిగి ఉండేలా
తండ్రి ఆయనకు ఇచ్చాడు. 27 ఇదిగాక, ఆయన మానవ
పుత్రుడై ఉండడంచేత తీర్పు తీర్చడానికి ఆయనకు అధికారం
ఇచ్చాడు.

28 “ఇందుకు ఆశ్చర్యపడకండి. ఒక కాలం వస్తుంది.
అప్పుడు సమాధులలో ఉన్నవారందరూ ఆయన స్వరం
వింటారు. 29 వారు బయటికి వస్తారు. మంచి చేసినవారు
శాశ్వత జీవం కోసం లేస్తారు; దుర్మార్గత చేసినవారు శిక్షావిధికి
లేస్తారు. 30 నా అంతట నేనే ఏమీ చేయలేను. నేను వినే
ప్రకారం తీర్పు తీరుస్తాను. నన్ను పంపినవారి ఇష్టప్రకారమే
చేయాలని కోరుతూ ఉన్నాను గాని నా ఇష్టప్రకారం కాదు
గనుక నేను తీర్చే తీర్పు న్యాయమైనది.

31 “నా విషయం నేనే సాక్ష్యం చెప్పుకొంటే నా సాక్ష్యం
నిజమైనది కాదు. 32 నా విషయం సాక్ష్యం చెప్పేవాడు
ఇంకొకడు ఉన్నాడు. నా విషయం ఆయన చెప్పే సాక్ష్యం
నిజమని నాకు తెలుసు.

33 “మీరు యోహాను దగ్గరకు మనుషులను పంపారు.
అతడు సత్యాన్ని గురించి సాక్ష్యం చెప్పాడు. 34 అయినా,

---

అంతరంగాలలో క్రీస్తు స్వరాన్ని వారు వింటారు. ఆ స్వరాన్ని నమ్మి విధేయులౌతారు (10:3,4,16,27 పోల్చి చూడండి). అలాంటివారే ఆధ్యాత్మికంగా బ్రతుకుతారు. దేవుని కుమారుడు అనే ఈ పేరును యేసు మూడు సార్లు ఈ శుభవార్తలో తనకు ఉపయోగించుకున్నాడు. – ఇక్కడ; 10:36; 11:4లో.

**5:26** “స్వయంగా జీవం గల” – అంటే దేవుడు వేరొకరి సహాయం, ప్రమేయం లేని స్వతంత్రమైన ఉనికి గలవాడని అర్థం. “నేను ఉన్నవాడను” అనేది తన పేరుగా ఆయన చెప్పుకున్నాడు (నిర్గమ 3:14 నోట్ చూడండి). దేవుడు సృష్టించబడిన జీవులన్నిటికీ జీవ ప్రదాత. ఆయన అనాది కాలం నుంచి సజీవుడు. మనుషుల సంగతి పూర్తిగా వేరుగా ఉంది. వారి జీవం వారిలో నుంచి గాక వేరొక మూలాధారంనుంచి వచ్చేది. యేసు కేవలం మానవ స్వభావం ఉన్న మానవ మాత్రుడు కాదు. తండ్రి అయిన దేవునికి ఉన్నట్టుగానే తనలో తనకు స్వయంగా జీవం ఉన్న దేవ కుమారుడు. యేసు ఇతరులకు కూడా జీవాన్నిచ్చే మూలాధారం (వ 12). ఆయన స్వభావ రీత్యా దేవునితో సమానుడు అని చెప్పే వేరొక పద్ధతి ఇది.

**5:27** “మానవ పుత్రుడు” – మత్తయి 8:20. యేసు తనను తాను తగ్గించుకొని, మనిషిగా మనుషుల మధ్య బ్రతికి మనిషిని గురించి కూలంకషంగా ఎరిగినవాడు కాబట్టి మనుషులకు న్యాయాధిపతిగా ఉండడానికి ఎంతైనా తగినవాడు. దేవుడే ఆయన్ను మనుషులందరికీ న్యాయాధిపతిగా ఉండడానికి వారికంటే ఎంతో ఉన్నతంగా హెచ్చించాడు (అపో కా 17:31).

**5:28,29** దేవుడు చనిపోయిన మనుషులందరినీ తిరిగి బ్రతికిస్తాడని ఇక్కడ క్రీస్తు చెపుతున్నాడు. వ 28లో “సమాధులలో” అనే మాట గమనించండి. వ 24లో చెప్పినట్టు ఆధ్యాత్మిక జీవం ఇవ్వడం గురించి ఇక్కడ చెప్పడం లేదు. “బయటికి వస్తారు” అంటే అర్థం చనిపోయినవారి ఆత్మలూ తిరిగి వారి మృతదేహాలతో కలిసి, ఆ దేహాలు తిరిగి లేస్తాయన్నమాట. దానియేలు 12:2; అపో కా 24:15; 1 కొరింతు 15:20–22; ప్రకటన 20:4–6, 11–15 కూడా చూడండి.

రెండు రకాల మనుషులకు రెండు రకాల పునర్జీవితాలు ఉంటాయని యేసు చెప్తున్నాడు. రెండు రకాల మనుషులంటే ఆయనలో నమ్మకం ఉంచినవారు, నమ్మకం ఉంచనివారు అని ఆయన చెప్తాడని మనం అనుకోవచ్చు (3:36లో లాగా). ఇది నిజమే గానీ మనకొక ముఖ్యమైన సత్యాన్ని నేర్పేందుకు ఆయన దీన్నే వేరే విధంగా చెప్పాడు. అదేమిటంటే ఇతరులకు మేలు చేయడం విశ్వాసి లక్షణం, చెడు చేయడం అవిశ్వాసి లక్షణం. విశ్వాసులు కొత్త జన్మం పొందినవారు (1:13), ఇతరులకు పూర్తిగా భిన్నంగా ఉండే కొత్త సృష్టి (2 కొరింతు 5:18). ఇందుకు రుజువు ఏమిటంటే వారు మేలు చేస్తుంటారు (మత్తయి 7:17,18; 25:31–46; రోమ్ 2:6–11). అవిశ్వాసులు కొన్ని సార్లు తమకు మంచి పనులుగా తోచినవాటిని చేస్తారు. కానీ అలా చెయ్యడంలో వారి ఉద్దేశాలు మంచివి కావు. అంతేగాక అస్తమానం దేవుని కుమారుణ్ణి నిరాకరించి, దేవుని వాక్కుకు లోబడకుండా, తమ పతితమైన భ్రష్ట స్వభావం అనుసరించి నేరమయమైన జీవితం జీవిస్తూనే ఉంటారు. తీర్పుకు గురై శిక్ష అనుభవించడం కోసమే వారిని మళ్ళీ బ్రతికించడం జరుగుతుంది. విశ్వాసులు శాశ్వత జీవాన్ని అనుభవించేందుకు లేస్తారు.

మంచివారు, చెడ్డవారు ఒకే సమయంలో మళ్ళీ బ్రతికి లేస్తారని యేసు అనలేదు గానీ రాబోయే కాలంలో ఎప్పుడో ఈ రెండు రకాల మనుషులు తప్పకుండా మళ్ళీ బ్రతికి లేస్తారని మాత్రం చెప్పాడు. ఈ రెండు రకాలు లేచే సమయాలు వేరువేరని ప్రకటన 20:4,5 సూచిస్తున్నది. 1 తెస్స 4:13–17; 1 కొరింతు 15:51–53లో విశ్వాసుల పునర్జీవితం గురించి మాత్రమే ఉంది. దీనికి కారణం బహుశా ఆ సమయానికి విశ్వాసులు మాత్రమే లేస్తారు. ఫిలిప్పీ 3:11 కూడా చూడండి.

**5:30** వ 19–30లో తండ్రి అయిన దేవుడు కుమారుణ్ణి పంపాడనీ, తాను చేసేదాన్ని ఆయన కుమారునికి చూపిస్తాడనీ (వ 20), కుమారునికి అధికారం ఇచ్చాడనీ (వ 22,27) గమనించండి. దేవత్వంలోని ముగ్గురు వ్యక్తులూ (తండ్రి, కుమారుడు, పవిత్రాత్మ) ఒకే స్వభావంలో సమానంగా పాల్గొన్నవారు. ముగ్గురూ దేవుడే. అయితే వారి విధుల్లో ఒక క్రమం ఉంది. కుమారుని కంటే తండ్రికి ఉన్నత స్థానం ఉంది (10:29; 14:28). తండ్రి, కుమారుడు కలిసి పవిత్రాత్మను పంపించారు (14:26; 15:26; 16:7). ఇది బహుశా పవిత్రాత్మ మిగతా ఇద్దరి అధికారానికి లోబడి ఉన్నాడని సూచించవచ్చు. అయితే తత్వంలో, మనసులో, ప్రేమలో, ఉద్దేశాల్లో ఈ ముగ్గురూ కేవలం ఒకే దేవుడు.

**5:31** యూదుల న్యాయమైన చట్టంలో ఒక మనిషి తన గురించి చెప్పుకునే సాక్ష్యం కోర్టులో అంగీకారం కాదు. ఇతరులెవరన్నా అతణ్ణి గురించి సాక్ష్యం చెప్పాలి. ఒక వ్యక్తిని నేరస్థుడుగా నిర్ణయించాలన్నా, నిర్దోషిగా తీర్చాలన్నా ఇద్దరు ముగ్గురు సాక్షులు అవసరం (8:17; ద్వితీ 19:15 చూడండి). యేసు తన గురించి చెప్పుకునే విషయాలకు తన సొంత మాటలు తప్ప వేరే ఆధారాలేవీ లేని పక్షంలో యూదులు తనను నమ్మనవసరం లేదంటున్నాడు. తరువాత తన గురించి సాక్ష్యమిచ్చే ఇతరుల విషయం చెపుతున్నాడు. అది వారికోసమే, తన కోసం కాదు (వ 34). తానెవరో ఏమిటో ఆయనకు బాగా తెలుసు. నలుగురు సాక్షులున్నారు. బాప్తిసం ఇచ్చే యోహాను (వ 33), యేసు చేస్తున్న కార్యాలు (వ 36; 8:18), తండ్రి అయిన దేవుడు (వ 37), పాత ఒడంబడికలోని వ్రాతలు (వ 39,46).

**5:32** బహుశా తండ్రి అయిన దేవుడు అని యేసు ఉద్దేశం కావచ్చు (వ 37). కానీ బాప్తిసమిచ్చే యోహాను గురించి ఆయనిలా అన్నాడని కొందరి అభిప్రాయం (వ 33).

**5:33** 1:19–34 చూడండి.

మనుషుల సాక్ష్యం నేను చేకూర్చుకోను గాని మీకు పాపవిముక్తి కలగాలని నేను ఈ మాటలు చెపుతున్నాను. 35 అతడు వెలుగుతూ ప్రకాశిస్తూ ఉన్న దీపం. అతని వెలుగులో కొంతకాలం సంతోషించడానికి మీరు ఇష్టపడ్డారు.

36 "కానీ యోహాను సాక్ష్యాన్ని మించిన సాక్ష్యం నాకు ఉంది. నెరవేర్చడానికి తండ్రి నాకిచ్చిన పనులు – నేను చేస్తూ ఉన్న పనులే – తండ్రి నన్ను పంపాడని సాక్ష్యంగా ఉన్నాయి.
37 ఇది గాక, నన్ను పంపిన తండ్రి తానే నా విషయం సాక్ష్యమిచ్చి ఉన్నాడు. ఆయన స్వరం మీరెన్నడూ వినలేదు. ఆయన స్వరూపాన్ని చూడలేదు. 38 మీలో ఆయన వాక్కు నిలిచి ఉండడం లేదు. ఎందుకంటే, ఆయన పంపినవాణ్ణి మీరు నమ్మడం లేదు. 39 మీరు లేఖనాలను పరిశోధిస్తున్నారు. వాటి మూలంగా మీకు శాశ్వత జీవం ఉందని మీ ఆలోచన. అవి నా విషయమే సాక్ష్యం చెపుతూ ఉన్నాయి. 40 అయినా మీకు జీవం కలిగేలా నా దగ్గరకు రావడానికి మీకు ఇష్టం లేదు.

41 "మనుషులు ఇచ్చే ఘనత నేను స్వీకరించను.
42 మీరు నాకు తెలుసు – మీలో దేవుని ప్రేమ లేదు.
43 నేను నా తండ్రి పేర వచ్చాను, మీరు నన్ను స్వీకరించడం లేదు. వేరొకడు తన పేరునే వస్తే వాణ్ణి మీరు స్వీకరిస్తారు.

44 "మీరు ఒకరిచేత ఒకరు ఘనత స్వీకరిస్తూ, ఒకే ఒక దేవునినుంచి వచ్చే ఘనత వెదకకుండా ఉంటే నన్ను ఎలా నమ్ముతారు? 45 తండ్రిదగ్గర మీమీద నేరం మోపుతానని తలంచకండి. మీరు మోషేమీద నమ్మకం ఉంచుతున్నారు. మీమీద నేరం మోపేవాడు అతడే. 46 ఎందుకంటే, మోషే నన్ను గురించి వ్రాశాడు. మీరు అతని మాటలు నమ్మితే నన్ను కూడా నమ్ముతారు. 47 అతడు వ్రాసినది మీరు నమ్మకపోతే నా మాటలు ఎలా నమ్ముతారు?"

---

**5:35** "వెలుగు" – మత్తయి 5:14-16 పోల్చి చూడండి. యోహాను చేసినది ఇదే.

**5:36** మనుషులను వారు చేసే పనులను బట్టి తెలుసుకోవచ్చు (మత్తయి 7:15-20). యేసు చేసిన పనులు ఆయన ఎవరో, ఎలాంటివాడో సాక్ష్యంగా ఉన్నాయి (2:11; 3:2; 10:25,37,38; మత్తయి 8:1; 11:4-6).

**5:37** 8:18; 1 యోహాను 5:9. తండ్రి పాత ఒడంబడికలోని భవిష్యద్వాక్కుల ద్వారా కుమారుని గురించి సాక్ష్యం చెప్తున్నాడు. అంతేగాక కుమారుడు జన్మించకముందే దేవదూత ద్వారా (మత్తయి 1:20-23; లూకా 1:26-35), ఆయన బాప్తిసం, కొండపై ఆయన రూపం మార్పు చెందిన సందర్భాల్లో కంఠ ధ్వనిద్వారా (మత్తయి 3:17; 17:5), ఆయన జీవిత కాలమంతా ఆయన చేసిన అద్భుత కార్యాల్లో ఆయనతో కలిసి పని చేయడం ద్వారా (14:10; అపో కా 10:38) తండ్రి ఆయనకు సాక్ష్యం పలుకుతున్నాడు.

**5:38** వారికి దేవుని వాక్కు (పాత ఒడంబడిక గ్రంథం) అందుబాటులో ఉంది. దాన్ని శ్రద్ధగా పఠించారు (వ 39) గనక అది వారి మనసుల్లో ఉంది. కానీ అది వారి అంతరంగాల్లో లేదు. అది వారిలో సజీవంగా ఉండి వారిని జీవింపజేయలేదు (కీర్తన 119:11 పోల్చి చూడండి).

**5:39** లేఖనాలు (లేక లేఖనం) క్రొత్త ఒడంబడిక గ్రంథంలో తరుచుగా (53 సార్లు) కనిపించే మాట. దీనికి అర్థం "రాసివున్నవి". పాత ఒడంబడిక పుస్తకాలను ఉద్దేశించి లేఖనాలు అన్నారు (కానీ 2 పేతురు 3:16 చూడండి). పాత ఒడంబడిక గ్రంథం నిండా యేసుప్రభువును గురించిన భవిష్యద్ వాక్కులూ సాదృశ్యాలూ సూచనలూ చిహ్నాలూ సంకేతాలూ ఉన్నాయి. వ 46; లూకా 24:27,45,46 చూడండి.

**5:40** తమకు శాశ్వత జీవం ఉందని వారనుకున్నారు గాని అది వారిలో లేదు. అలాంటి ఆధ్యాత్మిక జీవాన్ని వారికివ్వగల ఒకే ఒక వ్యక్తి దగ్గరికి నమ్మకంతో రావడానికి వారికి ఇష్టం లేదు (వ 21; 3:36). ఈ నాటికీ అనేకమంది ఇంతే.

**5:41** అనేక మంది మత నాయకుల్లాగా కాక (వ 44), మనుషులు ఇవ్వగల ఘనత, గొప్పతనం అంటే ఆయనకు ఎంతమాత్రం లెక్కలేదు. మనుషులు తనను పొగడాలని వారికి ఇష్టమైన విధంగా ప్రవర్తించేందుకు ఆయనెప్పుడూ ప్రయత్నించలేదు. ఆయన గురి అంతా 8:29లో చూడవచ్చు. ఇందులోనూ, మిగతా అన్ని విషయాల్లోనూ మనకు ఆదర్శం ఆయనే.

**5:42** మనిషిలో ఏముందో యేసుకు తెలుసు – 2:24,25. వారికి దేవుడంటే ప్రేమ ఉంటే వారు క్రీస్తును కూడా ప్రేమించేవారేనని ఆయనకు తెలుసు (8:42). తనను వారు ద్వేషించడం దేవునిపట్ల వారికున్న ద్వేషాన్ని బట్టబయలు చేసింది (15:24). దేవుణ్ణి తాము ప్రేమిస్తున్నామని వారు చెప్పుకుంటూ ఉండేవారు గానీ నిజానికి ఆయనంటే వారికున్నది ద్వేషమే. యిర్మీయా 17:9 చూడండి.

**5:43** తండ్రి పేర రావడం అంటే తండ్రి అయిన దేవుని అధికారంతో వచ్చాడనీ ఆయనకు సంపూర్ణంగా ప్రాతినిధ్యం వహించాడనీ అర్థం. తన పేరునే రావడమంటే తన సొంత అధికారంతో తన తరుపున తానే రావడం (అలాంటివారు క్రీస్తు పక్షంగా వచ్చామని చెప్పుకోవచ్చు). ఇలా చేసేవారు చాలామంది ఉన్నారు. మత్తయి 24:24 చూడండి. ఇలాంటి వారందరికీ ప్రధాని క్రీస్తువిరోధి (2 తెస్స 2:3,4).

**5:44** ఇక్కడ వర్ణించబడిన వారి గుణాలు వారు క్రీస్తులో నమ్మకం ఉంచడం అసాధ్యం చేస్తాయి. వారి జీవితానికి, ఉనికికి వారే కేంద్రాలు. మనుషులు తమను పొగడాలన్నదే వారి ఆశ. వారి హృదయాల్లో దేవునికి ఇసుమంతయినా స్థలం లేదు. గలతీ 1:10లో దీనికి వ్యతిరేకమైన పరిస్థితి చూడండి.

**5:45** యేసు నేరాలు మోపడానికి గానీ తీర్పు తీర్చడానికి గానీ రాలేదు (3:17). వారిపై నేరాలు మోపేవాడు మోషే. అంటే దేవుడు మోషేచేత రాయించిన లేఖనాలు (బైబిలులోని మొదటి ఐదు పుస్తకాలు) వారిని నేరస్థులుగా నిర్ణయిస్తున్నాయన్నమాట. అతడు రాసినవాటిని వారు నిజంగా నమ్మలేదు కాబట్టి ఇలా జరుగుతుంది (నమ్ముకుంటున్నామని వారు అనుకునేవారు గాని నిజంగా నమ్మలేదు). అతడు రాసిపెట్టిన సత్యాన్ని వారు ఆచరణలో పెట్టలేదు.

**5:46** 1:17; 7:19; లూకా 24:27,45,46 పోల్చి చూడండి. మోషే పుస్తకాలనబడిన వాటిని రాసినది మోషేనేననీ, అతడు క్రీస్తును గురించి రాశాడనీ (వ 39) తేటతెల్లం చేస్తున్న మాట ఇది. నిర్గమ 17:14; 24:4; 34:27; సంఖ్యా 33:2; ద్వితీ 31:9 చూడండి.

**5:47** ఇది వారు గానీ వేరెవరైనా గానీ జవాబు చెప్పలేని ప్రశ్న. పై వచనాలను బట్టి తాను దేవుని కుమారుణ్ణని క్రీస్తు చెప్పుకొన్న మాటలకు అమోఘమైన, ఆశ్చర్యకరమైన గొప్ప సాక్ష్యాధారాలూ రుజువులూ ఉన్నాయని మనం నేర్చుకోవాలి. మానవజాతి చరిత్ర అంతటిలో మరెవరికీ ఇలాంటి సాక్ష్యాధారాలూ రుజువులూ లేవు. ఈ సాక్ష్యం మార్గదర్శిగా మనల్ని ఎక్కడికి తీసుకువెళ్తున్నదో అక్కడికి అందరం పోదాం. ఆవిధంగా యేసుప్రభువును మన ప్రభువుగా రక్షకుడుగా

6 ఆ తరువాత యేసు గలలీ సరస్సు (ఇది తిబెరియ
సరస్సు) దాటి అవతలికి వెళ్ళాడు. 2 రోగులకు ఆయన
చేసిన సూచన కోసమైన అద్భుతాలు చూచి చాలామంది
ఆయన వెంట వచ్చారు. 3 అక్కడ యేసు ఒక కొండెక్కి తన
శిష్యులతో కూడా కూర్చున్నాడు. 4 పస్కా అనే యూదుల
పండుగ దగ్గర పడింది. 5 యేసు తలెత్తి పెద్ద గుంపు తనవైపుకు
రావడం చూచి ఫిలిప్పుతో ఇలా అన్నాడు: “వీరు తినడానికి
రొట్టెలు మనం ఎక్కడ కొనాలి?” 6 అతణ్ణి పరీక్షించడానికి
ఆయన అలా అన్నాడు – తాను ఏమి చేయబోతున్నాడో
ఆయనకు తెలుసు.

7 ఫిలిప్పు “వీళ్ళలో ఒక్కొక్కరికి కొంచెం దొరకాలన్నా రెండు
వందల దేనారాల రొట్టెలు కూడా ఏమీ చాలవు” అని ఆయనకు
జవాబిచ్చాడు.

8 ఆయన శిష్యులలో ఒకడు – సీమోను పేతురు సోదరుడు
అంద్రెయ – యేసుతో ఇలా అన్నాడు: 9 “ఇక్కడ ఓ అబ్బాయి
ఉన్నాడు. వాని దగ్గర అయిదు యవల రొట్టెలూ రెండు చిన్న
చేపలూ ఉన్నాయి. అయితే ఇంతమందికి అదేపాటిది?”

10 “ప్రజలను కూర్చోబెట్టండి” అని యేసు అన్నాడు. ఆ
చోట పచ్చిక విస్తారంగా ఉంది గనుక పురుషులు కూర్చున్నారు.
వారి సంఖ్య సుమారు అయిదు వేలు. 11 అప్పుడు యేసు ఆ
రొట్టెలు చేతపట్టుకొని దేవునికి కృతజ్ఞత అర్పించాడు, శిష్యులకు
పంచి ఇచ్చాడు. శిష్యులు కూర్చుని ఉన్నవారికి వడ్డించారు.
అలాగే చేపలు కూడా వారికి ఇష్టమైనంతమట్టుకు వడ్డించారు.
12 వారు కడుపారా తిన్న తరువాత ఆయన తన శిష్యులతో
“మిగిలిన ముక్కలు ఎత్తండి – ఏమీ నష్టం కాకూడదు”
అన్నాడు. 13 అలాగే వారు వాటిని ఎత్తారు, ఆ అయిదు
యవల రొట్టెలు ప్రజలు తినగా మిగిలిన ముక్కలతో పన్నెండు
గంపలు నింపారు.

14 యేసు చేసిన అద్భుతమైన ఈ సూచన చూచి ప్రజలు
“నిజంగా, లోకానికి రావలసిన ప్రవక్త ఈయనే!” అన్నారు.

15 వారు వచ్చి తనను రాజుగా చేయడానికి బలవంతంగా
తీసుకుపోతారని యేసుకు తెలుసు, కనుక ఆయన మళ్ళీ
కొండకు ఒంటరిగా వెళ్ళాడు.

16 సాయంకాలమైనప్పుడు ఆయన శిష్యులు సరస్సు
ఒడ్డుకు వెళ్ళి 17 పడవ ఎక్కి అవతల ఉన్న కపెర్నహూంకు
దాటిపోసాగారు. అంతలో చీకటి పడింది. యేసు వారిదగ్గరికి
ఇంకా రాలేదు. 18 అప్పుడు పెద్ద గాలి వీస్తూ ఉండడంచేత
సరస్సు అల్లకల్లోలం కాసాగింది. 19 వారు సుమారు అయిదు
కిలోమీటర్ల దూరం తెడ్లతో పడవ నడిపిన తరువాత యేసు
సరస్సు మీద నడుస్తూ పడవకు దగ్గరగా రావడం చూశారు.
వారికి భయం వేసింది. 20 అయితే ఆయన వారితో “నేనే,
భయపడకండి!” అన్నాడు.

21 అప్పుడు ఆయనను పడవలో చేర్చుకోవడం వారికి
ఇష్టం అయింది. వెంటనే పడవ వారు వెళ్ళిపోతున్న స్థలం
చేరింది.

22 మరుసటి రోజున సరస్సు అవతల నిలిచి ఉన్న
ప్రజలకు ఈ విషయం తెలిసింది: ఆయన శిష్యులు ఎక్కిన
పడవ తప్ప మరొకటి అక్కడ లేదు, యేసు తన శిష్యులతో
కూడా ఆ పడవ ఎక్కలేదు. శిష్యులు మాత్రమే వెళ్ళిపోయారు.
23 అప్పుడు వేరే పడవలు తిబెరియ నుంచి వచ్చాయి. యేసు
కృతజ్ఞత అర్పించిన తరువాత వారు తిన్న స్థలం దగ్గరికి అవి
వచ్చాయి. 24 ఆ గుంపుకు యేసు గానీ ఆయన శిష్యులు గానీ
అక్కడ కనబడకపోవడం చేత వారా పడవలెక్కి యేసును
వెదకుతూ కపెర్నహూం వచ్చారు. 25 సరస్సు అవతల
ఆయన కనబడ్డప్పుడు వారు ఆయనను “గురువర్యా! మీరెప్పుడు
ఇక్కడికి వచ్చారు?” అని అడిగారు.

---

నమ్ముకుందాం. అలా చెయ్యకపోతే ఆ గొప్ప నష్టం మనదే.

**6:1–14** యేసు మరణించి సజీవంగా తిరిగి లేచిన సంఘటన మినహాయిస్తే నాలుగు శుభవార్త పుస్తకాల్లోనూ రాసి ఉన్న అద్భుత కార్యం ఇదొక్కటే. దీన్ని బట్టి ఈ అద్భుతానికి ఉన్న గొప్ప అంతరార్థం, ప్రాముఖ్యత అర్థం అవుతున్నాయి. మత్తయి 14:13–21 నోట్స్ చూడండి. పస్కాపండుగ దగ్గర పడిన విషయం (వ 4), ఈ అద్భుతం “సూచన” అన్న విషయం యోహానొక్కడే రాశాడు. ఈ అధ్యాయంలో తరువాత కనిపించే క్రీస్తు మాటలు ఇందుకు కారణాన్ని తెలియజేస్తున్నాయి.

**6:2** మత్తయి 9:35.

**6:4** “పస్కా” – నిర్గమ 12 అధ్యాయం, లేవీ 23:4–8.

**6:6** మన విషయంలో కూడా ఏం చెయ్యాలో ప్రభువుకు అంతా ముందే తెలుసు. కానీ మన నమ్మకాన్ని, ప్రేమను, విధేయతను పరీక్షిస్తుంటాడు. ఆది 22:1; కీర్తన 66:10–12; 1 పేతురు 1:6,7 చూడండి.

**6:7** మార్కు 6:37. ఆ సమస్యకు పరిష్కారం ఫిలిప్పుకు తెలిసి ఉంటే అదేమిటో బయటికి చెప్పలేదు. యేసుప్రభువుకు అసాధ్యమంటూ ఏదీ లేదన్న సంగతి అతనికింకా అర్థం అయినట్టు లేదు.

“దేనారం” – 12:5; మత్తయి 18:28; 20:2 నోట్స్ చూడండి.

**6:11** “కృతజ్ఞత” – మత్తయి 14:19 చూడండి.

**6:14** “సూచన” – 2:11. ఈ అద్భుతం దేనికి సూచన? ద్వితీ 18:15–18లో రాసి ఉన్న ఆ గొప్ప ప్రవక్త తమ మధ్యకు వచ్చాడనడానికి ఇది సూచన అని ప్రజలు అనుకున్నారు. ఇది నిజమే, యేసు ఆ ప్రవక్తే. కానీ ఆ అద్భుతం యేసు పరలోకంనుంచి దిగివచ్చినవాడనీ (33), జీవాహారమనీ (వ 35), తన ప్రజల పస్కా విందు అనీ (వ 53–56) సూచిస్తున్నది.

**6:15** ఆయన ఉద్దేశం, నెరవేర్చవలసిన పని గురించి వారికెలాంటి గ్రహింపూ లేదు. దేవుని కుమారుడుగా ఆయనలో నమ్మకం లేదు. వారు తమ దేశంలోనుంచి రోమ్ పరిపాలనను తొలగించి శాంతి సౌభాగ్యాలను తెచ్చే ఇహలోక రాజ్యం గురించే ఆలోచిస్తున్నారు. యేసుకు అలాంటిదానితో నిమిత్తం లేదు. అప్పట్లో ఏ రాజకీయ వ్యవస్థనూ స్థాపించాలన్న ఆశ ఆయనకు లేదు. ఇప్పుడూ అంతే. ఆయన లోక పాపాల కోసం చనిపోయేందుకు వచ్చాడు. పతనమైన భ్రష్ట స్థితిలో ఉన్న మనుషులకు క్షమాపణ, ఆధ్యాత్మిక జీవం తేవడానికి వచ్చాడు.

**6:16–21** ఈ అద్భుతం మత్తయి, మార్కు శుభవార్తల్లో కూడా ఉంది. మత్తయి 14:22–33 నోట్స్ చూడండి.

**6:21** ప్రకృతి శక్తులకు కట్టుబడకుండా, వాటిపై పూర్తి అదుపు కలిగి ఉన్న వ్యక్తిని ఈ సూచన చూపుతున్నది. కీర్తన 107:23–30; మత్తయి 8:23–27 చూడండి.

**6:22** యేసు సరస్సు దాటి ఎలా రాగలిగాడో జనసమూహానికి అర్థం కాలేదు (వ 25).

**6:24** వారు ఆయన్ను వెతుక్కుంటూ వచ్చినది ఆయనెవరో వారికి తెలిసి కాదు, లేదా అలాంటి ఆధ్యాత్మిక కారణం ఏదైనా ఉండి కాదు.

**6:25** “గురువర్యా” – 1:38.

26 యేసు వారికిలా జవాబిచ్చాడు: “మీతో ఖచ్చితంగా
చెపుతున్నాను, మీరు నన్ను ఎందుకు వెదుకుతున్నారంటే,
సూచనకోసమైన అద్భుతాలు చూచినందుకు కాదు గానీ మీరు
కడుపారా ఆ రొట్టెలు తిన్నందుకే. 27 చెడిపోయే ఆహారం
కోసం కష్టపడకండి. శాశ్వత జీవానికి నిలిచి ఉండే
ఆహారంకోసం కష్టపడండి. ఇది మానవ పుత్రుడు మీకు
ప్రసాదిస్తాడు. ఎందుకంటే, తండ్రి అయిన దేవుడు ఆయనకు
ముద్ర వేశాడు.”
28 అందుకు వారు ఆయనను “దేవుని క్రియలు
జరిగించడానికి మేమేం చేయాలి?” అని అడిగారు.
29 “దేవుని క్రియ అంటే ఆయన పంపినవాణ్ణి మీరు
నమ్మడమే” అని యేసు వారికి బదులు చెప్పాడు.
30 అందుచేత వారు ఆయనతో ఇలా అన్నారు:
“అలాంటప్పుడు మేము చూచి మిమ్మల్ని నమ్మడానికి మీరు
సూచనగా ఏ అద్భుతం చేస్తారు? ఏ క్రియ జరిగిస్తారు?
31 మన పూర్వికులు ఎడారిలో మన్నా తిన్నారు. ‘ఆయన
ఆకాశంనుంచి వారికి ఆహారం ప్రసాదించాడు’ అని రాసి ఉంది
గదా.”
32 అందుకు యేసు “మీకు ఖచ్చితంగా చెపుతున్నాను,
ఆకాశంనుంచి మీకు ఆహారమిచ్చినది మోషే కాదు గానీ నా
తండ్రి పరలోకంనుంచి నిజమైన ఆహారం మీకిస్తున్నాడు.
33 దేవుడు ఇచ్చే ఆహారం ఏమిటంటే, పరలోకంనుంచి
దిగివచ్చి లోకానికి జీవం ఇచ్చేవాడే” అని వారితో అన్నాడు.
34 కనుక వారు ఆయనతో “ప్రభూ! ఆ ఆహారం మాకు
ఎప్పటికీ ఇస్తూ ఉండండి” అన్నారు.
35 యేసు వారికిలా చెప్పాడు: “జీవాహారం నేనే. నా
దగ్గరకు వచ్చే వ్యక్తికి ఆకలి ఎన్నడూ కాదు, నా మీద నమ్మకం
ఉంచిన వ్యక్తికి దాహం ఎన్నడూ కాదు. 36 అయినా మీరు
నన్ను చూచి కూడా నమ్మలేదని మీతో చెప్పాను.
37 “తండ్రి నాకు ఇచ్చిన వారందరూ నా దగ్గరకు వస్తారు.

---

**6:26** యేసుప్రభువుకు వారి హృదయాలు తెలుసు (2:24,25 చూడండి). తనను వెతకడంలో వారి ఉద్దేశాల పట్ల ఆయనకేమీ ఆనందం లేదు. వారికి ఆత్మ సంబంధమైన జ్ఞానం గానీ ఆసక్తి గానీ లేదు, తమ భౌతిక అవసరాలకు ఏమైనా దొరుకుతుందన్న తాపత్రయం మాత్రమే ఉంది. నేడు క్రైస్తవ సంఘాల్లోనూ, బయట కూడా సరికాని కారణాలను బట్టి క్రైస్తవులుగా ఉందామని ప్రయత్నించే అనేకమంది వీరివంటి వారే.

**6:27** అన్నిటికంటే ముఖ్యంగా వారికి దేన్ని గురించి శ్రద్ధ ఉండాలో ప్రభువు చెప్తున్నాడు. ఈ క్షణికమైన జీవితావసరాల కోసం కాదు, శాశ్వత జీవం కోసమే, శరీరం కోసం కాదు ఆత్మకోసమే వారు పాటుపడాలి. మత్తయి 6:31–33; 16:26; యెషయా 55:1,2 కూడా చూడండి.

“శాశ్వత జీవం” – 3:16. మానవ పుత్రుడే (మత్తయి 8:20) ఆ ఆహారం ప్రసాదిస్తాడు గానీ దానికోసం వారు కష్టపడాలన్న సంగతి గమనించండి. అంటే పాపవిముక్తి అనేది కష్టపడి మంచి పనులు చేస్తే వస్తుందని కాదు. క్రీస్తు ఇచ్చేదాన్ని మనుషులు ఆయనలో వెదికేందుకూ క్రీస్తులో నమ్మకం ఉంచి ఆ ఈవిని పొందేందుకూ అన్ని ప్రయత్నాలూ చెయ్యాలని దీని భావం (వ 29). మత్తయి 11:12; హీబ్రూ 4:11; 2 పేతురు 1:10 చూడండి.

**6:28** కష్టపడాలన్న క్రీస్తు మాటను వారు సరిగా అర్థం చేసుకున్నట్టు లేదు. ఆధ్యాత్మిక జ్ఞానం లోపించడంవల్ల పాప విముక్తినీ శాశ్వత జీవాన్నీ మంచి పనుల ద్వారా సంపాదించుకో వచ్చని వారు అనుకున్నారు. కానీ 4:10; రోమ్ 6:23; ఎఫెసు 2:8,9; తీతు 3:5 చూడండి.

**6:29** వారి పొరపాటు అభిప్రాయాన్ని ప్రభువు సవరిస్తున్నాడు. మనుషులు తమ పాపవిముక్తి కోసం క్రీస్తులోనే నమ్మకం ఉంచాలని దేవుని ఆదేశం (1:12; 3:15,16,36; 5:24). క్రీస్తులో నమ్మకం ఉంచడం బుద్ధికి అనుగుణమైన యోగ్యమైన పని, ఎందుకంటే దేవుడు ఆయన్ను ఈ లోకానికి పంపించాడు. యోహాను శుభవార్త ఒక్కదాన్లోనే దేవుడు తనను పంపాడని యేసుప్రభువు 40 సార్లు చెప్పాడు. మనుషులు ఆయన మాటలు నమ్మాలంటే ఒక విషయాన్ని ఆయన ఎన్ని సార్లు చెప్పాలి?

**6:30,31** మత్తయి 16:1–4; 1 కొరింథు 1:22. తన గురించిన సత్యాన్ని వెల్లడి చేస్తున్న సూచనలను యేసుప్రభువు ఇంతకుముందే చూపించాడు. అయితే ఆ ప్రజలు ఆయన్ను నమ్మలేదు. వ 31లో వారు ఎడారిలో మన్నా గురించి మాట్లాడారు (నిర్గమ 16:11–18,35). యేసు చేసినదానిని మన్నాతో పోలుస్తున్నట్టున్నారు. యేసు 5 వేల మందికి ఒక పూట భోజనం పెట్టాడు. మోషే కాలంలోనైతే దేవుడు ఆ జాతి నంతటినీ 40 సంవత్సరాలు పోషించాడు. యేసు వారికి మామూలు రొట్టెలు తినిపించాడు. మోషే కాలంలో దేవుడు ఆకాశంనుంచి మన్నా కురిపించాడు. అభిషిక్తుడు వచ్చినప్పుడు మళ్ళీ ఆకాశంనుంచి మన్నా కురిపిస్తాడని యూదులు నమ్మారు. కానీ యేసు అలా చెయ్యలేదు.

**6:32** మన్నా కురిపించినది దేవుడే. శాశ్వత జీవాన్ని కలిగించే పరలోక సంబంధమైన ఆహారాన్ని వారికి మోషే ఇవ్వడం అసాధ్యం. దేవుడు మాత్రమే అలా చెయ్యగలడు. తన సొంత కుమారుణ్ణి పంపడం ద్వారా దేవుడు అలా చేశాడు. దేవుడు ఇచ్చే ఆత్మ సంబంధమైన ఆహారానికి మన్నా ఒక సాదృశ్యం, ఒక చిహ్నం మాత్రమే. ఆధ్యాత్మిక జీవాన్ని కలిగించే నిజమైన ఆహారం ఇదే.

**6:33** దేవుడిచ్చే ఆహారం ఒక వ్యక్తి అని గమనించండి. పరలోకంనుంచి వచ్చి మానవజాతికి ఆత్మ సంబంధమైన జీవాన్నిచ్చే వ్యక్తి ఆయన (వ 35).

**6:34** 4:15 పోల్చి చూడండి. ఆయన చెప్తున్న దాని గురించి ఆత్మ సంబంధంగా వారికేమీ అర్థం కాలేదు, వారాయన్ను నమ్మలేదు (వ 36).

**6:35** వారు పోగు చేసుకుని తినగల మన్నావంటి పదార్థం గురించి తాను మాట్లాడ్డం లేదని యేసు స్పష్టంగా చెప్తున్నాడు. ఆయన తన గురించే మాట్లాడుతున్నాడు (వ 48,51). తనను తాను ఆహారంగా చెప్పుకొంటూ ఉన్నప్పుడు మానవ దేహానికి ఆహారం ఎలానో, మనుషుల మనసులకు, హృదయాలకు, ఆత్మలకు తాను అలా అని పోల్చుకుంటున్నాడు అన్నమాట.

**6:36** వ 64; 5:38; 8:45; 10:25.

**6:37** ఇది మరో గొప్ప వాగ్దానం. యేసుప్రభువు దగ్గరికి రావడంద్వారా మనం జీవాహారంలో భాగం పంచుకుంటామని ఇది తెలియజేస్తున్నది. ఆధ్యాత్మిక జీవం కలగాలంటే ఇదొక్కటే ఏకైక మార్గం (3:36; 5:40; 14:6; ప్రకటన 22:17). ఆయన దగ్గరికి రావడం అంటే ఆయనలో నమ్మకం ఉంచడం; వారిలాగా అపనమ్మకంతో, వేరే ఉద్దేశాలతో రావడం కాకుండా నమ్మకంతో రావడం (వ 24,26). రావడమంటే మన హృదయాలు ఆయనకు దగ్గర కావడం, ఆత్మలో ఆయన వైపుకు తిరగడం. అలా వచ్చినవారిని ఆయన ఎప్పుడూ పంపివెయ్యడు. ఈ మాటలు చాలా ఖచ్చితంగా ఉన్నాయి. ఒక వ్యక్తి ఎవరైనా, ఎక్కడ ఉన్నా అతడు లేక ఆమె క్రీస్తు దగ్గరికి వస్తే ఆ వ్యక్తిని క్రీస్తు

నా దగ్గరకు వచ్చే వ్యక్తిని నేనెన్నడూ బయటికి త్రోసివేయను.
38 నన్ను పంపినవాని సంకల్పం నెరవేర్చడానికే నేను పరలోకం
నుంచి దిగివచ్చాను గాని నా సొంత సంకల్పం నెరవేర్చడానికి
కాదు. 39 నన్ను పంపిన తండ్రి సంకల్పం ఏమంటే, ఆయన
నాకు ఇచ్చిన దాన్నంతటిలోనూ నేను దేన్నీ పోగొట్టుకోకుండా
చివరి రోజున దాన్ని లేపడమే. 40 నన్ను పంపినవాని సంకల్పం
ఇదే: కుమారుణ్ణి చూచి ఆయన మీద నమ్మకం ఉంచే ప్రతి
ఒక్కరూ శాశ్వత జీవం పొందాలి; చివరి రోజున నేను వారిని
సజీవంగా లేపుతాను.”
41 తాను పరలోకంనుంచి దిగివచ్చిన ఆహారాన్ని
అన్నందుకు ఆయనను గురించి యూదులు సణుక్కొన్నారు.
42 “ఈ యేసు యోసేపు కొడుకు గదా. అతని తల్లిదండ్రులు
మనకు తెలిసినవారే గదా. ఇప్పుడితడు ‘నేను పరలోకంనుంచి
దిగివచ్చాను’ అంటాడేమిటి!” అన్నారు.
43 యేసు వారికిలా బదులు చెప్పాడు: “మీలో మీరు
సణుక్కోకండి. 44 నన్ను పంపిన తండ్రి వారిని ఆకర్షించనిదే
ఎవరూ నా దగ్గరకు రాలేరు. వారిని చివరి రోజున సజీవంగా
లేపుతాను. 45 ‘వారందరికీ దేవుడు ఉపదేశిస్తాడు’ అని ప్రవక్తల
లేఖనంలో వ్రాసి ఉంది. అందుచేత తండ్రివల్ల విని నేర్చుకొనే
ప్రతి ఒక్కరూ నా దగ్గరకు వస్తారు. 46 దేవుని నుంచి
వచ్చినవాడు తప్ప ఇంకెవరూ తండ్రిని చూడలేదు. ఆయన
తండ్రిని చూశాడు. 47 మీతో ఖచ్చితంగా చెపుతున్నాను,
నామీద నమ్మకముంచినవారికి శాశ్వత జీవం ఉంది.
48 జీవాహారాన్ని నేనే. 49 ఎడారిలో మీ పూర్వీకులు మన్నా తిని
కూడా చనిపోయారు. 50 కానీ ఈ ఆహారం తిన్నవారు చావరు.
పరలోకం నుంచి ఈ ఆహారం దిగివచ్చిన కారణం అదే.

---

స్వీకరిస్తాడు.

దేవుడు తనను ఎన్నుకోలేదేమోనని, కాబట్టి క్రీస్తు తనను స్వీకరించడేమోనని ఈ వచనం మొదటి భాగం విషయం ఎవరూ ఆందోళన చెందనవసరం లేదు. అతడు క్రీస్తు దగ్గరికి రావడమే దేవుడు అతణ్ణి ఎన్నుకున్నాడని రుజువు. దేవుడు మానవాళిలో నుంచి కొందరు వ్యక్తులను క్రీస్తుకు ఇచ్చాడన్నది నిజమే (10:29; 17:6). ఒక వ్యక్తి క్రీస్తు దగ్గరికి రాకముందు అతడు, లేక ఆమె అలాంటి కోవకు చెందినవారో కాదో ఎవరూ చెప్పలేరు. అయితే దేవుడెన్నుకున్న వారందరూ మాత్రం నమ్మకంతో క్రీస్తు దగ్గరికి వస్తారు. అలా రావడం ద్వారా దేవుడు తమను క్రీస్తుకు ఇచ్చాడని రుజువు చేస్తారు. రోమ్ 8:29,30 నోట్స్ చూడండి. పాపవిముక్తి కోరుతున్న పాపి దేవుని రహస్య ఉద్దేశాల గురించి ఆందోళన పెట్టుకోవడం మాని, ఉన్నట్టుగా క్రీస్తు చెంతకు రావాలి (మత్తయి 11:28). రాదలచుకున్న వారంతా రావచ్చు (ప్రకటన 22:17).

**6:38** 4:34 నోట్. ఈ ఒక అధ్యాయంలో తాను పరలోకంనుంచి దిగివచ్చానని ఐదు సార్లు యేసుప్రభువు చెప్పాడు (వ 33,38,50,51,58). మనమంతా ఆయన్ను నమ్ముదాం. మనం ఈ ఒక్క సత్యం నమ్మితే ఆయన చెప్పిన వేరే విషయాల గురించి తొట్రుపాటు, ఆందోళన చెందనవసరం లేదు.

యేసు లోకానికి వచ్చిన ఇంకా కొన్ని కారణాలకోసం మత్తయి 5:17 నోట్ చూడండి.

**6:39** ఇక్కడ చివరి రోజున అంటే ఈ యుగాంతంలో విశ్వాసులు సజీవంగా తిరిగి లేచే రోజున (5:28, 29 నోట్). విశ్వాసులు తన తండ్రి తన కిచ్చిన బహుమానమనీ ఈ బహుమానాన్ని గురించి తాను శ్రద్ధ తీసుకుంటూ దానిలో ఏ చిన్న భాగాన్ని కూడా పోగొట్టుకోననీ యేసు ఇక్కడ చెపుతున్నాడు. వ 40, 44లో యేసు ఖచ్చితంగా ఎలాంటి షరతులూ మినహాయింపులూ లేకుండా విశ్వాసులందరినీ సజీవంగా లేపుతానంటున్నాడు. అంటే ఆయన ఆరంభించిన రక్షణ కార్యాన్ని వారందరి విషయంలో ఆయన ముగిస్తాడన్న మాట. ఏ ఒక్క విశ్వాసి విషయంలో కూడా ఆయన విఫలం కాడు. ఇందులో విశ్వాసులకు పరిపూర్ణమైన భద్రత, క్షేమం ఉంది. దేవుని కుమారుని ప్రేమ, బలప్రభావాలపై, తండ్రి సంకల్పంపై ఇది ఆధారపడి ఉంది (10:28-30, రోమ్ 5:9,10; ఫిలిప్పీ 1:6; హీబ్రూ 7:25 పోల్చి చూడండి.)

**6:40** కుమారునివైపు చూచి ఆయనపై నమ్మకం ఉంచడ మంటే ఆయన చెంతకు రావడమే (వ 37). “శాశ్వత జీవం” గురించి నోట్ 3:16.

**6:41** యేసు వారికి ఈ భూమిపై ఇంతకుముందు ఎవరూ వినని మనోజ్ఞమైన ఉపదేశం, అద్భుతమైన వాగ్దానాలు ఇచ్చాడు. అందుకు ప్రతిగా వారు చేసినదల్లా సణుక్కొవడం, అభ్యంతరాలు లేవదీయడం. విశ్వాసం లేని భ్రష్టమైన మానవ హృదయం అలాంటిదే.

**6:42** మత్తయి 13:55; మార్కు 6:3 కూడా చూడండి. క్రీస్తు ఎలా జన్మించాడో వారికి తెలియదు (మత్తయి 1:18-23; లూకా 1:26-35). ఆయన పరలోకంనుంచి వచ్చిన సంగతి వారికి తెలియదు. తెలుసుకోవాలన్న కోరికా లేదు.

**6:43** సత్యాన్ని గ్రహించాలంటే సణుగుడు సరైన మార్గం కాదు. అది కేవలం మనుషుల పాపాన్ని పెంచుతుంది.

**6:44** వ 37 చూడండి. దేవుని తోడు లేకుండా పాపులైన మనుషులకు క్రీస్తు మాటలు అర్థం కావు, ఆయనపై నమ్మకం కలగదు. ఆయన చెంతకు రావడం అసాధ్యం. అయినా అవిశ్వాసులు జవాబుదారులు, దోషులుగా ఉన్నారు, శిక్షావిధికి గురైనవారు (3:18-20).

చివరి రోజున విశ్వాసులందరినీ సజీవంగా లేపుతానని యేసు నాలుగు సార్లు చెప్పాడు (వ 39,40,54). ఈ సత్యం ఎంత నిశ్చయమో తెలియజేసేటందుకు ఈ మాటలను చాలా గట్టిగా మనస్సులో నాటుకునేలా చెప్తున్నాడు.

**6:45** యెషయా 54:13; యిర్మీయా 31:34. దేవుడు ఉపదేశకుడు అనే సత్యం గురించి నోట్స్ కీర్తన 25:4,5. దేవునినుంచి నేర్చుకునే ప్రతివాడూ క్రీస్తు దగ్గరికి వస్తాడు. సందేహం లేదు. క్రీస్తును తన రక్షకుడుగా ప్రభువుగా నమ్మకుండా దేవుడు తన ఉపదేశకుడు అని ఎవరన్నా అనడం వ్యర్థం.

**6:46** 1:18. దేవత్వంలో ఈ ఇద్దరు వేరువేరు వ్యక్తులని మరోసారి గమనించండి – ఒకరిని మరొకరు చూశారు.

**6:47** యేసు ఈ విషయాన్ని ఇంకా కొన్ని సార్లు చెప్పాడు (వ 40, 3:15,16; 5:24). నమ్మి ఆనందించండి.

**6:48** వ 35.

**6:49-51** నమ్మకం లేని యూదులు యేసుకన్నా మోషే గొప్పవాడనుకున్నారు (వ 30-32). కానీ నిజం దీనికి వ్యతిరేకంగా ఉందని క్రీస్తు ఇక్కడ నిరూపిస్తున్నాడు. ఇస్రాయేల్ వారు తినిన మన్నా వారికి ఆత్మ సంబంధమైన జీవాన్ని ఇవ్వలేదు. లేక చాలా కాలం ఈ లోకంలో బ్రతికేలా చెయ్యలేదు (వ 49). కానీ పరలోకంనుంచి వచ్చి ఆహారం అయిన క్రీస్తు ఎప్పటికీ నిలిచివుండే ఆత్మసంబంధమైన జీవాన్ని ఇస్తాడు. మన్నా ఒక్క జాతివారికే లభ్యం అయింది. కానీ క్రీస్తు ఇచ్చేది ఈ లోకంలోని వారందరికోసం (వ 51).

51 పరలోకంనుంచి దిగివచ్చిన సజీవమైన ఆహారాన్ని నేనే. ఈ
ఆహారం ఎవరైనా తింటే శాశ్వతంగా జీవిస్తారు. లోకానికి
జీవంకోసం నేను ఇవ్వబోయే ఆహారం నా శరీరమే!"
52 అప్పుడు యూదులు "ఈ మనిషి తన శరీరాన్ని
తినడానికి మనకు ఎట్లా ఇవ్వగలడు?" అంటూ ఒకరితో ఒకరు
వాదించుకొన్నారు.
53 కనుక యేసు వారితో ఇలా అన్నాడు: "మీతో
ఖచ్చితంగా చెపుతున్నాను, మీరు మానవ పుత్రుని శరీరం
తినకపోతే, ఆయన రక్తం త్రాగకపోతే మీలో మీకు జీవం
ఉండదు. 54 నా శరీరం తిని నా రక్తం త్రాగినవాడెవడైనా
శాశ్వత జీవం గలవాడు. చివరి రోజున నేను అతణ్ణి లేపుతాను.
55 నా శరీరం నిజంగా ఆహారం, నా రక్తం నిజంగా
పానీయం. 56 నా శరీరం తిని నా రక్తం త్రాగినవాడు నాలో
ఉంటాడు. నేను అతనిలో ఉంటాను. 57 జీవం గల తండ్రి
నన్ను ఎలా పంపాడో, నేను తండ్రి మూలంగా ఎలా
జీవిస్తూ ఉన్నానో అలాగే నన్ను తిన్నవాడు నామూలంగా
జీవిస్తూ ఉంటాడు. 58 పరలోకం నుంచి దిగివచ్చిన ఆహారం
ఇదే! మీ పూర్వీకులు మన్నా తిని చనిపోయినట్టు కాదు – ఈ
ఆహారం తిన్నవాడు ఎప్పటికీ జీవిస్తాడు.
59 ఆయన కపెర్‌నహూంలో ఉపదేశిస్తూ సమాజ

---

పరలోకంనుంచి వచ్చిన ఆ ఆహారాన్ని ఒక వ్యక్తి గనక తింటే అతడు చనిపోడని వ 50లో యేసు అంటున్నాడు. 11:26 కూడా చూడండి. మరి క్రీస్తులో నమ్మకం ఉంచినవారు శారీరికంగా చనిపోరా? అవును చనిపోతారు గాని ఆత్మసంబంధంగా ఎప్పుడూ చనిపోరు. వారు మరణం నుంచి జీవంలోకి వెళ్ళిపోయారు (5:24). క్రొత్త ఒడంబడిక గ్రంథంలో విశ్వాసుల మృతిని కూడా సాధారణంగా మరణం అనలేదు, "నిద్ర" అన్నారు. 11:11-13; అపో కా 7:60; 1 కొరింతు 15:6; 1 తెస్స 4:13 చూడండి. మరణం గురించి నోట్స్ ఆది 2:17 చూడండి.

**6:51** లోకమంతటి పాపాల పరిహారం కోసం తన దేహం బలి అర్పణ అనీ (1:29; 3:15 చూడండి), ఆయనమీద నమ్మకం ఉంచడంద్వారా మనుషులకు ఆత్మ సంబంధమైన జీవం కలుగుతుందనీ యేసు ఉద్దేశం.

**6:52** ఎప్పటిలాగానే నమ్మకం లేని ఈ మనుషులకు ఆయన చెప్పినది బోధపడలేదు. ఆధ్యాత్మికమైన వివేచన వారికి లేదు. ఆయన మాటలను అక్షరార్థంగా తీసుకున్నారు. 3:4; 4:15 పోల్చి చూడండి. యేసు తరుచుగా అలంకారికమైన భాషను ఉపయోగించాడు. దాన్ని ఉన్నది ఉన్నట్టు అర్థం చేసుకోకూడదు (వ 35; 4:10; 8:12; 10:7; 15:1; మొ॥). తరువాత వస్తున్న వచనాల విషయంలో కూడా ఇది గుర్తుంచుకోవాలి.

**6:53-58** ఈ భాగంలో యేసు తన శరీరం, రక్తం గురించి నాలుగు సార్లు మాట్లాడాడు. మనుషులు తన శరీరాన్ని తిని తన రక్తాన్ని తాగాలని చెప్పాడు. అదే "నిజమైన" ఆహారం అన్నాడు. తానే ఆహారం అనీ, మనుషులు తనను తినాలనీ చెప్పాడు.

విన్నవారు ఆ మాటలను ఉన్నవి ఉన్నట్టు అర్థం చేసుకోకూడదన్న సంగతి వేరే చెప్పనవసరం లేదు. వ 63 చూడండి. ఆయన వారి ఎదుట నిలబడి ఉన్నాడు. హత్య, నరమాంస భక్షణ అనే ఘోర నేరాలు చేయకుండా ఆయన్ను అక్షరాలా తినడం వారికి అసాధ్యం. ఈ రెంటిలో దేనినీ యేసుప్రభువు కలలోనైనా బోధించలేదు. ఆయన అక్షరాలా మనకు ఆహారం అని ఎలా భావించకూడదో అలానే ఆయన శరీరాన్ని అక్షరాలా తిని, రక్తాన్నీ తాగాలని మనం అనుకోకూడదు.

ఆధ్యాత్మిక సత్యాన్ని నేర్పించేందుకు ఆయన భాషాలంకారాన్ని వాడుతున్నాడు. తాను అక్షరాలా ఒక తలుపు అనీ (10:7), లేక అక్షరాలా ఒక ద్రాక్షతీగె (15:1) అనీ ఆయన ఉద్దేశం కానట్టే ఆయన్ను అక్షరాలా తినాలని కూడా ఆయన ఉద్దేశం కాదు. పాత ఒడంబడిక గ్రంథంలో రక్తాన్ని తాగడం తినడం నిషేధం (ఆది 9:4; లేవీ 17:10-14; 19:26).

యేసు ఏ ఆధ్యాత్మిక సత్యాన్ని నేర్పిస్తున్నాడు? వ 51లో చెప్పిన సత్యాన్నే, ఇక్కడ తన రక్తాన్ని కూడా చేర్చి నేర్పిస్తున్నాడు. "రక్తం" అంటే సిలువపై కారనున్న ఆయన రక్తం; మనుషుల పాపాలకు పరిహారబలిగా ఆయన ఇవ్వనున్న తన ప్రాణమన్న మాట (మత్తయి 26:27,28; రోమ్ 3:25 చూడండి). ఆయన శరీరం తిని ఆయన రక్తం తాగడమంటే ఏమిటి? ఆయన చేసిన బలి అర్పణ నిజంగా మన కోసమేననీ, అది మన పాపాలను తీసివేస్తుందనీ నమ్మడమే(రోమ్ 3:25; ఎఫెసు 1:7; హీబ్రూ 9:12-14; 1 యోహాను 1:7). నమ్మకం ద్వారా ఆయన్ను మన హృదయాల్లోకి స్వీకరించడమే. ఇది ఆత్మ సంబంధంగా తిని త్రాగడం. ఇది ఆత్మ సంబంధమైన జీవాన్ని ఇస్తుంది.

ఈ భాగమంతా ప్రభురాత్రి భోజన ఆచరణను సూచిస్తున్నదని కొందరు అనుకుంటున్నారు (మత్తయి 26:26-29; 1 కొరింతు 11:23-32). దీనికి చాలా తీవ్రమైన అభ్యంతరాలు ఉన్నాయి. ప్రభురాత్రి భోజన ఆచరణలోని ఆధ్యాత్మిక అర్థాన్ని ఈ వచనాలు వివరిస్తూ ఉండవచ్చు. కానీ ఆధ్యాత్మిక జీవం కలగాలంటే మనుషులు ఈ ఆచరణ పాటించాలని క్రొత్త ఒడంబడిక గ్రంథంలో ఎక్కడా రాసి లేదు. అదే నిజమైతే మరి సిలువ మీద నమ్మకం ఉంచిన దొంగ సంగతి ఏమిటి (లూకా 20:40-43)? ప్రభురాత్రి భోజనం ఎప్పుడూ పుచ్చుకోని ఇతర విశ్వాసుల, చిన్నపిల్లల సంగతి ఏమిటి? యేసు వ 53లో చాలా ఖచ్చితంగా తన శరీరం తినకపోతే, తన రక్తం త్రాగకపోతే వారిలో జీవం ఉండదని చెప్పాడు. ఇక్కడ ఆయన ఆత్మ సంబంధమైన వాస్తవాలను గురించి మాట్లాడుతున్నాడన్నది తేటతెల్లమే. ప్రభురాత్రి భోజన ఆచరణలో భాగం పుచ్చుకుంటూ కూడా ఆత్మ సంబంధంగా నమ్మకం ద్వారా ఎప్పుడూ ఆయన శరీరాన్ని తినకుండా, ఆయన రక్తాన్ని త్రాగకుండా ఉండడం సాధ్యమేనని మనం అర్థం చేసుకోవాలి. అలాగే ఆధ్యాత్మికంగా నమ్మకం ద్వారా ఆయన శరీరాన్ని తిని ఆయన రక్తాన్ని త్రాగి కూడా ప్రభురాత్రి భోజన సంస్కారంలో భాగం పుచ్చుకోకుండా ఉండడం కూడా సాధ్యమే.

**6:53** "తినకపోతే", "త్రాగకపోతే" అంటూ మాట్లాడడంలో పాపవిముక్తికి అత్యంత అవసరమైన విషయం గురించి యేసు మాట్లాడుతున్నాడు. 3:3; మత్తయి 18:3; లూకా 13:3 కూడా చూడండి. ఇవన్నీ లేకుండా ఏ మనిషికీ ఆత్మ సంబంధమైన జీవం, పాపవిముక్తి, దేవుని రాజ్యంలోకి ప్రవేశం, పరలోకం లేవు. యేసుక్రీస్తు చెప్పిన అతి గంభీరమైన వాక్కులే ఇందుకు ఆధారం.

**6:56** విశ్వాసి క్రీస్తులో ఉన్నాడు (రోమ్ 6:11; 8:1; 1 కొరింతు 1:2; ఎఫెసు 1:1-4); క్రీస్తు విశ్వాసిలో ఉన్నాడు (2 కొరింతు 13:5; కొలస్సయి 1:27; 3:11; ప్రకటన 3:20). ఒకరు పరస్పరం మరొకరిలో ఉన్నారు – 17:20-23. వారి జీవితాలు ఎప్పటికీ ఏకంగా పెనవేసుకొని ఉన్నాయి.

**6:57** తండ్రి అయిన దేవునిమూలంగా క్రీస్తుకు జీవం ఉన్నదన్న సంగతి ఎంత వాస్తవమో క్రీస్తుమూలంగా విశ్వాసులకు జీవం ఉన్న సంగతి అంత వాస్తవం. జీవం ఉన్న తండ్రి, జీవం ఉన్న కుమారుడు, జీవం ఉన్న విశ్వాసులు – వీరంతా అతి

కేంద్రంలో ఆ మాటలు చెప్పాడు. 60 ఆయన శిష్యులలో చాలమంది అది విని "ఈ మాట కఠినమైనది. ఇది ఎవరు వినగలరు?" అన్నారు.

61 తన శిష్యులు దానిని గురించి సణుగుకొంటూ ఉన్న సంగతి యేసుకు తెలుసు. కనుక ఆయన వారితో ఇలా అన్నాడు: "మీకు ఇది అభ్యంతరమా? 62 అయితే మానవ పుత్రుడు మునుపున్న చోటికి పైకి వెళ్ళడం మీరు చూస్తే మీకెలా ఉంటుందో! 63 జీవమిచ్చేది దేవుని ఆత్మ మాత్రమే. శరీరం ప్రయోజనమేమీ లేనిది. మీతో నేను చెప్పే మాటలు ఆత్మ సంబంధమైనవి, జీవం ఇచ్చేవి. 64 కానీ మీలో కొందరు నమ్మడం లేదు." నమ్మనివారెవరో తనను శత్రువులకు పట్టి ఇచ్చేవాడెవడో మొదటి నుంచి యేసుకు తెలుసు. 65 ఆయన ఇంకా అన్నాడు "తండ్రి వారిని అనుగ్రహించనిదే ఎవరూ నా దగ్గరకు రాలేరని నేను చెప్పినది అందుకే."

66 అప్పటినుంచి ఆయన శిష్యులలో అనేకులు వెనక్కు తగ్గి ఆయనతో మరెన్నడూ తిరగలేదు.

67 అప్పుడు యేసు తన పన్నెండుమందితో "మీరు కూడా వెళ్ళిపోవాలని ఉన్నారా?" అన్నాడు.

68 సీమోను పేతురు ఆయనకు ఇలా జవాబిచ్చాడు: "ప్రభూ, మేము ఎవరిదగ్గరికి వెళ్తాం? నీవు శాశ్వత జీవ వాక్కులు గలవాడవు. 69 అంతేకాక, అభిషిక్తుడవూ సజీవుడైన దేవుని కుమారుడవూ నీవే అని మేము నమ్ముతూ

---

సన్నిహిత సంబంధం కలిగి ఉన్నారు.

**6:60** క్రీస్తు శత్రువులైన యూదులు కాదు ఈ మాటలన్నది. ఆయన శిష్యులే కొందరు అన్నారు. ఆయనకు సన్నిహితులైన పన్నెండుమంది కాదు. ఆయన ఉపదేశాలు వినేందుకు అప్పుడప్పుడు ఆయన వెంట వెళ్తూ ఉండేవారు కొందరు ఇలా అన్నారన్నమాట. ఇలా అన్నవారిలో కొందరు నిజంగా ఆయనపై నమ్మకం ఉంచినవారు కారు (వ 64). ఆయన్ను వదిలి వెళ్ళిపోవడం ద్వారా వారి అవిశ్వాసాన్ని వారు బయట పెట్టుకున్నారు (వ 66. 1 యోహాను 2:19 పోల్చి చూడండి).

53–58 వచనాల్లో యేసు నేర్పినది ఆధ్యాత్మిక జ్ఞానం కలిగి ఆయనలో నమ్మకం ఉంచినవారికి దివ్యంగా కనిపిస్తుంది. అయితే నమ్మకం లేనివారికి నిజంగా అది "కఠినమైన" మాటే. వారి పాపవిముక్తికి ఏకైక మార్గం వారికోసం క్రీస్తు చేసిన బలి అర్పణేననీ, నమ్మకంద్వారా వారు ఆయనతో సంబంధం పెట్టుకోవాలనీ, లేదా వారు నశించిపోతారనీ వినడం వారికి ఏమాత్రం ఇష్టం లేదు. ఇది కఠినమైన మాట అనడంలో తాము అంగీకరించేందుకు అది చాలా కష్టమైన మాట అని వారి ఉద్దేశం. నిజమైన విశ్వాసికి యేసు చెప్పినవి కొన్ని అర్థం చేసుకోవడానికి కష్టమైనప్పటికీ అంగీకరించేందుకు మాత్రం ఏదీ కష్టమైనది కాదు. ఇక్కడ క్రీస్తు ఉపదేశం ఆయన నిజ శిష్యులనూ కపట శిష్యులనూ వేరు చేసింది (యూదా ఇస్కరియోతు ఒక్కడు మాత్రం మరి కొంత కాలం వేరు కాకుండా అలానే ఉన్నాడు).

**6:61** వ 41.

**6:62** మార్కు 16:19; లూకా 24:51; అపొ కా 1:9. క్రీస్తు పరలోకానికి పైకి వెళ్ళిపోతుండగా చూస్తే వారికి మరింత అభ్యంతరం కలుగుతుందా లేక ఆయన్ను నమ్ముతారా అని ఈ ప్రశ్నకు అర్థం కావచ్చు. "మునుపున్న చోటు" అంటే పరలోకంలో తండ్రి అయిన దేవుడున్నచోటు అని అర్థం (వ 38; 1:1; 3:13).

**6:63** "ఆత్మ" – దేవుని ఆత్మ. ఆ ఆత్మ మాత్రమే ఆత్మ సంబంధమైన జీవాన్ని ఇవ్వగలదు (3:5–8; 2 కొరింతు 3:6). అక్షరాలా తన శరీరాన్ని తినడం ఎలాంటి మేలూ కలిగించదని క్రీస్తు ఇక్కడ సూచిస్తున్నాడు. ఆధ్యాత్మిక జీవం ఏ వ్యక్తిలోకీ నోటి గుండా ప్రవేశించదు. అది నేరుగా మనిషి ఆత్మలోకి వెళ్తుంది.

"శరీరం ప్రయోజనమేమీ లేనిది" అనే మాటలు అక్షరాల క్రీస్తు శరీరాన్ని తినడంవల్ల ఏమీ ప్రయోజనం ఉండదనే అర్థం మాత్రమే కాకుండా ఎవరి శరీరమూ, శారీరికంగా ఎవరి ప్రయత్నాలూ ఆధ్యాత్మిక జీవాన్ని ఇవ్వలేవని కూడా దీని అర్థం కావచ్చు. అంటే మానవ స్వభావంతో సంబంధం ఉన్నదేదీ అలా చెయ్యడం అసాధ్యం (1:13).

"మీతో నేను చెప్పిన మాటలు" అంటే పై వచనాల్లో చెప్పిన మాటలు అని అర్థం. కానీ క్రీస్తు చెప్పిన మాటలన్నిటికీ ఇది సరిపోతుంది. అయితే మాటలు ఆత్మ సంబంధమైనవిగా జీవం ఇచ్చేవిగా ఉండడం ఎలా? దేవుని ఆత్మ ఈ మాటలను ఆత్మ సంబంధమైన జీవాన్ని ఇచ్చేందుకు వాడుకుంటాడన్న మాట. క్రీస్తు మాటలను మనుషులు అర్థం చేసుకుని, నమ్మకం ఉంచి, ఆ ప్రకారం చేసి, జీవాన్ని పొందగలిగేలా దేవాత్మ చేస్తాడు. క్రీస్తు మాటల మూలంగా మనుషులు తమ అవసరతను గుర్తించేలా, క్రీస్తు చేసిన వాగ్దానాలపై ఆశపెట్టుకునేలా, తమ హృదయాలు తెరిచి ఆయన జీవాన్ని స్వీకరించేలా పవిత్రాత్మ చేస్తాడు.

**6:64** 2:24,25. యూదా ఇస్కరియోతును క్రీస్తు తన శిష్యుల్లో ఒకడుగా ఎన్నుకోకముందే అతడు తనను శత్రువులకు పట్టి ఇస్తాడని ఆయనకు తెలుసు (70,71). అలాగైతే అతణ్ణి ఎన్నుకోవడం ఎందుకు? బైబిలు లేఖనాలు, దేవుని ఉద్దేశాలు నెరవేరాలని. మత్తయి 26:24 చూడండి.

**6:65** యేసుప్రభువు గొప్ప అద్భుతం చేశాడు, అద్భుతమైన మాటలు చెప్పాడు. అయితే చాలామంది తమ అపనమ్మకంలోనే ఉండిపోయారు. ఇందుకు కారణాన్ని ప్రభువు ఇక్కడ మరో సారి చెప్తున్నాడు (వ 44). ఇది వ 37లో ఉన్న విషయాన్నే మరో రీతిలో చెప్పడం. తండ్రి క్రీస్తుకు ఇవ్వని వారంతా ఆయన దగ్గరికి రారు.

**6:66** వ 15లోని మనస్తత్వం నుంచి కొందరు ఎంత త్వరగా ఈ స్థితికి మారిపోతారో గదా! వారు కోరేది తాము అదుపు చేయగలిగిన యేసును, తమ ఉద్దేశాల ప్రకారం చేసే యేసును, తమకు ఏది మంచిదని వారనుకుంటారో దాన్ని వారికిచ్చే యేసును. ఉన్న యేసును వారు కోరలేదు. ఆయన చెప్పిన "కఠినమైన" మాటల్ని (వ 60) వారు అంగీకరించలేకపోయారు. యేసు వారి అపనమ్మకాన్ని బట్టబయలు చేశాడు కూడా. అందువల్ల ఎవరి దారిన వారు వెళ్ళిపోయారు. యేసును మనం సరియైన కారణాలవల్ల అనుసరించాలి. అలా కాకపోతే ఎప్పటికైనా మనం కూడా ఆయన్ను వదిలి వెళ్లిపోతాం.

**6:67** పన్నెండుమంది శిష్యులూ తనను వదిలి వెళ్ళరని యేసుకు తెలుసు. వారి మనసుల్లో ఏమున్నదో వారు నోరు తెరచి చెప్పాలని ఆయన ఉద్దేశం. ఇది వారికి పరీక్ష సమయం అనడంలో సందేహం లేదు.

**6:68** శిష్యులందరి తరుపునా ప్రతినిధిగా పేతురు మాట్లాడేవాడు (మత్తయి 16:15,16; 17:4; మొ॥). వారందరి మనసుల్లో (ఇస్కరియోతు యూదా తప్ప) ఉన్న సంగతిని ఇతడు ఇక్కడ వెల్లడిస్తున్నాడు. క్రీస్తును అనుసరించడంలో గల సరైన కారణం చెప్తున్నాడు. వారు క్రీస్తు మాటలను విశ్వసించారు. తాను ఏమిటని ఆయన చెప్పుకున్నాడో అదేనని వారికి నమ్మకం కుదిరింది. వారాయన్ను వదిలిపోలేరు. నిజమైన విశ్వాసికి క్రీస్తును విడిచి వెళ్ళిపోదగిన ఇతర ప్రదేశమేదీ లేదు, ఆశ్రయించదగిన వేరొక వ్యక్తి ఎవరూ లేరు.

**6:69** "అభిషిక్తుడు" – యేసు ఎవరో శిష్యులు చాలా వరకు

తెలుసుకొన్నాం.”

70 “పన్నెండుగురైన మిమ్ములను ఎన్నుకొన్నాను గదా. మీలో ఒకడు పిశాచం” అని యేసు వారికి బదులు చెప్పాడు. 71 ఆయన సీమోను కొడుకైన ఇస్కరియోతు యూదాను గురించి చెప్పాడు. ఎందుకంటే అతడు పన్నెండుగురిలో ఒకడై ఉండి, ఆయనను శత్రువులకు పట్టి ఇవ్వబోయేవాడు.

7 ఆ తరువాత యేసు గలలీలో సంచారం చేస్తూ ఉన్నాడు. యూదులు తనను చంపడానికి చూస్తూ ఉండడంచేత ఆయనకు యూదయలో సంచారం చేయడం ఇష్టం లేకపోయింది. 2 అయితే యూదుల పర్ణశాలల పండుగ దగ్గర పడ్డప్పుడు 3 ఆయన తమ్ముళ్ళు ఆయనతో ఇలా అన్నారు: “నువ్వు చేస్తూ ఉన్న పనులు నీ శిష్యులు చూచేట్టు ఇక్కడనుండి యూదయకు వెళ్ళిపో. 4 ఎవడైనా బహిరంగంగా ప్రసిద్ధికెక్కాలంటే రహస్యంగా పనులు జరిగించడు. నువ్వు ఈ పనులు చేస్తూ ఉంటే నిన్ను నువ్వు లోకానికి కనపరచుకో!” 5 ఎందుకంటే, ఆయన సొంత తమ్ముళ్ళు కూడా ఆయన మీద నమ్మకం ఉంచలేదు.

6 అందుచేత యేసు వారికిలా చెప్పాడు: “నా సమయం ఇంకా రాలేదు. మీ సమయం ఎప్పుడూ సిద్ధమే. 7 లోకం మిమ్ములను ద్వేషించడం అసాధ్యం. కానీ నేను దాని క్రియలు చెడ్డవని దానిని గురించి సాక్ష్యం చెపుతూ ఉన్నాను, గనుక దానికి నా మీద ద్వేషం ఉంది. 8 మీరు ఈ పండుగకు వెళ్ళండి. నా సమయం ఇంకా సంపూర్తి కాలేదు గనుక ఇప్పుడే ఈ పండుగకు వెళ్ళను.”

9 ఆయన వారికిలా చెప్పిన తరువాత గలలీలో ఉండిపోయాడు. 10 ఆయన తమ్ముళ్ళు పండుగకు వెళ్ళిన తరువాతే ఆయన కూడా వెళ్ళాడు – బహిరంగంగా కాదు గాని రహస్యంగా. 11 ఆ పండుగలో యూదులు “ఆయనెక్కడ ఉన్నాడు?” అని అడుగుతూ ఆయనను వెతుకుతూ ఉన్నారు. 12 ప్రజలలో ఆయనను గురించి చాలా సణుగుడు ఉంది. కొంతమంది “ఆయన మంచివాడు” అన్నారు, మరి కొందరు “కాదు. ప్రజల్ని మోసగించి తప్పుదారి పట్టిస్తూ ఉన్నాడు” అన్నారు. 13 అయితే యూదులకు భయపడి ఆయనను గురించి ఎవరూ బహిరంగంగా మాట్లాడలేదు.

14 పండుగ రోజుల మధ్య యేసు దేవాలయానికి వెళ్ళి ఉపదేశం చేయసాగాడు. 15 “విద్యాభ్యాసం లేని ఈ మనిషికి పాండిత్యం ఎక్కడిది?” అంటూ యూదులు చాలా

---

అర్థం చేసుకున్నట్టే – ఆయన ఏ కల్మషమూ లేని పాపరహితుడు, దేవుడు ప్రత్యేకించి ఈ లోకానికి పంపినవాడు, దేవునికి ప్రతినిధి, ఇస్రాయేల్‌వారి అభిషిక్తుడు.

**6:70,71** యూదా అక్షరాలా పిశాచం కాదు. కానీ తన జీవితంపై అతడు సైతానుకు ఎంతగా అధికారం ఇచ్చాడంటే పిశాచంలాగానే అతడు ప్రవర్తించసాగాడు. 12:4-6; 13:2,26,27 కూడా చూడండి.

**7:1** వ 32; 5:16,18; 8:37,40; 10:31. చావంటే యేసుప్రభువుకు భయం లేదు. అసలు ఆయన వచ్చినదే అందుకు (3:15; 10:17,18; 12:27; 18:11; మత్తయి 20:28). కానీ అందుకు తగిన సమయం ఇంకా రాలేదు (వ 30).

**7:2** లేవీ 23:33-43 నోట్స్. ఈ పండుగ జెరుసలంలో ఏటేటా జరిగేది.

**7:3-5** ఆయన అద్భుతాలు చేయగలడని వారికి తెలుసు. అయితే ఆయన దేవుని కుమారుడనీ అభిషిక్తుడనీ వారింకా నమ్మలేదు. కాబట్టి ఆయనకు తాము సలహాలు ఇవ్వగలం అని వ్యర్థంగా అనుకున్నారు. ఆయన యూదుల మత జీవనానికి కేంద్ర స్థానమైన యూదయలోని జెరుసలం వెళ్ళి, బహిరంగంగా యూదులపై నాయకత్వం వహించడానికి ప్రయత్నించాలన్నదే ఆ సలహా. ఆ సమయంలో వారు ఆయన ఉద్దేశాలనూ, పనినీ పూర్తిగా అపార్థం చేసుకున్నారు. తరువాతి కాలంలో వారిలో కనీసం ఇద్దరు యాకోబు, యూదా (మత్తయి 13:55) యథార్థంగా అయనను అనుసరించారు (అపో కా 1:14; యాకోబు 1:1; యూదా 1).

**7:6** పండుగకు వారు ఏ సమయంలో వెళ్ళినా ఫర్వాలేదు గాని తాను మాత్రం మరి కొంత కాలం ఆగడం మంచిదని యేసు మాటలకు అర్థం (వ 8).

**7:7** ఇక్కడ మొట్టమొదటి సారి యేసు ఈ లోకం (నమ్మకం లేని మనుషులు) తనను ద్వేషిస్తారని చెప్తున్నాడు (15:18,23,24 కూడా చూడండి. 3:20లో ఈ విషయాన్ని సూచించాడు). ఈ ద్వేషానికి కారణం కూడా ఇక్కడ చెప్తున్నాడు. మనుషులకు వారి క్రియలు చెడ్డవని చెప్తే ఇష్టం ఉండదు. వారి నిజ స్థితిని ఎవరన్నా బయటపెడితే వారికి కోపం. యేసుప్రభువు తమ్ముళ్ళను లోకం ద్వేషించదు, ఎందుకంటే అప్పటికి వారింకా లోకానికి చెందినవారే కాబట్టి దాన్ని వ్యతిరేకించరు.

యోహాను శుభవార్తలో “లోకం” అనే మాట 70 కంటే ఎక్కువ సార్లు కనిపిస్తుంది. బైబిలులో మరి ఏ పుస్తకంలోనూ ఇన్ని సార్లు కనిపించదు. లోకం నశించిన స్థితిలో ఉన్నదనీ (3:16), చీకటిలో ఉన్నదనీ (3:19), దేవుణ్ణి ద్వేషిస్తున్నదనీ (7:7; 15:18,23), సైతాను పరిపాలనలో ఉన్నదనీ (8:44; 12:31), దేవుని ఆత్మను స్వీకరించలేని స్థితిలో ఉన్నదనీ (14:17), పాపభరితంగా, అపనమ్మకంగా ఉన్నదనీ (16:8-11) దాని గురించి యేసు చెప్పాడు. యోహాను తన మొదటి లేఖలో రెండు వచనాల్లో లోకాన్ని వర్ణించాడు (1 యోహాను 2:16; 5:10). రోమ్ 12:2; యాకోబు 4:4; 1 యోహాను 2:16 నోట్స్ కూడా చూడండి.

**7:10** ఒక పనిని సరిగ్గా ఎప్పుడు చెయ్యాలో, ఎలా చెయ్యాలో యేసుకు చక్కగా తెలుసు.

**7:11** క్రీస్తు జెరుసలంకు వస్తాడని ఆయన శత్రువులు ఎదురు చూశారు. ఆయన కనిపించకపోవడం వారికి తికమక పెట్టింది.

**7:12** యేసును గురించి పరస్పరం పూర్తి విరుద్ధమైన రెండు అభిప్రాయలు ఇక్కడ కనిపిస్తున్నాయి. ఆయన మంచివాడైతే ప్రజలను మోసగించడు. అలా మోసగిస్తూ ఉంటే ఆయన మంచివాడు కాదన్నమాట. ఆయన మంచివాడై, ప్రజలను మోసగించకుండా ఉన్న పక్షంలో ఆయన ఉపదేశాలు సత్యమన్న మాట. ఆయన శత్రువులు ఆయన్ను మోసగాడన్నారు (మత్తయి 27:63). కానీ దానికి సాక్ష్యాధారాలూ రుజువులూ ఏవీ వారు చూపించలేకపోయారు. ఆయన మంచివాడనీ, మోసగాడు కాదనీ నిరూపించే ఆధారాలూ రుజువులూ ఎన్నో ఉన్నాయి (5:31-40 పోల్చి చూడండి).

**7:13** మరి కొందరు కూడా (క్రీస్తు శిష్యులు సైతం) కొన్ని సార్లు ఇదే భయాన్ని కనపరిచారు (9:22; 12:42; 19:38; 20:19). ఇలాంటి భయమే బానిసత్వం. సామెత 29:25 పోల్చి చూడండి.

**7:14** సరైన సమయం వచ్చినట్టు గ్రహించగానే ఆయన బహిరంగంగా వారికి ఉపదేశించసాగాడు.

**7:15** మత్తయి 7:28,29; లూకా 2:47. అంటే ఆయన

ఆశ్చర్యపడ్డారు.
16 యేసు వారికి జవాబిస్తూ ఇలా అన్నాడు: “నేను చేసే ఉపదేశం నాది కాదు గాని నన్ను పంపినవానిది. 17 దేవుని ఇష్టప్రకారం చేయడానికి ఎవరైనా ఇష్టపడితే ఈ ఉపదేశం ఆయనదో, లేక నా అంతట నేనే చెపుతున్నానో తెలుసుకొంటారు.
18 “తనంతట తానే మాట్లాడేవాడు సొంత గౌరవం చేకూరాలని చూస్తూ ఉంటాడు, గాని తనను పంపినవానికే గౌరవం చేకూరాలని చూచేవాడు సత్యవంతుడు. ఆయనలో అన్యాయం ఏమీ లేదు. 19 మోషే మీకు ధర్మశాస్త్రం ఇచ్చాడు గదా. అయినా మీలో ఎవరూ ధర్మశాస్త్రం ఆచరణలో పెట్టడం లేదు. మీరెందుకు నన్ను చంపడానికి చూస్తూ ఉన్నారు?”
20 “దయ్యం పట్టినవాడివి నీవు. నిన్ను చంపడానికి ఎవరు చూస్తున్నారు?” అని ఆ ప్రజలు జవాబిచ్చారు. 21 యేసు వారికి ఇలా బదులు చెప్పాడు: “నేను ఒక క్రియ చేసినందుకు మీరంతా ఆశ్చర్యపడతూ ఉన్నారు. 22 మోషే మీకు సున్నతి అనే సంస్కారం నియమించాడు. అది మోషే నుంచి వచ్చినది కాదు గాని పూర్వికుల ద్వారా కలిగినది. మీరు విశ్రాంతి దినాన ఒక మనిషికి సున్నతి జరిగిస్తారు. 23 మోషే ధర్మశాస్త్రం మీరకూడదని విశ్రాంతి దినాన ఒక మనిషి సున్నతి పొందితే విశ్రాంతి దినాన నేను ఒక మనిషిని పూర్తిగా బాగు చేసినందుకు మీరు నా మీద కోపపడుతున్నారేమిటి? 24 బయటికి కనిపించేదాన్ని బట్టి నిర్ణయానికి రాకండి. న్యాయ సమ్మతంగా నిర్ణయం చేసుకోండి.”
25 అప్పుడు జెరుసలం వారిలో కొందరు ఇలా చెప్పుకొన్నారు: “వాళ్ళు చంపాలని చూస్తున్నవాడు ఈయనే గదా! 26 ఇదుగో! ఆయన బహిరంగంగా మాట్లాడుతూ ఉన్నాడు గాని వాళ్ళు ఆయనను ఏమీ అనరు! ఈయన నిజంగా అభిషిక్తుడు అని అధికారులకు తెలిసిపోయిందా ఏమిటి? 27 కానీ ఈ మనిషి ఎక్కడివాడో మనకు తెలుసు. అభిషిక్తుడు

---

యూద మత పాఠశాలల్లో మతోపదేశకుల దగ్గర చదువుకోలేదని వారి భావం. వారు ఆయన్ను (ఆ దేవుని కుమారుణ్ణి, వాక్కును, విశ్వానికి సృష్టికర్తను) ఒక చదువు లేనివాడుగా భావించారు. ఎంత విచిత్రం! అపో కా 4:13 పోల్చి చూడండి.

**7:16** యేసు తన ఉపదేశాలను తానే కల్పించలేదు. అది ఇతర మనుషుల నుంచి రాలేదు. అది తండ్రి అయిన దేవుని నుంచే వచ్చింది. 12:49; 17:8 కూడా చూడండి. యేసు యథార్థవంతుడు కాబట్టి దీని విషయంలో ఆయన మాటలు నమ్మాలి. ఆయన ఉపదేశాలను సాక్షాత్తూ దేవుని వాక్కులుగా స్వీకరించాలి. ఈ శుభవార్తలో 40 సార్లు యేసు తాను తండ్రి అయిన దేవుని దగ్గరనుంచి ఈ లోకానికి వచ్చిన సంగతిని నొక్కి చెప్పాడు (3:16,17; 4:34; 5:24,37; 6:39,44,57; మొ॥).

**7:17** యేసు దేవుని సత్యాన్ని పలికాడో లేదో ఎవరైనా విచారించి చూడగల ఒక మార్గాన్ని ఆయన చూపుతున్నాడు. నిజమైన ఆధ్యాత్మిక జ్ఞానం కావాలంటే విశ్వాన్ని సృష్టించిన దేవుని సంకల్పం ప్రకారం చేయాలన్న హృదయ పూర్వకమైన నిర్ణయం చేసుకోవడం ఒక్కటే మార్గం. ఎవరైనా సరే, ఎక్కడైనా సరే అలా చేస్తే యేసు సాక్షాత్తూ దేవుని సత్యాన్ని నేర్పించాడని తప్పక తెలుసుకొంటారు. ఇన్ని వివిధ మతాలూ, శాఖలూ, వేదాంతాలూ ఈ ప్రపంచంలో ఉన్నాయి గదా సత్యమేమిటో తెలిసేదెలా అని కొన్ని సార్లు ప్రశ్న వస్తుంది. ఈ వచనంలో ఈ మార్గం వెల్లడి అయింది. మత్తయి 6:22 పోల్చి చూడండి.

మనుషులతో వచ్చిన సమస్య వారి బుద్ధికి సంబంధించిన అడ్డంకి కాదు గాని వారి సంకల్పం, ఉద్దేశాలకు సంబంధించిన అడ్డంకే. దేవుని సంకల్పం ప్రకారం చెయ్యడం వారికి ఇష్టం లేదు గనకనే వారు సత్యం తెలియకుండా ఉండిపోతారు (3:19,20). దేవుని సంకల్పం ఏదైనా సరే నిజంగా దాని ప్రకారం చెయ్యడానికి మనం సిద్ధమేనా? కాదు అని దీనికి జవాబైతే మనకు సత్యం తెలియకపోవడం ఆశ్చర్యమేమీ లేదు.

**7:18** యేసు ఇక్కడ రెండు వేరువేరు రకాల మతోపదేశకుల గురించి మాట్లాడుతున్నాడు. తమకే గౌరవ ప్రతిష్ఠలు కలగాలని చూచేవారు తమ ఉపదేశం సత్యమో కాదో దాని గురించి పట్టించుకోరు. మనుషులకు నచ్చి, తద్వారా వారు తమను గౌరవిస్తారనుకుంటే మనుషులు కల్పించిన సిద్ధాంతాలను నేర్పించేందుకు వారు సిద్ధమే. కానీ దేవునికే ఘనత కలగాలని చూచేవారికి ఆ సత్య దేవునికి సత్యమే ఘనత కలిగించగలదని తెలుసు (కీర్తన 31:5). మనుషులకు నచ్చినా నచ్చకపోయినా దేవుని సత్యాన్ని నేర్పించాలనే నిర్ణయం వారు తీసుకుంటారు (గలతీ 1:10). యేసుప్రభువుకు తాను ఈ రెండో కోవకు చెందిన ఉపదేశకుణ్ణని తెలుసు (8:49,50).

**7:19** తాము మోషే ధర్మశాస్త్రాన్ని పాటిస్తున్నామని ఈ యూదులకు గర్వం. అయితే వారిలో ఏ ఒక్కడు కూడా నిజంగా దాన్ని పాటించలేదు. యేసుప్రభువును చంపాలని కుట్ర పన్నడం ద్వారా వారు దాన్ని పాటించలేదని రుజువౌతున్నది. ఇది ధర్మశాస్త్రంలోని ముఖ్యమైన ఆజ్ఞల్లో ఒకదాన్ని మీరడం (నిర్గమ 20:13). తాను నేర్పిన సత్యాన్ని వారు అంగీకరించకపోవడానికి కారణం అతి ప్రాథమికమైన విషయాల్లో కూడా దేవుని సంకల్పం ప్రకారం చేయడం వారికి ఇష్టం లేకపోవడమేనని యేసు అంటున్నాడు.

**7:20** ఇక్కడ వీరు అబద్ధమాడుతున్నారు. తాము ఆయన్ను చంపడానికి చూస్తున్నామని వారికి బాగా తెలుసు (వ 32; 5:18). దేవుని కుమారునికి విరుద్ధంగా అతి హీనమైన దూషణ పాపాన్ని వారిక్కడ మూట గట్టుకొంటున్నారు (8:48; 10:20 కూడా చూడండి). మత్తయి 12:24,31,32 నోట్స్ చూడండి.

**7:21–23** 5:1–9లో రాసివున్న అద్భుతాన్ని గురించి ప్రభువు మాట్లాడుతున్నాడు. ఆయన విశ్రాంతి దినాన ఒక మనిషిని బాగు చేశాడని ఈ యూదులు ఆయనకు వ్యతిరేకంగా తీవ్రంగా ఫిర్యాదు చేశారు (5:10,16. మత్తయి 12:9–14 కూడా చూడండి). అయితే ఒక పిల్లవాడు పుట్టిన తరువాత అతనికి సున్నతి సంస్కారం జరిగించవలసిన దినం విశ్రాంతి దినాన వస్తే వారు విశ్రాంతి దినాన్నే దాన్ని జరిగించేవారు (ఆది 17:9–14; లేవీ 12:3 చూడండి). విశ్రాంతి దినాన గాయం చెయ్యడం ఫర్వాలేదు గాని బాగు చేస్తే వారికి కోపం!

**7:24** వారి నిర్ణయాలు చేసే సామర్థ్యంలో లోపాలున్నాయి కాబట్టి ఎవరికైనా శిక్ష విధించడానికి వారు ఉరకలు వేసేవారు.

**7:25–27** ఈ సామాన్య ప్రజలు యేసుప్రభువును గురించి ఎటూ తేల్చుకోలేక పోయేవారు. ఆయన ఉపదేశాలు వారి మీద ప్రభావితం చేశాయి. యూదుల అధికారులు ఆయన్ను చంపుదామన్న ఆలోచన మానుకుని ఇస్రాయేల్ అభిషిక్తునిగా ఆయన్ను స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నారేమోనని ప్రజలకు అనిపించింది. అయితే యేసు గలలీ నుంచి వచ్చాడు కాబట్టీ, అభిషిక్తుడు ఎక్కడనుంచి వస్తాడో ఎవరికీ తెలిసే అవకాశం లేదని వారు అనుకున్నారు కాబట్టీ వారే ఈ సంగతి నమ్మలేని పరిస్థితిలో ఉన్నారు. అయితే ఈ విషయంలో వారనుకునేది పొరపాటు (మీకా 5:2; మత్తయి 2:1–6).

వచ్చేటప్పుడు ఆయన ఎక్కడనుంచి వస్తాడో ఎవరికీ తెలీదు."

28 అందుచేత యేసు దేవాలయంలో ఉపదేశిస్తూ బిగ్గరగా ఇలా అన్నాడు : "నేను మీకు తెలుసు, నేనెక్కడినుంచి వచ్చానో అది కూడా మీకు తెలుసు. నా అంతట నేనే రాలేదు. నన్ను పంపినవాడు సత్యవంతుడు. ఆయనను మీరెరుగరు. 29 నేనైతే ఆయనను ఎరుగుదును. నేను వచ్చినది ఆయన దగ్గరనుంచే. నన్ను పంపినది ఆయనే."

30 అందుచేత వాళ్ళు ఆయనను పట్టుకోవడానికి చూశారు గానీ ఆయన సమయం ఇంకా రాకపోవడం వల్ల ఆయన ఎవరి చేతికీ చిక్కలేదు. 31 ప్రజలలో అనేకులు ఆయనమీద నమ్మకం ఉంచారు, "అభిషిక్తుడు వచ్చేటప్పుడు ఈయనకంటే ఎక్కువ సూచకమైన అద్భుతాలు చేస్తాడా?" అన్నారు. 32 ఆయనను గురించి ఈ విషయాలు ప్రజల గుంపు గుసగుసలాడడం పరిసయ్యులు విన్నారు గనుక ప్రధాన యాజులూ పరిసయ్యులూ ఆయనను పట్టుకోవడానికి భటులను పంపారు.

33 యేసు వారితో "ఇంకా కొద్ది కాలమే నేను మీతో ఉంటాను. తరువాత నన్ను పంపినవాని దగ్గరికి వెళ్ళిపోతాను. 34 మీరు నన్ను వెదుకుతారు గాని నన్ను కనుక్కోరు. నేనెక్కడ ఉంటానో మీరు అక్కడికి రాలేరు" అన్నాడు.

35 అందుకు యూదులు ఒకరితో ఒకరు ఇలా చెప్పుకొన్నారు: "మనం ఇతణ్ణి కనుక్కోకుండా ఎక్కడికి వెళ్ళిపోవాలని ఉద్దేశిస్తున్నాడు? గ్రీస్ దేశస్థుల మధ్య చెదరిపోయిన యూదుల దగ్గరికి వెళ్ళి గ్రీస్‌వారికి ఉపదేశం ఇవ్వాలనుకుంటున్నాడా ఏమిటి? 36 'మీరు నన్ను వెతుకుతారు గాని నన్ను కనుక్కోరు. నేనెక్కడ ఉంటానో మీరు అక్కడికి రాలేరు' అని అతడు చెప్పిన మాట ఏమిటి?"

37 ఆ పండుగలో చివరి రోజున – ఆ మహా దినాన యేసు నిలబడి బిగ్గరగా ఇలా చెప్పాడు: "ఎవరైనా దప్పిగొంటే నా దగ్గరకు వచ్చి దప్పి తీర్చుకోవాలి. 38 నా మీద నమ్మకం ఉంచే వ్యక్తి అంతరంగంలో నుంచి జీవ జల నదులు పారుతాయి. ఇది లేఖనాలు చెప్పిన ప్రకారమే."

39 ఆయనమీద నమ్మకం ఉంచుతున్నవారు పొందబోయే దేవుని ఆత్మను గురించి ఆయన ఆ మాట చెప్పాడు. అప్పటికి యేసు ఇంకా మహిమాస్థితి పొందలేదు గనుక పవిత్రాత్మను అనుగ్రహించడం ఇంకా జరుగలేదు.

40 ఆ మాటలు విని జనసమూహంలో అనేకులు "నిజంగా ఈయనే ఆ ప్రవక్త" అన్నారు. 41 మరి కొందరు "ఈయనే అభిషిక్తుడు" అన్నారు. మరి కొంతమంది "కానీ అభిషిక్తుడు గలలీలోనుంచి రాడు గదా! 42 అభిషిక్తుడు దావీదు సంతానంలో నుంచి వస్తాడనీ దావీదు ఉండిన బేత్‌లెహేం గ్రామం నుండి వస్తాడనీ లేఖనం చెప్పలేదా?" అన్నారు. 43 ఈ విధంగా ప్రజలలో ఆయనను గురించి విభేదం పుట్టింది.

---

**7:28,29** ఈ అవకాశాన్ని పురస్కరించుకుని తాను ఎక్కడనుంచి వచ్చాడో ఆ సత్యాన్ని వారికి చెప్తున్నాడు యేసు. ఆయన గలలీనుంచి లేదా నజరేతునుంచి వచ్చాడని వారు చెప్పి ఉంటారు. యేసు మరో సారి తాను దేవుని నుంచి వచ్చిన సంగతిని నొక్కి చెప్తున్నాడు. వారు దేవుణ్ణెరిగి ఉంటే దీన్ని గుర్తించగలిగేవారు. అయితే వారు దేవుణ్ణి ఎరిగినవారు కారు.

**7:30** యేసు మరణించేందుకు, మనుషుల పాపాలకోసం తనను తాను అర్పించుకునేందుకూ పరలోకంనుండి వచ్చాడు. అంతేగాక ఆయన అలా చెయ్యవలసిన ఘడియ కూడా నిర్ణయమైపోయింది. ఆ ఘడియ ఇంకా రాలేదు.

**7:31** "అద్భుతాలు" – 2:11. కొంతమంది కనిపిస్తున్న సాక్ష్యాధారాలూ రుజువుల కారణంగా యేసుప్రభువుపై నమ్మకం ఉంచారు.

**7:32** "పరిసయ్యులు" – మత్తయి 3:7.

**7:33** వ 16.

**7:34** వారి అవకాశం చెయ్యి దాటిపోతుంది. సామెత 1:24-28; హోషేయ 5:6,15; ఆమోసు 8:11,12 పోల్చి చూడండి. తాను పరలోకంలో ఉంటాననీ వారు అక్కడికి రాలేరనీ ఆయన మాటలకు అర్థం.

**7:35,36** ఎప్పటిలాగానే నమ్మకం లేనివారికి ఆయన మాటలు అర్థం కాలేదు. ఇహలోక సంబంధమైన విషయాల గురించి ఆలోచించడం మాత్రమే వారికి చేతనైంది.

**7:37,38** 4:10,13,14 పోల్చి చూడండి. ఈ అద్భుతమైన వాగ్దానం అందరికోసం. యేసు బిగ్గరగా దృఢంగా ఖచ్చితంగా ఈ మాటలు చెప్పాడు. వ 37ను వ 38తో పోల్చి చూస్తే "దప్పి తీర్చుకోవడం" అంటే క్రీస్తులో నమ్మకం ఉంచడమని అర్థం అవుతుంది (ఇది 6:53-56 విషయంలో కూడా నిజమని గ్రహించండి).

"లేఖనాలు" – యెషయా 44:3; 55:1,2; 58:11 లో ఈ సత్యం సూచించబడింది. అపొ కా గ్రంథంలో యేసు క్రీస్తు రాయబారులనుంచి సేవకులనుంచి ఈ జీవజల ప్రవాహాలు రావడం కనిపిస్తున్నది. క్రీస్తు సంఘ చరిత్రలో ఈ ప్రవాహాల గురించి మనం చదవవచ్చు. మనం క్రీస్తు దగ్గరికి వెళ్ళి దప్పితీర్చుకుంటే ఈ ప్రవాహాలు మనలోనుంచి కూడా పారడం అనుభవించనారంభిస్తాం. లూకా 11:13; అపొ కా 5:32; ఎఫెసు 5:18 చూడండి.

**7:39** 14:16,17 మొదలైన చోట్ల పవిత్రాత్మను గురించి నోట్స్. ఇది ఆయన పట్ల నమ్మకం గల హృదయాలనుంచి ప్రవహించే ఆధ్యాత్మిక జీవం. పాత ఒడంబడిక కాలంలోను, క్రీస్తు ఈ లోకంలో ఉన్నప్పుడూ పవిత్రాత్మ చురుకుగా పని చేస్తూనే వచ్చాడు (ఆది 1:2; నిర్గమ 31:3; సంఖ్యా 11:25; 24:2; న్యాయాధి 3:10; 6:34; 11:29; 1 సమూ 16:12; 2 సమూ 23:2). క్రీస్తు మరణం, పునర్జీవితం, ఆరోహణం తరువాత తండ్రి, కుమారుడు కలిసి ఆయన్ను ఆయన సంపూర్ణతతో ఈ లోకానికి పంపించారు (14:16,17,26; అపొ కా 1:4,5; 2:1-4). క్రీస్తు పరలోకానికి వెళ్ళిపోయిన తరువాత ఉన్న ఈ యుగానికి మనం "పవిత్రాత్మ యుగం" అని పేరు పెట్టవచ్చు.

"మహిమాస్థితి" – మహిమ అని తర్జుమా చేసిన గ్రీకు పదం ఈ శుభవార్తలో 23 సార్లు ఉంది. క్రొత్త ఒడంబడిక గ్రంథంలోని మరి ఏ పుస్తకంలోనూ ఇన్ని సార్లు కనిపించదు. అన్ని చోట్లా ఇది యేసుప్రభువుకు, తండ్రి అయిన దేవునికి మాత్రమే వర్తిస్తున్నది. యేసు తన మరణం, పునర్జీవితం జరిగిన తరువాతే పవిత్రాత్మను పంపాడు. కల్వరిలో జరిగిన కార్యం లేకపోతే పెంతెకొస్తు సంఘటన ఉండేది కాదు. దేవుని ఆత్మయొక్క జీవప్రదమైన ప్రవాహాలు పారగలిగేది సిలువ మూలంగానే.

**7:40** ద్వితీ 18:15-18.

**7:41** "అభిషిక్తుడు" – మత్తయి 1:1.

**7:42** వారు అన్నది నిజమే (మీకా 5:2). కానీ యేసు ప్రభువు జన్మించినది అక్కడ అన్న విషయం వారికి తెలియదు (మత్తయి 2:1; లూకా 2:4-7).

**7:43** ఎక్కడ చూచినా ఇప్పటికీ యేసుప్రభువు మనుషుల

44 వారిలో కొందరు ఆయనను పట్టుకోవాలని కోరారు గాని ఆయన ఎవరి చేతికీ చిక్కలేదు.

45 ఆ భటులు ప్రధాన యాజుల దగ్గరకీ పరిసయ్యుల దగ్గరకీ వచ్చినప్పుడు వీరు "అతణ్ణి మీరెందుకు తీసుకురాలేదు?" అని వారిని అడిగారు. 46 భటులు "ఈ మనిషి మాట్లాడే విధంగా ఏ మనిషీ ఎన్నడూ మాట్లాడలేదు" అని జవాబిచ్చారు.

47 అందుకు పరిసయ్యులు వారికి ఇలా బదులు చెప్పారు: "మీరు కూడా మోసపోయారా ఏమిటి? 48 అధికారులలో గానీ పరిసయ్యులలో గానీ ఎవరూ అతణ్ణి నమ్మలేదు గదా. 49 అయితే ధర్మశాస్త్రం తెలియని ఈ మూకమీద శాపం ఉందన్నమాట!"

50 రాత్రివేళ ఆయన దగ్గరకు వచ్చిన నీకొదేము వారిలో ఒకడు. అతడు వారితో 51 "ఒక మనిషి ప్రతివాదం విని ఆయన చేసేది ఏమిటో తెలుసుకోకముందే మన ధర్మశాస్త్రం ఆయనకు తీర్పు తీర్చదు గదా!" అన్నాడు.

52 వారు "నువ్వు కూడా గలలీవాడివా? లేఖనాలను విచారించి చూడు – గలలీలో ప్రవక్త ఎవ్వడూ బయలు దేరలేదు" అని అతనికి బదులు చెప్పారు. 53 అప్పుడు ఎవరి ఇంటికి వారు వెళ్ళారు.

8 అయితే యేసు ఆలివ్‌కొండకు వెళ్ళాడు. 2 ప్రొద్దున
పెందలకడ ఆయన దేవాలయంలోకి తిరిగి వచ్చాడు.
ఆయన దగ్గరికి ప్రజలంతా వస్తూ ఉన్నారు. ఆయన కూర్చుని
వారికి ఉపదేశిస్తూ ఉన్నాడు. 3 అప్పుడు ధర్మశాస్త్ర పండితులూ
పరిసయ్యులూ ఒక స్త్రీని తీసుకువచ్చారు. ఆమె వ్యభిచార
క్రియలో పట్టుబడింది. వారు ఆమెను మధ్యలో నిలబెట్టి
4 ఆయనతో ఇలా అన్నారు: "ఉపదేశకా! ఈ స్త్రీని వ్యభిచార
క్రియలో ఉండగానే పట్టుబడింది. 5 ధర్మశాస్త్రంలో మోషే
ఇలాంటి స్త్రీలను రాళ్ళు రువ్వి చంపాలని మనకాజ్ఞ ఇచ్చాడు.
అయితే మీరేమంటారు?"

6 ఆయనమీద నేరం మోపడానికి కారణం కనుక్కోవాలని
ఆయనను పరీక్షిస్తూ అలా అడిగారు. అయితే యేసు తాను
ఆలకించనట్టు వంగి వ్రేలితో నేలమీద ఏదో వ్రాశాడు. 7 వారు
పట్టు విడువకుండా ఆయనను అడుగుతూ వచ్చారు గనుక
ఆయన లేచి "మీలో ఏ అపరాధం లేనివాడు మొట్టమొదట
ఆమెమీద రాయి వేయవచ్చు" అన్నాడు. 8 అప్పుడాయన మళ్ళీ
వంగి నేలమీద వ్రాశాడు.

9 ఆ మాటలు విన్నవారు తమ అంతర్వాణి మందలింపుకు
గురి అయి – మొదట పెద్దలు నుండి చివరివాడి వరకు –
ఒకరి తరువాత ఒకరు బయటికి వెళ్ళారు. చివరికి మధ్య

---

మధ్య విభేదాలకు కారణం. ఆయనపై నమ్మకం పెట్టుకున్నవారు అలా నమ్మనివారికి వేరైపోతారు. మత్తయి 10:34–36 పోల్చి చూడండి.

**7:45,46** వ 32లో ఈ భటులను పంపడం ఉంది. వారు క్రీస్తు ఉపదేశంలోని ప్రభావానికి తబ్బిబ్బైపోయారు గనక పరిసయ్యుల ఆదేశాల ప్రకారం చేయలేకపోయారు. మత్తయి 7:28,29 పోల్చి చూడండి.

**7:47** వ 12.

**7:48** తమ అపనమ్మకమే యేసు మోసగాడనేందుకు రుజువు అని ఈ బండబారిపోయిన అపనమ్మకస్థులు నమ్మారు! ఆయన మాటలపై తమ ఆమోద ముద్ర లేదు గనక యేసు సత్యం చెప్పడం లేదు అని వారి ఉద్దేశం!

**7:49** మోషే ధర్మశాస్త్రంతో సరిగా పరిచయం లేనివారే యేసును నమ్మగలరని వారనుకున్నారు! ఆ ధర్మశాస్త్రం, మొత్తం పాత ఒడంబడిక గ్రంథమంతా యేసువైపుకు చూపిస్తున్నదని వారికి తెలియదు (5:39,46; 1:45; లూకా 24:27,45,46). అసలు ఆ మాటకొస్తే మోషేకు ధర్మశాస్త్రాన్ని ఇచ్చినదీ, పాత ఒడంబడిక గ్రంథం మొత్తాన్నీ వ్రాయించినదీ ఆయనే. అసలు తెలియని మూకంటే ఆ పరిసయ్యులే.

**7:50** ఏ పరిసయ్యుడు గానీ యూద నాయకుడు గానీ యేసుపై నమ్మకం ఉంచలేదనుకున్నారు వారు. ఇందులో కూడా వారిది పొరపాటే. అలా నమ్మిన ఒక వ్యక్తి వారి మధ్యలోనే ఉన్నాడు. 19:39–42 చూడండి (12:42 కూడా చూడండి). నీకొదేము ధైర్యంగా బయటికి సాక్ష్యం చెప్పకపోయినందువల్ల ఇతర పరిసయ్యులకు ఇది తెలియదు.

**7:51** ఇది బుద్ధికి అనుగుణమైన ప్రశ్నే. ధర్మశాస్త్రానికి అనుగుణమే. నీకొదేము ధైర్యంగా నిలబడకపోయినప్పటికీ మొత్తానికి వారికి వ్యతిరేకంగా నిలబడగలిగాడు, ఒంటరిగా నిలబడేందుకు సిద్ధంగా ఉన్నాడు. అయితే ఇది ఆ గర్విష్ఠులైన అపనమ్మకస్థుల అజ్ఞాన పూరితమైన తిరస్కారాన్నే రేకెత్తించగలిగింది.

**7:53** అప్పటికీ యేసును ఏమీ చెయ్యలేమని గ్రహించి వారంతా వెళ్ళిపోయారు.

**8:1–11** ఈ వచనాలు గ్రీకు మూల ప్రతుల్లో లేవని కొందరు పండితులు అభిప్రాయం. ఇవి గ్రీకు మూలంలో ఉన్న వచనాలేనని ఈ నోట్స్ రచయిత నమ్ముతున్నాడు.

**8:3** "పరిసయ్యులు" – మత్తయి 3:7. ఈ స్త్రీ వాళ్ళకెలా దొరికిందో రాసిలేదు. యేసుమీద నేరం మోపే కారణం వెదకాలని (వ 6) వారు కావాలనే ఆమెను కపటోపాయం చేత చిక్కించుకుని ఉండవచ్చు.

**8:4** వారాయన్ను "ఉపదేశకా" అని పిలుస్తున్నారు గాని ఆయన ఉపదేశించిన వాటిల్లో దేన్నీ అంగీకరించలేదు. లూకా 6:46 పోల్చి చూడండి.

**8:5** ధర్మశాస్త్రం ఇలా చెప్పిన సంగతి నిజమే గాని మగవాణ్ణి కూడా చంపాలని కూడా చెప్పింది (ద్వితీ 22:22–24; లేవీ 20:10). దోషి అయిన ఆ మగవాణ్ణి వారు తీసుకు రాకపోవడంలో ఏదో మోసం ఉంది. బహుశా వాడు వాళ్ళ మనిషే కావచ్చు. ధర్మశాస్త్రం విధిస్తున్న శిక్షనుంచి యేసు ఆమెను రక్షించడానికి ప్రయత్నిస్తాడని బహుశా వారు గట్టిగా నమ్మి ఉండవచ్చు. ఆయన గనక అలా చేస్తే అది ఆయన్ను ధర్మశాస్త్రానికి విరోధంగా నిలబెడుతుంది గదా అని వారి దురాలోచన.

**8:6** ఆయన్ను అలా బుట్టలో వేయజూసినది ఇదొక్క సారే కాదు. మత్తయి 22:15 చూడండి. యేసు రాస్తూ ఉన్నదేమిటో ఎందుకు రాశాడో ఊహాగానాలు అనవసరం. ఇది ఎవరికీ తెలియదు. ఆధ్యాత్మికమైన మేలు కలిగించే స్పష్టమైన విషయాలు బైబిల్లో కోకొల్లలు. వాటిని ప్రధానంగా నేర్చుకుందాం.

**8:7** ఈ ఆశ్చర్యకరమైన జవాబు పరిస్థితిని పూర్తిగా మార్చేసింది. ఆ స్త్రీకీ, యేసుకూ విరోధంగా గుమిగూడినవారు ఓడిపోయి యుద్ధరంగం వదిలి జారుకోవలసి వచ్చింది. వారాయన కోసం గొయ్యి తవ్వారు గానీ వారే దాన్లో పడ్డారు. కీర్తన 7:14,15; 57:6; సామెత 26:27.

**8:9** పరిసయ్యుల్లో అనేకమంది స్వనీతిపరులూ, ఇతరులకన్న తామే మంచివారమని భావించే వారైనప్పటికీ (లూకా

నిలబడి ఉన్న ఆ స్త్రీతో మిగిలినది యేసు ఒక్కడే.
10 యేసు లేచి ఆ స్త్రీ తప్ప మరెవరినీ చూడకుండా
“అమ్మా, నీ మీద నేరం మోపినవారు ఎక్కడ? ఎవరూ నీకు శిక్ష
విధించలేదా?” అని అడిగాడు. 11 ఆమె “లేదు ప్రభూ” అంది.
యేసు “నేనూ నీకు శిక్ష విధించను. నీవు వెళ్ళి అపరాధం
చేయకుండా ఉండు” అన్నాడు.
12 తరువాత యేసు మళ్ళీ వారితో ఇలా అన్నాడు: “నేను
లోకానికి వెలుగును. నన్ను అనుసరిస్తూ ఉన్నవారు చీకటిలో
నడవరు గాని వారికి జీవ కాంతి ఉంటుంది.”
13 అందుచేత పరిసయ్యులు “నీ విషయం నీవే సాక్ష్యం
చెప్పుకొంటూ ఉన్నావు. నీ సాక్ష్యం నిజం కాదు” అని
ఆయనతో అన్నారు.
14 యేసు వారికిలా జవాబు చెప్పాడు: “నా విషయం నేను
సాక్ష్యం చెప్పుకొన్నా నా సాక్ష్యం నిజమే. ఎందుకంటే, నేను
వచ్చినది ఎక్కడనుంచో, వెళ్ళేది ఎక్కడికో నాకు తెలుసు.
అయితే నేను ఎక్కడనుంచి వచ్చానో, ఎక్కడికి వెళ్ళిపోతానో
మీకు తెలియదు. 15 మీరు శరీర సంబంధంగా తీర్పు
తీరుస్తారు. నేనెవరికీ తీర్పు తీర్చడం లేదు. 16 ఒక వేళ నేను
తీర్పు తీర్చినా నా తీర్పు నిజమైనది. ఎందుకంటే అందులో
నేను ఒంటరిగా లేను. నేనూ నన్ను పంపిన తండ్రీ ఉన్నాం.
17 ఇద్దరు మనుషుల సాక్ష్యం నమ్మతగినదని మీ ధర్మశాస్త్రంలో
కూడా వ్రాసి ఉంది. 18 నా విషయం నేను సాక్ష్యం
చెపుతున్నాను, నన్ను పంపిన తండ్రి కూడా నా విషయం
సాక్ష్యం చెపుతున్నాడు.”
19 అందుకు వారు “నీ తండ్రి ఎక్కడున్నాడు?” అని
ఆయననడిగారు.

---

18:9-12), వారిలో ఒక్కడు కూడా తాను పాపం లేని వాణ్ణి ధైర్యంగా చెప్పగలవాడు లేడు. పాత ఒడంబడిక గ్రంథం వారికి తెలుసు (ఆది 8:21; కీర్తన 51:5; యిర్మీయా 17:9). అనేక సార్లు వారు తమ అంతర్వాణిని అణచివేసుకున్నప్పటికీ వారిలోని ఆ స్వరం పూర్తిగా చచ్చిపోలేదు, మౌనం దాల్చలేదు.

**8:10** ఆమెపై నేరం మోపినవారంతా వెళ్ళిపోయారు. ఆమెకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పే వారెవరూ ఇక లేరు. అందువల్ల ధర్మశాస్త్రాన్ని బట్టి చూచినా ఆమెను వెళ్ళిపోనివ్వడమే న్యాయం. ద్వితీ 17:6,7; 19:15 చూడండి.

**8:11** 3:17 చూడండి. యేసు పాపులను నేరస్థులుగా తీర్చి వారికి శిక్ష విధించేందుకు గనక వచ్చివుంటే అందరూ – అంటే ఈ స్త్రీ, పరిసయ్యులు, మొత్తం ప్రజలంతా, ఆయన శిష్యులు కూడా నేరస్థులుగా తీర్చబడి శిక్షకు గురై ఉండేవారే. ఎందుకంటే అందరూ పాపులే (రోమ్ 3:9,19,23; మత్తయి 7:11). కానీ యేసు దారి తప్పిన వారిని వెతికి పాపవిముక్తుల్ని చేసి రక్షించేందుకు వచ్చాడు గానీ నేరం మోపి శిక్షించాలని కాదు (లూకా 19:10). అంటే పాపం చేసినా ఫర్వాలేదని యేసు అంటున్నట్టా? ఎంతమాత్రం కాదు. పాపం బహు భయానకమైనదని ఆయనకు తెలుసు. పాపాన్ని తీసివేసే బలి అర్పణగా బాధలు అనుభవించి చనిపోవడానికే ఆయన వచ్చాడు (1:29; 3:14; 6:53-58; 10:11). ఈ స్త్రీతో ఆయన ఏమంటున్నాడో చూడండి – “ఇకనుంచి అపరాధం చేయకుండా ఉండు”. 5:14; మత్తయి 4:17; లూకా 13:2,3 కూడా చూడండి. పాపం చేసినా ఫర్వాలేదని దీని అర్థంలా అనిపిస్తున్నదా? యేసుప్రభువు మన పాపాలను క్షమించాడంటే మనం అలాగే పాపాలు చేస్తూ ఉండవచ్చని కాదు, పాపం చెయ్యడం మానుకోవాలనే. మత్తయి 1:21; కీర్తన 130:4; రోమ్ 6:14; 1 యోహాను 2:1.

**8:12** “వెలుగును” – 1:4; 3:19,20; 12:35,36; మత్తయి 4:16; లూకా 1:79; 2 కొరింతు 4:6; 1 యోహాను 1:5; 2:8. దేవుడు ఈ లోకమంతటికీ ఇచ్చిన వెలుగు యేసుప్రభువు. ఈ భూమికి సూర్యగోళం ఎలానో, మానవాళికి యేసు అలా. ఆయన జీవితం, చర్యలు, ఆయన వాక్కులు దేవుణ్ణి గురించీ, మనిషి పాపవిముక్తి గురించీ దేవుడు ఏం చేస్తాడో, మనిషి ఏం చెయ్యాలో దాన్ని గురించీ సత్యాన్ని వెల్లడి చేస్తున్నాయి. ఈ వెలుగు వాస్తవమైనవాటికీ, వాస్తవం కానివాటికీ, సత్యానికీ అసత్యానికీ ఉన్న తేడాను స్పష్టం చేస్తున్నది. అది పరలోకానికి మార్గం చూపుతుంది.

అయితే క్రీస్తును అనుసరించేవారికే ఈ వెలుగు పనికి వస్తుంది. అనుసరించడమంటే నమ్మిక ఉంచి విధేయత చూపడం. మనం ఆయన్నుండి వెనక్కు తగ్గితే జీవితంలోని అతి ప్రాముఖ్యమైన విషయాల గురించి తెలియక చీకట్లోనూ అజ్ఞానంలోనూ ఉండిపోతాం. యేసును అనుసరించేవారు ఇప్పుడు వెలుగులో ఉన్నారు. వేరే పరిస్థితుల్లో చూడలేని అనేక సత్యాలను వారు చూడగలుగుతారు. తాము ఎక్కడికి వెళ్తున్నదీ వారికి తెలుస్తుంది. అవిశ్వాసులు ఇప్పుడు చీకట్లో ఉన్నారు (అందువల్ల వారు చేయగలిగినదల్లా వెలుగును నిరాకరించి, ఆత్మ సంబంధమైన విషయాల గురించి ఊహాగానాలు చెయ్యడమే). వారు శాశ్వత అంధకారంలోకి వెళ్ళిపోతారు (మత్తయి 8:12; 22:13; 2 పేతురు 2:17; యూదా 13).

“జీవ కాంతి” అనే మాటకు బహుశా జీవం అయిన కాంతి (లేక సజీవమైన వెలుగు), లేదా జీవాన్నిచ్చే కాంతి, లేదా జీవంనుండి ప్రసరించే కాంతి, లేక పై అర్థాలన్నీ కూడా కావచ్చు. ఇక్కడ అతి ప్రాముఖ్యమైన ప్రశ్న ఉంది. క్రీస్తు ఇచ్చే కాంతిని నిజంగా మనం కోరుతున్నామా, లేక మన చీకటితో తృప్తిపడి ఊరుకుంటున్నామా?

**8:13** వీరు యేసు మాటల్ని తిప్పి ఆయనమీదే ప్రయోగించాలని చూస్తున్నారా (5:31)? కాంతిని గురించి వారేమీ నోరు విప్పడం లేదన్న సంగతి గమనించండి. వారి చీకటి వారికి చాలు. విరోధ భావంతో, అపనమ్మకంతో వారు యేసును ఆయనే వెలుగు అనేందుకు రుజువు అడుగుతున్నారు. నిజానికి సహజంగా చూస్తే వెలుగు తానున్నానని ఎలాంటి రుజువులూ చూపనక్కర్లేదు. అది వెలుగుతూ ఉంటే చాలు. వెలుగుతూ ఉండడమే కాంతికి రుజువు. వెలుగనేది లేదని చీకటి అనవచ్చు. అయితే అలా అనడం వెలుగు లేదనడానికి రుజువు కాదు, చీకటి ఉందని మాత్రమే అనడానికి అది రుజువు.

**8:14-18** 5:31లో తాను గాక వేరే సాక్షులెవరూ లేకుండా తనగురించి తానే సాక్ష్యం చెప్పుకుంటే అది చాలదని యేసుప్రభువు చెప్పాడు. అలాంటి సాక్ష్యాన్ని ఏ కోర్టూ అంగీకరించదు. ఇక్కడ ఆయన రెండు విషయాలను బట్టి తన సాక్ష్యం సత్యం అంటున్నాడు. తానెక్కడనుంచి వచ్చినదీ ఎక్కడికి వెళ్తున్నదీ తనకు తెలుసు. తండ్రి అయిన దేవుడు ఆయనకు సాక్షి. 5:36,37 కూడా చూడండి.

**8:15,16** 7:24; 3:17.

**8:17** ద్వితీ 19:15. ధర్మశాస్త్రం ప్రకారం ఇద్దరు వ్యక్తుల సాక్ష్యం అంగీకారమే. తండ్రి అయిన దేవుడు, ఆయన కుమారుడు ఇచ్చిన సాక్ష్యాన్ని మనం అంగీకరించవద్దా?

**8:19** 10:30; 14:9 పోల్చి చూడండి. దేవుని కుమారుడు, తండ్రి అయిన దేవుడు స్వభావంలోనూ గుణశీలాల్లోనూ మనస్సు, ఉద్దేశాల్లోనూ ఎంత ఐక్యంగా ఉన్నారంటే ఒకర్ని ఎరిగితే

యేసు "మీరు నన్ను ఎరుగరు, నా తండ్రిని కూడా ఎరుగరు. ఒకవేళ నన్ను ఎరిగి ఉంటే నా తండ్రిని కూడా ఎరిగి ఉండేవారు" అని జవాబిచ్చాడు.

20 దేవాలయంలో కానుకలు ఉంచే స్థలంలో ఆయన ఉపదేశం చేస్తూ ఆ మాటలు చెప్పాడు. అయితే ఆయన గడియ ఇంకా రాకపోవడం చేత ఆయనను ఎవరూ పట్టుకోలేదు. 21 గనుక ఆయన మళ్ళీ వారితో ఇలా అన్నాడు: "నేను వెళ్ళిపోతాను, మీరు నన్ను వెతుకుతారు గాని మీ పాపాలలోనే చనిపోతారు. నేను వెళ్ళే స్థలానికి మీరు రాలేరు."

22 అందుకు యూదులు "ఇతడు ఆత్మహత్య చేసుకుంటాడా ఏమిటి? 'నేను వెళ్ళే స్థలానికి మీరు రాలేరు' అని ఇతడు చెప్పడం అందుకేనా?" అని చెప్పుకొన్నారు.

23 ఆయన "మీరు క్రిందివారు, నేను పైనుంచి వచ్చినవాణ్ణి. మీరు ఈ లోకానికి చెందినవారు, నేను ఈ లోకానికి చెందేవాణ్ణి కాను. 24 అందుచేత మీరు మీ పాపాలలో చనిపోతారని చెప్పాను. నేను 'ఉన్నవాడను' అని నమ్మకపోయారా, మీరు మీ పాపాలలోనే చనిపోతారు" అని వారితో అన్నాడు.

25 అందుకు వారు "నీవెవరివి?" అని ఆయనననడిగారు. యేసు వారితో అన్నాడు "మొదటినుంచి నేనెవరినని చెపుతున్నానో ఆయననే నేను. 26 మీ విషయం చెప్పడానికీ విమర్శించడానికీ ఇంకా అనేక సంగతులున్నాయి. నన్ను పంపినవాడు సత్యవంతుడు. ఆయన చెప్పగా నేను విన్న సంగతులే లోకానికి చెపుతూ ఉన్నాను."

27 దేవుడైన తండ్రిని గురించి ఆయన తమతో చెపుతున్నాడని వారు గ్రహించలేదు.

28 కనుక యేసు వారితో "మీరు మానవపుత్రుణ్ణి పైకెత్తేటప్పుడు నేను 'ఉన్నవాడను' అని మీరు గ్రహిస్తారు. నా అంతట నేనే ఏమీ చేయడం లేదనీ తండ్రి నాకు నేర్పిన విషయాలే చెపుతున్నాననీ కూడా గ్రహిస్తారు. 29 నన్ను పంపినవాడు నాతో ఉన్నాడు. ఆయనకు ఇష్టమైనవే నేనెప్పుడూ చేస్తూ ఉన్నాను గనుక ఆయన నన్ను ఒంటరిగా విడవలేదు" అన్నాడు.

30 ఈ మాటలు చెపుతూ ఉండగానే ఆయనమీద చాలామంది నమ్మకం ఉంచారు.

31 అందుచేత, తనను నమ్మిన యూదులతో యేసు ఇలా

---

మరొకర్ని ఎరిగినట్టే. 1:18; హీబ్రూ 1:3 కూడా చూడండి. క్రీస్తు దేవత్వం గురించి ఫిలిప్పీ 2:6; లూకా 2:11 నోట్స్‌లో రిఫరెన్సులు చూడండి. ఈ పరిసయ్యులకు క్రీస్తు తెలియదు. వారయన్ను చూశారు. ఆయన మాట్లాడినప్పుడు విన్నారు. అయితే వారి దురభిమానం, అపనమ్మకం ఆయన నిజంగా ఎవరో అర్థం చేసుకోనియ్యకుండా చేశాయి.

**8:20** 7: 30.

**8:21** 7:33,34. ఇక్కడ యేసు "మీ పాపాలలోనే చనిపోతారు" అనే భయంకరమైన మాటను కలుపుతున్నాడు. పాపంలో చనిపోవడం అంటే శాశ్వతంగా నశించిపోవడమే గనక ఇవి భయానకమైన మాటలు. చావు తరువాత పాపవిముక్తి పొందే అవకాశాలు ఉన్నాయని బైబిలు చెప్పడం లేదు. మనుషులు ఈ భూమిపై తిరిగి తిరిగి జన్మిస్తూ ఉండరు. 9:3; హీబ్రూ 9:27; లూకా 16:19–31 చూడండి.

**8:22** 7:35,36. యేసు ఆత్మహత్య చేసుకుంటాడని వీరు నిజంగా అనుకోగలిగారా? ఆయన్ను గురించీ ఆయన తండ్రిని గురించీ వారెంత అజ్ఞానంలో ఉన్నారో ఇది తెలియజేస్తున్నది ( వ 19).

**8:23** ఇక్కడ యేసుప్రభువు తనకూ, ఇతరులందరికీ మధ్య ఉన్న తేడా చెప్తున్నాడు. మనం ఈ లోకానికి చెందినవారం. ఆయన పరలోకం నుంచి వచ్చినవాడు (3:13; 6:33,38,50,51). 1 కొరింతు 15:45–47 కూడా చూడండి.

**8:24** పాపాల్లోనే చనిపోయి నశించిపోకుండా తప్పించు కొనేందుకు ఏకైక మార్గం యేసులో నమ్మకం పెట్టడమేనని ఆయన స్పష్టంగా చెప్తున్నాడు. 3:36 పోల్చి చూడండి.

"నేను ఉన్నవాడను" – ఇది పాత ఒడంబడిక గ్రంథంలో దేవుడు తానే మాట్లాడిన రీతి – నిర్గమ 3:14; యెషయా 43:10. పాత ఒడంబడికలో యెహోవాగా వెల్లడి అయిన దేవుణ్ణి తానే అని యేసు ఇక్కడ చెప్పుకుంటున్నట్టు స్పష్టంగా తెలుస్తున్నది. వ 58లో ఇది మరీ స్పష్టంగా ఉంది. మనుషులు దీన్ని నమ్మకపోతే వారు తమ పాపాల్లోనే చనిపోతారని చెప్తున్నాడు. యేసు యెహోవా అవతారమని తెలియజేసే ఇతర రిఫరెన్సులు లూకా 2:11 నోట్‌లో ఉన్నాయి.

**8:25** దేవుడు తన తండ్రి అని యేసుప్రభువు పదేపదే చెప్పాడు (2:16; 3:16,18; 5:19–23,26; 6:40). అంటే తాను దేవుణ్ణని ఆయన చెప్పుకుంటున్నట్టు వారు అర్థం చేసుకున్నారు. వారి ఆలోచన సరిగానే ఉంది. కుమారునికి తండ్రి స్వభావమే ఉంటుంది గదా.

**8:26** ఆయన లోకానికి తీర్పు తీర్చేందుకు రాలేదు, అంటే దానిపై అంతిమ తీర్పు వినిపించి శిక్షించేందుకు రాలేదన్నమాట (3:17). కానీ ఇతరుల ప్రవర్తనను ఆయన గమనించాడు. వారి గురించిన సత్యం మాట్లాడ్డానికి ఆయనకు అధికారం ఉంది.

**8:27** మళ్ళీ ఇక్కడ అపనమ్మకంలోని గుడ్డితనం కనిపిస్తున్నది.

**8:28** "మానవపుత్రుడు" – మత్తయి 8:20.

"పైకెత్తేటప్పుడు" – సిలువను గురించి ఆయన మాట్లాడుతున్నాడు (3:14), కానీ పైకెత్తడం అని అనువదించిన గ్రీకు మాటకు "హెచ్చించడం", "గొప్ప చేయడం" అని కూడా అర్థం ఉంది. కాబట్టి ఇక్కడ ఆయన మాటలో ఆయన సజీవంగా తిరిగి లేవడం, పరలోకానికి వెళ్ళిపోవడం కూడా ఇమిడి ఉండవచ్చు. ఈ సంఘటనల తరువాతే చాలమంది యూదులు, యూదుల నాయకులు కొందరు కూడా ఆయనెవరో తెలుసుకొని, ఆయన్ను అనుసరించసాగారు (అపో కా 2:41; 4:4; 6:7; 21:20). ఇంకా చాలా మందికి ఆయన్ను అనుసరించాలని తెలుసు గాని అలా చెయ్యడం ఇష్టం లేదు.

"నేర్పిన" – 7:16; 12:49,50. యేసు ఉపదేశించినదంతా నేరుగా తండ్రి అయిన దేవునినుంచి వచ్చినదే.

**8:29** ఆయన జీవితం ముఖ్యోద్దేశం తండ్రి అయిన దేవునికి ఆనందం కలిగించడమే. దాన్ని ఆయన లోపరహితంగా నెరవేర్చాడు (4:34 నోట్).

**8:30** తరువాత వస్తున్న వచనాలను బట్టి వారి నమ్మకం ఎంత అల్పమైనదో చూడవచ్చు. 2:23–25; 12:42,43 చూడండి. యేసును గురించి కొన్ని విషయాలు వారు నమ్మారు. అయితే ఈ నమ్మకం వారి హృదయాల లోతుల్లోకి పోయి వారి బ్రతుకుల్ని మార్చలేదు.

**8:31** శిష్యులంటే యేసుప్రభువు తమ ఏకైక ఉపదేశకుడుగా అంగీకరించినవారే, ఆయన్నుండి నేర్చుకుని ఆయనకు లోబడుతూ తమను ఆయన ఎటు తీసుకు వెళ్తే అటు వెళ్ళేవారే. అలా చేస్తూ ఉండేవారే నిజమైన శిష్యులని ఇక్కడ ఆయన

అన్నాడు: “మీరు నా వాక్కులో నిలిచి ఉంటే నాకు నిజమైన
శిష్యులుగా ఉంటారు. 32 అప్పుడు మీరు సత్యం గ్రహిస్తారు,
సత్యం మీకు విడుదల కలిగిస్తుంది.”

33 అయితే వారు “మేము అబ్రాహాము సంతానం.
మేమెప్పుడు ఎవరికీ బానిసలం కాము. మాకు విడుదల
కలుగుతుందని అంటావేం?” అని ఆయనకు జవాబు చెప్పారు.

34 యేసు వారికిలా బదులు చెప్పాడు: “పాపం చేసే ప్రతి
ఒక్కరూ పాపానికి బానిస అని మీతో ఖచ్చితంగా చెపుతున్నాను.
35 బానిస యజమాని ఇంట్లో ఎల్లప్పుడూ ఉండడు గానీ
కుమారుడు ఎప్పుడూ ఇంట్లో ఉంటాడు. 36 కనుక కుమారుడు
మిమ్ములను విడుదల చేస్తేనే మీరు నిజంగా విడుదల
పొందినవారై ఉంటారు. 37 మీరు అబ్రాహాము సంతానమని
నాకు తెలుసు. కానీ నా మాటలకు మీలో చోటు లేదు గనుక
నన్ను చంపాలని చూస్తూ ఉన్నారు. 38 నా తండ్రి దగ్గర
చూచిన విషయాలే చెపుతూ ఉన్నాను. మీ తండ్రి దగ్గర
చూచిన విషయాలు మీరూ చేస్తున్నారు.”

39 అందుకు వారు ఆయనకు “అబ్రాహాము మా తండ్రి”
అన్నారు.

యేసు “మీరు అబ్రాహాము సంతానమైతే అబ్రాహాము
క్రియలు చేస్తారు. 40 అయితే దేవుడు చెప్పగా నేను విన్న
సత్యం మీకు చెప్పిన మనిషినయిన నన్ను చంపడానికి చూస్తూ
ఉన్నారు. అబ్రాహాము ఇలా చేయలేదే! 41 మీరు మీ తండ్రి
క్రియలే చేస్తూ ఉన్నారు” అని వారితో చెప్పాడు.

ఆయనతో వారు “మేము వ్యభిచారం మూలంగా పుట్టలేదు.
మాకు తండ్రి ఒక్కడే. ఆయన దేవుడే” అన్నారు.

42 యేసు వారితో అన్నాడు “దేవుడే గనుక మీ తండ్రి

---

చెప్తున్నాడు. శిష్యులనడానికి రుజువు వారు శిష్యులుగా ఉండిపోవడమే. కొంతమంది ఆరంభం బాగానే ఉన్నట్టుంది గాని త్వరలోనే క్రీస్తు ఉపదేశాలను విడిచిపెట్టి తమ సొంత దారుల్లో వెళ్ళిపోతారు. అలాంటివారు నిజమైన శిష్యులు ఎన్నడూ కాలేదు. 1 యోహాను 2:19 పోల్చి చూడండి.

**8:32** క్రీస్తు మనుషుల్ని విడుదల చేయడానికే వచ్చాడు (లూకా 4:18). ఈ విడుదల ఏమిటి? ఇది రాజకీయ స్వేచ్ఛ గానీ అక్షరాలా బానిసత్వం నుంచి స్వేచ్ఛ గానీ కాదు. పాప బంధకాల నుంచీ విడుదల (వ 34). దానితోబాటు అపరాధులమనే తీర్పు నుంచీ శిక్ష నుంచి దేవుని పవిత్ర ధర్మశాస్త్రం చేసే నేరారోపణ నుంచీ చావు భయం నుంచీ భవబంధాల నుంచీ ఆస్తిపాస్తుల కట్లనుంచీ క్రీస్తును అనుసరించకుండా దేవుణ్ణి సేవించకుండా అడ్డుపడే అన్ని సంకెళ్ళ నుంచీ ఆయన మనకు విడుదలను అనుగ్రహిస్తాడు. అయనిచ్చేది ఆత్మ సంబంధమైన విడుదల.

క్రీస్తు ఈ విడుదలను ఎలా ప్రసాదిస్తాడు? మనం సత్యాన్ని తెలుసుకోవడం ద్వారానే. నిజమైన శిష్యుడు సత్యస్వరూపి అయిన క్రీస్తును (1:17; 14:6), ఆయన్ను గురించిన సత్యాన్ని తెలుసుకుంటాడు. అంటే ఆయనెవరో, ఈ లోకానికి ఎందుకు వచ్చాడో, ఇక్కడ ఆయన సాధించినదేమిటో తెలుసుకుంటాడు. అంతేగాక అతడు తన గురించీ పాపవిముక్తి గురించీ యేసు చేసిన ఇతర గొప్ప ఉపదేశాల గురించీ సత్యాన్ని కూడా తెలుసుకుంటాడు. సత్యం గురించిన ఈ జ్ఞానం ఒక్కటే విడుదలకు మార్గం. పాపం, అపనమ్మకం, సత్యాన్ని ఎరగకపోవడం మనుషుల్ని బానిసత్వంలో ఉంచుతున్నాయి. 15:21; మొ॥ నోట్స్ చూడండి. వారికి విడుదల ప్రసాదించే సత్యం క్రీస్తు సత్యం ఒక్కటే.

**8:33** మత్తయి 3:9 చూడండి. ఇది జాతి గురించిన అహంకారం. యూద జాతి వంశకర్త అబ్రాహాము గొప్పవాడు కాబట్టి తాము కూడా గొప్పవారమని వారు అనుకున్నారు. కానీ వారు ఆత్మ సంబంధంగా అబ్రాహాము సంతతి కాదని 39,40 వచనాలు చూపిస్తున్నాయి. కుటుంబ సంబంధంగా జాతి సంబంధంగా గర్వించడం మనల్ని దేవుని ఛాయలకు కూడా తీసుకువెళ్ళదు.

“విడుదల” – ఎప్పటిలాగానే యేసుప్రభువును వారు అపార్థం చేసుకున్నారు. శారీరికంగా బానిసత్వం నుంచి విడుదల గురించి ఆయన మాట్లాడుతున్నాడని అనుకున్నారు.

**8:34** ఎవరూ కూడా అపార్థం చేసుకోవడానికి వీలులేకుండా అతి స్పష్టంగా యేసు ఇప్పుడు మాట్లాడుతున్నాడు. దేవుని వాక్కు విధిస్తున్న కట్టుబాట్లు తెంచుకొని, తమ సొంత దారుల్లో సాగిపోవడం స్వేచ్ఛ అనుకునేవారు ఎంతమందో ఉన్నారు. అయితే తమ ఇష్టప్రకారం చేసేందుకూ తనివితీరా పాపం చేసేందుకూ స్వేచ్ఛ కావాలని వారి ప్రయత్నాలవల్ల వారు తమ సొంత బంధకాలను తయారు చేసుకుంటున్నారు, చాలా క్రూరమైన యజమానికి – అంటే పాపానికి బానిసలౌతున్నారు.

**8:35** ఏ కుటుంబం విషయంలోనైనా చివరికి దేవుని కుటుంబం విషయంలో కూడా ఇది సత్యమే. పాపానికి దాసులైన వారికి కుమారునికి ఉన్నట్టుగా అందులో నిజమైన స్థానం, హక్కు లేవు.

**8:36** బానిసలు తమను తాము విడిపించుకోలేరు. అలా విడిపించుకోగలిగితే వారు బానిసలే కాదు. వారిని విడిపించాలనంటే వారు గాక వేరొకరు, బానిస కానివాడు అవసరం. దీన్ని క్రీస్తు చేశాడు. చేస్తూనే ఉన్నాడు (మత్తయి 1:21; అపో కా 26:17,18; రోమ్ 6:16-18,22; 8:2,21; గలతీ 5:1).

**8:37** సంతానం అంటే శారీరికంగా సంతానం అని యేసు ఉద్దేశం. తనను చంపడానికి వారు పన్నుతున్న కుట్రల సంగతంతా యేసుకు తెలుసు – 5:18.

**8:38** క్రీస్తు ఎప్పుడూ దేవుని సన్నిధిలో ఉన్నాడు – వ 28; 1:1; 5:19,20.

“మీ తండ్రి” – అంటే సైతాను (వ 41,44).

**8:39,40** అబ్రాహాము తమ తండ్రి అని వారు నొక్కి చెప్పారు. బహుశా అది శరీరికంగా, ఆధ్యాత్మికంగా కూడా వాస్తవమే అని వారి ఉద్దేశం కావచ్చు. ఇది నిజం కాదని వారి ప్రవర్తనే తెలియజేస్తూ ఉన్నదని యేసు అంటున్నాడు. అబ్రాహాము ఎలాంటివాడో బైబిలు తెలియజేస్తున్నది (ఆది 12–24 అధ్యాయాలు). ఈ యూదులు ఎంతమాత్రం అతని లాంటివారు కాదు.

**8:41** ఈ యూదులు ఇలా ఎందుకన్నారో స్పష్టంగా తెలియదు. తాము భౌతికంగా ఆధ్యాత్మికంగా కూడా అబ్రాహాము సంతానమనీ, నిజ దేవుణ్ణి ఆరాధించేవారమనీ వారి ఉద్దేశం కావచ్చు (పాత ఒడంబడిక గ్రంథంలో పర దేవత పూజ వ్యభిచారం వంటిదని చెప్పడం జరిగింది (యిర్మీయా 2:1; యెహె 16:31-34; 23:2,3; హోషేయ 1:2 నోట్స్). ఇస్రాయేల్ జాతికి దేవుడే తండ్రి అని వారికి తెలుసు (యెషయా 64:8; మలాకీ 2:10). ఇక్కడ వ్యక్తిగతంగా తమకు కూడా దేవుడే తండ్రి అని చెప్పుకుంటున్నారు. కానీ కేవలం అలా చెప్పినంత మాత్రాన అలా అయిపోదు.

**8:42** చాలామంది తాము దేవుని పిల్లలమనుకుంటారు. అలా చెప్పుకుంటారు. కానీ వారికి యేసుప్రభువంటే ప్రేమ ఉందా? లేని పక్షంలో వారు అనుకునేది ఏమైనప్పటికీ వారు దేవుని

అయితే మీరు నన్ను ప్రేమతో చూచేవారే. ఎందుకంటే, నేను దేవుని దగ్గరనుంచి బయలుదేరి వచ్చాను. నా అంతట నేనే రాలేదు. ఆయన నన్ను పంపాడు. 43 నేను చెప్పేది మీరు ఎందుకు గ్రహించరు? నా మాట వినలేకపోవడమే దానికి కారణం. 44 మీరు మీ తండ్రి అపనింద పిశాచానికి చెందినవారు. మీ తండ్రి ఇచ్ఛల ప్రకారం జరిగించాలని కోరుతూ ఉన్నారు. మొదటినుంచి వాడు హంతకుడు, సత్యంలో నిలవనివాడు. సత్యం వాడిలో బొత్తిగా లేదు. వాడు అబద్ధికుడు, అబద్ధాలకు తండ్రి. వాడు అబద్ధం చెప్పినప్పుడెల్లా వాడి సొంత స్వభావంలోనుంచి చెపుతాడు. 45 నేనైతే సత్యం చెప్పినందుచేతే మీరు నన్ను నమ్మడం లేదు. 46 నేను దోషినని మీలో ఎవరు నిరూపించగలరు? నేను మీకు సత్యం చెపుతూ ఉంటే నన్ను నమ్మరేమిటి? 47 దేవునికి చెందినవాడు దేవుని మాటలు వింటాడు. మీరు దేవునికి చెందినవారు కారు. అందుచేతే మీరు వాటిని వినడం లేదు."

48 యూదులు ఆయనకు "నీవు సమరయ దేశస్థుడివి, దయ్యం పట్టినవాడివి అని మేము చెప్పేది సరిగానే ఉంది గదా!" అని జవాబిచ్చారు.

49 యేసు "దయ్యం పట్టినవాణ్ణి కాను, నా తండ్రిని గౌరవించేవాణ్ణే. మీరైతే నన్ను అవమానానికి గురి చేస్తున్నారు. 50 నాకు గౌరవం చేకూరాలని నేను వెతకడం లేదు. వెతికేవాడు, తీర్పు తీర్చేవాడు ఒకడు ఉన్నాడు. 51 మీతో ఖచ్చితంగా చెపుతున్నాను, నా మాట ఆచరించేవాడెవడైనా ఎన్నడూ మరణం చూడడు" అని సమాధానం చెప్పాడు.

52 యూదులు "నీవు దయ్యం పట్టినవాడివని మాకిప్పుడు తెలుసు. అబ్రాహాము చనిపోయాడు, ప్రవక్తలూ చనిపోయారు.

---

పిల్లలు కాదు. యేసుప్రభువును ప్రేమించడమంటే ఏమిటి? 14:15,23,24 చూడండి. ఆయన ఈ లోకంలోకి పంపిన యేసుప్రభువును ప్రేమించకుండా దేవుణ్ణి ప్రేమించడం సాధ్యం కాదు.

**8:43** వారెందుకు వినలేకపోతున్నారు? ఎందుకంటే ఆత్మ సంబంధంగా వారు చెవిటివారు, గుడ్డివారు, చచ్చినవారు. చీకటంటే వారికి ఇష్టం (3:19). దేవుని తీర్పు వారిపై ఉంది (మత్తయి 13:11–15).

**8:44** వ 38, 41. శారీరకంగా వారు అబ్రాహాము సంతానం. కానీ ఆధ్యాత్మిక విషయాల్లో వారు సైతాను పిల్లలు (మత్తయి 13:38. సైతాను గురించి 1 దిన 21:1; మత్తయి 4:1–11; 2 కొరింతు 11:14 నోట్స్). సైతాను వారిలో పని చేస్తున్నాడు (ఎఫెసు 2:2); వారు వాడికి లోబడ్డారు, అనేక విధాలుగా వాడివంటి వారు. వారు వాడికి చెందినవారు. యేసుప్రభువు పట్ల వారి ప్రవర్తనే ఈ విషయాన్ని బయటపెట్టింది.

దీన్ని బట్టి మనం ఓ పాఠం నేర్చుకుందాం. ఒక వ్యక్తి ముందు తరాలవారు గొప్పవారై ఉండవచ్చు. అతడు చాలా మతనిష్ఠ గలవాడై ఉండవచ్చు. తాను దేవుని సంతానమని చెప్పుకోవచ్చు. అయినప్పటికీ ఆ వ్యక్తి సైతాను కొడుకై ఉండే అవకాశం ఉంది. మానవ హృదయంలో మోసకరమైన స్థితి, ఘోరమైన చెడుతనం అలాంటిదే (యిర్మీయా 17:9).

యేసు ఇక్కడ సైతాను గురించి రెండు సంగతులను వెల్లడిస్తున్నాడు – వాడు హంతకుడు, పచ్చి అబద్ధాలకోరు. "మొదటినుంచి వాడు హంతకుడు" అనేమాట సైతాను ఆదామునూ హవ్వనూ నాశనం చేయజూచిన సంగతి గురించిన మాట కావచ్చు (ఆది 2:17; 3:1–4). లేక హేబెలు హత్యను గురించినది కావచ్చు (ఆది 4:8). తమ్ముణ్ణి హత్య చెయ్యడానికి కయీనును ప్రేరేపించినది నిస్సంశయంగా సైతానే.

సైతాను మానవజాతి మొత్తానికి హంతకుడు అనడం అతిశయోక్తి కాదు. ఆదాము, హవ్వలను వాడు ప్రేరేపించి చేయించిన పాపం మూలంగా వారికీ, వారి సంతతివారందరికీ మరణం దాపురించింది (రోమ్ 5:12). సైతాను అబద్ధికుడు కూడా. తన అబద్ధాలతో మానవజాతి అంతటినీ దారి తప్పిపోయేలా చేస్తున్నాడు (ప్రకటన 12:9). దేవుణ్ణి గురించి, మనిషి గురించి, పాపవిముక్తి, మతం గురించి, మనుషుల్ని వల్లో వేసుకుని నాశనం చేసేందుకు తనకు వీలున్నదనుకున్న ఏ సందర్భంలోనైనా వాడు అబద్ధాలు చెప్తాడు. వాడు ముఖ్యంగా మత సంబంధంగా పని చేస్తుంటాడు. విచారమేమిటంటే ఎక్కువ మంది మనుషులు క్రీస్తు నేర్పిన సత్యాలను నమ్మక, సైతాను అబద్ధాలనే నమ్ముతారు. తెలిసో, తెలియకో చాలామంది సైతానుకు పూజ చేస్తారు కూడా (మత్తయి 4:8,9; లేవీ 17:7; ద్వితీ 32:17; కీర్తన 106:37; 1 కొరింతు 10:20; ప్రకటన 9:20).

"అబద్ధాలకు తండ్రి" – అబద్ధాలాడేవారంతా సైతాను పక్షం వహించి, సత్యస్వరూపియైన దేవుణ్ణి ఎదిరిస్తున్నారు (కీర్తన 31:5). ఈ ఘోర పాపానికి తగిన శిక్ష అనుభవిస్తారు – ప్రకటన 21:8.

**8:45** "సత్యం చెప్పినందుచేతే" – యేసు వారికి అబద్ధాలు చెప్పి ఉంటే వారు ఆయన్ను నమ్మి ఉండేవారే! వారు అప్పటికే సైతాను అబద్ధాలు నమ్మారు గనక సత్యమంటే వారికి ద్వేషం. సత్యాన్ని వారు నమ్మలేదు, నమ్మలేకపోయారు. 5:44 కూడా చూడండి.

**8:46** యేసు ఎప్పుడైనా పాపం చేశాడని వారు గానీ మరెవరైనా గానీ ఎప్పుడూ నిరూపించలేకపోయారు (మత్తయి 27:23; లూకా 23:4; 2 కొరింతు 5:21; హీబ్రూ 4:15; 7:26; 1 పేతురు 1:22–24). తరువాతి వచనంలో వారికి తానంటే ఎందుకు నమ్మకం లేదో చెప్తున్నాడు.

**8:48** వారు వాదంలో ఓడిపోయి ఆగ్రహంతో అపనిందలు వెయ్యసాగారు. ఇది సాధారణంగా దుర్మార్గుల తీరు. యేసు దయ్యం పట్టినవాడని యూదులు నాలుగు సార్లు అన్నారు (7:20; 8:48,52; 10:20). మత్తయి 12:24 కూడా చూడండి. సమరయ దేశస్థులంటే యూదులు అసహ్యపడ్డారు (4:9) గనుక, వాళ్ళను మతభ్రష్టులుగా ఎంచారు గనక ఆయన్ను సమరయుడు అన్నారు. ఒక మనిషిని సమరయ దేశస్థుడు అని పిలవడం చాలా కించపరచినట్టు అన్నమాట వారి ఉద్దేశంలో.

**8:49** యేసు యూదుడైనప్పటికీ తనను సమరయ దేశస్థుడు అని ఎవరైనా పిలవడం తనకు అవమానంగా భావించలేదు. దాని విషయం ఏమీ అనలేదు. ఏ జాతివారినీ ఆయన చిన్నచూపు చూచేవాడు కాదు.

**8:50** తనకు చెందవలసిన గౌరవాన్ని మనుషులు తనకియ్యాలని ఆయనకేమీ తాపత్రయం లేదు. ఆయన ఉద్దేశమంతా తండ్రి అయిన దేవునికి మహిమ కలిగించడమే.

**8:51** 6:49–51 నోట్. మనుషులు "మరణం" అని దేన్నైతే పిలుస్తారో దాన్ని గురించి ఆయన మాట్లాడ్డం లేదు. స్వీకరించే మనసు గల వారెవరి కోసమైన మరో గొప్ప వాగ్దానం ఇవ్వకుండా ఆ చర్చను ముగించడం ఆయనకు ఇష్టం లేదు. ఇది 5:24; 6:50; 11:25,26లో ఉన్న వాగ్దానాల్లాంటిదే.

**8:52,53** ఎప్పటిలాగానే వారాయన్ను సరిగా అర్థం

నీవైతే ‘నా మాట ఆచరించేవాడెవడైనా ఎన్నడూ మరణం రుచి
చూడడని చెపుతున్నావు. 53 చనిపోయిన మా తండ్రి
అబ్రాహాము కంటే గొప్పవాడివా నీవు? ప్రవక్తలు కూడా
చనిపోయారు. ఇంతకూ నీవు ఎవరివైనట్టు
చెప్పుకొంటున్నావు?” అని ఆయనతో అన్నారు.
54 యేసు ఇలా బదులు చెప్పాడు: “నాకు నేనే ఘనత
కలిగించుకొంటే నా ఘనత వట్టిది. నాకు ఘనత
కలిగించేవాడు నా తండ్రి. ఆయనను ఉద్దేశించి మీరు ‘మా
దేవుడు’ అంటారు. 55 కానీ ఆయనను మీరెరుగరు.
నేనాయనను ఎరుగుదును. ఆయననెరగనని నేను చెపితే
మీలాగే అబద్ధం చెప్పేవాణ్ణే అవుతాను. నేనాయనను
ఎరుగుదును, ఆయన మాట ఆచరిస్తూ ఉన్నాను. 56 నా
రోజు చూడడం మీ తండ్రి అబ్రాహాముకు ఆనందం. అతడు
అది చూచి సంతోషించాడు.”
57 అందుకు యూదులు ఆయనతో “నీకింకా
యాభైయేళ్ళయినా లేవే! నీవు అబ్రాహామును చూశావా?”
అన్నారు.
58 యేసు “మీతో ఖచ్చితంగా చెపుతున్నాను, అబ్రాహాము
ఉండే ముందే నేను ‘ఉన్నవాడను’” అని వారికి చెప్పాడు.
59 అందుచేత వారు ఆయనమీద రువ్వడానికి రాళ్ళు
ఎత్తారు గాని యేసు తనను మరుగు చేసుకొని వారి మధ్య
గుండా దాటుతూ దేవాలయం నుంచి బయటికి వెళ్ళాడు.

9 ఆయన దారిన వెళ్తూ ఉన్నప్పుడు పుట్టు గుడ్డివాడు
ఒకడు ఆయనకు కనబడ్డాడు. 2 ఆయన శిష్యులు
“గురువర్యా! ఇతడు గుడ్డివాడుగా పుట్టడానికి ఎవరు అపరాధం
చేశారు? ఇతడా, ఇతడి తల్లిదండ్రులా?” అని
ఆయననడిగారు. 3 యేసు ఇలా జవాబిచ్చాడు: “ఇతడు లేదా

---

చేసుకోలేదు.

**8:54** వ 50; 17:5; అపో కా 3:13; ఫిలిప్పీ 2:9-11.

**8:55** వ 19; 15:21; 16:3. వారి సమస్యంతా ఇదే. ఈ జ్ఞానం లోపించడంవల్ల చీకట్లో తడుములాడినట్టు వారు వాదిస్తున్నారు.

**8:56** వారి గొప్ప పూర్వీకుడు అబ్రాహాముకూ వారికీ ఉన్న తేడాను మరోసారి చూపిస్తున్నాడు యేసు. క్రీస్తు వచ్చే రోజును గురించి అబ్రాహాము సంతోషించాడు. వారైతే క్రీస్తును చంపజూశారు. రాబోయే అభిషిక్తుని కోసం అబ్రాహాము ఆనందంతో ఎదురుచూశాడు. రాబోయే ఆ రోజును దేవుడు ఒక ప్రత్యేకమైన దర్శనం ద్వారా అబ్రాహాముకు చూపించి ఉండవచ్చు. అయితే ఇలాంటి దర్శనం గురించి బైబిలులో రాయలేదు.

**8:57** నిజానికి యేసు వయసు దాదాపు 33 ఏళ్ళు మాత్రమే. సరైన నిండువయసు అయినా యేసుకు రాలేదు అని వారి ఉద్దేశం. దీనికి 2000 సంవత్సరాలకు ముందు అబ్రాహాము జీవించాడు.

**8:58** “మీతో ఖచ్చితంగా చెపుతున్నాను” అంటే యేసు ఇక్కడ మరో గంభీరమైన, ప్రాముఖ్యమైన విషయాన్ని చెప్పబోతున్నాడు.

“నేను ఉన్నవాడను” – వ 24; నిర్గమ 3:14,15. ఈ శుభవార్త ఆరంభంలో ఉన్న సత్యాన్నే (1:1) యేసుప్రభువు ప్రకటిస్తున్నాడు – తాను యెహోవా దేవుణ్ణన్నదే ఈ సత్యం. లూకా 2:11; ఫిలిప్పీ 2:6,10,11 కూడా చూడండి.

**8:59** 5:18 చూడండి. యేసు దేవదూషణ చేస్తున్నాడని, తన గురించి లేనిపోనివి చెప్పుకుంటున్నాడని వారనుకున్నారు. మత్తయి 26:63-66 కూడా చూడండి. నిజానికి ఆయన కేవలం సత్యం పలికాడు. కానీ వారు తమ అంధకారంలో ఉండి దాన్ని నమ్మడానికి నిరాకరించారు. యేసు వారిని విడిచి వెళ్ళిపోయింది భయంచేత కాదు. తన సమయం ఇంకా రాలేదని ఆయనకు తెలుసు కాబట్టి (7:30).

**9:1** నాలుగు శుభవార్తల్లోనూ యేసు మరే ఇతర రోగంకంటే ఎక్కువగా గుడ్డితనాన్ని బాగు చేశాడు (మత్తయి 9:27-31; 12:22; 15:30; 21:14; మార్కు 8:22-26; 10:46-52; లూకా 7:21). పాత ఒడంబడిక గ్రంథంలో మనుషుల్ని గుడ్డివారుగా చేసేదీ, చూపు ఇచ్చేదీ దేవుడేనని ఉంది (నిర్గమ 4:11; కీర్తన 146:8). అక్కడ కూడా గుడ్డివారికి చూపు ఇవ్వడానికీ, అభిషిక్తుని రాకకూ సంబంధం ఉన్నట్టు చూడవచ్చు (యెషయా 29:18; 35:5; 42:7). యోహాను ఈ శుభవార్త రాయడంలో అతని ఉద్దేశాల్లో ఒకటి యేసే అభిషిక్తుడనీ దేవుని కుమారుడనీ చూపించడం (20:31). ఈ ఉద్దేశాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ అధ్యాయాన్ని అతడు దైవావేశపూర్వకంగా రాసినట్టుంది. ఇందులో ఉన్న అద్భుతం కూడా సూచనకోసమైనదే (వ 16; 2:11). ఇది సూచిస్తున్న ఆధ్యాత్మిక అర్థం ఏమిటంటే – మనుషులు ఈ లోకంలో ఆత్మ సంబంధంగా గుడ్డివారుగా పుట్టారు. స్వభావ సిద్ధంగా వారు తమ గురించి, దేవుణ్ణి గురించి పాపవిముక్తి గురించిన సత్యాలను గ్రహించలేరు. యేసుప్రభువు మనుషులకు ఆధ్యాత్మికమైన చూపు ఇస్తాడు (వ 39). ప్రతి ఒక్కరికి అవసరమైన జ్ఞానప్రకాశం ఇదే. వ 39; 8:12; కీర్తన 36:9; అపో కా 26:15-18; 2 కొరింతు 4:4,6; ఎఫెసు 1:17,18; 5:14; 1 పేతురు 2:9 చూడండి.

**9:2** ఒక వ్యక్తికి వచ్చే వ్యాధులకు గానీ అంగవైకల్యానికి గానీ దుర్బలతకు గాని మనిషి స్వయంగా చేసిన పాపాలే కారణమని యూదులు సాధారణంగా భావించేవారు. యోబు స్నేహితుల్లో ఇదే మనస్తత్వం కనిపిస్తుంది. (యోబు 4:7-9; 8:3; 18:5-21 నోట్స్ చూడండి). ఎవరైనా పుట్టడమే ఏదన్నా అంగవైకల్యంతో పుడితే పై నియమం వర్తిస్తుందో లేదో అర్థం చేసుకునేందుకు శిష్యులు ప్రయత్నిస్తున్నారు. ఆ మనిషి గుడ్డితనం అతని తల్లిదండ్రులు చేసిన పాపాలకు శిక్షగా అతనికి వచ్చిందా, లేక ఆ మనిషే ఏదో విధంగా పుట్టకముందే ఏదో పాపం చేశాడా? ఆ రోజుల్లో యూద మత గురువులు ఇంకా పుట్టని శిశువు తల్లి గర్భంలోనే పాపం చేయగల అవకాశం ఉందో లేదో దాని గురించి ఊహాగానాలు చేసేవారు. అంతేకాకుండా బహుశా పునర్జన్మ సిద్ధాంతం (గత జన్మలో ఒక వ్యక్తి చేసిన పాపాలు తరువాతి జన్మలో అతడిపై ప్రభావం చూపుతుందనే తప్పు సిద్ధాంతం) గురించి కూడా ఆ రోజుల్లో చర్చలు జరిగాయేమో. శిష్యులు పై ఊహల్లో దేన్నైనా నమ్మారని అనుకునేందుకు ఆస్కారం లేదు (యోబు 11:12; హీబ్రూ 9:27 పోల్చి చూడండి). కానీ ఆ మనిషి పుట్టుకతోనే గుడ్డివాడెందుకు అయ్యాడని వారికి కుతూహలంగా ఉంది. అతడికి ఏదన్నా సహాయం చేసే విధానాన్ని వారు సూచించలేదు. అతడిపై జాలి చూపలేదని గమనించండి. వారి దృష్టిలో అతడు కేవలం వేదాంత సంబంధమైన ఊహాగానాలకు కారణమైన వస్తువులా ఉన్నాడు.

**9:3** యేసుప్రభువు శిష్యుల ఊహాగానాలన్నిటినీ త్రోసిపుచ్చాడు. మనుషులందరి లాగానే (రోమ్ 3:23) ఆ గుడ్డివాడు, అతని తల్లిదండ్రులు పాపులు కాదని ఆయన చెప్పడం లేదు. ఆ మనిషి గుడ్డితనానికి వారి పాపాలకూ మాత్రం ఏ సంబంధమూ లేదంటున్నాడు. యేసుప్రభువు పునర్జన్మ సిద్ధాంతాన్ని ఉపదేశించలేదు. ఆయన దాన్ని నమ్మినవాడైతే, లేదా ఈ భూమిపై మనిషి జీవితాన్ని వివరించడానికి పునర్జన్మ సిద్ధాంతం

ఇతని తల్లిదండ్రులు అపరాధం చేసినందుకు కాదు, గానీ దేవుని క్రియలు ఇతని మూలంగా వెల్లడి కావాలని. 4 పగలు ఉన్నంతవరకూ నన్ను పంపినవాని క్రియలు నేను చేస్తూ ఉండాలి. రాత్రి వస్తూ ఉంది. అప్పుడు ఏ మనిషీ పని చేయలేడు. 5 లోకంలో ఉన్నంతవరకూ నేను లోకానికి వెలుగును." 6 ఈ విధంగా చెప్పి ఆయన నేలపై ఉమ్మివేసి దానితో బురద చేసి గుడ్డివాని కండ్లకు ఆ బురద పూశాడు, 7 "వెళ్ళి సిలోయం కోనేటిలో కడుక్కో!" అని అతనితో అన్నాడు. (సిలోయం అంటే పంపబడిన వాడని తర్జుమా.) అతడు వెళ్ళి కడుక్కొని చూస్తూ తిరిగి వచ్చాడు.

8 అందుచేత ఇరుగుపొరుగువారు, మునుపు అతడు గుడ్డివాడని చూచినవారు "వీడు మునుపు కూచుని బిచ్చమడుక్కొనేవాడు కాదా?" అని అడిగారు.

9 కొంతమంది "అవును వాడే", మరి కొంతమంది "వాణ్ణి పోలినవాడే" అన్నారు. అతడు "నేనే అతణ్ణి" అని చెపుతూ వచ్చాడు.

10 అందుచేత వారు "నీ కండ్లను తెరవడమెలా?" అని అతణ్ణి అడిగారు.

11 అతడు "యేసు అనే మనిషి బురద చేసి నా కండ్లకు పూసి సిలోయం కోనేటికి వెళ్ళి కడుక్కోమన్నాడు. అలాగే వెళ్ళి కడుక్కొన్నాను, చూపు వచ్చింది" అని బదులు చెప్పాడు.

12 "అతడు ఎక్కడున్నాడు?" అని వారు అతణ్ణి అడిగినప్పుడు అతడు "నాకు తెలీదు" అన్నాడు.

13 మునుపు గుడ్డివాడుగా ఉన్న ఆ మనిషిని వారు పరిసయ్యుల దగ్గరికి తీసుకువెళ్ళారు. 14 యేసు బురద చేసి అతని కండ్లు తెరచిన రోజు విశ్రాంతి దినం. 15 కనుక పరిసయ్యులు కూడా అతనికెలా చూపు వచ్చిందని మళ్ళీ అతణ్ణి అడిగారు.

వారితో అతడు "ఆయన బురద నా కండ్లకు రాశాడు. నేను కడుక్కొన్నాను. ఇప్పుడు చూస్తూ ఉన్నాను" అన్నాడు.

16 కనుక పరిసయ్యులలో కొంతమంది "ఆ మనిషి దేవుని దగ్గర నుంచి వచ్చినవాడు కాదు. ఎందుకంటే అతడు విశ్రాంతి దినం ఆచరించడం లేదు" అన్నారు. మరి కొందరైతే "పాపాత్ముడైన మనిషి ఇలాంటి సూచకమైన అద్భుతాలు ఎలా చేయగలడు?" అన్నారు. ఇలా వారి మధ్య భేదం ఉంది. 17 అందుచేత వారు మళ్ళీ ఆ గుడ్డివాణ్ణి ప్రశ్నించారు – "అతడు నీ కండ్లు తెరచినందుకు అతడి విషయం నీవేం అంటావు?" అతడు "ఆయన ఒక ప్రవక్త" అన్నాడు.

18 అతడు మునుపు గుడ్డివాడనీ చూపు పొందాడనీ యూదులు అతని విషయం మొట్టమొదట నమ్మలేదు గనుక చూపు వచ్చినవాని తల్లిదండ్రులను పిలిచి 19 "మీ కొడుకు గుడ్డివాడుగా పుట్టాడంటారు. వీడు మీ కొడుకా? అలాగైతే ఇప్పుడు వీడు ఎలా చూడగలుగుతూ ఉన్నాడు?" అని వారిని అడిగారు.

20 అందుకు అతని తల్లిదండ్రులు వారికిలా జవాబిచ్చారు: "ఇతడు మా కొడుకనీ గుడ్డివాడుగా పుట్టాడనీ మాకు తెలుసు. 21 గానీ ఇతడు ఇప్పుడు ఎలా చూడగలుగుతూ ఉన్నాడో మాకు తెలియదు. అతడి కండ్లు తెరచినది ఎవరో అది కూడా మాకు తెలియదు. ఇతడు వయసు వచ్చినవాడు. ఇతణ్ణే అడగండి. తన సంగతి తానే చెప్పుకొంటాడు."

---

అర్థవంతమని తలచినవాడైతే అది చెప్పడానికి ఇంతకన్న మంచి అవకాశం రాదు. అలా చెప్పడానికి బదులుగా ఆయన ఆ సిద్ధాంతానికి ఆధారం లేదని చూపుతున్నాడు. గత జన్మలో ఒక మనిషి చేసిన పాపాలు తరువాతి జన్మలో అతడి స్థితిని నిర్ణయిస్తాయన్న ఆలోచనలే ఆయన కాదన్నాడన్నమాట. లూకా 16:19–31లో యేసు నేర్పిన సత్యం కూడా పునర్జన్మ సిద్ధాంతానికి వ్యతిరేకమైనది. యోహాను 3:3 కూడా చూడండి. శిష్యులు ఊహించిన దానికంటే మరింత ఉత్తమ కారణం మూలంగా ఈ మనిషి గుడ్డివాడుగా పుట్టాడని యేసు చెప్తున్నాడు. ఆ మనిషి విషయంలో దేవుని మహా శక్తివంతమైన అద్భుతం ఒకటి జరగబోతున్నది. దానిద్వారా దేవునికి, ఘనత కలుగనున్నది. మనకు బాధ కలిగించే ఏ వ్యాధి, అశక్తత, అంగవైకల్యంలోనైనా దేవునికి ఇదే ఉద్దేశం ఉండవచ్చు. దేవుని అద్భుత కార్యం ఒకటి మనలో కూడా జరగవచ్చు. లేదా ఆయనకు మహిమ కలిగించే వేరొక పని జరగవచ్చు. అంటే అలాంటి బాధను వినయంతో, నమ్మకంగా, ఆనందంగా మనం సహించగలిగేలా మనకు సహాయం చేసే ఒక కార్యం మన హృదయంలో జరగవచ్చన్నమాట (16:33; అపొ కా 5:41; రోమ్ 5:3; 2 కొరింతు 4:16–18; 12:9–10; కొలస్సయి 1:24; 1 పేతురు 4:13).

**9:4,5** 8:12. క్రీస్తు ఈ భూమిపై జీవించినప్పుడు ఆయన సన్నిధి చీకటిని కూడా పగలుగా మార్చివేసింది (మత్తయి 4:16; లూకా 1:78,79). కానీ తన పని పూర్తి చేసేందుకు ఆయనకు ఎక్కువ సమయం లేదు. రాత్రి వచ్చేస్తున్నది (లూకా 22:53). ఆయన రెండో సారి వచ్చేవరకు అది అలానే నిలిచి ఉంటుంది (రోమ్13:12; 2 పేతురు 1:19 పోల్చి చూడండి).

**9:6,7** కొన్నిసార్లు యేసు దూరంనుంచే వ్యాధులు బాగు చేశాడు (4:50). కొన్ని సార్లు ముట్టుకుని బాగు చేశాడు (మత్తయి 8:3,15). ఇక్కడ ఒక పదార్థాన్ని ఆయన ఉపయోగించాడు (మార్కు 8:24,25 నోట్ చూడండి) ఆయన చెయ్యదలచుకున్నది చేస్తాడు. ఏం చేస్తాడో మనం ఊహించలేము. లేక ఇలా చెయ్యాలని ఆయనకు చెప్పలేము.

**9:13** "పరిసయ్యులు" – మత్తయి 3:7.

**9:16** "విశ్రాంతి దినం" – 12:9–14. యేసుప్రభువులోని ప్రభావానికీ, కనికరానికీ పరిసయ్యులు తమను తాము ఆశ్చర్యపోనివ్వలేదు. ఆయనలో ఏ తప్పు దొరుకుతుందా అని మాత్రం చూస్తున్నారు. వారి ఉద్దేశం ఇది – తాము విశ్రాంతి దినం గురించి కల్పించిన కట్టడుల్లో ఒకదాన్ని యేసు మీరాడు కాబట్టి ఆయన దుర్మార్గుడై ఉండాలి! వారిలో కొద్దిమంది దీనితో ఏకీభవించలేకపోయారు. ఇలా గుడ్డివాణ్ణి బాగు చేయడం దేవుని శక్తి ప్రదర్శన అని వారికి తెలుసు.

**9:17** యేసును దేవుడే పంపాడనీ, యేసు దేవునికి ప్రతినిధి అనీ అతడు నమ్మాడు. యేసు కేవలం ప్రవక్త మాత్రమే కాదని తరువాత అర్థం చేసుకోగలిగాడు (వ 35–38).

**9:18** ఈ అద్భుతం జరిగిందన్న సంగతిని యేసు శత్రువులు నమ్మడానికి ఇష్టపడలేదు. అందువల్ల కనిపిస్తున్న గొప్ప సాక్ష్యాధారాలూ రుజువులూ వేటినీ పట్టించుకోకుండా ఉండేందుకు ప్రయత్నించారు. చాలా సార్లు మనుషులు నమ్మేవాటితో వాస్తవాలకూ సాక్ష్యాధారాలకూ రుజువులకూ పొందిక ఉండదు. వారి నమ్మకాలు వారి కోరికలు, దురభిమానాల్లో నుంచే వస్తాయి.

**9:20–23** తమ కొడుక్కు చూపు ఇచ్చినది యేసేనని వారికి తెలుసు గాని వారికి ధైర్యం, నిజాయితీ లేవు. ఇతరులవల్ల భయం మనుషులను సత్యంకోసం నిలబడకుండా చేస్తుంది

22 అతని తల్లిదండ్రులు యూదులకు భయపడి అలా
చెప్పారు. ఎందుకంటే, యేసు అభిషిక్తుడని ఎవరైనా సరే
ఒప్పుకొంటే వారిని సమాజ కేంద్రంనుంచి వెలివేయడం
జరుగుతుందని ఇంతకుముందే యూదులు నిర్ణయించారు.
23 ఈ కారణంచేతే అతని తల్లిదండ్రులు "ఇతడు వయసు
వచ్చినవాడు, ఇతణ్ణే అడగండి" అన్నారు.
24 కనుక మునుపు గుడ్డివాడుగా ఉన్నవాణ్ణి వారు రెండో
సారి పిలిచి అతనితో "దేవునికి మహిమ కలిగించు! ఆ మనిషి
పాపాత్ముడని మాకు తెలుసు" అన్నారు. 25 అందుకతడు
జవాబిస్తూ "పాపాత్ముడో కాడో నాకు తెలీదు. ఒకటే నాకు
తెలుసు. మునుపు గుడ్డివాణ్ణి, ఇప్పుడైతే చూస్తూ ఉన్నాను."
26 అందుకు వారు "అతడు నీకు ఏం చేశాడు? నీ కళ్ళు
ఎలా తెరిచాడు?" అని అతణ్ణి మళ్ళీ అడిగారు.
27 అతడు "అప్పుడే మీతో చెప్పాను గాని మీరు చెవిని
పెట్టలేదు. ఎందుకు మళ్ళీ వినాలని ఉన్నారు? ఆయన శిష్యులు
కావడానికి మీకు కూడా ఇష్టం ఉందా?" అని వారికి
జవాబిచ్చాడు.
28 అప్పుడు వారు అతణ్ణి దూషించి అన్నారు "అతడి
శిష్యుడివి నీవే. మేము మోషే శిష్యులం. 29 మోషేతో దేవుడు
మాట్లాడాడని మాకు తెలుసు. ఈ మనిషైతే ఎక్కడనుంచి
వచ్చాడో తెలీదు."
30 అతడు వారికిలా జవాబిచ్చాడు: "ఓహో! ఇది వింతగా
ఉందే! ఆయన నా కండ్లు తెరిచినా ఆయన ఎక్కడనుంచి
వచ్చాడో మీకు తెలియదు! 31 దేవుడు పాపాత్ముల ప్రార్థనలు
వినడని మనకు తెలుసు! ఎవడైనా దేవుని భక్తుడై ఆయన
ఇష్టప్రకారం చేసేవాడి ప్రార్థనలే దేవుడు వింటాడు. 32 పుట్టు
గుడ్డివాడి కండ్లు ఎవరైనా తెరిచిన విషయం లోకం ఉనికిలోకి
వచ్చినప్పటినుంచి ఎన్నడూ వినబడలేదు. 33 ఈ మనిషి
దేవుని దగ్గర నుంచి వచ్చినవాడు కాకపోతే ఏమీ చేయలేడు,
అంతే."
34 ఇది అతనికి వారు చెప్పిన జవాబు: "నీవు పుట్టుకతోనే
కేవలం పాపివి. మాకు ఉపదేశం చేస్తావేమిటి!" అప్పుడు వారు
అతణ్ణి వెలివేశారు.
35 వారతణ్ణి వెలివేశారని విని యేసు అతణ్ణి కనుక్కొని

(12:42,43).

వ 22లో యేసుప్రభువును నిరాకరించేవారు తమకు గనక అధికారం ఉంటే విశ్వాసులను ఎలా హింసిస్తారో చూడవచ్చు. అన్యాయంగా ఒత్తిడి తేవడం, భయం, బెదిరింపులను తరచుగా ఉపయోగించి వారు మనుషులను సత్యంనుంచి మళ్ళించాలని చూస్తారు (అపో కా 4:18,21; 5:17,18,40; 7:57,58; 8:3; మొ॥).

"సమాజ కేంద్రం" – మత్తయి 4:23. సమాజ కేంద్రంనుంచి వెలివేయడం వల్ల ఒక వ్యక్తి వాళ్ళ సంఘం, మతం విషయాల్లో అంటరానివాడిలాగా అయ్యేవాడు.

"క్రీస్తు" – మత్తయి 1:1.

**9:24** యేసుప్రభువు మనుషుల దృష్టిలో చెడ్డవాడుగా కనిపించాలని పరిసయ్యుల నిర్ణయం. "దేవునికి మహిమ కలిగించు" అనడంలో దేవుని మహిమ గురించి వారికి శ్రద్ధ ఉన్నట్టు కాదు. నిజం చెప్పమని ఆ మనిషికి ఆజ్ఞ ఇవ్వడమో లేక యేసుకు ఎలాంటి గౌరవమూ ఇయ్యవద్దు అని చెప్పడమో ఈ మాటల్లో ఉద్దేశం. యేసు పాపాత్ముడన్న ఘోరమైన అబద్ధాన్ని ఈ మనిషికి వారు చెప్పారు. అయితే అందుకు రుజువులేవీ వారిదగ్గర లేవు (8:46). సత్యాన్ని ద్వేషించేవారు, అపకారబుద్ధి గలవారు ఎలాంటి రుజువూ అక్కర్లేదన్నట్టు ప్రవర్తిస్తారు.

**9:25** యేసు పాపాత్ముడో కాదో ఇతడికి ఖచ్చితమైన అభిప్రాయం ఉంది (వ 30–33). కానీ దాని గురించి మాట్లాడబోయే ముందు ఒక సత్యాన్ని మరి ఏ సందేహానికీ తావులేకుండా ఒక్కసారే గట్టిగా చెప్పదలచుకున్నాడు. తాను అంతకుముందు గుడ్డివాడు, యేసు తనకు చూపు ఇచ్చాడు. ఇది వాస్తవం. తనకేమాత్రం శంక లేదు. యేసుప్రభువు ద్వారా మనుషులు ఆధ్యాత్మిక దృష్టిని పొందినప్పుడు కూడా ఇలానే ఉంటుంది. అది జరిగిందని వారికి తెలుసు. ఎన్నో శతాబ్దాలుగా ప్రపంచమంతటా కోట్లకొద్దీ విశ్వాసులు ఇలా చెప్పగలరు: "మేము ఆధ్యాత్మికంగా గుడ్డివారుగా ఉన్నప్పుడు యేసుప్రభువు మాకు చూపు ఇచ్చాడు" అని.

**9:26** వారికి ఏం చెయ్యాలో తోచలేదు, వారి ఎత్తు పారలేదు. అయినా వారు ఊరుకోలేదు.

**9:27** చాలా వ్యంగ్యంగా ఈ ప్రశ్న అడిగాడు.

**9:28** తమ వాదాన్ని ఎవరన్నా వ్యతిరేకించి ఓడిస్తే గర్విష్ఠులు సాధారణంగా ఏ పద్ధతిని ఉపయోగిస్తారో దాన్ని ఇక్కడ వీరు కనపరుస్తున్నారు (7:48 కూడా చూడండి). కానీ అవమానించడం, తిట్టడం అనేవి ఒక్క మంచి వాదానికి కూడా జవాబియ్యలేవు. ఒక చిన్న ఆధారాన్ని కూడా తప్పని నిరూపించలేవు. తాము మోషే రాసిన ధర్మశాస్త్రాన్ని అనుసరించే వారమని వారి ఉద్దేశం కానీ నిజంగా వారలా అనుసరించేవారు కారు. 5:45–47; మత్తయి 23:1–3 చూడండి. తాము మోషే శిష్యులమని వారు గర్వంగా చెప్పుకొన్నారు గాని మోషే ఎవరిని గురించి అయితే రాశాడో ఆయన్ను చంపడానికి కుట్రలు పన్నుతున్నారు (1:45; 5:46; లూకా 24:27,44). యిర్మీయా 17:9కు ఇది మరో ఉదాహరణ.

**9:29** క్రీస్తు ఎక్కడినుంచి వచ్చాడో వారు తెలుసుకోగలిగేవారే. కానీ యేసు ఆ విషయం చెప్పినప్పుడు ఆయన్ను వారు నమ్మలేదు (6:41,42; 8:23–25).

**9:30** చాలా మతనిష్ఠ, విద్య గల ఈ పరిసయ్యులందరి మాటల్లో కనిపించిన దానికంటే ఈ పేద పామరుడి జవాబులో ఎక్కువ జ్ఞానం కనిపిస్తున్నది. తరుచుగా సామాన్యుడైన విశ్వాసిలో కనిపించే ఇంగిత జ్ఞానం, ఆరితేరినవారని పేరు పొందినవారి ఆలోచనల్నీ తర్కాల్నీ వెలవెలబోయేలా చేస్తుంది. దీనికి కారణం మత్తయి 11:25,26; కీర్తన 8:2; 119:99; యెషయా 54:13; యిర్మీయా 31:34; 1 కొరింతు 2:12; 1 యోహాను 2:20,27లో కనిపిస్తున్నది.

**9:31** దీని విషయంలో పాత ఒడంబడిక ఏమని చెప్తున్నదో పరిసయ్యులకు తెలుసు. కీర్తన 66:18; సామెత 15:29; యెషయా 1:15 చూడండి. అయితే ఈ సందర్భంలో సత్యం నడిపిస్తున్న చోటికి వెళ్ళడం వారికి ఇష్టం లేదు.

**9:32** పాత ఒడంబడిక గ్రంథం అంతటిలోనూ ఇలాంటి సంగతి ఎక్కడా రాసిలేదు.

**9:33** పరిసయ్యులు వేదాంతం మాట్లాడబోయారు. చూపు వచ్చిన వ్యక్తి వేదాంతపరంగా చక్కగా వాదించి వెలిబుచ్చిన నిర్ణయం ఇది.

**9:34** విద్వాంసులైన ఈ మనుషులు ఈ సామాన్యుడి నిర్ణయాన్ని ఏమాత్రం కదిలించలేకపోయారు. అందువల్ల మళ్ళీ అతణ్ణి తిట్టారు (వ 28).

**9:35** 5:14 నోట్. తనకు చెందిన వారందరినీ ఆయన వెతికి కనుగొంటాడు. తమ నమ్మకం కారణంగా మనుషులద్వారా వెలివేయబడిన వారి చెంతకు వస్తాడు.

"దేవుని కుమారుని మీద నీకు నమ్మకం ఉందా?" అని
అడిగాడు. 36 అతడు "స్వామీ, ఆయన మీద నేను నమ్మకం
ఉంచాలంటే ఆయన ఎవరండి?" అని అడిగాడు. 37 యేసు
అతనితో అన్నాడు "నీవు ఆయనను చూశావు. నీతో
మాట్లాడుతూ ఉన్నవాడు ఆయనే." 38 అతడు "నేను నమ్ముతూ
ఉన్నాను, స్వామీ!" అంటూ ఆయనను ఆరాధించాడు.
39 యేసు "చూడనివారు చూడాలి, చూచేవారు గుడ్డివారు
కావాలి అనే తీర్పు జరగాలని నేను లోకంలోకి వచ్చాను"
అన్నాడు.
40 ఆయనదగ్గర ఉన్న కొందరు పరిసయ్యులు ఆ మాటలు
విని "మేము కూడా గుడ్డివాళ్ళమా?" అని ఆయననడిగారు.
41 యేసు వారితో "మీరు గుడ్డివారై ఉంటే మీకు పాపం
ఉండేది కాదు గాని 'చూస్తూ ఉన్నాం' అని మీరిప్పుడు
అంటున్నారు, గనుక మీ పాపం నిలిచి ఉంది" అన్నాడు.

10 "మీతో ఖచ్చితంగా చెపుతున్నాను, గొర్రెల దొడ్డిలోకి
ద్వారంగుండా రాక వేరే విధంగా ఎక్కి వచ్చేవాడు
దొంగ, దోపిడీగాడు. 2 ద్వారంగుండా లోపలికి వచ్చేవాడు
గొర్రెల కాపరి. 3 ద్వారపాలకుడు ఆయనకు తలుపు తెరుస్తాడు.
గొర్రెలు ఆయన స్వరం వింటాయి. తన సొంత గొర్రెలను పేరు
పెట్టి పిలుస్తాడు, బయటికి నడిపిస్తాడు. 4 తన సొంత గొర్రెలను
బయటికి తెచ్చినప్పుడు తాను వాటికి ముందు నడుస్తాడు. ఆ

---

"దేవుని కుమారుని" – మత్తయి 8:20.

**9:36** ఆ రోజుల్లోని పరిసయ్యుల్లో అనేకమందిలాగా కాకుండా సత్యం వెల్లడి అయితే దాన్ని నమ్మేందుకు ఇతడు సిద్ధమే. యేసుప్రభువును స్వీకరించేందుకు అన్ని చోట్లా వ్యక్తులను దేవుడు ఇలాగే సిద్ధపరుస్తూ ఉంటాడు (6:37,44).

**9:37** 4:26. వినయ విధేయతలు గలవారికీ, చిన్నపిల్లల్లాంటి వారికీ తన గురించిన సత్యాన్ని వెల్లడి చేయడం ప్రభువుకు ఎంతో సంతోషం.

**9:38** మనుషులు తనను ఆరాధించబోయినప్పుడు యేసుప్రభువు అంగీకరించేవాడు (మత్తయి 8:2; 9:18; 14:33; 15:25; 28:9,17). దేవుణ్ణి మాత్రమే ఆరాధించాలని ఆయనకు తెలుసు (మత్తయి 4:10). కాబట్టి ఆరాధనను తాను స్వీకరించడంలో తాను దేవుని అవతారమని తనకు తెలుసని కనపరుస్తున్నాడు.

**9:39** తీర్పరిగా కూర్చుని మనుషులకు శిక్షలు విధించేందుకు ఆయన రాలేదు. కానీ లోకానికి వెలుగుగా ఆయన రాకడే తీర్పును తెచ్చినట్టుంది (3:17-21). అది మనుషుల్ని రెండు వర్గాలుగా విభజించింది – ఆ వెలుగు దగ్గరికి వచ్చినవారు, రాకుండా ఉన్నవారు; చూపు పొందినవారు, అంధులుగానే ఉండిపోయినవారు. ఈ వచనంలో యేసు ఆధ్యాత్మిక అంధత్వం, దృష్టి గురించి మాట్లాడుతున్నాడన్నది స్పష్టం.

"చూచేవారు గుడ్డివారు కావాలి" అనడంలో వెలుగు ఉండి చూస్తున్నాం అనుకునేవారినీ అలా అనుకొని గర్వపడేవారినీ పూర్తి అంధులుగా చేయడం జరుగుతుంది అని యేసు ఉద్దేశం (మత్తయి 13:14-16 పోల్చి చూడండి). క్రీస్తు ఇచ్చే వెలుగును నిరాకరించడంలో వారు తమపైకి తామే తెచ్చి పెట్టుకున్న తీర్పు ఇది. యేసు ఈ లోకానికి వచ్చిన ఇతర కారణాల గురించి మత్తయి 5:17 నోట్స్ చూడండి.

**9:40** చూడగలిగిన వాళ్ళం తాము మాత్రమే అనుకున్నారు. తాము అంధులమై ఉండవచ్చునన్న ఆలోచన చూచాయగానైనా వారికి కలగలేదు. మానవ హృదయం (యిర్మీయా 17:9), సైతాను శక్తి (2 కొరింతు 4:4) ఎలాంటివో చూడండి.

**9:41** దేవుడు వారికిచ్చే వెలుగు విషయంలో ఏం చెయ్యాలన్నది మనుషుల బాధ్యతే. 12:35,36; మత్తయి 6:22,23; లూకా 11:35 పోల్చి చూడండి. పాత ఒడంబడిక వెలుగు ఆ యూదులకు ఉంది. లోకానికి వెలుగై ఉన్నవాడు వారిమధ్య ఉన్నాడు. అంతటా మనుషులందరికీ దేవుడిచ్చే వెలుగు కూడా వారికి ఉంది – 1:9; రోమ్ 1:18-20. వారు పూర్తిగా అంధులైతే, ఒక్క కాంతి కిరణమైనా వీరికి సోకకపోతే వారిపై ఏమీ బాధ్యత ఉండేది కాదు. వెలుగును నిరాకరించిన దోషం వారికి అంటేది కాదు. కానీ వారి జ్ఞానాన్ని బట్టి వారికి గర్వం. తమ అవసరత ఒప్పుకోవడానికి సిద్ధంగా లేరు. తమకున్న వెలుగును ఇష్టపూర్తిగా నిరాకరించారు. అందువల్ల దేవుడు వారి దోషాన్ని చూచీ చూడనట్టు ఊరుకోలేదు. ఆధ్యాత్మిక విషయాల్లో జ్ఞానం, వెలుగు కలిగి ఉండి దాన్ని సరిగా ఉపయోగించుకోకపోవడం కన్నా ఏమీ లేకుండా ఉండడం మంచిది ( 2 పేతురు 2:21 పోల్చి చూడండి). ఎక్కువ సత్యం తెలిసి దాన్ని ఆచరణలో పెట్టని క్రైస్తవులు అసలు క్రీస్తు అంటే ఎప్పుడూ వినని వారికంటే ఎక్కువ శిక్షావిధికి పాత్రులు. మనకు ఎంత ఎక్కువ వెలుగు ఉంటే దాన్ని అనుసరించని పక్షంలో మన పాపం అంత ఎక్కువగా ఉంటుంది.

**10:1** 9 అధ్యాయంలో చివరి వచనాలకు ఇది కొనసాగింపు. ఆ దృశ్యం, వ 19-21లో చెప్పిన యూదులు, గుడ్డివాడు అలానే ఉన్నారు. కాబట్టి ఈ అధ్యాయం వ 1-18ను యేసు పరిసయ్యులకు చెప్తున్నాడనుకోవచ్చు. వారు తమను తాము గురువులుగా, ఇస్రాయేల్‌ప్రజల కాపరులుగా భావించుకొనేవారు (మత్తయి 23:2,3; రోమ్ 2:17-21. ఈ అధ్యాయంలో యేసు తానే దేవుని ప్రజలకు నిజమైన కాపరిననీ, పరిసయ్యులు దొంగలు, దోపిడీదారులు, తోడేళ్ళవంటి వారనీ చెప్తున్నాడు. వారు తమ స్వలాభం కోసం గొర్రెలను వాడుకోవడం, లేదా వారిని నాశనం చేయడానికే సమకట్టిన వారనీ చెప్తున్నాడు. అంటే పరిసయ్యులు కపటులు, స్వార్థపరులైన కాపరులన్నమాట. కొన్ని పాత ఒడంబడిక లేఖనాల్లో దేవుడు తానే తన ప్రజలకు కాపరినని చెప్తూ, ఇలాంటి దొంగ కాపరులను కఠినమైన పదజాలంతో వర్ణించాడు. కీర్తన 80:1; యెషయా 40:10,11; 56:9-12; యిర్మీయా 23:1-4; 25:32-38; యెహెజ్కేలు 34 అధ్యాయం; జెకర్యా 11:4-17 చూడండి.

ఇక్కడ 10:1-18లో యేసు ఒక ఆధ్యాత్మిక సత్యాన్ని తెలిపేందుకు ఒక ఉదాహరణ చెప్తున్నాడు. గొర్రెలు అంటే క్రీస్తు సొంత ప్రజలు. ఆయన స్వరం విని, నమ్మి, విధేయులయ్యేవారు (వ 15-29). క్రీస్తు తానే తన ప్రజలకు ద్వారం, నిజమైన కాపరి (వ 7,11). దొంగలు, దోచుకునేవారు, తోడేళ్ళు వీరంతా తమ లాభంకోసం రహస్యంగా గానీ బహిరంగంగా గానీ గొర్రెల మీద పడి తినేసే మనుషులకు గుర్తు.

**10:2** దేవుని ప్రజల నిజమైన కాపరి సరైన దారిగుండా ప్రవేశిస్తాడు. దేవుడు ఆయన్ను నియమించి కాపరి పరిచర్యలో ఉంచుతాడు.

**10:3** వ 27; 18:37. క్రీస్తువిశ్వాసులు ఆయన తమతో మాట్లాడినప్పుడు గ్రహించగలుగుతారు. ఇతర ఉపదేశకుల మాటలకూ ఆయన మాటలకూ తేడాను గుర్తించగలుగుతారు. ఆయన స్వరానికి లోబడాలని చూస్తారు. బయటికి నడిపించడమంటే ఏమిటి? అంటే నీటి వాగులకూ పచ్చిక మైదానాలకూ తీసుకువెళ్ళడం. కీర్తన 23:1,2.

**10:4** మంచి కాపరి గొర్రెలను తోలడు గాని అవి వెళ్ళవలసిన

గొర్రెలకు ఆయన స్వరం తెలుసు గనుక అవి ఆయన వెంట
వెళ్తాయి. 5 పరాయివారి స్వరం వాటికి తెలియదు గనుక
పరాయివాని వెంట వెళ్ళనే వెళ్ళవు. అసలు, అతని దగ్గర నుంచి
పారిపోతాయి.”
6 ఈ ఉదాహరణ యేసు వారితో చెప్పాడు గాని తమతో
ఆయన చెప్పినవేవో వారికి అర్థం కాలేదు. 7 అందుచేత యేసు
వారితో మళ్ళీ ఇలా అన్నాడు:
“మీతో ఖచ్చితంగా చెపుతున్నాను, గొర్రెలకు నేనే ద్వారాన్ని.
8 నాకు ముందుగా వచ్చినవారంతా దొంగలు, దోపిడీదారులు.
గొర్రెలు వారి మాట వినలేదు. 9 నేను ద్వారాన్ని. నాద్వారా
ఎవరైనా లోపలికి వస్తే అతనికి రక్షణ లభిస్తుంది. అతడు
లోపలికి వస్తూ, బయటికి వెళ్తూ మేత కనుక్కొంటాడు.
10 దొంగ వచ్చే కారణం దొంగతనం, హత్య, నాశనం
చేయడానికే. మనుషులకు జీవం కలగాలనీ అది సమృద్ధిగా
కలగాలనీ నేను వచ్చాను. 11 నేను మంచి కాపరిని. మంచి
కాపరి గొర్రెలకోసం తన ప్రాణం ధారపోస్తాడు. 12 జీతగాడు
కాపరి కాడు. గొర్రెలు అతనివి కావు గనుక తోడేలు రావడం
చూశాడంటే గొర్రెలను విడిచిపెట్టి పారిపోతాడు. తోడేలు
వాటిని పట్టుకొంటుంది, చెదరగొట్టివేస్తుంది. 13 జీతగాడు
జీతగాడే గనుక పారిపోతాడు – గొర్రెల క్షేమం అంటే
అతనికేమీ పట్టదు.
14 “నేను మంచి కాపరిని. నాకు నా గొర్రెలు తెలుసు, నా

---

చోటికి తాను ముందుండి తీసుకువెళ్తాడు. క్రీస్తు తన ప్రజలను భూమినుంచి పరలోకానికి నడిపిస్తాడు. వారు వెయ్యవలసిన ప్రతి అడుగూ ఆయనకు తెలుసు, ఎందుకంటే వారికి సంభవించబోయే ప్రతిదాని విషయంలోనూ ఆయన వారికి ముందుగా వెళ్ళాడు. (1 పేతురు 2:21-25; హీబ్రూ 12:1-3).

**10:5** “పరాయివారి” – అంటే దుర్బోధకులు, కపట గురువులు, యేసుప్రభువును అనుసరించేవారికి సత్యం, అసత్యాల మధ్య ఉన్న తేడాను గుర్తించే వివేచన జ్ఞానం ఉంటుంది. యేసు చేసిన ఉపదేశానికి వ్యతిరేకమైనదేదైనా తప్పు, ప్రమాదకరం అని వారు తెలుసుకోగలుగుతారు. తమను తప్పుదారి పట్టించాలని చూస్తున్న పరాయివారి స్వరాన్ని అందులో వారు గుర్తిస్తారు (రోమ్ 16:17,18; హీబ్రూ 13:9). యేసు ఉపదేశాలను వారెంతగా తెలుసుకుని అర్థం చేసుకోగలిగితే, ఈ పరాయివారి స్వరాలను అంత స్పష్టంగా వారు గుర్తించగలుగుతారు. గొర్రెనని చెప్పుకునే వారెవరైనా క్రీస్తును పూర్తిగా వదిలిపెట్టి దుర్బోధల వెంట వెళ్ళిపోతే అది 1 యోహాను 2:19కు ఉదాహరణ.

**10:6** ఈ శుభవార్తలో తరచుగా యూదులు యేసు మాటలను అర్థం చేసుకోలేకపోవడం చూస్తాం (6:41,42,52; 7:35; 8:22,27). వారు ఆయన గొర్రెలు కారు (వ 26) కాబట్టి ఆధ్యాత్మిక జ్ఞానం వారికి లేదు.

**10:7** “నేనే ద్వారాన్ని” – యేసు ఆ రోజుల్లో కాపరులు, గొర్రెల పద్ధతులను బట్టి ఈ భాషాలంకారం ఉపయోగించాడు. కాపరి తన గొర్రెలను తిరిగి తన ఆవరణానికి తీసుకువచ్చి ద్వారంగుండా ఒక్కొక్కటీ వెళ్తుంటే వాటిని కనిపెట్టి చూచేవాడు. అన్నీ లోపలికి వెళ్ళాక అతడు ఈ ద్వారానికి అడ్డంగా పడుకునేవాడు. అతని శరీరం మీదుగా దాటకుండా ఏదీ, ఎవరూ లోపలికి రావడానికీ, బయటికి వెళ్ళడానికీ వీలులేదు. అతడే ద్వారమన్నమాట. పాపవిముక్తికి ఏకైక ద్వారం క్రీస్తే (ఆయన ఇక్కడ చెప్తున్నది ఇదే – వ 9). ఆయనద్వారా తప్ప ఎవరూ దేవుని ప్రజలనే గొర్రెల దొడ్డిలోకి రాలేరు. 14:6 చూడండి. మత్తయి 7:13,14 పోల్చి చూడండి.

**10:8** “నాకు ముందుగా” – పాత ఒడంబడిక కాలం ప్రవక్తల గురించి కాదు యేసుప్రభువు ఇలా చెప్పినది. మోషే, సమూయేలు, దావీదు లాంటివారు ప్రధాన కాపరి అయిన దేవుణ్ణి సేవించిన మంచి ఉపకాపరులు (కీర్తన 78:70-72). తన ప్రజలకోసం దేవుడు తానే ఇలాంటి కాపరులను బయలుదేరదీశాడు. దేవుడు పంపకుండా వచ్చిన వారి గురించి ఇక్కడ యేసు మాట్లాడుతున్నాడు. వారు తమ సొంత ప్రయోజనాల కోసం తమంతట తామే వచ్చి కాపరులమని చెప్పుకున్నారు (యిర్మీయా 23:21). క్రీస్తు కాలంలో ఇస్రాయేల్ పరిస్థితి ఇది. మత విషయాల్లో దొంగలు, దోపిడిగాళ్ళు పుష్కలంగా ఉన్నారు. అయితే ఈ యేసుప్రభువు గాక “కాపరి” అనే పేరుకు తగినవాళ్ళు వేరెవరూ లేరు (మత్తయి 9:36)

**10:9** “పాపవిముక్తి” – కాపరి, గొర్రెల ఉదాహరణలో యేసు మాట్లాడుతున్నది దీన్ని గురించే, అంటే పాపవిముక్తిలోని అన్ని అంశాల గురించీ అన్నమాట (రోమ్ 1:16). క్రీస్తు తన ప్రజలను బలపరిచే ఆహారాన్ని “మేత” సూచిస్తున్నది. వారు లోపలికి వస్తూ బయటికి వెళ్తూ ఉండడం జీవనయాత్ర అంతటిలో భద్రతనూ విడుదలనూ సూచించే మాటలు. గొర్రెల దొడ్డి, పచ్చిక మైదానం, మిగతావన్నీ కూడా మంచి కాపరివే, ఆయన పరిపాలన క్రింద ఉన్నవే. ఈ వచనానికి శ్రేష్ఠమైన వ్యాఖ్యానం 23వ కీర్తన అంతా.

**10:10** “దొంగ” – కపట ఉపదేశకులూ గురువులూ పాపవిముక్తి పొందని స్వార్థపరులైన కాపరులూ దొంగిలిస్తారు, దోచుకుంటారు, నాశనం చేస్తారు. దేవునికి మాత్రమే చెందవలసిన ఘనతను దొంగిలించే ప్రయత్నం చేస్తారు (7:18; మత్తయి 23:5-12). మనుషుల దగ్గర్నుంచి దేవుని వాక్కును తీసేసేందుకు ప్రయత్నిస్తారు (మత్తయి 15:6-9; యిర్మీయా 36:23-25; గలతీ 1:6,7). ఈవిధంగా వారు మనుషుల్ని నాశనం చేయజూస్తారు. ఇలాంటివారు తరచుగా హత్యకు కూడా పాల్పడతారు (మత్తయి 23:34-37; మొ॥). యేసు క్రీస్తు ఉద్దేశం, పరిచర్య ఇందుకు పూర్తిగా వ్యతిరేకం. మనుషులకు శాశ్వత జీవం, ఆత్మ సంబంధమైన జీవం ఇవ్వాలని ఆయన కోరిక. ఆయన పరలోకంనుంచి భూమికి వచ్చినది ఇందుకే. ఈ శుభవార్త జీవం అనేదానికి అంతటా ప్రాముఖ్యత ఇస్తున్నది (1:4; 3:16,36; 4:14; 5:24; 6:35,47,51; 11:25; 14:6). యేసు ఈ లోకానికి వచ్చిన ఇతర కారణాలకు మత్తయి 5:17 నోట్ చూడండి.

**10:11** పాత ఒడంబడికలో యెహోవా దేవుడే కాపరి (కీర్తన 23:1; యెషయా 40:10,11). ఈ వచనంలో యేసుప్రభువు తాను కాపరినంటున్నాడు. ఆయన యెహోవాదేవుని అవతారం. 8:24,58; 12:41; లూకా 2:11 కూడా చూడండి. ప్రాణం ధారపోస్తాడు అనేది ఆయన సిలువ మరణాన్ని సూచిస్తూ పలికిన మాట.

**10:12** “జీతగాడు” – కేవలం డబ్బుకోసం, లేదా ఏదైనా స్వంత ప్రయోజనంకోసం దేవుని ప్రజలకు పరిచర్య చేసేవాడు. గొర్రెలంటే వారికి ఏమీ ప్రేమ లేదు (వ 13).

“తోడేలు” – కపట బోధకులకూ అబద్ధ ప్రవక్తలకూ సూచన (మత్తయి 7:15,16; అపో కా 20:29-31).

**10:14,15** త్రిత్వంలో తండ్రి, కుమారుని విషయంలో ఉన్నంత వాస్తవంగానే క్రీస్తుకు గొర్రెలు, గొర్రెలకు క్రీస్తు తెలుసు. క్రీస్తు తన గురించి నేరుగా వారికి వెల్లడి చేసుకొన్నందువల్ల తన ప్రజలకు ఆయన తెలుసు (మత్తయి 11:27). ఆయన్ను గురించిన పూర్తి జ్ఞానం వారికి ఒక్క రోజులో వచ్చేయ్యదు.

సొంత గొర్రెలకు నేను తెలుసు. 15 తండ్రికి నేను తెలుసు. అలాగే నాకు తండ్రి తెలుసు. నా గొర్రెలకోసం నా ప్రాణం ధారపోస్తాను. 16 ఈ దొడ్డిలో లేని వేరే గొర్రెలు కూడా నాకు ఉన్నాయి. వాటిని కూడా నేను తీసుకురావాలి. అవి నా స్వరం వింటాయి. అప్పుడు ఒకే మంద ఉంటుంది, ఒకే కాపరి ఉంటాడు. 17 నా ప్రాణం మళ్ళీ తీసుకొనేలా దానిని ధారపోస్తాను, గనుక నేనంటే నా తండ్రికి ప్రేమ. 18 నా నుంచి నా ప్రాణం ఎవరూ తీయరు. నా అంతట నేనే దానిని ధారపోస్తాను. దానిని ధారపోయడానికీ దానిని మళ్ళీ తీసుకోవడానికీ నాకు అధికారం ఉంది. నా తండ్రి నాకు ఈ ఆజ్ఞ ఇచ్చాడు."

19 ఆ మాటల కారణంగా యూదులలో మళ్ళీ విభేదం పుట్టింది. 20 వారిలో చాలామంది ఇలా అన్నారు: "అతడు దయ్యం పట్టినవాడు, పిచ్చివాడు. అతడు మాట్లాడితే మీరు ఎందుకు వింటున్నారు?" 21 మరి కొందరైతే "అతడివి దయ్యం పట్టినవాడి మాటలు కావు. దయ్యం గుడ్డివాళ్ళ కండ్లు తెరవగలదా ఏమిటి?" అన్నారు.

22 అప్పుడు జెరుసలంలో ప్రతిష్ఠ మహోత్సవం జరిగింది. 23 అది చలికాలం. యేసు దేవాలయంలో ఉన్న 'సొలొమోను మంటపం'లో నడుస్తున్నాడు. 24 యూదులు ఆయన చుట్టు పోగై ఆయనతో "ఎంతవరకు మమ్మల్ని ఇలా అనుమానంలో ఉంచుతావు? నీవే అభిషిక్తుడివి గనుక అయితే మాకు తేటగా చెప్పు!" అన్నారు.

25 యేసు వారికిలా జవాబిచ్చాడు: "మీకు చెప్పాను గానీ మీరు నమ్మడం లేదు. నా తండ్రి పేర నేను చేస్తూ ఉన్న క్రియలు నన్ను గురించి సాక్ష్యమిస్తూ ఉన్నాయి. 26 అయితే మీరు నమ్మడం లేదు. ఎందుకంటే నేను మీతో చెప్పినట్టే మీరు నా గొర్రెలు కారు. 27 నా గొర్రెలు నా స్వరం వింటారు. వారు నాకు తెలుసు. వారు నన్ను అనుసరిస్తారు. 28 నేను వారికి శాశ్వత జీవం ఇస్తూ ఉన్నాను. వారు ఎన్నడూ నశించరు. వారిని నా

ఆయనలో నమ్మకం ఉంచి లోబడుతూ ఉండగా క్రమేణా పెరుగుతూ ఉండే జ్ఞానం అది (ఎఫెసు 1:17; ఫిలిప్పీ 3:10; 2 పేతురు 3:18). యేసు ఇక్కడ ఉపదేశిస్తున్నది తన గొర్రెలందరికీ తాను తెలుసునన్న సత్యమే. ఇది ఆయనెవరో కేవలం తెలిసి ఉండడం మాత్రమే కాదు. ఆరంభంలో ఆయన్ను కలుసుకోవడం, ఆయనతో సహవాసం చేయడం వీటిని ఇది సూచిస్తున్నది (1 యోహాను 1:3). ఇది ఆత్మ సంబంధమైన కలయిక, సహవాసం అని వేరే చెప్పనవసరం లేదుగా.

**10:16** తరువాతి కాలంలో ఆయనమీద నమ్మకం ఉంచబోయే ఇతర దేశప్రజలు, జాతుల మనుషుల గురించి యేసు ఇక్కడ చెప్తున్నాడు. వారు ఇప్పటిదాకా శుభవార్త వినకపోయినా, నమ్మకపోయినా, భవిష్యత్తులో వారలా చేస్తారని ఆయనకు తెలుసు. 6:37 పోల్చి చూడండి. అలాంటివారిని తన ప్రజల గుంపులోకి చేరుస్తానంటున్నాడు. ఈ కృప యుగమంతటిలో తన సేవకుల ద్వారా ఆయన ఇది చేస్తున్నాడు.

"ఒకే కాపరి" – ఈ యుగంలో "ఒకే మంద" అంటే యేసుక్రీస్తు సంఘం. యూదులు మాత్రమే గాక అన్ని జాతులవారూ అందులో ఉన్నారు. ఆయనొక్కడే సంఘానికి నిజమైన అధిపతి (ఎఫెసు 2:11-22 చూడండి).

**10:17** మూడోసారి యేసు తన ప్రాణాన్ని ధారపోయడం గురించి చెప్తున్నాడు (వ 11,15). ఆయన తన గొర్రెలకోసం చేసిన అత్యంత ప్రాముఖ్యమైన విషయం ఇదే. ఇంతకన్నా స్పష్టంగా గొర్రెల కోసం తన ప్రేమను ప్రదర్శించడం సాధ్యం కాదు (15:13; రోమ్ 5:6-8; 1 యోహాను 4:10). తండ్రి అయిన దేవుడు అనంత కాలంనుంచి కుమారుణ్ణి ప్రేమిస్తున్నాడు (5:20; 17:24). అయితే తన ప్రజలకోసం క్రీస్తు ప్రాణత్యాగం చేయడం తండ్రి ఆయన్ను ప్రేమించడానికి గల ప్రత్యేక కారణం. ఈ కారణాన్ని బట్టే తండ్రి ఆయన్ను అత్యున్నతంగా ఘనపరిచాడు (ఫిలిప్పీ 2:8,9).

**10:18** యేసు తాను చనిపోయిన వారిలో నుంచి సజీవంగా లేవడం గురించి మాట్లాడుతున్నాడు (మత్తయి 16:21; 28:6). ఆయన అనుమతిస్తేనే తప్ప ఎవరూ ఆయన ప్రాణం తీసుకోలేకపోయారు (19:10,11; మత్తయి 26:53). మరణించి తిరిగి సజీవంగా లేవకుండా ఆయన్నెవరూ ఆపలేకపోయారు. ఈ రెండూ కూడా ఆయన విషయంలో దేవుని సంకల్పమే. యేసుకు ఈ రెంటిమీద అధికారం ఉంది.

**10:19** 7:12,43; 9:16.

**10:20** 7:20; 8:48,52; మత్తయి 4:24. తాను ఏమై ఉన్నానని ఆయన చెప్పుకున్నాడో దాన్ని వారు నమ్మలేదు గనక ఆయన పిచ్చివాడనుకున్నారు. మతి ఉన్న ఏ మనిషి కూడా అవి సత్యం అయితేనే తప్ప యేసు తన గురించి చెప్పుకున్న సంగతులను చెప్పుకోలేడన్నది పచ్చి నిజం. యేసు పలికినది సత్యమై ఉండాలి. లేదా ఆయన నిజంగా పిచ్చివాడై ఉండాలి. దేన్ని నమ్మాలో ప్రతి వ్యక్తీ స్వయంగా నిశ్చయించుకోవాలి. యేసును దయ్యం పట్టినవాడని, పిచ్చివాడని చెపితే, ఆయన చూపిన సాక్ష్యాధారాలనూ రుజువులనూ పట్టించుకొనే అవసరం లేదనుకున్నారు ఆ యూదులు (వ 25; 5:31-47). ఎదుటివాడి వాదననుంచి బయట పడాలంటే ఇది సులభ మార్గం.

**10:21** కొందరు ఇతరులకన్నా కొంచెం తెలివైనవారు. అయితే వీరు కూడా యేసుప్రభువును అనుసరించడానికి ముందుకు రాలేదు. ఆయన పక్షంగా రెండు మూడు మాటలు మాట్లాడ్డం ఆయన కోరుతున్న నమ్మకం, భక్తిశ్రద్ధలు, అభినివేశం కావు.

**10:22** ఆలయం శత్రువుల చేతిలో పడి ధ్వంసమైన తరువాత క్రీ.పూ. 165లో దాన్ని తిరిగి ప్రతిష్ఠించిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ ఏటేటా జరిపేదే ఈ ప్రతిష్ఠ మహోత్సవం.

**10:24** "అభిషిక్తుడు" గురించి మత్తయి 1:1 నోట్. ఆయన్ను స్పష్టంగా మాట్లాడమంటున్నారు – ఆయన్ను నమ్మాలని కాదు, గాని తన గురించి చెప్పుకున్నది అబద్ధమని చెప్పి ఆయనపై నేరం మోపాలని.

**10:25** "నేనే క్రీస్తును, ఇస్రాయేల్ వారి అభిషిక్తుణ్ణి" అనే మాటలు యేసు వాడలేదు. అయితే ఆయన మాటల్లో కొన్ని స్పష్టంగా ఈ అర్థాన్నే ఇస్తున్నాయి. 5:16-47; 6:32-58; 8:12,23-29; 10:7-18 వంటి మాటలను ఆ అభిషిక్తుడు తప్ప వేరెవరూ యథార్థంగా పలకలేరు. ఆయన చూపిన రుజువుల్లో ఆయన చేసిన అద్భుతాలు కూడా భాగమే – వ 38, 5:36.

**10:26** 8:44.

**10:27** ఈ సత్యాలను ఆయన ఇంతకుముందే చెప్పాడు (వ 3,14,16). కొత్తగా ఆధ్యాత్మికంగా జన్మించినవారే క్రీస్తుకు చెందిన గొర్రెలు (3:3-8). వారిలో ఒక నూతన ఆధ్యాత్మిక స్వభావం ఉంది. గనకనే క్రీస్తు స్వరాన్ని విని ఆయన వెంట వెళ్ళగలుగుతారు. ఆయన వెంట వెళ్ళడమంటే ఆయనపై నమ్మకం పెట్టి ఆయనకు లోబడడం. ఆయన ప్రజల జంట లక్షణాలు నమ్మకం, విధేయత. అవి రెండూ లేకుండా మనుషులు నిజమైన క్రైస్తవులు కాలేరు.

**10:28** "శాశ్వత జీవం" – ఇది ప్రస్తుతం విశ్వాసులకు ఉన్నది

చేతిలో నుంచి ఎవరూ ఎత్తుకుపోరు. 29 వారిని నాకిచ్చిన నా తండ్రి అందరికంటే గొప్పవాడు. నా తండ్రి చేతిలోనుంచి వారిని ఎవరూ ఎత్తుకుపోలేరు. 30 నేను, నా తండ్రి ఒకటే."

31 యూదులు మళ్ళీ ఆయన మీద రువ్వడానికి రాళ్ళు చేతపట్టుకొన్నారు. 32 అయితే యేసు "నా తండ్రి నుంచి అనేక మంచి పనులు నేను మీకు చూపాను. ఆ పనుల్లో దేని కారణంగా మీరు నామీద రాళ్ళు రువ్వుతున్నట్టు?" అని వారికి బదులు చెప్పాడు.

33 "మంచి పనికి కాదు గానీ దేవదూషణకే మేము నీ మీద రాళ్ళు రువ్వుతాం. నీవు మనిషివే అయినా నిన్ను దేవుడుగా చేసుకుంటున్నందుకే" అని యూదులు ఆయనకు బదులు చెప్పారు.

34 యేసు వారికిలా జవాబిచ్చాడు: "మీ ధర్మశాస్త్రంలో 'మీరు దేవుళ్ళని నేను గదా చెప్పాను' అని వ్రాసి ఉంది గదా. 35 లేఖనం అర్థ రహితం కానే కాదు. దేవుని వాక్కు ఎవరి దగ్గరకు వచ్చిందో ఆయన వారిని దేవుళ్ళు అన్నాడూ అంటే,

---

(3:36; 5:24). క్రీస్తును అనుసరించడం మూలంగా వారికి శాశ్వత జీవం కలగదు. వారిలో శాశ్వత జీవం ఉంది కాబట్టి వారు క్రీస్తును అనుసరిస్తారు.

"ఎన్నడూ నశించవు" – తన గొర్రెలన్నీ ఎప్పటికీ క్షేమంగా భద్రంగా ఉన్నారని క్రీస్తు బహు స్పష్టంగా ప్రకటిస్తూ ఉన్నాడు. 6:39,40,54,56; 17:11,15; రోమ్ 5:9,10; 8:30–39; ఫిలిప్పీ 1:6; హీబ్రూ 7:25; 1 పేతురు 1:3–5 చూడండి. వ 27,28లోని మాటల కూర్పును జాగ్రత్తగా గమనించండి. ఇలా రాసి లేదు – "నా గొర్రెలు నా స్వరం వింటే, నన్ను అనుసరిస్తే నేను వాటికి శాశ్వత జీవం ఇస్తాను. అప్పుడు అవి ఎన్నడూ నశించవు". క్రీస్తు మాటల్లో "వింటే", "అనుసరిస్తే" అన్నవి లేవు. అలాంటి షరతులు కూడా లేవు. గొర్రెల భద్రత అవి యేసు గొర్రెలే అన్న విషయంపై ఆధారపడేది గాని మరి ఏ ఇతర షరతుపైనా ఆధారపడి లేదు. గొర్రెల లక్షణం తను కాపరి స్వరం విని అతణ్ణి అనుసరించడమే. అవి అలా చెయ్యకపోతే అవి గొర్రెలే కాదన్నమాట. నిజమైన గొర్రెలు మంచి కాపరి కాపుదలలో ఉండడం వల్లే క్షేమంగా, భద్రంగా ఉన్నారు.

కానీ విశ్వాసులు క్రీస్తులో తమ నమ్మకాన్ని వదులుకుని ఆయన్ను శాశ్వతంగా విడిచిపెట్టడం సాధ్యం కాదా? అలా చేసేవారు నశించిపోతారు. కానీ తన గొర్రెలు ఎన్నడూ నశించరని క్రీస్తు చెప్తున్నాడు. మొదట్లో వారికి నమ్మకాన్ని దయచేసిన దేవుడు (ఫిలిప్పీ 1:29; ఎఫెసు 2:8; హీబ్రూ 12:2) వారిని ఆ నమ్మకంలో చివరిదాకా కొనసాగేలా చేస్తాడని దీని భావం (లూకా 22:31,32; రోమ్ 5:9,10; 8:37; ఫిలిప్పీ 1:6; 1 పేతురు 1:5 చూడండి). యిర్మీయా 32:40 పోల్చి చూడండి. అలాగైతే గొర్రెలు కొన్నిసార్లు దారి తప్పి ఎటో వెళ్ళిపోవచ్చు గదా. తాత్కాలికంగా అలా జరగవచ్చు. అయితే అలాంటి సందర్భాల్లో తానేమి చేస్తాడో యేసుప్రభువు తెలియజేశాడు (మత్తయి 18:12–14; లూకా 15:3–7).

అయితే ఇలా భద్రత ఉందన్న ఉపదేశం పాపాన్ని ప్రోత్సహించదా? తాము శాశ్వతంగా క్షేమంగా ఉన్నామనుకుని గొర్రెలు తమకిష్టం వచ్చినట్టు చేయరా? ఈ ఆలోచనా విధానం నిజమైన గొర్రెల మనస్తత్వం కాదు. వారికిష్టమైనదాన్నే ఇప్పుడు చేస్తున్నారు. అంటే క్రీస్తును అనుసరించడం వారికి ఇష్టం. ఇప్పుడు అనుసరిస్తున్నదాని కంటే మరింత సన్నిహితంగా అనుసరించలేకపోతున్నామే అన్నదే వాళ్ళ విచారం. అలా కాకపోతే వారు ఆయన గొర్రెలు కాదన్నమాట. తాము భద్రంగా ఉన్నామన్న జ్ఞానం వారిలో పవిత్రతను పెంపొందిస్తుంది. ఈ పవిత్రత తప్పిపోతామేమోనన్న భయంపై ఆధారపడేది కాదు గాని మంచి కాపరిని ప్రేమించడంపై, ఆయన ప్రేమ, ప్రభావాలపై ఉన్న నమ్మకంమీద ఆధారపడే పవిత్రత అది.

"నా చేతిలో నుంచి" – ఆయన చేతిలోనుంచి గొర్రెలను లాక్కోవాలంటే ఆయనకన్న బలమైన చెయ్యి కావాలి. ఏ దుర్మార్గుడూ, సాక్షాత్తూ సైతాను అయినా క్రీస్తు గొర్రెలను ఆయననుంచి ఎత్తుకుపోలేడు. క్రీస్తు మంచి కాపరి. ఏ కాపరి అయినా తన గొర్రెలను క్షేమంగా ఉంచుకోవాలంటే రెండు విషయాలు అవసరం – అలా ఉంచుకోవాలన్న పట్టుదల, అందుకు కావలసిన శక్తిసామర్థ్యాలు. క్రీస్తుకు ఈ పట్టుదల, సామర్థ్యం రెండూ పరిపూర్ణంగా ఉన్నాయి. ఆయన ఎవరో, ఏమిటో దాన్నిబట్టే గొర్రెలు క్షేమంగా ఉన్నారు.

క్రీస్తుకు చెందిన ప్రజలు తండ్రినుంచి ఆయనకు లభించిన ప్రత్యేక ప్రేమ బహుమానం (6:37; 17:6). ఈ బహుమానాన్ని కాపాడుకోవడానికి ఆయన తన శక్తినంతటినీ ఉపయోగిస్తాడు. ఆయన శక్తి అమితం.

**10:29** రెండు అమిత శక్తిగల హస్తాలు క్రీస్తు గొర్రెలకు కాపుదలగా ఉన్నాయి. ఇది రెట్టింపు భద్రత. కొలస్సయి 3:2 చూడండి. విశ్వాసుల జీవం దేవుని లోపలే దాచబడి ఉంది. దాన్ని అక్కడనుంచి తొలగించగలిగేదెవరు?

"అందరికంటే గొప్పవాడు" – 14:28 చూడండి.

**10:30** తండ్రీ, కుమారుడూ ఒకే వ్యక్తి అని ఇది చెప్పడం లేదు. అలాంటి అర్థం దీనికి రాదు. గ్రీకులో ఈ "ఒకటే" అనే పదం ఇద్దరూ ఒకే తత్వంలో ఐక్యమై ఒకే స్వభావంలో భాగస్వాములై ఉన్నారని సూచిస్తున్నది. 1:1 చూడండి. ఫిలిప్పీ 2:6; లూకా 2:11 నోట్స్‌లో ఇతర రిఫరెన్సులు చూడండి. త్రిత్వం గురించి 5:30; మత్తయి 3:16,17; 28:19; 2 కొరింతు 13:14; ఎఫెసు 4:6 చూడండి. ఇక్కడ ఉన్న యేసు ఉపదేశం అద్వైత వేదాంతం వంటిది ఏమాత్రమూ కాదు. మనుషులంతా దేవునితో ఏకమైన వారేననీ, మనిషి ఆత్మ, దేవుని ఆత్మ ఒకటేననీ అద్వైతం నేర్పుతూవుంది. యేసు చెప్పినది ఇది కానే కాదు. తాను అంటే దేవుని ఏకైక కుమారుడు తండ్రితో ఏకంగా ఉన్నానని చెప్తున్నాడు. తాను ప్రత్యేకమైన వ్యక్తిననీ, కొన్ని ప్రాముఖ్య విషయాల్లో ఇతర మనుషుల్లాంటివాడు కాదని పదే పదే చెప్పాడు – 3:15; 8:23,24; మొ။.

**10:31** 5:18 చూడండి.

**10:32** వ 30లో ఆయన చెప్పిన సత్యాన్ని సూచించేవే ఆయన అద్భుతాలు. మొద్దుబారిపోయిన ఈ అవిశ్వాసులు తన గురించి ఆయన చెప్పిన దాన్నంతటినీ, చూపిన రుజువులన్నిటినీ నిరాకరించి ఆయన మానవ మాత్రుడే అన్నారు. కానీ రెండు విషయాల్లో వాళ్ళు చెప్పినది నిజమే – ధర్మశాస్త్రం ప్రకారం దేవదూషణకు శిక్ష మరణమే. మనవ మాత్రుడు తాను దేవుణ్ణని చెప్పుకోవడం దేవదూషణే. అది మరణశిక్షకు తగిన భయంకరమైన పాపం (లేవీ 24:16; సంఖ్యా 15:30). రాబోయే న్యాయవిరోధి చేసే పాపం సరిగ్గా ఇదే ( 2 తెస్స 2:3,4). బైబిల్లో నిజ దేవుడు మనుషులందరినీ సృష్టించినవాడుగా, వారికంటే అన్ని విధాలా ఉన్నతుడుగా తనను తాను వెల్లడి చేసుకున్నాడు (ఆది 2:7; సంఖ్యా 23:19; కీర్తన 9:19,20; యెషయా 40:22–26). కానీ యేసు మానవమాత్రుడు అనుకోవడంలో ఈ యూదులు ఘోరమైన పొరపాటులో ఉన్నారు.

**10:34** కీర్తన 82:6. ఆ కీర్తన గురించి నోట్స్ చూడండి.

**10:35** పూర్తి పాత ఒడంబడిక గ్రంథం (లేఖనం)

36 తండ్రి ప్రత్యేకించి లోకానికి పంపినవాడు ‘నేను దేవుని
కుమారుణ్ణి’ అని చెప్పినందుచేత ‘నీవు దేవదూషణ చేస్తున్నావు’
అని మీరు అంటారా? 37 నా తండ్రి క్రియలు నేను చేయకపోతే
నన్ను నమ్మకండి. 38 అవి నేను చేస్తూ ఉంటే, నన్ను
నమ్మకపోయినా తండ్రి నాలో ఉన్నాడనీ నేను తండ్రిలో
ఉన్నాననీ మీరు తెలుసుకొని నమ్మేలా ఆ క్రియలే నమ్మండి.”
39 మరోసారి వారు ఆయనను పట్టుకోవడానికి చూశారు
గానీ ఆయన వారి చేతికి చిక్కకుండా వెళ్ళాడు.
40 అప్పుడాయన యొర్దాను అవతలికి, యోహాను
మొట్టమొదట బాప్తిసం ఇచ్చిన స్థలానికి తిరిగి వెళ్ళి అక్కడ
ఆగిపోయాడు.

41 చాలామంది ఆయన దగ్గరికి వచ్చి “యోహాను
అద్భుతమైన సూచన ఏదీ చేయలేదు గాని ఈయన విషయం
అతడు చెప్పినదంతా నిజమే” అని చెప్పుకొన్నారు.
42 అక్కడ చాలామంది ఆయనమీద నమ్మకం ఉంచారు.

11 బేతనీ గ్రామం వాడైన లాజరుకు జబ్బు చేసింది. ఆ
గ్రామంలోనే మరియ, ఆమె సోదరి మార్త
ఉండేవారు. 2 ఈ మరియ అత్తరుతో ప్రభువును అభిషేకించి
తన తల వెంట్రుకలతో ఆయన పాదాల తుడిచింది. జబ్బుగా
ఉన్న లాజరు ఈమె సోదరుడు. 3 అందుచేత అక్కచెల్లెండ్లు
యేసుకు ఇలా కబురంపారు: “ప్రభూ! నీవు ప్రేమతో చూచే
వాడికి జబ్బు చేసింది.”
4 అది విని యేసు “ఆ రోగం రావడం మరణం కోసం కాదు
గాని దాని ద్వారా దేవుని కుమారునికి మహిమ కలిగేలా దేవుని
మహిమకోసమే వచ్చింది” అన్నాడు.
5 యేసుకు మార్త, ఆమె సోదరి, లాజరు అంటే ప్రేమ.
6 అతడు జబ్బుగా ఉన్నాడని విని కూడా ఆయన ఉన్న చోట
ఇంకా రెండు రోజులు ఉండిపోయాడు. 7 ఆ తరువాత ఆయన
శిష్యులతో అన్నాడు “యూదయకు తిరిగి వెళ్దాం, పదండి.”
8 శిష్యులు “గురువర్యా, ఇటీవలే యూదులు నీమీద రాళ్ళు
రువ్వాలని చూశారు! తిరిగి అక్కడికి వెళ్తావా?” అని ఆయనతో
అన్నారు.
9 యేసు ఇలా జవాబిచ్చాడు: “పగటికి ఉన్నవి పన్నెండు
గంటలు గదా. ఎవరైనా పగటివేళ నడిస్తే అతనికి ఈ లోకం
వెలుగు కనిపిస్తుంది గనుక తడబడడం అంటూ ఉండదు.

---

రాయించినది దేవుడే అనీ అది దేవుని అధికారం గలదనీ యేసుప్రభువు ఇక్కడ స్థిరపరుస్తున్నాడు. మత్తయి 4:4,7,10; 5:17,18; 15:3; 22:43; మార్కు 12:36; లూకా 24:44 కూడా చూడండి. ఆయన దృష్టిలో పాత ఒడంబడిక గ్రంథం దేవుని వాక్కు.

**10:36** యేసు వారికిచ్చిన జవాబు స్పష్టంగా, చాలా ప్రభావం గలదిగా ఉంది. దేవుడే మానవమాత్రులను కీర్తన 82:6లో దేవుళ్ళు అనీ, సర్వాతీతుని కుమారులు అనీ అన్నాడు. ఇది దేవదూషణ కాదు. అలాగైతే సాక్షాత్తూ ఒక్కడే అయిన దేవుని కుమారుడే తాను ఆ కుమారుణ్ణి అని చెప్పుకోవడం దేవదూషణ ఎలా అవుతుంది? 82వ కీర్తనలో దేవుడు ఇస్రాయేల్ నాయకులకు వారి ఉన్నత పదవులకు అనుగుణంగా బిరుదులు ఇవ్వడం ద్వారా వారిని గౌరవిస్తున్నాడు. అయితే దేవుడు క్రీస్తును ప్రత్యేకించి ఈ లోకానికి పంపడం ద్వారా ఆయనను గౌరవించాడు (3:13–17; 5:37; 6:57; 8:29 కూడా చూడండి).

**10:37,38** తాను దేవుని కుమారుణ్ణనీ, తండ్రితో ఏకమై ఉన్నాననీ చెప్పడమే కాదు, అందుకు ఆధారాలూ రుజువులూ ప్రదర్శించాడు. ఆయన అద్భుతాలు ఆయన మాటల్ని బలపరచాయి (2:11; 5:36; మత్తయి 8:1; 11:4,5).

**10:39** యేసు చెప్పగలిగినదేదీ కఠినులు, దురభిమానులు, బుద్ధికి వ్యతిరేకులు అయిన ఈ మనుషుల్ని ఒప్పించలేదు.

**10:40** 1:28. ఇది యొర్దాను నదికి తూర్పున ఉంది.

**10:41** “చెప్పినదంతా” – 1:26,27,29,34.

**10:42** జెరుసలంలో గాఢమైన యూద మతనిష్ఠ వాతావరణానికి దూరంగా ఉన్నవారు క్రీస్తు ఉపదేశాలను అంత తేలికగా నిరాకరించక, నమ్మడానికి మరింత సుముఖంగా ఉన్నారు.

**11:1** లాజరు అనే పేరు ఎలియాజరు అనే పేరులోనుంచి వచ్చింది. దీని అర్థం “దేవుడు సహాయం చేశాడు”. జెరుసలంకు తూర్పు దిక్కున ఆలివ్ కొండపై బేతనీ గ్రామం ఉంది.

**11:2** 12:3. శుభవార్తల్లో మరియ అనే పేరున్న స్త్రీలు కొందరు కనిపిస్తారు – 19:25; మత్తయి 1:18; 27:56.

**11:3** కష్టకాలంలో విశ్వాసులంతా చేయవలసినది ఇదే. యేసుకు ఈ కుటుంబ సభ్యులంతా బాగా తెలుసు. వారిపట్ల ఆయన ప్రత్యేక వాత్సల్యం చూపించాడు. లాజరు అక్కచెల్లెళ్ళు అతని పేరును కూడా యేసుకు చెప్పనవసరం లేదు.

**11:4** యేసు ప్రత్యేకంగా అభిమానించిన వ్యక్తికి కూడా జబ్బు చేసింది చూడండి. ప్రభువు ఆ వ్యాధిని రాకుండా చేయలేదు, అంతకు ముందు ఆయన అనేక వ్యాధులను బాగుచేసినా అతణ్ణి బాగు చెయ్యలేదు. యోబు 2:48; 2 కొరింతు 12:7–10; 1 తిమోతి 5:23; 2 తిమోతి 4:20 కూడా చూడండి.

“మహిమ కలిగేలా” – 9:3 పోల్చి చూడండి. దేవుని కుమారునికి మహిమ కలిగితే దేవునికి మహిమ కలుగుతుందని గమనించండి. లాజరు మరణం యేసుప్రభువు తన కృప, ప్రభావాలను ప్రదర్శించేందుకు మరో అవకాశం అతణ్ణి తిరిగి బ్రతికించడమనే మహా అద్భుతం. ఆయన దేవుని కుమారుడైన అభిషిక్తుడనడానికి మరో సూచన (2:11).

**11:6** యేసుప్రభువుకు వారంటే ప్రేమ ఉన్నప్పటికీ వారికి సహాయం చేసేందుకూ ఓదార్చేందుకూ పరుగెత్తుకుంటూ వాళ్ళ ఊరు వెళ్ళలేదు. అంతకన్నా శ్రేష్ఠమైన కార్యం ఒకటి, దానికి అనువైన సమయంలో చేయాలని ఆయన మనస్సులో ఉంది. తమ సమస్యను ఆయన చేతుల్లో వదిలి ఆయన సమయం కోసం ఎదురు చూచేవాళ్ళకు సరైన సమయంలో తమకు లభించగల అన్ని మేలుల్లోకీ గొప్ప మేలు ఆయన్నుంచి లభిస్తుంది. ప్రభువు ఆలస్యం చేస్తున్నాడంటే మన మనవి నిరాకరించాడని కాదు. ఆయన ఉద్దేశంలో అందుకు మంచి కారణాలు ఉండబట్టి కొన్ని సార్లు మనల్ని బాధలు పడనిస్తాడు (2 కొరింతు 4:17; 12:7–10; ప్రకటన 2:10; యోబు 3:20). లాజరు విషయంలో ఆయన ఇలా జాగుచేయడం బహుశా అతని అక్కచెల్లెళ్ళకూ, తన శిష్యులకూ విశ్వాస పరీక్షగా ఆయన ఉద్దేశించాడేమో. 1 పేతురు 1:6,7.

**11:7** జెరుసలం ముఖ్య పట్టణంగా ఉన్న ప్రాంతం యూదయ.

**11:8** “గురువర్యా” – 1:38.

**11:9,10** 9:4; 12:35 పోల్చి చూడండి. ఒక పనిని పూర్తి చేయడానికి దేవుడు ఒక సమయాన్ని నియమిస్తాడు; దేవుడిచ్చిన వెలుగులో నడుచుకునేవారు దేనికీ భయపడనవసరం లేదు; తాను చేస్తున్నదేమిటో తనకు బాగా తెలుసు; వెలుగులో

10 కానీ రాత్రివేళ నడిచేవాడిలో వెలుగు లేకపోవడంచేత
తడబడుతాడు.”
11 ఇలా చెప్పిన తరువాత ఆయన “మన స్నేహితుడు
లాజరు నిద్రపోయాడు. అతణ్ణి మేల్కొలపడానికి వెళ్తాను” అని
వారితో చెప్పాడు.
12 అందుకు శిష్యులు “ప్రభూ! అతడు నిద్రపోతూ ఉంటే
బాగుపడుతాడు” అన్నారు.
13 యేసు అతని మృతిని గురించి అలా చెప్పాడు గాని
సహజమైన నిద్ర వల్ల కలిగే విశ్రాంతిని గురించి ఆయన
చెప్పాడని వారనుకొన్నారు. 14 కనుక యేసు వారితో స్పష్టంగా
ఇలా చెప్పాడు:
“లాజరు చనిపోయాడు. 15 నేను అక్కడ లేనందుచేత
సంతోషిస్తూ ఉన్నాను. ఈ సంతోషం మీ మేలు విషయమే.
అంటే మీకు నమ్మకం కుదరాలని నా ఉద్దేశం. అతనిదగ్గరకు
వెళ్దాం, పదండి.” 16 అప్పుడు తోమా (అతణ్ణి ‘దిదుమ’ అని
కూడా అంటారు) సాటి శిష్యులతో అన్నాడు “ఆయనతో
చనిపోవడానికి మనం కూడా వెళ్దాం.”

17 యేసు వచ్చినప్పుడు లాజరు సమాధిలో నాలుగు
రోజులు ఉండడం ఆయన చూశాడు. 18 బేతనీ జెరుసలం
దగ్గరే, సుమారు మూడు కిలోమీటర్ల దూరాన ఉంది. 19 కనుక
మరియ, మార్తలను వారి సోదరుని విషయం ఓదార్చడానికి
చాలామంది యూదులు వారిదగ్గరికి వచ్చారు. 20 యేసు
వస్తూ ఉన్నాడని మార్త విన్నప్పుడు ఆయనకు ఎదురు వెళ్ళింది.
మరియ అయితే ఇంట్లో కూర్చుని ఉంది. 21 మార్త యేసుతో
ఇలా అంది:
“ప్రభూ, ఒక వేళ నీవు ఇక్కడ ఉండి ఉంటే నా సోదరుడు
చనిపోయి ఉండడు. 22 ఇప్పుడు కూడా నీవు దేవుణ్ణి ఏది
అడిగినా అది దేవుడు నీకిస్తాడని నాకు తెలుసు.”
23 యేసు ఆమెతో “నీ సోదరుడు సజీవంగా లేస్తాడు”
అన్నాడు.
24 “చివరి రోజున పునర్జీవితంలో అతడు లేస్తాడని నాకు
తెలుసు” అని మార్త ఆయనతో అంది.
25 అందుకు యేసు “పునర్జీవితాన్నీ జీవాన్నీ నేనే.
నామీద నమ్మకం ఉంచినవాడు చనిపోయినా జీవిస్తాడు.

---

ఆయనతోబాటు వారు సాగిపోవాలి అని యేసు ఇక్కడ చెప్తున్నాడు.

**11:11** “స్నేహితుడు” – 15:14,15 చూడండి. ఇక్కడ “నిద్రపోయాడు” అంటే అర్థం “చనిపోయాడు” (వ 14). శరీరం మరణించడానికి పాత, క్రొత్త ఒడంబడిక గ్రంథంలో రెండు పుస్తకాలలోనూ ఈ విధంగా వర్ణించడం జరిగింది (ద్వితీ 31:16; దానియేలు 12:2; మత్తయి 27:52; అపో కా 7:60; 13:36; 1 కొరింతు 7:39; 11:30; 15:6-18; 1 తెస్స 4:13,14. ఈ తర్జుమాలో సాధారణంగా ఇది “కన్ను మూయడం” అని అనువదించాం). ఈ మాట మరణం తరువాతి జీవితం, మరణించినవారి మధ్యనుంచి లేవడం అనేవాటిని సూచిస్తున్నది – నిద్రపోయిన వారు తెల్లారినప్పుడు తిరిగి లేస్తారు గదా (దానియేలు 12:2). ఈ సందర్భంలో నిద్రపోవడం అంటే చనిపోయినవారికి స్పృహ, చైతన్యం ఉండదని అర్థం కాదు – లూకా 16:22-26; ప్రకటన 6:9,10 చూడండి. నిద్రపోయేది ఆత్మ కాదు దేహమే. “మేల్కొలపడానికి” అంటే చనిపోయినవాణ్ణి తిరిగి సజీవంగా లేపడానికి అని అర్థం.

**11:12,13** ఇంతకుముందు తరచుగా జరిగినట్టుగానే మనుషులు యేసు మాటలను అక్షరాలా తీసుకుని వాటిని పొరపాటుగా అర్థం చేసుకున్నారు.

**11:14** 3:4; 4:11,15,32; 6:52; మత్తయి 16:6 పోల్చి చూడండి. క్రీస్తుకున్న మానవాతీతమైన జ్ఞానానికి మరో ఉదాహరణ. లాజరుకు జబ్బు చేసిందని మాత్రమే ఆయనకు కబురు వచ్చింది. కానీ అతడు చనిపోయాడని యేసుకు తెలుసు. 1:48-50; 2:24,25 కూడా చూడండి.

**11:15** యేసుప్రభువు ఒక మహా అద్భుతాన్ని చేయనున్నాడు. దాని ఫలితంగా ఆయన శిష్యుల నమ్మకం అభివృద్ధి చెందుతుంది. సంతోషించడానికి కారణం ఇదే గానీ లాజరు చనిపోవడం కాదు.

**11:16** “తోమా” – మత్తయి 10:3. “దిదుమ” అన్నా “తోమా” అన్నా అర్థం ఒకటే – “కవల”. యేసు గనక యూదయ ప్రాంతానికి తిరిగి వెళ్తే తప్పక హతమౌతాడనీ ఆయనతోబాటు తాము కూడా హతమవుతామన్న విషయంలో ఇతడికి ఏమాత్రం సంశయం ఉన్నట్టు లేదు. ప్రతిదానిలోనూ కీడు ఉందేమో అని తలంచే స్వభావం ఇతనిది. నమ్మకం ఉంచవలసిన సందర్భంలో సందేహించే మనస్తత్వం అతనికి ఉంది. (14:5; 20:24-27).

**11:17** లాజరు అక్కచెల్లెళ్ళు యేసుకు వార్త పంపిన కొద్ది సమయానికి లాజరు చనిపోయి ఉండాలి (వ 3). వార్త యేసుకు చేరడానికి ఒక రోజు పట్టి ఉంటుంది. ప్రయాణం కట్టకముందు ఆయన రెండు రోజులు ఆగాడు. ప్రయాణమై బేతనీ చేరడానికి మరో రోజు పట్టింది.

**11:19** ఈ కుటుంబం ఊళ్ళో మంచి పరువు మర్యాదలుగల కుటుంబం అయి ఉండాలి.

**11:20** ఇద్దరిలోనూ మార్త చురుకైనది. మరియ నెమ్మదిగా ఉండేది (లూకా 10:38-42).

**11:21** యేసు గనక అక్కడున్నట్టయితే లాజరును బాగుచేసి ఉండేవాడే అని ఆమె ఉద్దేశం. లాజరు విషయంలో ఇది నిజమో కాదో చెప్పలేము. అందరి విషయంలోనూ ఇది నిజం కాదని మనకు తెలుసు. ప్రభువు ఎప్పుడూ తన విశ్వాసులతో ఉండేవాడు (మత్తయి 28:20), నిజంగా వారిలో ఉండేవాడు (17:23; 2 కొరింతు 13:5; కొలస్సయి 1:27). అయినప్పటికీ ఇన్ని శతాబ్దాలుగా వారంతా చనిపోతూనే ఉన్నారు. వారిలో అనేకులు చాలా నొప్పులు, ఆయా వ్యాధులతో బాధపడుతూ చనిపోయారు.

**11:22** ప్రభువు ఆశ్చర్య క్రియలు చేయగలడని ఆమెకు తెలుసు. కానీ ఆ సమయంలో ఆయన లాజరును సజీవంగా లేపుతాడని ఆమె అనుకున్నదా అన్నది సందేహమే. వ 39 చూడండి. చనిపోయిన వారందరూ తిరిగి లేచే రోజున లాజరు లేస్తాడని ఆమె నమ్మింది (వ 24). అయితే అది వేరే విషయం. యేసు ఒకవేళ లాజరును బ్రతికిస్తాడేమోనన్న ఆలోచన ఆమెలో మొలకెత్తడానికి ప్రయత్నిస్తూ ఉండగా, దాన్ని నమ్మడానికి ఆమె కొట్టుమిట్టాడుతున్నదేమో. 23,25,26 వచనాల్లో ఆమెతో యేసు చెప్పిన మాటలు దాన్ని నమ్మేందుకు ఆమెను ప్రోత్సహించడం కోసమేమో.

**11:25** 5:21-29 చూడండి. యేసుప్రభువులో సాక్షాత్తూ దేవుని జీవం ఉంది. విశ్వాసుల జీవం ఆయనే (కొలస్సయి 3:3,4). ఆయనలో, ఆయనలో మాత్రమే మనుషులు శాశ్వత జీవాన్ని పొందగలరు (3:16,36; 6:53,54; 14:6). పునర్జీవితం ఆయనే. పునర్జీవితం అంటే పునర్జన్మ కానే కాదు. పునర్జన్మ అనే సిద్ధాంతం బైబిలు ఉపదేశానికి విరుద్ధం. 9:3 నోట్ చూడండి. తనకు ఇష్టమైనప్పుడు ఎవరినైనా, తనను సహా సజీవంగా లేపే అధికారం, శక్తి తనకున్నదని ఆయన చెప్తున్నాడు

26 బ్రతికి ఉండి నామీద నమ్మకం ఉంచేవాడు ఎన్నటికీ చనిపోడు. ఇది నమ్ముతున్నావా?" అని ఆమెతో అన్నాడు.

27 ఆమె ఆయనతో "అవును, ప్రభూ! నీవే లోకానికి రావలసిన దేవుని కుమారుడివనీ అభిషిక్తుడివనీ నమ్ముతున్నాను" అంది.

28 ఇలా చెప్పి ఆమె వెళ్ళి తన సోదరి మరియను పిలిచి రహస్యంగా "గురువుగారు వచ్చి నిన్ను పిలుస్తున్నారు" అంది.
29 ఆమె ఆ మాట విని గబాలున లేచి ఆయన దగ్గరికి తరలివెళ్ళింది. 30 యేసు ఇంకా గ్రామంలోకి రాలేదు. మార్త తనకు ఎదురు వచ్చిన స్థలంలోనే ఉన్నాడు. 31 ఇంటిలో మరియతో కూడా ఉన్న యూదులు ఆమెను ఓదారుస్తూ ఉన్నారు. మరియ గబాలున లేచి బయటికి వెళ్ళడం చూచినప్పుడు ఆమె సమాధి దగ్గర ఏడ్వడానికి వెళ్తుందని చెప్పి ఆమె వెంట వెళ్ళారు. 32 యేసు ఉన్న స్థలానికి మరియ చేరి ఆయనను చూచి ఆయన పాదాలదగ్గర సాగిలపడి "ప్రభూ! ఒకవేళ నీవు ఇక్కడ ఉండి ఉంటే నా సోదరుడు చనిపోయి ఉండడు" అంది.

33 ఆమె ఏడ్వడం, ఆమెతో వచ్చిన యూదులు కూడా ఏడ్వడం యేసు చూచి ఆందోళన చెంది ఆత్మలో పరితపిస్తూ ఇలా అన్నాడు: 34 "అతణ్ణి మీరెక్కడ ఉంచారు?" వారు "ప్రభూ, వచ్చి చూడండి" అని ఆయనతో అన్నారు.

35 యేసు కన్నీళ్ళు విడిచాడు. 36 అందువల్ల యూదులు "ఇదిగో అతడంటే ఈయనకు ఎంత ప్రేమో చూశారా!" అని చెప్పుకొన్నారు.

37 అయితే వారిలో కొంతమంది "ఆ గుడ్డివాడి కండ్లు తెరిచిన ఈ మనిషి లాజరు చావకుండా చేయలేక పోయేవాడా?" అన్నారు.

38 మళ్ళీ తనలో పరితపిస్తూ యేసు సమాధి దగ్గరికి వచ్చాడు. అది గుహ. దానిమీద బండ ఉంది. 39 యేసు "బండ తీసివేయండి" అన్నాడు. చనిపోయినవాని సోదరి మార్త "ప్రభూ, అతడు నాలుగు రోజులు నిర్జీవంగా ఉన్నాడు, గనుక కంపుకొడతుంది" అని ఆయనతో చెప్పింది.

40 యేసు "నీవు నమ్మితే దేవుని మహిమ చూస్తావని నేను నీతో అనలేదా?" అని ఆమెతో అన్నాడు.

---

(5:21; 10:17,18). క్రీస్తులో విశ్వాసులు దేవుని సన్నిధిలో అనంత కాలం జీవిస్తారు (14:3; 1 తెస్స 4:17). వారికి మరణం జీవితానికి అంతం కాదు. మరింత శ్రేష్ఠమైన జీవితానికి అది ఆరంభం మాత్రమే (2 కొరింతు 5:6-8; ఫిలిప్పీ 1:21-23).

**11:26** 5:24; 6:50,51. విశ్వాసులు శరీర సంబంధంగా మరణిస్తారు గాని శాశ్వతంగా జీవిస్తారు. ఆత్మ సంబంధమైన మరణం (ఎఫెసు 2:1) వారిని ఎన్నడూ తాకదు. తనమీద నమ్మకం ఉంచడం ఎంత ప్రాముఖ్యమో యేసు నొక్కి చెప్తున్న సంగతి మళ్ళీ గమనించండి. 3:15,16,18; 6:40; 8:24; 10:37,38 చూడండి.

**11:27** "అభిషిక్తుడు" – మత్తయి 1:1.

"దేవుని కుమారుడు" – 1:34,49; 6:68; 20:31; మత్తయి 3:17; 16:16. మార్తకున్న నమ్మకం నిజమైనది, స్థిరమైనది.

**11:30** మరియను ఒంటరిగా కలుసుకుని ఓదార్చి ఆమె నమ్మకాన్ని ప్రోత్సహించాలని ప్రభువు అక్కడ ఉండిపోయి నట్టుంది. కానీ యూదులు ఆమె వెంట రావడంతో అందుకు ఎక్కువ సమయం లేకపోయింది.

**11:32** వ 21. వ్యాధి నయం కావాలంటే యేసు శారీరికంగా ఆ ప్రదేశంలో ఉండాలన్నట్టు మార్త, మరియ ఇద్దరూ మాట్లాడారు. కానీ 4:47-53; మత్తయి 8:5-13 చూడండి.

**11:33** ఆయన అంత పరితపించడం, అంత ఆందోళన చెందడం ఎందుకు? బహుశా బాధపడుతున్న తన స్నేహితుల దుఃఖాన్ని సంపూర్ణంగా ఆయన పంచుకున్నాడేమో (యెషయా 63:9 పోల్చి చూడండి). బహుశా లాజరు భవిష్యత్తులో మరోసారి చనిపోయేలా అతడు ఉన్న ప్రశాంత స్థితినుండి వెనక్కు తీసుకురావాలని అతడి గురించి దుఃఖపడ్డాడేమో. లేక ఒకవేళ యేసు మరణం గురించీ అది పాపం మూలంగా లోకంలో ఎలా ప్రవేశించిందీ, శత్రువుగా మానవ జాతినంతటినీ ఎలా అణగద్రొక్కి బానిసలుగా చేసుకున్నదీ (రోమ్ 5:12,21; హీబ్రూ 2:14,15) ఆలోచిస్తున్నాడేమో. లేక మరణమనే ఈ శత్రువును ఓడించేందుకు త్వరలో తాను చెల్లించబోయే వెలను – అంటే లోక పాపాల కోసం సిలువపై ఘోర యాతనతో తాను మరణించవలసిన సంగతి గుర్తు చేసుకుంటున్నాడేమో. లేక తన బలి అర్పణవల్ల ఎలాంటి లాభమూ పొందకుండా పాపంలోనే చనిపోయి శాశ్వతంగా నశించిపోయే అనేకమందిని గురించి తలపోస్తున్నాడేమో. ఒకవేళ ఈ సమయంలో లాజరు సజీవంగా లేవాలని హృదయపూర్వకంగా ప్రార్థిస్తున్నాడేమో (వ 41). ఆయన ప్రార్థనలు చల్లగా నిర్లిప్తంగా ఉండవు (హీబ్రూ 5:7 పోల్చి చూడండి. విశ్వాసుల కోసం క్రీస్తు ఆత్మ చేస్తున్న ప్రార్థనలు కూడా పోల్చి చూడండి – రోమ్ 8:27).

**11:34** ఇలా అడగడంలో యేసుకు తెలియదని కాదు. ఆయనకున్న మానవాతీతమైన జ్ఞానానికి ఉదాహరణ వ 14లో చూడండి. ఆది 3:9లో దేవుడు ఆదామును అడిగిన ప్రశ్న గమనించండి.

**11:35** బైబిల్లో అన్నిటికన్నా చిన్న వచనం ఇది. కానీ భావంలో మాత్రం పెద్ద వచనాల్లో ఒకటి. విశ్వాన్ని చేసినవాడు, మనుషుల ముక్తి ప్రదాత సానుభూతీ కదలికా వ్యక్తిత్వమూ లేని రాతిగుండె దైవం కాదు. ఆయన ప్రేమిస్తాడు, మన బాధల్ని పట్టించుకుంటాడు, మనుషుల కష్టాల్లో వారి గురించి రోదిస్తాడు (లూకా 21:41-44; యిర్మీయా 48:31,32; నిర్గమ 2:24,25).

**11:37** వ 21, 32. వారంతా అన్నది నిజమే. యేసు లాజరును చనిపోకుండా ఉంచగలిగేవాడే. అయితే ఆయన మదిలో వేరొక ఉద్దేశం ఉంది (వ 4). అది వారికింకా అర్థం కాలేదు.

**11:38** వ 33.

**11:39** లాజరును సజీవంగా లేపినవాడు సమాధి రాయి దానంతట అది దొర్లిపోయేలా కూడా చేయగలడు. అయితే చనిపోయిన వ్యక్తిని లేపడంలో వారిని కూడా కొద్దిగా చెయ్యి వెయ్యనిచ్చాడు. ఆ రాయిని తాము తొలగించామనీ ఆ రాయి మూసి ఉన్న సమాధిలో లాజరు మృతదేహం ఉందనీ వారు తరువాత సాక్ష్యం చెప్పగలరు. యేసు చెయ్యబోతున్నది మార్తకు అర్థం కాలేదన్నది స్పష్టం. అందుకనే ఆ రాయిని తొలగించడం ఆమెకు అర్థం లేని పనిగా అనిపించింది. లాజరు ఏదో స్మృతి తప్పి మైమరచిన స్థితిలో ఉండడం కాదని, అతడు చనిపోయినది ఖాయమనీ మాత్రం ఆమెకు తెలుసు. శరీరం కుళ్ళిపోవడం కూడా మొదలయింది.

**11:40** వ 4. ఇంతకుముందు క్రీస్తుకూ మార్తకూ మధ్య జరిగిన సంభాషణలో ఈ మాటలు కనిపించలేదు. అయితే ఆయన అన్న ప్రతి మాటా ఇక్కడ రాసి ఉంది అనుకోలేము. లేక

41 అప్పుడు వారు చనిపోయిన వాడున్న స్థలం నుంచి బండను తీసివేశారు. యేసు పైకి చూస్తూ ఇలా అన్నాడు: “తండ్రీ! నా ప్రార్థన విన్నందుచేత నీకు కృతజ్ఞతలు అర్పిస్తున్నాను. 42 నీవు ఎప్పుడూ నా ప్రార్థనలు వింటున్నావని నాకు తెలుసు గాని నీవు నన్ను పంపావని ఇక్కడ నిలుచున్న ప్రజలు నమ్మాలని వారిని బట్టి ఇది చెప్పాను.”

43 ఇలా చెప్పి ఆయన “లాజరూ! బయటికి రా!” అని బిగ్గరగా పిలిచాడు.

44 చనిపోయినవాడు బయటికి వచ్చాడు. సమాధి కట్లు అతని కాళ్ళకూ చేతులకూ కట్టి ఉన్నాయి. అతని ముఖానికి రుమాలు చుట్టివేసి ఉంది. యేసు వారితో “ఆ కట్లు విప్పి అతణ్ణి వెళ్ళనియ్యండి” అన్నాడు.

45 ఈ కారణంగా, మరియ దగ్గరికి వచ్చిన యూదులలో అనేకులు ఆయన చేసినవి చూచి ఆయనమీద నమ్మకం ఉంచారు.

46 కానీ వారిలో మరి కొందరు పరిసయ్యుల దగ్గరికి వెళ్ళి యేసు చేసినది వారికి తెలియజేశారు. 47 కనుక ప్రధాన యాజులూ పరిసయ్యులూ సమాలోచన సభను సమకూర్చారు. అప్పుడు వారు ఇలా చెప్పుకొన్నారు:

“ఈ మనిషి అనేక సూచకమైన అద్భుతాలు జరిగిస్తూ ఉన్నాడు గానీ మనం ఏం చేయాలి? 48 మనం ఇలాగే అతణ్ణి చేయనిస్తే అందరూ అతణ్ణి నమ్ముతారు. అప్పుడు రోమ్‌వాళ్ళు వచ్చి మన స్థలాన్నీ దేశాన్నీ పూర్తిగా స్వాధీనం చేసుకొంటారు.”

49 వారిలో ఒకడు కయప. అతడు ఆ సంవత్సరం ప్రముఖ

---

25,26లోని మాటల గురించి చెప్పాడేమో. ఈ వచనంలో నమ్మకం ముందు, చూడడం తరువాత రావడం గమనించండి. మనుషులు ఈ క్రమాన్ని తలకిందులు చేయాలనుకుంటారు – చూచి నమ్మాలనుకుంటారు – 4:48.

**11:41** “పైకి చూస్తూ” – 17:1. ప్రార్థనలో మనం ఏ భంగిమలో ఉన్నాం అన్నది కాదు గాని హృదయ స్థితే ప్రాముఖ్యం.

“విన్నందుచేత” – లాజరు సజీవంగా లేవాలని ఆయన ప్రత్యేకించి ప్రార్థించాడన్నమాట.

“కృతజ్ఞత” – మత్తయి 14:19; లేవీ 7:12,13; కీర్తన 7:17; ఎఫెసు 5:20; 1 తెస్స 5:18.

**11:42** యేసు తండ్రియైన దేవుని సంకల్పం ప్రకారమే ఎప్పుడూ ప్రార్థించాడు కాబట్టి దేవుడు తన ప్రార్థనలకు ఎప్పుడూ జవాబిచ్చాడని ఆయనకు తెలుసు (1 యోహాను 5:14,15 పోల్చి చూడండి). తన ప్రార్థన విన్నందుకు బహిరంగంగా ఆయన తన తండ్రికి కృతజ్ఞతలు ఎందుకు చెప్పాడంటే అక్కడ నిలిచి ఉన్న యూదులు ఒక ముఖ్యమైన సత్యాన్ని నేర్చుకోవాలి. తాను లాజరును తన స్వశక్తిచేత బ్రతికించడం లేదు, లేక తనకు తానే కోరి అలా చేయడం లేదు. దేవుడు ఆయన్ను పంపాడనడానికి ఆ అద్భుతం ఒక సూచన.

**11:43** ఆయన బిగ్గరగా పిలిచినది లాజరు వినాలని కాదు, చుట్టూ ఉన్నవారు వినాలని. ఇక్కడ మాయ గానీ ఇంద్రజాలం గానీ మంత్రం గానీ లోలోపల గొణుక్కునే మంత్రవిద్య గానీ లేవు. చనిపోయిన వ్యక్తికి యేసు స్పష్టమైన ఆజ్ఞ ఒకటి ఇచ్చాడు అంతే. వ 5:21-27లో ఆయన చెప్పిన ప్రకారం చనిపోయినవాడు తిరిగి బ్రతికాడు.

**11:44** పట్టపగలు అనేకమంది నిలబడి చూస్తుండగా బహిరంగంగా జరిగిన మహా అద్భుతం ఇది. యేసుప్రభువుకు జీవన్మరణాలపై అధికారం ఉందని ఇది వెల్లడి చేస్తున్నది. 5:21-27లో తనకు అలాంటి అధికారం ఉందని ఆయన చెప్పాడు. ఇక్కడ దాన్ని రుజువుపరచాడు. భౌతిక లోకంలో ఆయనకు అధికారం ఉంది. నాలుగు దినాల క్రితం మరణించి కుళ్ళి వాసన గొడుతున్న శరీరంలో ఆయన ప్రాణం పోశాడు. ఆధ్యాత్మిక లోకంలో కూడా ఆయనకు అధికారం ఉంది. చనిపోయిన మనిషి ఆత్మను దాని విశ్రాంతి స్థలం నుంచి వెనక్కు పిలిచి శరీరంలో తిరిగి లీనం చేశాడు.

“ఆ కట్లు విప్పి” – తన పనిలో మనుషులకు మరోసారి భాగం ఇచ్చాడు. ఈ విధంగా వారు లాజరుకు దగ్గరగా వచ్చి చూచి అతని శరీరానికి చుట్టిన సమాధి బట్టలు తొలగించి, ఇంతకుముందు కుళ్ళిపోయి ఇప్పుడు ఆరోగ్యవంతంగా తాజాగా ఉన్న అతని దేహాన్ని తాకి చూడవచ్చు. తమ కళ్ళెదుట జరిగినది ఏదో బూటకం లేక మాయ కాదని తెలుసుకోవచ్చు.

**11:45** రుజువును చూచి వారు యేసును నమ్మారు. ఆ వాస్తవాలనుంచి వారు ఎలా తప్పించుకోగలరు? దేవుని బలప్రభావాల్ని ఆయన ప్రదర్శించాడు. అది వారికి తెలుసు.

**11:46** కొందరైతే ఈ అద్భుతాన్ని చూచి కూడా యేసును అభిషిక్తుడని ఒప్పుకోలేదు. పరిసయ్యులు ఈ సందర్భంలో ఏం చేస్తారో చూద్దామని వెళ్ళారు. ఇంత బ్రహ్మాండమైన అద్భుతం కూడా పాపంలో బందబారిపోయిన వారి విరోధ భావాన్నీ దురభిమానాన్నీ అపనమ్మకాన్నీ తొలగించలేదు (లూకా 16:31 చూడండి). తరువాత వస్తున్న వచనాల్లో ఇది స్పష్టంగా కనిపిస్తున్నది.

**11:47** “సమాలోచన సభ” – మత్తయి 5:22. యేసు సూచనకోసమైన ఈ అద్భుతాలు చేస్తున్నాడని వారు ఒప్పుకున్నారు. వారు కొట్టిపారవేయలేనంత బలంగా సాక్ష్యాధారాలూ రుజువులూ ఉన్నాయి (అపో కా 4:15-17 పోల్చి చూడండి). కానీ అవి చూపిస్తున్న దిశకు వెళ్ళడానికి వారికి ఇష్టం లేదు. వారు కోరేది సత్యాన్ని కాదు కాబట్టి ఆ రుజువులు చూపిస్తున్న వైపుకు వెళ్ళలేకపోయారు (5:44 చూడండి). క్రీస్తుమీద నమ్మకం ఉంచమని నిశ్చయించుకున్నవారికి ఎన్ని సాక్ష్యాధారాలు చూపినా ఎంత బలమైన రుజువులున్నా నమ్మరు.

**11:48** క్రీస్తును నిరాకరించేందుకు వారెలాంటి సాకు చెప్తున్నారో చూడండి. వారి భయమేమిటంటే జనమంతా క్రీస్తులో నమ్మకం ఉంచితే వారు ఆయన్ను తమ నాయకుడుగా చేసుకుని రోమ్ సామ్రాజ్యంపై తిరుగుబాటు చేస్తారు (ఆ కాలంలో వారిని పరిపాలిస్తున్నది రోమ్‌వారే). అలాంటప్పుడు రోమ్‌వారు గొప్ప బలగంతో వచ్చి జెరుసలంకు, దేవాలయానికి, జాతి అంతటికీ గొప్ప విధ్వంసాన్ని కలిగిస్తారని వారి భయం. ఈ పరిసయ్యులకు మనుషులంటే భయం గాని దేవుడంటే భయం లేదు. (రోమ్ 3:18). ఇలా రోమ్‌వారికి భయపడడంలో అర్థం లేదు. యేసుప్రభువు రాజకీయ నాయకుడుగా ఉండేందుకు ఇంతకుముందే నిరాకరించాడు (6:15). ఆయన రాజ్యం ఈ లోకానికి చెందినది కాదు (18:36). మనుషుల హృదయాల్లో ఒక ఆధ్యాత్మిక సామ్రాజ్యం స్థాపించడం గాని రోమ్‌పై రాజకీయంగా తిరుగుబాటు లేవదీయడం ఆయన ఉద్దేశం కాదు. కానీ ఈ పరిసయ్యుల కపటబుద్ధి, దుర్మార్గత చూడండి. ఆ జాతిని కాపాడేది తామేనని ఒక పక్క చెప్తూనే మరో పక్క దేవుని కుమారుణ్ణి చంపాలని ఆశిస్తున్నారు. చివరికి వారు భయపడినదంతా జెరుసలం మీదికి వచ్చిపడింది. ఆ జాతి యేసుప్రభువుపై నమ్మకం ఉంచినందుకు కాదు, ఆయన్ను తిరస్కరించినందుకే ఇలా జరిగింది. మత్తయి 23:37-39; 24:1,2; లూకా 19:41-44 చూడండి.

**11:49** ఆ సందర్భంలో చేయవలసినదేదో వారు

యాజి. అతడు వారితో అన్నాడు “మీకేమీ తెలీదు. 50 సర్వజాతి
నాశనం కాకుండా ప్రజలకోసం ఒకే మనిషి చావడం మనకు
మేలని మీరు ఆలోచించరు.”

51 ఈ మాట తనంతట తానే చెప్పలేదు గానీ ఆ
సంవత్సరం అతడు ప్రముఖ యాజి అయి ఉండి యేసు ఆ
ప్రజకోసం చనిపోతాడని భవిష్యద్వాక్కు పలికాడు. 52 ఆ
ప్రజకోసమే కాదు గాని బయట చెదరి ఉన్న దేవుని
పిల్లలందరినీ ఆయన ఒకటిగా సమకూరుస్తాడని కూడా
భవిష్యద్వాక్కు పలికాడు. 53 అందుచేత ఆ రోజునుంచి
ఆయనను చంపడానికి వారు కుట్ర పన్నుతూ వచ్చారు.
54 కాబట్టి యేసు అప్పటినుంచి యూదులలో బహిరంగంగా
సంచరించలేదు గాని అక్కడనుంచి ఎడారి దగ్గర ఉన్న
ప్రాంతానికి, ఎఫ్రాయిం అనే ఊరికి వెళ్ళిపోయాడు. అక్కడ తన
శిష్యులతోకూడా ఆగాడు. 55 యూదుల పస్కా పండుగ దగ్గర
పడింది గనుక పస్కా పండుగకు మునుపు తమను శుద్ధి
చేసుకోవడానికి చాలామంది పల్లెటూళ్ళనుంచి జెరుసలం
వెళ్ళారు. 56 వారు యేసును వెతుకుతూ దేవాలయంలో
నిలుచుండి ఒకరితో ఒకరు ఇలా చెప్పుకొన్నారు: “ఆయన
పండుగకు రానే రాడా? ఏమనుకొంటున్నారు?” 57 అయితే
ప్రధాన యాజులూ పరిసయ్యులూ ఆయనను పట్టుకోవాలని
ఆయన ఎక్కడ ఉన్నది తెలిసినవారెవరైనా తమకు
తెలియజేయాలని ఆజ్ఞ జారీ చేశారు.

12 అందుచేత యేసు పస్కా పండుగకు ఆరు రోజులు
ముందుగా బేతనీకి వచ్చాడు. అక్కడ లాజరు మృతి
చెందాడు, యేసు చనిపోయిన వారిలోనుంచి అతణ్ణి లేపాడు. 2
వారు ఆయనకు అక్కడ విందు చేశారు. మార్త పరిచర్య చేస్తూ
ఉంది, లాజరు యేసుతో భోజనానికి కూర్చుని ఉన్నవారిలో
ఒకడు. 3 మరియ అయితే చాలా విలువైన అత్తరు సుమారు
సగం కిలో బరువు తెచ్చింది. అది స్వచ్ఛమైన జటామాంసి.
ఆమె యేసు పాదాలను అభిషేకించి తలవెంట్రుకలతో ఆయన
పాదాలను తుడిచింది. ఇల్లంతా పరిమళ సువాసనతో
నిండిపోయింది.

4 ఆయన శిష్యులలో ఒకడూ సీమోను కుమారుడూ
ఆయనను శత్రువులకు పట్టి ఇవ్వనై ఉన్నవాడైన ఇస్కరియోతు
యూదా 5 “ఈ అత్తరు ఎందుకు మూడు వందల దేనారాలకు
అమ్మి బీదలకివ్వలేదు?” అన్నాడు. 6 అతడు ఇలా అన్నది
బీదలమీద శ్రద్ధ ఉండి కాదు. అతడు దొంగ, అతని దగ్గర
శిష్యుల డబ్బుసంచి ఉండడంచేత దానిలో వేసినది సొంతానికి
తీసుకొనేవాడు.

---

గ్రహించలేదని కయప అంటున్నాడు. వారు చేయవలసినదాని గురించి తన అభిప్రాయాన్ని తరువాతి వచనంలో స్పష్టంగా చెప్తున్నాడు.

**11:50** ఇక్కడ తెగువగా తన నిర్ణయాన్ని వినిపిస్తున్నాడు – “ఒకే మనిషి చావడం” – క్రీస్తు రోమ్‌వారిని యూదజాతిపై చర్య తీసుకునేలా రేపే తంటాలమారి అనీ ఆయన్ను చంపడం అవసరం అనీ అతని అభిప్రాయం. పరిసయ్యులకు, పొంతి పిలాతుకు (18:38) సత్యమంటే ఎంత నిర్లక్ష్యం ఉందో ఇతనికీ అంతే.

**11:51,52** ఇది చాలా వింతైన విషయం. నమ్మకం, పాపవిముక్తి లేనివాడు, క్రీస్తును తిరస్కరించినవాడు ఆధ్యాత్మిక విషయాన్ని గురించి భవిష్యద్వాక్కు పలికాడు. క్రీస్తు సంఘం ఏర్పడుతుందన్న భవిష్యద్వాక్కు ఇది. ఇలా దేవుని మూలంగా పలికేందుకు దేవుడు అతణ్ణి వాడుకుంటున్నట్టుగా అతనికి తెలియదన్నది స్పష్టం. తన హృదయంలోని అపనమ్మకం, దుర్మార్గతల మూలంగా అతడు ఈ విధంగా పలికాడు. అయితే అతడు ఊహించిన దానికంటే అతడి మాటలు ఎంతో అర్థవంతంగా ఉన్నాయి. దేవుని ప్రజలైన ఇస్రాయేల్‌వారి ప్రముఖ యాజిగా అతడు మాట్లాడాడు. దేవుడు తన కుమారుణ్ణి గురించి ఆలోచన చెప్పేందుకు అతని పదవిని బట్టి అతణ్ణి వాడుకున్నాడు. ఆ ఆలోచనవల్ల గొప్ప ఫలితాలు కలగనున్నాయి. దుర్మార్గులు దేవుని మూలంగా పలకడం గురించి ఇతర ఉదాహరణలకు సంఖ్యా 23,24 అధ్యాయాలు; 1 సమూ 11:9–11నూ వాటి నోట్స్‌నూ చూడండి. దేవుడు తాను ఎన్నుకున్న ఏ సాధనాన్నైనా తన సంకల్ప సిద్ధికి వాడుకోగలడు.

**11:53** ఇంతకుముందు వారు యేసుప్రభువును చంపడానికి ప్రయత్నం చేశారు (5:18; 8:59). అయితే అప్పుడు వారు అకస్మాత్తుగా వచ్చిన ఉద్రేకంలో అలా చేయబోయారు. ఇప్పుడైతే అలా చేసేందుకు సరైన విధానమేదోనని కుట్ర పన్నసాగారు.

**11:54** యేసు ఇలా చేసినది భయంవల్ల కాదు. తన మరణ సమయం ఇంకా రాలేదని ఆయనకు తెలుసు (7:30). అది రాకముందు ఆయన చేయవలసిన పనులింకా ఉన్నాయి.

**11:56** ఆ సమయంలో యేసుకు ఉన్న పేరుప్రఖ్యాతులకు ఇది సూచన. ఇస్రాయేల్ దేశమంతటినుంచీ పండుగకు వచ్చిన వారందరూ ఆయన్ను గురించే చర్చించుకుంటున్నారు.

**12:1** పస్కా గురించి నోట్స్ నిర్గమ 12వ అధ్యాయం; లేవీ 23:48. క్రీస్తు సిలువ మరణానికి ముందు వారంలో జరిగిన సంగతులు ఇక్కడ నుంచి ఆరంభమౌతున్నాయి. లోక పాపాల కోసం ఆయన చనిపోవలసిన సమయం వచ్చింది. దేవుడే ఆ సమయాన్నీ (ఈ పస్కా దినం), స్థలాన్నీ (జెరుసలం) నిర్ణయించాడు. యేసుప్రభువు ఆ పరమ తండ్రి చిత్తం ప్రకారం చేయడానికి పూర్తిగా సిద్ధపడి ఉన్నాడు.

**12:2** మత్తయి 26:6–13; మార్కు 14:19 పోల్చి చూడండి. మత్తయి, మార్కు శుభవార్తల్లో రాసి ఉన్న సంఘటనా ఇదీ వేరువేరని కొందరు పండితుల అభిప్రాయం.

**12:4** ఈ మాట అన్నది యూదా అని మత్తయి, మార్కు రాయలేదు.

**12:5** ఒక దేనారం సాధారణంగా ఒక పనివాడికి ఒకరోజు కూలీ (మత్తయి 20:2). స్వార్థంకోసం గాక క్రీస్తుకోసం ప్రేమతో చేసిన పనులను ఇతరులు అపార్థం చేసుకుని విమర్శించవచ్చని గమనించండి. డబ్బును కూడబెట్టడం, స్వార్థానికి వాడుకోవడం యూదాకు తెలుసు గానీ కేవలం తనలోని ప్రేమ మూలంగా, ప్రతిఫలాపేక్ష లేకుండా మరియ అంత ఖరీదైనదాన్ని క్రీస్తు పాదాలపై ఒలకబోయడం యూదాకు అర్థం కాలేదు.

**12:6** యూదా ఒకసారి దుష్ప్రేరణకు లొంగి, ఏదో దొంగిలించి తరువాత పశ్చాత్తాపపడి తన బలహీనతలను జయించిన రకం కాదు. దేవుని ప్రజలు దేవుని పనికోసం ఇచ్చిన డబ్బును అతడు కావాలని, అలవాటుగా తనకోసం తీసుకుంటూ వచ్చాడు. ఘనమైన, యోగ్యమైనవాటి కంటే, సత్యం లేక క్రీస్తు కంటే అతడికి డబ్బునే ఎక్కువ ప్రీతి. క్రీస్తును శత్రువులకు పట్టివ్వడంలో అతని ముఖ్యోద్దేశం డబ్బు (మత్తయి 26:14–16). అతణ్ణి పిశాచంగా చేసిన లక్షణాల్లో (యోహాను 6:70,71) డబ్బంటే అతనికి ఉన్న ప్రీతి ఒకటి. ఈ దురాశకు లోబడినవారికి ఏం సంభవించగలదో తెలిపే భయానకమైన ఒక ఉదాహరణ

7 కనుక యేసు “ఆమెను ఇలా చేయనివ్వండి. ఆమె ఈ అత్తరు ఉంచినది నా అంత్యక్రియలరోజు కోసమే. 8 బీదలు ఎల్లప్పుడూ మీ దగ్గర ఉంటారు గానీ నేను ఎల్లప్పుడు మీతో ఉండను” అన్నాడు.

9 ఆయన అక్కడ ఉన్నాడని యూదులలో చాలామందికి తెలియవచ్చింది. వారు యేసునే కాదు, ఆయన చనిపోయిన వారిలోనుంచి లేపిన లాజరును కూడా చూద్దామని వచ్చారు. 10 లాజరు కారణంగా యూదులలో అనేకులు తమను విడిచి యేసుమీద నమ్మకం ఉంచినందుచేత 11 ప్రధాన యాజులు అతణ్ణి కూడా చంపాలని కుట్రపన్నారు.

12 మరుసటి రోజున యేసు జెరుసలం వస్తున్నాడని పండుగకు వచ్చిన మహా సమూహానికి వినవచ్చింది. 13 వారు ఖర్జూర మట్టలు చేతపట్టుకొని ఆయనకు ఎదురు వెళ్ళి “జయం! ప్రభువు పేరట వచ్చేవాడు, ఇస్రాయేల్‌ప్రజల రాజు ధన్యజీవి!” అని కేకలు వేయడం ఆరంభించారు. 14 ఇలా వ్రాసి ఉంది: సీయోను కుమారీ, భయపడకు! మీ రాజు గాడిద పిల్ల మీద కూర్చుని ఉండి వస్తున్నాడు.

15 దీనిప్రకారమే యేసు ఒక గాడిదపిల్లను కనుక్కొని దానిమీద కూర్చున్నాడు. 16 ఈ విషయాలు మొట్టమొదట ఆయన శిష్యులకు అర్థం కాలేదు గాని యేసు మహిమాస్థితి పొందిన తరువాత అవి ఆయనను గురించి వ్రాసి ఉన్నవనీ వారు ఆయనపట్ల అలా జరిగించారనీ శిష్యులు జ్ఞాపకం చేసుకొన్నారు.

17 ఆయన లాజరును చనిపోయినవారిలో నుంచి లేపి సమాధినుంచి పిలిచినప్పుడు ఆయనతో ఉన్న ప్రజలు ఆయనను గురించిన సాక్ష్యం చెపుతూ వచ్చారు. 18 ఆయన ఈ సూచకమైన అద్భుతం చేశాడని వినడంచేత ఆ ప్రజలు ఆయనకు ఎదురు వెళ్ళారు.

19 అందుచేత పరిసయ్యులు తమలో తాము ఇలా చెప్పుకొన్నారు: “చూశారా, మీరు చేసినదానిలో నెగ్గినది ఏమీ లేదు. ఇదిగో, లోకమంతా ఆయన వెంట వెళ్ళింది.”

20 పండుగలో ఆరాధించడానికి వచ్చినవారిలో గ్రీసు దేశస్థులు కొందరు ఉన్నారు. 21 వారు ఫిలిప్పు దగ్గరికి వచ్చారు (అతడు గలలీలోని బేత్‌సయిదా నివాసి). వారు “అయ్యా, యేసును చూడాలని మా ఆశ” అని అతణ్ణి కోరారు. 22 ఫిలిప్పు వచ్చి అంద్రెయకు చెప్పాడు. అంద్రెయ, ఫిలిప్పు యేసుకు చెప్పారు.

23 యేసు వారికిలా సమాధానం చెప్పాడు:

“మానవ పుత్రుడు మహిమాస్థితి పొందే గడియ వచ్చింది. 24 మీతో ఖచ్చితంగా చెపుతున్నాను, గోధుమ గింజ భూమిలో

---

యూదా (1 తిమోతి 6:5,9,10 చూడండి). క్రీస్తు సంఘంలోపలా బయటా కూడా ధన లాభం కోసం తమ జీవితాలను పాడు చేసుకుని, దేవుణ్ణి అగౌరవపరచి, తమ ఆత్మలను నాశనానికి గురి చేసుకున్న అనేకమందిలో యూదా ఒకడు. క్రైస్తవ సేవలో ఉన్నవారిలో కూడా చాలామందిని డబ్బు విషయంలో నమ్మడానికి వీలు లేదు. ఎంత విచారం! యూదాలాగా వీరు కూడా తాము దొంగలమని రుజువు చేసుకుంటారు. అయితే ఇతర శిష్యులు యూదాను ఎలా ఎంచారో చూడండి. ఆతణ్ణి నమ్మి తమ గుంపుకు కోశాధికారిగా పెట్టుకున్నారు. ఈ వచనంలో యూదా కపటాన్ని కూడా గమనించండి. పేదలంటే అతనికేమీ శ్రద్ధ లేదు గానీ ఉన్నట్టు నటిస్తున్నాడు. అతని ఉద్దేశమేమిటంటే పేదలకియ్యవలసిన డబ్బు భద్రం చేయమని తన చేతికే ఇస్తారు. అందులో కొంత తన సొంతానికి వాడుకోవచ్చు అని. డబ్బు వాసన తగిలింది, అంతే! దేవుని కుమారుడు, ఆయన ఆశ్చర్యకరమైన ఉపదేశాలు, అద్భుత క్రియలు, ఆయన ఇస్తున్న శాశ్వత జీవం ఇవన్నీ యూదాకు వట్టివి, తృణప్రాయమయ్యాయి. ఇంకా ఇంకా డబ్బు సంపాదించే మార్గంగా తప్ప వేరే ఉద్దేశంతో పైవాటిని ఎన్నడూ చూడలేదు యూదా. ఈ విషయం గురించి యేసుప్రభువు చేసిన ఉపదేశాలను పూర్తిగా పెడచెవిన బెట్టాడు (మత్తయి 6:19-21,24; లూకా 6:20,24; 12:20,21,33). మనం కూడా అలానే వాటిని నిర్లక్ష్యం చేస్తే యూదాలాగా అయిపోగలం. అబద్ధాలు, మోసం, దొంగతనం ఇలాంటివన్నీ చేయడంకన్నా పేదవారుగా ఉండడం ఎంతో మేలు – సామెత 19:22.

**12:7,8** మత్తయి 26:10-13.

**12:10,11** ఈ అవిశ్వాసుల స్వభావం (మొత్తంగా అవిశ్వాసులందరిదీ) ఇక్కడ మరోసారి బయట పడుతున్నది. యేసు లాజరును సజీవంగా లేపిన సంగతిని వారు కాదనలేకపోయారు. అందుకు బలమైన స్పష్టమైన రుజువు ఉంది. కానీ ఈ రుజువు చూపించిన దిశగా వెళ్ళవలసింది పోయి ఆ రుజువునే రూపుమాపాలని నిర్ణయించుకున్నారు. యిర్మీయా 36:1-26 పోల్చి చూడండి.

**12:12-15** మత్తయి 21:4-9; మార్కు 11:9,10; లూకా 19:37,38. నాలుగు శుభవార్తల్లోనూ ఆ జనసమూహం అన్నమాటలు వేరువేరుగా రాసి ఉన్నాయి. వీటిల్లో ఏవీ సరైనవి? అన్నీ సరైనవే. ఏ ఒక్క శుభవార్తలో జనసమూహం అన్న మాటలన్నీ రాసిలేదు. ప్రతి ఒక్కటీ ఆ గుంపులు అన్న మాటల్లో కొన్ని రాసి ఉన్నాయి. 19:19 పోల్చి చూడండి. మార్కు 4:1-20 గురించిన నోట్స్ చూడండి.

**12:14** మత్తయి 21:1-3.

**12:16** యేసు మరణం, పునర్జీవితం తరువాత (“మహిమాస్థితి పొందిన తరువాత”) శిష్యులు చాలావరకు అర్థం చేసుకున్నారు. లూకా 24:45 పోల్చి చూడండి.

**12:18** “సూచన” – 2:11.

**12:19** ఈ సంఘటనతో వారు భయపడుతూ వచ్చినదే నిజమైనట్టు అనిపించింది (11:47,48).

**12:20** పస్కా యూదుల పండుగ, గ్రీకులు (ఇతర దేశస్థులెవరూ కూడా) యూద మతంలోకి మారితే తప్ప యూద పండుగల్లో ఏవిధంగానైనా పాల్గొనే అవకాశం ఉండదు. గ్రీకుల్లో ఇలాంటివారు ఉన్నారని అపో కా 17:4 వంటి వచనాల ద్వారా తెలుస్తున్నది.

**12:21** ముందు కాలంలో ఈ విధంగా ఆశించబోయే అనేకమంది గ్రీకులు, ఇతర జాతీయులందరిలోకి ఈ గుంపు మొదటివారు. వారు క్రీస్తులో నమ్మకం పెట్టుకుంటే వారి కోరిక నెరవేరుతుంది (ప్రకటన 7:9; 22:4).

**12:22** ఇలాంటి కోరిక గురించి నిర్ణయం తీసుకోవాలంటే సాటి శిష్యుడు మరొకణ్ణి సంప్రదించడం అవసరమని ఫిలిప్పు అనుకున్నాడు. ఈ గ్రీకుల కోరిక తీరిందో లేదో రాసి లేదు. కానీ యేసు ఈ సందర్భాన్ని తన మరణం గురించి మాట్లాడేందుకు వాడుకున్నాడు. గ్రీకులు గానీ వేరెవరైనా గానీ పరలోకంలో స్థలం సంపాదించుకోవాలన్నా, దేవుణ్ణి చూడాలన్నా ఇది ముందుగా నెరవేరవలసి ఉందని ఆయనకు తెలుసు.

**12:23** వ 16; 17:1,5 చూడండి.

**12:24** “ఖచ్చితంగా” – 1:51.

పడి చావకపోతే అది ఒంటిరిగానే ఉండిపోతుంది. అది చస్తే సమృద్ధిగా ఫలిస్తుంది. 25 తన ప్రాణం అంటే ప్రీతి ఉన్నవాడు దానిని పోగొట్టుకొంటాడు. కానీ ఈ లోకంలో ఉన్న తన ప్రాణం అంటే ద్వేషం ఉన్నవాడు దానిని శాశ్వత జీవంకోసం సంరక్షిస్తాడు.

26 “ఎవరైనా నాకు సేవ చేస్తే నన్ను అనుసరిస్తూ ఉండాలి. నేనెక్కడ ఉంటానో అక్కడ నా సేవకుడు ఉంటారు. ఎవరైనా నాకు సేవ చేస్తే అతణ్ణి నా తండ్రి ఘనపరుస్తాడు. 27 ఇప్పుడు నా ప్రాణానికి ఆందోళనగా ఉంది. నేనేమి అనాలి? తండ్రీ, ఈ గడియ నుంచి నన్ను తప్పించు అనాలా? కానీ, నేను ఈ గడియకు వచ్చినది ఇందుకే. 28 తండ్రీ, నీ పేరుకు మహిమ చేకూర్చుకో!”

అప్పుడు పరలోకంనుంచి ఒక స్వరం ఇలా వినిపించింది: “నేను దానికి మహిమ చేకూర్చుకొన్నాను, మళ్ళీ చేకూర్చుకొంటాను.”

29 అక్కడ నిలుచుండి అది విన్న జనం “ఉరిమింది” అన్నారు. ఇతరులు “ఒక దేవదూత ఆయనతో మాట్లాడాడు” అన్నారు.

30 అందుకు యేసు “ఈ స్వరం వచ్చినది నాకోసం కాదు గాని మీకోసమే. 31 ఇప్పుడు ఈ లోకానికి తీర్పు జరుగుతుంది.

---

“అది చస్తే. . .ఫలిస్తుంది” – ఇది మనం చల్లే విత్తనాల విషయంలోనూ నిజమే, లోకంలో ఉన్న మనుషులపట్ల దేవుడు అనుసరించే విధానంలోనూ నిజమే, యేసుప్రభువు విషయంలోనూ నిజమే. ఆయన ఇక్కడ తన మరణం గురించి, దానిద్వారా కలిగే ఫలితాల గురించి మాట్లాడుతున్నాడన్నది నిస్సందేహం. మనుషుల కోసం చనిపోయేందుకు ఆయన సమ్మతించకపోతే ఎవరికీ శాశ్వత జీవం అనేది ఉండేది కాదు. అలాంటప్పుడు యేసుప్రభువు ఒక్కడే మిగిలిపోయి ఉండేవాడు. ఆయన పోలికలో తయారైన అనేకమంది “సహోదరులు” ఆయనకు లభించేవారు కాదు (రోమ్ 8:29; హీబ్రూ 2:10–15). ప్రపంచంలో దేవుని సేవకులెవరికైనా కూడా వర్తించే నియమం ఇది. “నేను” అనేది మరణించకపోతే నిజమైన ఫలితం, ఇతరులకు ఆధ్యాత్మిక జీవం కలగవు. 2 కొరింతు 4:8–12 పోల్చి చూడండి.

**12:25** ప్రభువు ఇదే సత్యాన్ని కొద్దిగా వేరే మాటల్లో అనేక సందర్భాల్లో చెప్పాడు. దీన్ని బట్టి చూస్తే ఇది ఆయన చెప్పిన అతి ప్రాముఖ్యమైన సత్యాల్లో ఒకటి. దీన్ని నిర్లక్ష్యం చెయ్యడం మనకే హానికరం. మత్తయి 10:39; 16:25; మార్కు 8:35; లూకా 9:24; 17:33. ఇక్కడ యోహాను శుభవార్తలో ఆయన “ద్వేషం” అనే మాట వాడడం ద్వారా దీన్ని మరింత నొక్కి చెప్పున్నాడు. లూకా 14:26 పోల్చి చూడండి. అంతేగాక “శాశ్వత జీవం” అనేమాట వాడడం ద్వారా నిజంగా మనం క్షణికమైన ఈ లోకాన్నో, దేవుని సన్నిధిలో అనంత జీవితాన్నో ఎంచుకోవలసి ఉందని స్పష్టం చేశాడు. ఈ లోకమా, రాబోయే లోకమా మనం దేనికి విలువ ఇస్తామో, దేనికోసం బ్రతుకుతామో నిర్ణయించుకోవాలి.

**12:26** 10:27. తన సొంత విషయాన్ని తన సొంత విధానంలో చేసేవారెవరూ క్రీస్తును సేవించడం లేదు. క్రీస్తును అనుసరించేవారు ఈ లోకంలో ఆయనెక్కడ ఉంటాడో అక్కడ ఉంటారు. ఎందుకంటే ఆయన వారి కాపరి. వారెక్కడికి వెళ్ళాలో అక్కడికి ఆయనే నడిపిస్తాడు. ఇలా చెయ్యడంలో పరీక్షలు, ప్రమాదాలు, అపాయాలు, బాధలు, క్రీస్తుకోసం చనిపోవడం సంభవించినా దానంతటిలో ఆయన వారితో, వారు ఆయనతో ఉంటారు. ఆయన్ను అనుసరించేవారు రాబోయే లోకంలో కూడా అనంత కాలం ఆయనతో ఉంటారు. వారి గురించి ఆయన చేసిన ప్రార్థన ఇదే (17:24) గనక వారికి చేకూరబోయేది ఇదే.

క్రీస్తు సేవకులకు ఈ లోకంలో ఎంతో అన్యాయం, హింస, అవమానం, అప్రతిష్ఠ ఎదురు కావచ్చు. వారి ప్రభువును చేసినట్టు వారిని కూడా మనుషులు తృణీకరించి నిరాకరించ వచ్చు. వారికి కలగవలసిన గౌరవాలు ముందున్నాయి. శాశ్వతుడైన దేవుడు తానే క్రీస్తు సేవకులను హెచ్చించి, మెచ్చుకుని, గౌరవించి, బహుమతులిస్తాడు (5:44; మత్తయి 25:21; రోమ్ 2:6–10; 8:18; హీబ్రూ 6:10; 1 పేతురు 5:1,4; ప్రకటన 22:12). వారికిక్కడ జరిగిన నష్టమేదైనా ఉంటే దానంతటికీ ఆయన పుష్కలంగా పరిహారం చెల్లిస్తాడు. అందువల్ల ఏ గౌరవాన్ని మనం ఆశించాలి, ఎవరి మెప్పును కోరాలి – మనుషులవల్ల కలిగేదాన్నా లేక దేవునినుంచి వచ్చేదాన్నా అని ఎన్నుకోవాలి.

**12:27** “ఘడియ” – అంటే ఆయన బాధలు, మరణం కలిగే సమయం. లోక పాపాలకు బలిగా, మనుషుల దోషాలను భరిస్తూ, వాటికి వ్యతిరేకంగా మండే దేవుని కోపాన్ని అనుభవించాలన్న ఆలోచన క్రీస్తుకు మనోవేదనలు కలిగించింది. మత్తయి 26:37,38; లూకా 22:42–44 పోల్చి చూడండి. అయినా అది దేవుని సంకల్పం అయితే తప్ప, దానినుంచి తప్పించుకోవాలని మాత్రం ఆయన ప్రార్థన చేసేవాడు కాదు. అది దేవుని సంకల్పం కాదని ఆయనకు తెలుసు.

**12:28** కొన్ని రోజుల తరువాత గెత్సేమనే తోటలో ఆయన ప్రార్థించినట్టుగానే ఆయన కోరినదల్లా తండ్రి అయిన దేవునికి మహిమ కలగాలనే, తనకు కాదు; తండ్రి సంకల్పం నెరవేరాలనే, తనది కాదు. తండ్రికి మహిమ కలిగేలా తాను సిలువ బాధలు భరించడానికి ఆయన సిద్ధమే. ఆయన్ను అనుసరించేవారంతా ఇలా ప్రార్థించడం నేర్చుకోవాలి. మత్తయి 6:9,10 చూడండి. శుభవార్త గ్రంథాల్లో ఈ విధంగా పైనుంచి దేవుడు మాట్లాడ్డం ఇది మూడో సారి (మత్తయి 3:17; 17:5). పాత ఒడంబడిక గ్రంథంలో వర్ణించిన సంభవాల మూలంగా, యేసుప్రభువు జీవితమూ, పరిచర్యా అంతటిద్వారా దేవుడు తన పేరును మహిమపరచుకున్నాడు. ఇప్పుడు క్రీస్తు మరణం, పునర్జీవితం ద్వారా ఆయన దాన్ని మహిమపరచుకుంటాడు.

**12:29** నిర్గమ 19:16–19; కీర్తన 29:3.

“దేవదూత” – ఆది 16:7. ఈ మాటలు కొందరికి అర్థం అయినట్టున్నాయి. కొందరికి అర్థం కాలేదు. కానీ ఏదో అసాధారణమైనది జరిగిందని మాత్రం అందరికీ తెలిసింది.

**12:30** క్రీస్తుకు అంత బాగా తెలిసిన విషయాన్ని వేరొకరు మళ్ళీ ఆయనకు చెప్పనవసరం లేదు. మనుషులకు మాత్రం చాలా గట్టిగా నొక్కి చెప్పాలి.

**12:31** దోషులైన మనుషుల స్థానంలో లోక పాపాలను మోసి తీసివేసే దేవుని గొర్రెపిల్లగా క్రీస్తు చనిపోబోతున్నాడు (1:29). అంటే మానవజాతి అంతా మరణానికి పాత్రులని అర్థం. సిలువ మనుషుల పాపాలకు తీర్పు చెప్పినట్టుంది. దేవుడు లోకులతో ఇలా అంటున్నాడన్నమాట: “నీ పాపాల కారణంగా నువ్వు మరణం పొందవలసినవాడివి. నీ స్థానంలో నా కుమారుని మరణం ద్వారా నేను ఈ తీర్పును ప్రకటిస్తున్నాను. నా కుమారుణ్ణి సిలువ వేయడంద్వారా నీకు నువ్వే తీర్పు తీర్చుకుంటావు. ఆ విధంగా నా నిర్ణయం సరైనదేనని రుజువు చేసుకుంటావు” (3:18,19).

“లోక పాలకుణ్ణి” – అంటే సైతానును 14:30; 16:11;

ఇప్పుడు లోక పాలకుణ్ణి బయటికి త్రోసివేయడం జరుగుతుంది. 32 నన్ను భూమినుంచి పైకెత్తడం జరిగితే నేను నావైపుకు అన్ని జనాలనూ ఆకర్షించుకొంటాను" అన్నాడు. 33 ఆయన ఎలాంటి మరణానికి గురి కాబోతున్నాడో సూచించడానికి ఆ మాట చెప్పాడు.

34 ప్రజలు ఆయనకు జవాబిస్తూ "అభిషిక్తుడు ఎప్పటికీ మాతోనే ఉంటాడని ధర్మశాస్త్రంలో ఉందని విన్నాం. 'మానవపుత్రుణ్ణి పైకెత్తడం జరగాల'ని మీరు అంటున్నారేం? అసలు ఈ మానవ పుత్రుడు ఎవరు?" అన్నారు.

35 అందుచేత యేసు వారితో ఇలా అన్నాడు: "మీ మధ్య వెలుగు ఉండేది ఇంకా కొంత కాలమే. చీకటి మిమ్ములను కమ్మకుండా వెలుగు మీ మధ్య ఉండగానే దానిలో నడుచుకోండి. చీకటిలో నడుస్తున్నవానికి తాను ఎక్కడికి వెళ్తూ ఉన్నాడో తనకు తెలియదు. 36 మీ మధ్య వెలుగు ఉండగానే మీరు వెలుగు సంతానం అయ్యేలా ఈ వెలుగును నమ్మండి." ఈ సంగతులు చెప్పి యేసు వెళ్ళి వారికి కనబడకుండా తనను మరుగు చేసుకొన్నాడు.

37 ఆయన వారి ఎదుట సూచనకోసమైన అద్భుతాలు ఇన్ని చేసినా వారు ఆయనమీద నమ్మకం ఉంచలేదు. 38 యెషయా ప్రవక్త చెప్పిన ఈ వాక్కు నెరవేరేలా అది *జరిగింది:* "ప్రభూ, మేము తెలియజేసిన సమాచారం నమ్మినదెవరు? ప్రభు హస్తం ఎవరికి వెల్లడి అయింది?" 39 ఇందుచేత వారు నమ్మలేకపోయారు. ఎందుకంటే, యెషయా ఇంకా ఇలా చెప్పాడు: 40 వారు తమ కండ్లతో చూడకుండా, తమ హృదయాలతో అర్థం చేసుకోకుండా, నావైపు తిరిగి నావల్ల బాగుపడకుండా ఆయన వారి కండ్లకు గుడ్డితనం కలిగించాడు, వారి హృదయాలను కఠిన పరిచాడు. 41 యెషయా యేసు మహిమ చూచి ఆయన విషయం చెప్పినప్పుడు ఈ విషయాలు అన్నాడు.

42 అయినా అధికారులలో కూడా అనేకులు ఆయనమీద నమ్మకం ఉంచారు గాని పరిసయ్యుల కారణంగా అది ఒప్పుకోలేదు. తమను సమాజ కేంద్రంనుంచి వెలివేయడం జరుగుతుందేమో అని భయపడ్డారు. 43 దేవుని మెప్పుకంటే మనుషుల మెప్పు వారికి ఎక్కువ ప్రీతిపాత్రమైనదన్న మాట.

44 అప్పుడు యేసు బిగ్గరగా ఇలా అన్నాడు: "నామీద నమ్మకం ఉంచేవాడు నామీద కాదు, నన్ను పంపినవాని మీద

---

2 కొరింతు 4:4; ఎఫెసు 2:2; 6:12 చూడండి. మనుషులకు చాలా ఇష్టమైన చీకటిలో (3:19), ఏకైక నిజ దేవుణ్ణి ఎరుగని పాపుల హృదయాల్లో వాడు రాజ్యమేలుతుంటాడు. సైతాను గురించి నోట్స్ 8:44; 1 దిన 21:1; మత్తయి 4:1-10.

"బయటికి త్రోసివేయడం" అంటే లోకంలో నుండి వెళ్ళగొట్టడమని కాదు యేసుప్రభువు ఉద్దేశం. ఎందుకంటే సైతాను ఇంకా నిక్షేపంగా ఈ లోకంలోనే ఉన్నాడు (1 పేతురు 5:8). క్రీస్తు మళ్ళీ వచ్చేవరకు వాణ్ణి లోకంలోనుంచి బయటికి వెళ్ళగొట్టడం జరగదు (ప్రకటన 20:13). కాబట్టి ఇక్కడ దీని అర్థం ఇది కావచ్చు – సిలువ ద్వారా యేసు క్రీస్తు మనుషులకు విముక్తిని సాధిస్తాడు. దీని ఫలితంగా సైతాను చివరికి పూర్తిగా ఓడిపోతాడు. అన్ని దేశాల్లోనూ ఇంతకుముందు సైతాను పరిపాలన కింద ఉన్న మనుషులు దేవునివైపు తిరుగుతారు, చివరికి లోకమంతా దేవుని పరిపాలనకు లోబడి, ఆయన మహిమను ప్రతిబింబిస్తుంది (యెషయా 11 అధ్యాయం; మొ॥). దీనంతటికీ సిలువ ఆధారం. తాత్కాలికంగా సైతాను విజయంగా అనిపించిన సిలువ వాడి సమూల నాశనానికి దారి తీసేది.

**12:32** 3:14; 8:28 పోల్చి చూడండి.

"పైకెత్తడం" – సిలువను సూచించే మాట. మనుషులందరినీ తనవైపుకు ఆకర్షించుకోవడం అంటే మనుషులంతా పాపవిముక్తి పొందుతారని కాదు (8:24; మత్తయి 7:13,14; 25:46; ప్రకటన 21:8 చూడండి) యేసు యూద జాతినుంచి మాత్రమే గాక అన్ని జాతులు, జనాలు, వంశాలనుంచి మనుషులను తనవైపుకు ఆకర్షించుకుంటాడని అర్థం (ప్రకటన 7:9).

**12:33** మొదటినుంచీ కూడా తాను సిలువపై మరణిస్తానని ఆయనకు తెలుసు.

**12:34** వారు బహుశా కీర్తన 89:36; 110:4; యెషయా 9:7; దానియేలు 7:14వంటి వచనాల గురించి అడుగుతున్నారు. యేసు తనను తాను తరచుగా "మానవ పుత్రుడు" అంటున్నాడని వారికి తెలుసు. ఈ పేరుకు అర్థమేమిటో అనీ పాత ఒడంబడిక గ్రంథంలో చెప్పిన అభిషిక్తుడే ఈ మానవ పుత్రుడా అనీ సందేహించారు. "మానవ పుత్రుడు" గురించి నోట్ మత్తయి 8:20.

**12:35** "వెలుగు" – అంటే తానే అని ప్రభువు ఉద్దేశం. వ 46; 8:12; 9:5. అంతటా చాలామంది ప్రజల విచారకరమైన పరిస్థితి ఇక్కడ కనిపిస్తున్నది – వారు ఎక్కడికి వెళ్తున్నారో వారికి తెలియదు.

**12:36** అంటే క్రీస్తుపై నమ్మకం ఉంచి "వెలుగు" అయి ఉన్న దేవుని పిల్లలుగా మారాలని దీని అర్థం (1 యోహాను 1:5). వెలుగు అయి ఉన్న క్రీస్తును స్వీకరించి ఆయన పేరుమీద నమ్మకం పెట్టుకోవడం ద్వారా మాత్రమే ఎవరైనా దేవుని పిల్లలు కాగలరు (1:12,13). "వెలుగు సంతానం" అనేమాట వెలుగు లక్షణం ఉన్నవారినీ, వెలుగులోకి వచ్చి వెలుగును అమూల్యమైనదిగా భావించేవారినీ, వెలుగును ఇతరులకు అందించేవారినీ సూచిస్తున్నది. మత్తయి 5:14-16; ఎఫెసు 5:8; 1 తెస్స 5:5 పోల్చి చూడండి.

**12:37-40** శుభవార్త పుస్తకాలన్నిటిలో అనేకమంది యూదుల అపనమ్మకం కనబడుతున్నది. క్రీస్తు వారికి చూపిన సాక్ష్యాధారాలూ రుజువులూ ఏవీ వారిని నమ్మించలేకపోయాయి. వారి అపనమ్మకానికి అర్థం లేదు. ఇది చాలా వింతగా విపరీతంగా ఉంది. అయితే ఇక్కడ దానికొక కారణం కనిపిస్తున్నది. వారు పాత ఒడంబడికలోని భవిష్యద్వాక్కులను నెరవేరుస్తున్నారు. యెషయా 53:1; 6:10 చూడండి. వారి అపనమ్మకం వారి పాపాలకు దేవుని తీర్పు. ఆ జాతి ఇంతకుముందు ఎప్పుడో అపనమ్మకం మార్గాన్ని ఎన్నుకున్నది. దేవుడిప్పుడు వారిని ఆ మార్గంలో విడిచిపెట్టాడు. మత్తయి 13:14,15 నోట్ చూడండి.

**12:41** యెషయా 6:1-3లో తాను ప్రభువును (హీబ్రూలో "యెహోవా") చూశాననీ, భూమి అంతా ప్రభువు ("యెహోవా") మహిమతో నిండి ఉందనీ యెషయా రాశాడు. ఇక్కడ యెషయా యేసు మహిమను చూశాడని యోహాను రాస్తున్నాడు. అంటే యేసు యెహోవాదేవుని అవతారం అన్నమాట. 8:24,58; 10:11; లూకా 2:11 మొ॥ కూడా చూడండి.

**12:42,43** వీరి నమ్మకం నిజమైనదేనా? బహుశా నిజ విశ్వాసం అంకురం వారిలో ఉందేమో. అది తరువాత మొలకెత్తి వారిని మరింత ధైర్యవంతులుగా చేసిందేమో. అయితే నమ్మకం ఉంచామని చెప్పుకుంటూ భయానికి లొంగిపోతూ, మనుషుల మెప్పుదల కోసం ఆశించేవారిని చూచి వారి గురించి సందేహించకుండా ఉండలేము.

**12:44,45** తండ్రి అయిన దేవునితో తన ఐక్యతను ఇంతకన్న

నమ్మకం ఉంచుతున్నాడు. 45 నన్ను చూచేవాడు నన్ను పంపినవాణ్ణి చూస్తున్నాడు. 46 నామీద నమ్మకం ఉంచేవారు చీకటిలో ఉండిపోకుండా నేను వెలుగుగా లోకానికి వచ్చాను. 47 నా మాటలు ఎవరైనా విని నమ్మకపోతే నేను వానికి తీర్పు చేయడం లేదు. లోకానికి తీర్పు తీర్చడానికి నేను రాలేదు గాని లోకానికి విముక్తి కలిగించడానికే వచ్చాను. 48 నా మాటలు అంగీకరించక నన్ను నిరాకరించేవానికి తీర్పు తీర్చేది ఒకటి ఉంటుంది. చివరి రోజున వారికి తీర్పు తీర్చేది నేను చెప్పిన వాక్కే. 49 ఎందుకంటే, నా అంతట నేనే మాట్లాడలేదు. నేనేమి చెప్పాలో, ఏమి మాట్లాడాలో నన్ను పంపిన తండ్రి నన్ను ఆదేశించాడు. 50 ఆయన ఆదేశం శాశ్వత జీవమని నాకు తెలుసు. అందుచేత నేను ఏ సంగతులు చెప్పినా తండ్రి నాకు చెప్పినట్టే చెపుతున్నాను."

13 అప్పుడు, పస్కా పండుగకు ముందు ఈ లోకాన్ని విడిచి తండ్రిదగ్గరకు వెళ్ళిపోవలసిన సమయం వచ్చిందని యేసుకు తెలుసు. లోకంలో ఉన్న తన సొంతవారిని ఆయన ప్రేమిస్తూ వారిని అంతంవరకూ ప్రేమతో చూశాడు. 2 ఆయనను శత్రువులకు పట్టి ఇవ్వాలనే ఉద్దేశం అపనింద పిశాచం ఇంతకుముందే సీమోను కొడుకైన ఇస్కరియోతు యూదా హృదయంలో పుట్టించాడు. అప్పటికి సాయంకాల భోజనం చేయడం ముగిసింది. 3 పరమ తండ్రి సమస్తమూ తన చేతికి అప్పగించాడనీ తాను దేవుని దగ్గరనుంచి వచ్చి దేవుని దగ్గరకు తిరిగి వెళ్ళిపోతాననీ యేసుకు తెలిసికూడా 4 ఆయన భోజనపంక్తిలోనుంచి లేచి తన పైవస్త్రాలు విడిచి అవతల పెట్టి తువాలు తీసుకొని దానిని నడుముకు చుట్టుకొన్నాడు. 5 అప్పుడు పళ్ళెంలో నీళ్ళు పోసి శిష్యుల పాదాలు కడుగుతూ నడుముకు చుట్టుకొన్న తువాలుతో తుడవసాగాడు.

6 అలాగే ఆయన సీమోను పేతురు దగ్గరికి వచ్చాడు. అతడు ఆయనతో "ప్రభూ! నా పాదాలు కడుగుతావా?" అన్నాడు.

7 అందుకు యేసు జవాబిస్తూ "నేను చేస్తున్నది ఇప్పుడు నీకు అర్థం కావడం లేదు గాని తరువాత నీకు తెలిసిపోతుంది" అని అతనితో చెప్పాడు.

8 పేతురు "నీవు నా పాదాలు ఎన్నడూ కడగవు!" అని ఆయనతో అన్నాడు.

యేసు "నేను నిన్ను కడుగకపోతే నీకు నాతో భాగం లేదు" అని అతనికి బదులు చెప్పాడు.

9 సీమోను పేతురు "ప్రభూ! నా పాదాలు మాత్రమే గాక

---

స్పష్టంగా యేసు వెల్లడించగలడా? 10:30; 14:9 పోల్చి చూడండి. యేసును నమ్మడమంటే దేవుణ్ణి నమ్మడమే. ఆయన్ను చూస్తే దేవుణ్ణి చూచినట్టే.

**12:46** వ 35,36; 8:12; 9:5. క్రీస్తు ఈ లోకానికి ఎందుకు వచ్చాడో మత్తయి 5:17 నోట్ చూడండి.

**12:47** 3:17.

**12:48** చివరి రోజు అంటే దేవుడు నియమించిన తీర్పు రోజు. మత్తయి 10:15 నోట్‌లో రిఫరెన్సులు చూడండి. ఆ సమయంలో తెరిచే పుస్తకాల్లో (ప్రకటన 20:12) ఒకదానిలో క్రీస్తు చెప్పిన మాటలు ఉంటాయన్నమాట. అంటే ఈ నాలుగు శుభవార్తల్లో మనం చూస్తున్న మాటలు, వాటి ప్రకారం మనం ప్రవర్తించకపోతే మనమీదికి మనమే శిక్ష తెచ్చిపెట్టుకున్న వారమౌతాం. 7:21–23 పోల్చి చూడండి.

**12:49** 5:19; 4:34 పోల్చి చూడండి. యేసుప్రభువు ఉపదేశాలన్నీ దేవుడు నియమించిన ఖచ్చితమైన మాటల్లో, భాష తీరులో, వ్యక్తీకరణలో ఉన్నాయి. వాటిని ఎదిరించబూనుకునే వాడు వాటిని ఇచ్చిన ఏకైక నిజ దేవునితోనే పోరాడుతున్నాడన్న మాట.

**12:50** "జీవానికి" – ఈ శుభవార్త అంతటా కొనసాగే ముఖ్యాంశం జీవం (1:4; 3:16,36; 4:14; 5:24; 6:47; 10:10). తండ్రి అయిన దేవుడు తనకిచ్చిన మాటలనే అక్షరాలా మాట్లాడేందుకు క్రీస్తు జాగ్రత్త వహించాడు. ఆ మాటల్లో వెలిబుచ్చిన అంశాలు చాలా ప్రాముఖ్యమైనవి. క్రీస్తు బహిరంగ పరిచర్యలో ఆయన పలికిన ఆఖరు పలుకులివి. ఆయన చెప్పిన మాటలన్నిటిపై ఇవి దేవుని అధికార ముద్ర వేస్తున్నాయి. దేవుని వాక్కు ఆయనే (1:1), ఆయన దేవుని వాక్కులనే పలికాడు.

**13:1** "పస్కా" – నిర్గమ 12వ అధ్యాయం; లేవీ 23:4–8. చివరికి క్రీస్తు వెళ్ళిపోవలసిన సమయం వచ్చింది. 7:30 చూడండి.

"ప్రేమించి" – ఆయన జీవితం, పరిచర్య అంతా ఆయన ప్రేమ ప్రదర్శనమే. ఇప్పుడాయన తన ప్రజలకు తన ప్రేమ పొడవు, వెడల్పు, లోతు చూపించబోతున్నాడు (ఎఫెసు 3:18).

**13:2** "అపనింద పిశాచం" – మత్తయి 4:1.

"యూదా" – 6:70,71; 12:6; మత్తయి 26:14–16.

**13:3** "తన చేతికి అప్పగించాడని" – 3:35; 10:18; 17:2; మత్తయి 28:18 పోల్చి చూడండి.

**13:4,5** తాను కుమారుడైన దేవుణ్ణని, తండ్రి అయిన దేవుని దగ్గరనుంచి వచ్చానని, అక్కడికే తిరిగి వెళ్ళనున్నానని ఆయనకు తెలుసు. అయినా ఇక్కడ ఆయన అల్ప స్థితిలోని దాసుడు చేసే పనికి సమకట్టాడు. ఇది ఆయన అణకువను వెల్లడి చేస్తున్నది. సేవలు పొందడానికి మారుగా సేవించడానికి ఆయన మనసును ఇది తెలియజేస్తున్నది. మత్తయి 11:29; 20:25–28; ఫిలిప్పీ 2:68 చూడండి. ఈ రోజుల్లో సేవకులం, శిష్యులం అని చెప్పుకునే చాలామందికి ఆయనకూ ఎంత తేడా!

**13:6–8** క్రీస్తు అనీ సజీవుడైన దేవుని కుమారుడనీ తనకు తెలిసిన వ్యక్తి (మత్తయి 16:16) సాధారణ సేవకుడు చేసే పని చేయడం తగినపని కాదని పేతురుకు అనిపించింది. ఆ పనిలోని అర్థాన్ని అతడు తరువాత గ్రహిస్తాడని యేసు అతనితో చెప్పినప్పటికీ అలా జరగనివ్వడానికి పేతురు అంగీకరించలేదు. పేతురు మాటల్లో వినయం ఉట్టిపడుతున్నట్టు అనిపిస్తున్నది గానీ వాటిలో కొంత గర్వం కూడా వెల్లడి అవుతున్నది. ఏం చెయ్యాలో ఏం చెయ్యకూడదో యేసుప్రభువు కంటే తనకు బాగా తెలుసని పేతురు అనుకున్నాడా? (మత్తయి 16:22; యెషయా 40:13,14 కూడా చూడండి). దేవుని కుమారుడు తనకు చేయబోతున్నదాన్ని నిరాకరించేందుకు మానవుడు ఎంతటివాడు? ఆయన మన విషయంలో చేసే పనులనేకం ఇప్పుడు మనకు అర్థం కాకపోవచ్చు (రోమ్ 11:33,34). కానీ ఆయన ఇష్టప్రకారం మనం అణకువతో ఆయన్ను మనకు పరిచర్య చేయనివ్వాలి. ఒక దినాన ఆయన మనకు చేసేదంతా, మనకోసం, మనతో, మనలో చేసేదంతా మనకు అర్థం అవుతుంది.

"నీకు నాతో భాగం లేదు" అన్నమాటల్లో ఒక ఆత్మ సంబంధమైన అర్థం ఉంది. ఆయనతో శిష్యులకు సహవాసం కావాలంటే ఆయన వారి పాపాలను కడిగివేయడం తప్పనిసరి.

నా చేతులూ నా తల కూడా కడిగేయండి!” అని ఆయనతో అన్నాడు.

10 యేసు అతనితో ఇలా అన్నాడు: “స్నానం చేసినవాడు తన పాదాలు మాత్రమే కడగాలి. వాడు కేవలం శుద్ధుడు. మీరు శుద్ధులే గాని మీలో ప్రతి ఒక్కడూ శుద్ధుడు కాదు.”

11 తనను శత్రువులకు పట్టి ఇవ్వబోయే వాడెవడో ఆయనకు తెలుసు. కనుకనే “మీలో ప్రతి ఒక్కడూ శుద్ధుడు కాదు” అన్నాడు.

12 వారి పాదాలు కడిగి తన పైవస్త్రాలు వేసుకొని మళ్ళీ కూర్చున్న తరువాత ఆయన వారితో ఇలా అన్నాడు: “నేను మీకు చేసినదాని భావం మీకు తెలుసా? 13 మీరు నన్ను గురువు, ప్రభువు అంటారు. మీరలా అనడం సరిగానే ఉంది – అలాగే ఉన్నాను. 14 ప్రభువుగా గురువుగా ఉన్న నేను మీ పాదాలు కడిగితే మీరూ ఒకరి పాదాలు ఒకరు కడగవలసినదే. 15 నేను మీకు చేసిన ప్రకారం మీరూ చేయాలని మీకు ఆదర్శాన్ని చూపాను. 16 మీతో ఖచ్చితంగా చెపుతున్నాను, దాసుడు తన యజమానిని మించినవాడు కాడు. పంపేవాని కంటే పంపబడ్డవాడు మించినవాడు కాడు. 17 మీరు ఈ విషయాలు తెలుసుకొంటే వీటి ప్రకారం చేస్తే మీరు ధన్యజీవులు. 18 మీలో ప్రతి ఒక్కణ్ణి గురించి నేను చెప్పడం లేదు. నేను ఎన్నుకొన్నవారు నాకు తెలుసు. అయితే ఈ విధంగా లేఖనం నెరవేరాలి: రొట్టె నాతో తిన్నవాడు నాకు వ్యతిరేకంగా మడిమ ఎత్తాడు. 19 ఇది జరిగినప్పుడు నేనే ‘ఉన్నవాడును’ అని మీరు నమ్మాలని ఇది జరగకముందే మీకు చెపుతున్నాను. 20 మీతో ఖచ్చితంగా చెపుతున్నాను, నేను పంపేవారిని స్వీకరించేవాడు నన్నూ స్వీకరిస్తున్నాడు, నన్ను స్వీకరించేవాడు నన్ను పంపినవాణ్ణీ స్వీకరిస్తున్నాడు.”

21 ఈ మాటలు చెప్పిన తరువాత యేసు తన ఆత్మలో ఆందోళన చెందాడు. “మీతో ఖచ్చితంగా చెపుతున్నాను, మీలో ఒకడు నన్ను శత్రువులకు పట్టి ఇస్తాడు” అని సాక్ష్యం చెప్పాడు.

22 ఆయన ఎవణ్ణి గురించి చెప్పాడో అని అనుమానంతో శిష్యులు ఒకరివైపు ఒకరు చూచుకోసాగారు. 23 ఆయన శిష్యులలో ఒకడు – యేసు ప్రేమించినవాడు యేసు ఛాతీని ఆనుకొని ఉన్నాడు. 24 అతనికి సీమోను పేతురు సైగ చేసి ఆయన ఎవణ్ణి గురించి చెప్పాడో అడగమని సూచించాడు. 25 అతడు యేసు ఛాతీని ఆనుకొని ఉండి ఆయనను ఇలా అడిగాడు: “ప్రభూ, అతడెవడు?”

26 అందుకు యేసు “ఎవరికి రొట్టె ముక్క ముంచి ఇస్తానో అతడే” అని జవాబిచ్చాడు.

ఆ ముక్క ముంచి సీమోను కొడుకైన ఇస్కరియోతు

---

1 యోహాను 1:7-9 చూడండి.

**13:10** ఈ విశ్వాసులు మొదట క్రీస్తుపై నమ్మకం ఉంచినప్పుడు వారి పాపాన్ని పూర్తిగా కడిగివేయడం జరిగింది. పౌలు దీన్ని “కొత్త జన్మ అనే స్నానం” అన్నాడు – తీతు 3:5; యోహాను 3:5 చూడండి. ఇది అనుభవించినవారు మళ్ళీ మళ్ళీ దీన్ని పొందనక్కర లేదు. నిజానికి ఒకటికంటే ఎక్కువ సార్లు దీన్ని పొందడం అసాధ్యం. అయితే పాపంతో నిండిన ఈ లోకంలో వారి క్రైస్తవ నడతలో వారి ఆధ్యాత్మికమైన “పాదాలు” మురికి కావచ్చు. వారికి పాపం అంటుకోవచ్చు. దాన్ని కడుక్కోవలసిన అవసరం వస్తుంది (లూకా 11:4; కీర్తన 51:4; రోమ్ 7:18,19). ఇది ఎన్ని సార్లు అవసరమైతే అన్ని సార్లు క్రీస్తు చేస్తాడు (ఎఫెసు 5:25,26 పోల్చి చూడండి). వారిలో “ప్రతి ఒక్కడూ శుద్ధుడు కాదు”, అంటే ఈ కొత్త జన్మ అనే స్నానాన్ని యూదా ఎన్నడూ అనుభవించి ఉండేవాడు కాదని యేసు ఉద్దేశం. అతడు ఇప్పటికీ హృదయంలో, మనస్సులో, ఆత్మలో మురికిగానే ఉన్నాడు.

**13:11** 2:24,25.

**13:12** ద్రోహి అయిన యూదా పాదాలతో సహా క్రీస్తు అందరి పాదాలూ కడిగాడు. శత్రువులతో ఎలా ప్రవర్తించాలో ఇది ఒక ఉదాహరణ. మత్తయి 5:43,44; రోమ్ 12:17-21 పోల్చి చూడండి. ప్రభువు అడిగిన ప్రశ్న తాను చేసిన పనిలోని ఆధ్యాత్మిక అంతరార్థం గురించినదే. కాళ్ళు కడగడం అనేదాన్ని అర్థం చేసుకున్నారా అని వారిని అడగవలసిన పని లేదు.

**13:13** “నన్ను గురువు...” – అలాగైతే పేతురులాగా ఎవరూ ఆయనకు బుద్ధి చెప్పేందుకూ, ఏం చేయ్యాలో నేర్పేందుకు ప్రయత్నించకూడదు.

**13:14** బాప్తిసం, ప్రభురాత్రి భోజన ఆచారాల్లాగా యేసు తన సంఘానికి మరో ఆచారాన్ని ఇక్కడ నియమిస్తున్నాడని ఈ నోట్స్ రచయిత నమ్మడం లేదు. సాధారణ జీవిత విషయాల్లో అక్షరాలా కాళ్ళు కడగడం గానీ మరి ఏ ఇతర సేవ గానీ వినయంతో ఇతరులకు చేయడానికి ప్రతి విశ్వాసీ సిద్ధంగా ఉండాలి. ఇలాంటి సేవ గురించి యేసు ఇక్కడ చెప్తున్నాడు. అంతే కాకుండా ఇతర విశ్వాసులకు వారి అనుదిన క్రైస్తవ జీవితాల్లో అంటుకునే పాపాలను శుద్ధి కలగడానికి సహాయపడేందుకు ప్రవర్తించాలని కూడా ఈ మాటలు సూచించవచ్చు. అలాంటివారికి దేవుని వాక్కు ఉపదేశించడం ద్వారా (15:3), యేసుప్రభువు ద్వారా అలా శుద్ధి పొందేలా వారిని ప్రోత్సాహించడం ద్వారా (1 యోహాను 1:9) అలా చెయ్యవచ్చు.

**13:15** అన్నిటిలో లాగానే ఇందులో కూడా క్రీస్తు మనకు ఆదర్శం – 1 పేతురు 2:21-23; 1 యోహాను 2:6.

**13:16** మత్తయి 10:24,25.

**13:17** క్రీస్తు చెప్పేది చెయ్యడం వల్ల మాత్రమే దేవునినుంచి కలిగే ఆశీర్వాదం ఒకటి ఉంది – లూకా 11:28. వినడం మాత్రమే చాలదు (యాకోబు 1:22,23). ధన్యత, దీవెనల గురించి నోట్స్ ఆది 12:1-3; సంఖ్యా 6:22-27; కీర్తన 1:1; 119:1; మత్తయి 5:3-12.

**13:18** 6:70,71; కీర్తన 41:9.

**13:19** “ఉన్నవాడను” – 8:24,28,58. క్రీస్తు కేవలం దుర్మార్గుల కుతంత్రాలకు బలైపోలేదనీ, ఆయనకు జరగబోయేది తెలుసనీ, పరిస్థితులు ఆయన అదుపులోనే ఉన్నాయనీ తరువాతి కాలంలో శిష్యులకు అర్థం అయింది. అప్పుడు వారి నమ్మకం స్థిరపడి, బలపడి పెరిగింది.

**13:20** మత్తయి 10:40; మార్కు 9:37; లూకా 9:48; 10:16. క్రీస్తు పంపేవారు ఆయన రాయబారులు, ఆయన ప్రతినిధులు (2 కొరింతు 5:20). వారిని స్వీకరించడమంటే వారిని పంపిన పరమ తండ్రిని, కుమారుణ్ణి స్వీకరించినట్టే.

**13:21** 11:33; 12:27. ఏం జరగబోతున్నదో ముందుగానే తెలిసినందువల్ల యేసు నిర్లక్ష్యంగా నిరుత్సాహంగా నిర్లిప్తంగా అయిపోలేదు.

**13:22** యూదా తప్ప మిగతా వారంతా పూర్తిగా నిర్ఘాంతపోయారు. వారిలో ఎవరూ కూడా యూదాను క్షణమాత్రమైనా సందేహించినట్టు లేదు.

**13:23** ఇతడు బహుశా శిష్యుడైన యోహాను, ఈ శుభవార్త రచయిత. 19:26; 20:2; 21:7,20 కూడా చూడండి.

యూదాకు ఇచ్చాడు. 27 ఆ ముక్క తీసుకొన్న తరువాత సైతాను వానిలో చొరబడ్డాడు. అప్పుడు యేసు వానితో “నీవు చేసేది త్వరగా చెయ్యి!” అన్నాడు.

28 ఆయన ఏ కారణంచేత వానికి అది చెప్పాడో భోజనానికి కూర్చుని ఉన్నవారిలో ఎవరికీ తెలియదు.
29 డబ్బుసంచి యూదాదగ్గర ఉంది గనుక పండుగకోసం తమకు కావలసినవి కొనమని గానీ బీదలకు ఏమైనా ఇమ్మని గానీ యేసు వానితో చెప్పాడేమో అని కొందరు అనుకొన్నారు.
30 వాడు ఆ ముక్క తీసుకోగానే బయటికి వెళ్ళాడు. అది రాత్రివేళ.

31 వాడు బయటికి వెళ్ళినతరువాత యేసు ఈవిధంగా అన్నాడు: “ఇప్పుడు మానవ పుత్రునికి మహిమ చేకూరుతుంది, ఆయనమూలంగా దేవునికి కూడా మహిమ చేకూరుతుంది.
32 ఆయనమూలంగా దేవునికి మహిమ చేకూరితే దేవుడు తనమూలంగా ఆయనను మహిమపరుస్తాడు, వెంటనే ఆయనను మహిమపరుస్తాడు. 33 చిన్నపిల్లలూ! ఇంకా కొంత కాలమే మీతో ఉంటాను. మీరు నన్ను వెదకుతారు గాని నేను యూదులకు చెప్పినట్టు మీకూ చెపుతున్నాను, నేను వెళ్ళిపోయే స్థలానికి మీరు రాలేరు. 34 ఒక క్రొత్త ఆజ్ఞ మీకిస్తున్నాను – మీరు ఒకరినొకరు ప్రేమతో చూచుకోవాలి. నేను మిమ్ములను ప్రేమతో చూచినట్టే మీరూ ఒకరినొకరు ప్రేమతో చూచుకోవాలి. 35 మీరు ఒకరినొకరు ప్రేమతో చూచుకొంటే దాన్నిబట్టి మీరు నా శిష్యులని అందరూ తెలుసుకొంటారు.”

36 సీమోను పేతురు “ప్రభూ! ఎక్కడికి వెళ్ళిపోతున్నావు?”

**13:27** లూకా 22:3. ఇంతకు ముందే సైతాను యూదా మనసులో యేసును ద్రోహంతో శత్రువులకు పట్టివ్వాలన్న ఆలోచనను ప్రవేశపెట్టాడు. (వ 2). యూదా ఎప్పటినుంచో సైతాను దారుల్లో వెళ్తున్నాడు (6:70; 12:6). ఇప్పుడైతే సైతాను అతణ్ణి పూర్తిగా వశపరచుకున్నాడు. ఈ భయంకరమైన సంఘటన యూదాను భయంకరమైన అంతానికి తెచ్చింది (మత్తయి 27:3–7). యేసు యూదాతో చెప్తున్న మాటలు ఆయన సమయం వచ్చిందనీ, యూదా చేసే ద్రోహ కార్యానికి ఆయన పూర్తిగా సన్నద్ధుడై ఉన్నాడని తెలియజేస్తున్నాయి. ఇక యూదా కాలయాపన చెయ్యవలసిన పని లేదు (7:30; 12:1).

**13:29** 12:6 శిష్యుల్లో కనిపించే మందబుద్ధి కొన్ని సార్లు ఆశ్చర్యం కలిగిస్తుంది.

**13:30** ఇతర శిష్యులకు అర్థం కాకపోయినా యేసు అన్నదేమిటో యూదాకు తెలుసు. అది రాత్రివేళ, యూదాలో అది ఆధ్యాత్మికంగా రాత్రి సమయం, ఈ భూమిపై అంధకార సమయం ఆరంభం (లూకా 22:53). మత్తయి 26:26–29లోని సంగతులు జరిగాక యూదా బయటికి వెళ్ళినట్టుంది. లూకా 22:20,21 చూడండి.

**13:31** “మానవ పుత్రుడు” – మత్తయి 8:20. యేసుప్రభువు సిలువపై ఘోరమైన మరణాన్ని పొందవలసిన ఘడియ ఆసన్నమైనది. ఆయన్ను పట్టియివ్వబోయేవాడు అలా చేసేందుకు బయటికి వెళ్ళాడు. మరుసటి రోజు యేసు మరణిస్తాడు. దీన్నంతటినీ ఆయన ఎలా భావిస్తున్నాడు? తనకు మహిమగా భావిస్తున్నాడు. అది మహిమ ఎలా కాగలదు? ఆయనకు అన్నిటికన్నా ఎక్కువ గౌరవాన్ని చేకూర్చే ఆయనలోని లక్షణాలను ఆ సిలువ బాధలు బయట పెట్టబోతున్నాయి. దేవునిపట్ల, మనుషులపట్ల ఆయన అమర ప్రేమ, ఆయన అణకువ, ఆయన పవిత్రత, తదితర శ్రేష్ఠ గుణాలు అవి. యేసు సిలువ మరణంలో మహిమ పొందినంతకంటే మరే సమయంలోనూ ఎక్కువ మహిమ పొందలేదు. ఎందుకంటే ఆయన స్వభావం, లక్షణాలు అతి స్పష్టంగా వెల్లడి అయినది అక్కడే. అంతేగాక జరిగిన దానంతటిలో తండ్రికీ కుమారునికీ సంపూర్ణ ఐక్యత ఉంది గనుక క్రీస్తులో తండ్రి అయిన దేవుడు కూడా మహిమ పొందాడు.

**13:32** క్రీస్తు చనిపోయి సజీవంగా లేవడం గురించిన మాట ఇది. యేసు మనసారా సమ్మతించి సిలువ మరణాన్ని సహించాడు కాబట్టి దేవుడు ఆయన్ను లేపి పరలోకంలో తన కుడివైపున అత్యున్నతంగా హెచ్చించాడు (అపో కా 2:32,33; 3:13–15; ఫిలిప్పీ 2:6–11).

**13:33** యేసు తన శిష్యులను “చిన్నపిల్లలారా” అని పిలిచినది ఇక్కడొక్క చోటనే. వారి పట్ల ఆయనకున్న వాత్సల్యాన్ని ఇది సూచిస్తున్నది (1 యోహాను 2:1,12,13,18,28; 3:7,18; 4:4; 5:21 పోల్చి చూడండి. మత్తయి 18:2,3 కూడా చూడండి.

**13:34** ఆయన మరణించే రోజు ముందురాత్రి ఆయన మనసులో ప్రధానంగా ఉన్న తలంపు తన శిష్యులంతా ఒకరినొకరు ప్రేమించుకోవలసిన అవసరమే. అలా చెయ్యాలని కేవలం వారికి విన్నవించుకోలేదు, సలహా ఇవ్వలేదు. ఆజ్ఞ ఇచ్చాడు. ఈ ఆజ్ఞ మూడు సార్లు ఇచ్చాడు (15:12,17). రోమ్ 13:8; గలతీ 5:13,14; ఎఫెసు 5:2; ఫిలిప్పీ 2:2; కొలస్సయి 2:2; 1 తెస్స 3:12; 4:9; హీబ్రూ 13:1; యాకోబు 2:8; 1 పేతురు 1:22; 2:17; 3:8; 1 యోహాను 3:11,18,23; 4:7 కూడా చూడండి.

“క్రొత్త” – తనను ప్రేమించుకొన్నట్టే తన సాటి మనిషిని ప్రేమించాలన్నది దేవుని ధర్మశాస్త్రమంతట్లోనూ ఉన్న రెండు గొప్ప ఆజ్ఞల్లో ఒకటి (మత్తయి 22:35–40). అలాగైతే ఇది కొత్త ఆజ్ఞ ఎలా అయింది? యేసుప్రభువు ధర్మశాస్త్రం కంటే ఉన్నతమైనదీ, శ్రేష్టమైనదీ అయిన ఒక ఆజ్ఞను ఇస్తున్నాడు. క్రీస్తు సంఘం అనే పేరుతో పిలవబడే విముక్తులైన ఒక కొత్త గుంపును ఆయన సృష్టించాడు. అందులో ప్రతి సభ్యుడూ ఇతర సభ్యులందరి పట్లా చూపవలసిన ప్రేమ ప్రత్యేకమైనది, సాటి మనిషి పట్ల చూపవలసిన ప్రేమ, ఆదరాలకంటే ఉన్నతమైనది. వారిపట్ల క్రీస్తు చూపిన ప్రేమను ఆధారం చేసుకున్న ప్రేమ అది. విశ్వాసులు కేవలం తమను తాము ప్రేమించుకొన్నట్టే సాటి విశ్వాసులను ప్రేమిస్తే సరిపోదు. క్రీస్తు తమను ప్రేమించినట్టుగా వారిని ప్రేమించాలి. క్రీస్తు ఎలా ప్రేమించాడు? అంతం వరకు, సంపూర్ణంగా మనసారా, తన ప్రాణం ధారపోసేంతగా ప్రేమించాడు. 1 యోహాను 3:16 చూడండి. ఆయనది సంపూర్ణంగా పవిత్రమైన ప్రేమ, స్వార్థం లేనిప్రేమ, ఎన్నడూ తప్పని ప్రేమ 1 కొరింతు 13:1 నోట్ చూడండి.

**13:35** క్రైస్తవులు ఒకరినొకరు ప్రేమించుకొంటే, తమకూ సంఘం వెలుపల ఉన్న ప్రజలకూ వారు నిజమైన క్రైస్తవులనీ, క్రీస్తును నిజంగా అనుసరించేవారనీ అది రుజువుగా ఉంటుంది – 1 యోహాను 3:14. క్రైస్తవులు ఒకరినొకరు కరుచుకుంటూ దిగమింగివేస్తూ ఉంటే (గలతీ 5:15), ఒకరినొకరు మోసగిస్తూ ఉంటే (1 కొరింతు 6:8) ప్రజలకు వారు నిజమైన క్రైస్తవులని నమ్మకం కుదరదు.

**13:36** లూకా 24:45లో రాసిన సంఘటన జరగకముందు శిష్యులు ఆధ్యాత్మిక సత్యాలను అర్థం చేసుకోవడంలో చాలా మందమతులు. తనకు కలగబోతున్న మరణం గురించి ఆయన వారికి ఒకటికన్నా ఎక్కువ సార్లు చెప్పాడు (మత్తయి 16:21; మొ॥). ప్రేమించాలని యేసు ఇచ్చిన ఆజ్ఞను పూర్తిగా పక్కకు నెట్టి అంతకు ముందు ఆయన చెప్పిన సంగతి గురించి పేతురు

అని ఆయననడిగాడు.

యేసు “నేను వెళ్ళే స్థలానికి నీవిప్పుడు నా వెంట రాలేవు. తరువాత నా వెంట వస్తావు” అని సమాధానం చెప్పాడు.

37 పేతురు “ప్రభూ, నేనెందుకు ఇప్పుడు నీ వెంట రాలేను? నీకోసం నా ప్రాణం ధారపోస్తాను” అని ఆయనతో జవాబిచ్చాడు.

38 యేసు “నీ ప్రాణం నాకోసం ధారపోస్తావా? నీతో ఖచ్చితంగా చెపుతున్నాను, నన్ను ‘ఎరగన’ని నీవు మూడు సార్లు చెప్పకముందే కోడి కూయదు” అన్నాడు.

14 “మీ హృదయం ఆందోళన పడనియ్యకండి. మీరు దేవుని మీద నమ్మకం ఉంచుతూ ఉన్నారు. నామీద కూడా నమ్మకం ఉంచండి. 2 నా తండ్రి ఇంటిలో అనేక నివాసాలు ఉన్నాయి. ఇది నిజం కాకపోతే మీతో చెప్పి ఉండేవాణ్ణి. మీకు స్థలం సిద్ధం చేయడానికి వెళ్ళిపోతున్నాను. 3 నేను వెళ్ళి మీకు స్థలం సిద్ధం చేస్తే, నేను ఎక్కడ ఉంటానో మీరూ అక్కడ ఉండేలా తిరిగి వస్తాను, నా దగ్గర మిమ్మును చేర్చుకొంటాను. 4 నేను ఎక్కడికి వెళ్ళిపోతున్నానో అది మీకు తెలుసు, ఆ మార్గం కూడా మీకు తెలుసు.”

5 అందుకు తోమా “ప్రభూ, నీవు ఎక్కడికి వెళ్ళిపోతున్నావో మాకు తెలియదే! మార్గం మాకెలా తెలుసు?” అని ఆయననడిగాడు.

6 యేసు అతనితో ఇలా చెప్పాడు: “నేనే మార్గాన్ని, సత్యాన్ని, జీవాన్ని. నా ద్వారానే తప్ప ఎవరూ తండ్రి దగ్గరకు

ప్రశ్నిస్తున్నాడని గమనించండి. ఇప్పుడు కూడా అనేకమంది క్రైస్తవులు క్రీస్తు ఏం చేస్తాడో ఊహాగానాలతో పొద్దుపుచ్చుతారే గానీ తాము ఏం చెయ్యాలో దాన్ని ఆసక్తితో అభ్యసించరు. క్రీస్తు ఇక్కడ తాను పరలోకానికి వెళ్ళిపోవడం గురించి మాట్లాడుతున్నాడు.

**13:37** క్రీస్తు మాటల్లోని భావాన్ని పేతురు ఇంకా అర్థం చేసుకోలేదల్లే ఉంది. తన స్వభావాన్ని అతడు అసలే అర్థం చేసుకోలేదు. మత్తయి 26:31-35 చూడండి. దీన్నిబట్టి క్రీస్తు ప్రధాన శిష్యులకు సైతం హృదయాల గురించి ఎక్కువ అజ్ఞానం ఉండవచ్చని మనం నేర్చుకోగలం. మన భ్రష్ట స్వభావంలో అన్ని పాపాల విత్తనాలూ లోతుగా నాటి ఉన్నాయని మనలో ఎంతమందికి తెలుసు? ఎంతమంది ధూళిలో అణుకువతో వంగి ఉండవలసింది పోయి, స్వశక్తి మీద ఆధారపడుతూ, తమ గురించి గొప్పలు చెప్పుకొంటూ ఉంటున్నారు? యిర్మీయా 17:9; 1 కొరింతు 10:12; సామెత 16:18 చూడండి.

**13:38** మనుషులకు తమలో ఏముందో తెలియకపోయినా, క్రీస్తుకు తెలుసు – 2:24,25.

**14:1** వారు ఆందోళన చెందడానికి చాలినంత కారణాలు ఉన్నాయి. వారి యజమాని వెళ్ళిపోతున్నాడు. ఆయన్ను ఎరగనని పేతురు అబద్ధాలు పలకపోతున్నాడు. ఏం జరబోతున్నదో వారిలో ఎవరికీ తెలియదు. ఏదో వింతైన, కష్టతరమైన సంగతి జరగబోతున్నదని మాత్రం తెలుసు. అయితే ఆందోళన పడవద్దని వారికి చెప్తున్నాడు యేసు. అలా ఆందోళన లేకుండా నిబ్బరంగా ఉండడానికి ఈ ఆధ్యాయంలో కొన్ని కారణాలు ఇస్తున్నాడు. మొదటిదేమిటంటే ఆయన నమ్మదగినవాడు. జరుగుతున్న పరిస్థితుల గురించి అందోళన, చింత, కంగారులను ఆయన ప్రజలు ఎప్పుడైనా జయించదగిన మార్గం ఇదే – దేవునిలో క్రీస్తులో నమ్మకం ఉంచాలి. మత్తయి 6:25-27; ఫిలిప్పీ 4:6,7; 1 పేతురు 5:7 చూడండి. అల్లకల్లోలంగా ఉన్న ఈ లోకంలో మనశ్శాంతి కావాలంటే ఇప్పటికీ క్రీస్తులో నమ్మకం ఉంచడమే మార్గం.

**14:2** వారు ఆందోళన చెందకుండా ఉండడానికి మరో కారణం – వారికి పరలోకంలో దివ్యమైన, శాశ్వతమైన భవిష్యత్తు ఉంది. అలాంటి మహా భాగ్యం తమకోసం కాచుకుని ఉండగా ఈ కాలానికీ, ఇహలోకానికీ చెందిన పరిస్థితులు వారి మనసుల్లో భారంగా ఎందుకుండాలి? ఆయన ఎక్కడికి వెళ్తున్నాడని పేతురు అడిగాడు (13:36). యేసు ఇక్కడ స్పష్టంగా, సూటిగా దానికి జవాబు చెప్తున్నాడు. వారికోసం పరలోకంలో చెయ్యవలసిన పని ఆయనకు ఉంది.

**14:3** 17:24; 1 తెస్స 4:17. వారు ఎందుకు ఆందోళన చెందకుండా ఉండాలో మరో కారణం – ఆయన వెళ్ళిపోతున్నప్పటికీ మళ్ళీ తిరిగి రాబోతున్నాడు కూడా. మత్తయి 24:26,27; 25:31; 26:64; అపొ కా 1:11; 1 తెస్స 4:16-5:4; ప్రకటన 1:7; 19:11-16; 22:12.

**14:4** శిష్యులు తమకు మార్గం తెలియదనుకున్నారు. కానీ నిజానికి వారికి తెలుసు ఎందుకంటే ఆ మార్గమైన యేసు వారికి తెలుసు. పరలోకానికి తీసుకుపోయే మార్గానికి వారు ఇంతకు ముందే వచ్చారు. అది ఆయనపై నమ్మకం ఉంచడమే (1:12,13; 3:16,36; 5:24; 6:47).

**14:5** 20:24,25లో ఉన్నదాన్ని బట్టి ఈ శిష్యుణ్ణి తరచుగా సందేహి అయిన తోమా అని క్రైస్తవులు పిలుస్తుంటారు. అయితే ఇతడు ముక్కుసూటిగా పోయేవాడు, ఏదీ దాచుకోనివాడు, కపటం లేనివాడు, తనకు తెలియని సంగతులు తెలుసునని నటించేవాడు కాదు, తాను నమ్మని సంగతులు నమ్ముతున్నానని చెప్పేవాడు కాదు.

**14:6** యేసుప్రభువు పలికిన మాటలన్నిటిలోకి ప్రసిద్ధికెక్కిన అత్యంత ప్రాముఖ్యమైన మాటల్లో ఇదొక్కటి.

“మార్గాన్ని” – ఒక మార్గం కాదు; ఉన్న ఏకైక మార్గం. పరలోకానికీ, దేవుని సన్నిధికీ ఆయనొక్కడే మార్గమని నొక్కి చెప్పినది మొదట స్వయంగా ఆయనే, ఆయన శిష్యులెవరూ కాదు. ఆయనపట్ల ఆయన మాటలపట్ల ఆయన శిష్యులు నమ్మకంగా ఉండాలంటే అదే ప్రకటించాలి (3:36; అపొ కా 4:12; 1 తిమోతి 2:5 పోల్చి చూడండి). చాలా మందికి యేసు చెప్పిన ఈ ఉపదేశం నచ్చదు. నచ్చకపోయినంత మాత్రాన ఇది మారుతుందా? ఆయనే సత్యం, ఆయన అబద్ధమాడడు కాబట్టి ఈ మాట మనకు నచ్చేలా చేసుకోవడం ఎంతో మంచిది. తాను దేవుని ఏకైక కుమారుణ్ణని ఆయన చెప్పాడు (3:16). ఆధ్యాత్మిక జీవం తనను స్వీకరిస్తేనే వస్తుందనీ (6:53), శాశ్వతంగా నశించిపోకుండా ఉండాలంటే మనుషులు నమ్మకం పెట్టవలసినది తన పైనే అనీ (8:24), దేవుని ప్రజలకు తానొక్కడే ద్వారమనీ, తానే కాపరి అనీ (8:24) ఆయన తానే చెప్పాడు. ఆయన ఎవరో దాన్నిబట్టీ, ఆయన చూపించిన రుజువులు, సాక్ష్యాధారాలను బట్టి ఆయన్ను నమ్ముదాం.

“సత్యాన్ని” – యేసుప్రభువు ప్రత్యక్షమైన దేవుని సత్యం, సత్య దేవుని అవతారం. ఆయనలో మోసం, కపటం, చీకటి మచ్చుకైనా లేవు. నేనే సత్యాన్ని అని చెప్పిన ఆయన నేనే మార్గాన్ని అని కూడా చెప్పాడు.

“జీవాన్ని” – 11:25. భౌతిక ప్రాణం అని కాదు దీని అర్థం. మనుషులందరికీ, జీవులంతటికీ ప్రాణం తానే అని ఏదో ఒక వేదాంతాన్ని ఆయనిక్కడ చెప్పడం లేదు. ఏకైక నిజదేవుని జీవంలో తాను భాగస్వామిననీ (5:26), మనుషులకు శాశ్వత జీవాన్నిచ్చేది తానేనని (5:21; 17:2), ఆ జీవం తనలో మాత్రమే

రారు. 7 నేనెవరినో మీరు తెలుసుకొని ఉంటే నా తండ్రిని
కూడా తెలుసుకొని ఉండేవారే. ఇప్పటినుంచి మీరు ఆయనను
తెలుసుకొంటున్నారు. ఆయనను చూశారు.”
8 ఫిలిప్పు ఆయనతో “ప్రభూ, తండ్రిని మాకు కనపరచు.
అది మాకు చాలు” అన్నాడు.
9 యేసు అతనితో ఇలా అన్నాడు: “ఫిలిప్పు, నేను మీతో
ఇంత కాలం ఉన్నా ఇంకా నన్ను ఎరుగవా? నన్ను
చూచినవాడు తండ్రిని చూశాడు. ‘తండ్రిని మాకు కనపరచు’
అని నీవు అడుగుతున్నావేమిటి? 10 నేను తండ్రిలో ఉన్నాను.
తండ్రి నాలో ఉన్నాడు. ఇది నీవు నమ్మడం లేదా? నేను మీతో
చెపుతూ ఉన్న మాటలు నా అంతట నేనే చెప్పడం లేదు గాని
నాలో నివాసం చేస్తున్న తండ్రి ఈ పనులు జరిగిస్తూ ఉన్నాడు.
11 నేను తండ్రిలో ఉన్నాననీ తండ్రి నాలో ఉన్నాడనీ
అనుకుంటే నన్ను నమ్మండి. లేదా, ఈ పనుల కారణంగానైనా
నన్ను నమ్మండి. 12 మీతో ఖచ్చితంగా చెపుతున్నాను, నేను
చేస్తున్న పనులు నామీద నమ్మకం ఉంచేవాడు కూడా చేస్తారు,
వీటికి మించిన పనులు చేస్తారు. ఎందుకంటే, నేను తండ్రి
దగ్గరకు వెళ్ళిపోతున్నాను. 13 కాబట్టి నా పేర మీరు ఏది
అడిగినా సరే, కుమారుని మూలంగా తండ్రికి మహిమ
కలిగేందుకు అది నేను చేస్తాను. 14 నా పేర మీరు ఏది
అడిగితే అది చేస్తాను.
15 “నా మీద మీకు ప్రేమ గనుక ఉంటే నా ఆజ్ఞలను
ఆచరించండి. 16 నేను తండ్రికి మనవి చేస్తాను, ఆయన మీకు
మరో ఆదరణకర్తను ఇస్తాడు. ఈ ఆదరణకర్త ఎప్పటికీ మీకు

ఉందనీ (1 యోహాను 5:11,12) చెప్తున్నాడు.

నమ్మకం ద్వారా యేసుప్రభువును మన హృదయాల్లో స్వీకరిస్తే ఆయన ఏమై ఉన్నాడో అదంతా మనది అవుతుంది. అప్పుడు మనం పరలోకానికి మార్గంలో ఉంటాం, సత్యాన్ని నమ్ముతాం, జీవాన్ని కలిగి ఉంటాం. యేసును నిరాకరిస్తే దేవుణ్ణి చేరే మార్గంలో ఎన్నటికీ ఉండము, సత్యంపట్ల నమ్మకం కలగదు, శాశ్వతమైన ఆధ్యాత్మిక జీవం మనకు లభించదు, పరలోకంలో దేవుని సన్నిధికి శాంతితో చేరుకోము. సాక్షాత్తూ దేవుని కుమారుడే ఇది చెప్పాడు కాబట్టి ఇందులో ఇక సందేహమక్కరలేదు.

**14:7** తానెవరో, ఏమిటో వారు నిజంగా అర్థం చేసుకుని ఉంటే తండ్రి అయిన దేవుణ్ణి కూడా వారు తెలుసుకుని ఉండేవారు. 1:14,18; ఫిలిప్పీ 2:6; లూకా 2:11 నోట్స్‌ను చూడండి. కానీ అప్పటివరకు వారి నమ్మకం, ఆధ్యాత్మిక జ్ఞానం బలహీనంగా ఉన్నాయి.

**14:8** ఫిలిప్పు అడిగినది నిర్గమ 33:18లో మోషే కోరికలాగా ఉన్నదేమో – దేవుణ్ణి కళ్ళతో చూడాలని.

**14:9** “తండ్రిని చూచారు” – 10:30; 12:44,45; 1:18; హీబ్రూ 1:3 పోల్చి చూడండి. యేసును చూస్తే దేవుణ్ణి చూచినట్టే.

**14:10** దేవత్వంలో తండ్రి, కుమారుల పరిపూర్ణమైన, సంపూర్ణమైన ఐక్యతను ఈ మాటలు సూచిస్తున్నాయి. యేసు ఇంతకుముందే ఉపదేశించిన సత్యాన్ని బట్టి ఫిలిప్పు దీన్ని ఇప్పటికే నమ్మి ఉండవలసింది. యేసు మాటలూ పనులూ దేవుని మాటలు, పనులే (7:16; 12:49).

**14:11** క్రీస్తు మాటలు ఫిలిప్పును తృప్తిపరచకపోతే, ఆయన చూపిన రుజువులను బట్టి అయినా నమ్మాలి. 10:37,38 చూడండి.

**14:12** క్రీస్తు చేసిన పనులకన్నా మించినవి ఎలాంటివి? ఆయన తన అద్భుత కార్యాల గురించి మాట్లాడుతున్నాడని అనుకునేందుకు వీలులేదు. ఎందుకంటే తరువాతి కాలంలో వారు చేసినవి ఆయన చేసినవాటికన్నా గొప్పేమీ కాదు. వారు చేసిన ఒక్క పని మాత్రం ఆయన చేసిన వాటికంటే మించినదని చెప్పవచ్చు – యూదులు, యూదేతరుల్లో అనేకమందిని నిజ దేవునివైపుకు తిప్పేందుకు వారికి శుభవార్త ప్రకటించడం (మార్కు 16:15), అన్ని జాతులవారినీ శిష్యులుగా చెయ్యడం (మత్తయి 28:19). క్రీస్తు ఈ లోకంలో ఉన్నప్పుడు తన పరిచర్యను చాలా కొద్ది ప్రాంతానికే పరిమితం చేసుకున్నాడు. ఆ పరిచర్య ద్వారా తనపై నిజమైన నమ్మకం కలిగినది తక్కువమందికే. ఆయన పరమ తండ్రి దగ్గరికి వెళ్ళిపోయి, తన శిష్యులు తనను మించిన పనులు చేయగలిగేలా, తన శుభవార్తను భూమి కొనలవరకు వ్యాపింపజేయగలిగేలా వారికి సామర్థ్యాన్ని కలిగించేందుకు పవిత్రాత్మను పంపించాడు.

**14:13,14** శిష్యులు ఎందుకు ఆందోళన చెందకూడదో (వ 1) ఇది మరో కారణం. ఇది చాలా విశాలమైన పరిధి గల వాగ్దానం, గానీ దీనికి ఖచ్చితమైన షరతులున్నాయి. సఫలమైన ప్రార్థన క్రీస్తు పేరట చేసేదే. ఏ ఇతర నామం, ఏ ఇతర మధ్యవర్తీ అవసరం లేదు. ఆయన పేర చేసే ఎలాంటి ప్రార్థనకైనా ఆయన తానే జవాబిస్తాడు కాబట్టి మన ప్రార్థనలకు జవాబు కోసం పరలోకంలో గానీ భూమిపై గానీ మరెవరి సహాయమూ మనకు అవసరం లేదన్నది స్పష్టమే. ఇక్కడ “పేరు” ఆయనలోని సమస్తాన్ని, ఆయన స్వభావాన్ని, లక్షణాన్ని, అధికారాన్ని, సంకల్పాన్ని సూచిస్తున్నది. ఆయన సంకల్పం (ఆయనను గురించి మనకు తెలిసినదంతా) ఆయన ఉపదేశాల్లో వెల్లడి అయింది. అందువల్ల మన ప్రార్థన దానికి అనుగుణంగా ఉండాలి. ఆయనకు విన్నవించుకున్నవి అనేకం మనకు దొరకవు. ఎందుకంటే దీన్ని మనం పాటించము. యేసుప్రభువు ఒక గొప్ప ఉద్దేశంతో ప్రార్థనలకు జవాబులు ఇస్తాడు. పరమ తండ్రికి మహిమ కలగాలనే ఆ ఉద్దేశం. మనం కూడా అదే ఉన్నతమైన ఉద్దేశంతో మన ప్రార్థనలకు జవాబులు ఆశించాలి. మత్తయి 6:9,10 పోల్చి చూడండి. మన ఉద్దేశాలు సరైనవైతే గొప్ప విషయాల కోసం అడిగి గొప్ప ఫలితాలు చూడవచ్చు. 15:7; 1 యోహాను 5:14,15 కూడా చూడండి. యిర్మీయా 33:3; లూకా 11:5-13; 18:1-8; ఎఫెసు 6:18; హీబ్రూ 4:16; యాకోబు 5:16 పోల్చి చూడండి.

**14:15** దీన్ని మూడుసార్లు చెప్పడం కనిపిస్తుంది – వ 21,23. పైన ఇచ్చిన వాగ్దానానికి తప్పకుండా ఈ వచనంతో చాలా దగ్గర సంబంధం ఉంది. ఆయన ఆజ్ఞలను నిర్లక్ష్యం చేస్తూ, వాటిప్రకారం చెయ్యకుండా ఉంటే ఆయన పేరున ప్రార్థనెలా చేస్తాం? ఆయన్ను ప్రేమిస్తున్నామని ఎలా చెప్పుకుంటాం? ప్రేమకు రుజువు మాటలు కావు, చేతలే. కన్నీళ్ళు, ఉత్తమ మనోభావాలు, ప్రేమను గురించిన జ్ఞానం కావు, విధేయతే. మనం క్రీస్తును నిజంగా ప్రేమిస్తున్నామో లేదో తెలుసుకునే విధానం ఏమిటంటే, ఆయన ఆజ్ఞలన్నిటినీ పరిశీలించి చూస్తూ మనం వాటిని పాటిస్తున్నామా లేదా అని చూచుకోవడమే. ఎలాంటి ఆజ్ఞలంటే 13:13-17,34; మత్తయి 5:16,23,24, 34,39-42,44; 6:1-6,19,20,25; 7:1; 9:38; 16:24; 18:15,21,22; 19:4-6; 20:25-27; 24:42,44; 28:19.

**14:16** క్రీస్తు శిష్యులు ఆందోళన చెందకుండా ఉండేందుకు మరో కారణం (వ 1). పరలోకంలో క్రీస్తు తన ప్రజల కోసం పరమ తండ్రిని ప్రార్థిస్తూ ఉన్నాడు. (రోమ్ 8:34; హీబ్రూ 7:25). “ఆదరణకర్త” అని తర్జుమా చేసిన గ్రీకు పదానికి పెద్ద అర్థం ఉంది. “సహాయపడేందుకు దగ్గరికి పిలవబడినవాడు” అని

తోడుగా ఉంటాడు. 17 ఈయన సత్యాత్మ. లోకం ఆయనను చూడడం లేదు, తెలుసుకోవడం లేదు గనుక అది ఆయనను స్వీకరించడం అసాధ్యం. ఆయన మీతో ఉన్నాడు, మీలో ఉంటాడు గనుక ఆయన మీకు తెలుసు. 18 నేను మిమ్మును అనాథలనుగా విడిచివెళ్ళను. మీ దగ్గరకు వస్తాను. 19 ఇంకా కొద్ది కాలం అయిందంటే లోకం నన్ను చూడనే చూడదు. మీరైతే నన్ను చూస్తారు. నేను బ్రతుకుతున్నాను గనుక మీరూ బ్రతుకుతారు. 20 నేను నా తండ్రిలో ఉన్నాననీ మీరు నాలో ఉన్నారనీ నేను మీలో ఉన్నాననీ ఆ రోజున మీరు తెలుసుకొంటారు. 21 నా ఆజ్ఞలు కలిగి వాటిని ఆచరించేవాడే నన్ను ప్రేమించేవాడు. నన్ను ప్రేమించేవాణ్ణి నా తండ్రి ప్రేమిస్తాడు. నేను కూడా అతణ్ణి ప్రేమిస్తాను. అతనికి నన్ను వెల్లడి చేసుకొంటాను."

22 ఇస్కరియోతు కాని యూదా "ప్రభూ, దేనివల్ల లోకానికి కాక, మాకే నిన్ను వెల్లడి చేసుకుంటావు?" అని ఆయనను అడిగాడు.

23 యేసు అతనికిలా సమాధానం చెప్పాడు: "నన్ను ప్రేమించేవారెవరైనా నా మాట ఆచరిస్తాడు. అలాంటి వాణ్ణి

---

దీని అర్థం. తరచుగా ఈ మాట చట్టానికి సంబంధించిన వ్యవహారాల్లో సహాయపడేవాడు, లేక ఒకరి పక్షంగా వాదించే మరో వ్యక్తి, బహుశా ఒక మధ్యవర్తి, ఒకరి గురించి విజ్ఞాపన చేసేవాడు అని కూడా అర్థం ఇస్తుంది. క్రొత్త ఒడంబడిక గ్రంథంలో వాడిన ఈ మాట నీతిన్యాయాలకూ పాపానికీ సంబంధించిన అన్ని విషయాల్లో విశ్వాసులకు సలహాలిచ్చే మిత్రుడు, వారికి బుద్ధి చెప్తూ, సహాయపడుతూ, ఓదారుస్తూ ఉండేవాడు, దేవుని ఎదుట వారికి ప్రతినిధిగా మాట్లాడేవాడు అని అర్థమిస్తున్నది. 17,26 వచనాలను బట్టి యేసుప్రభువు ఈ మాటలు చెప్తున్నది పవిత్రాత్మను గురించి అని స్పష్టంగా ఉంది. "మరో ఆదరణ కర్త" అంటున్నాడు. అప్పటివరకూ ఆయనే వారి ఆదరణకర్త (గ్రీకు భాషలో 1 యోహాను 2:1లో యేసుప్రభువుకు ఇదే మాట వాడబడింది. యెషయా 9:6 కూడా చూడండి). ఇప్పుడు తనలాంటి మరొకరిని పంపుతానని వాగ్దానం చేస్తున్నాడు. 7:39; లూకా 24:49; అపొ కా 1:4,5,8; 2:1–4 కూడా చూడండి. ఈ ఆదరణకర్త, విశ్వాసుల దివ్య స్నేహితుడు వారితో "ఎప్పటికీ" ఉంటాడు. వారినెన్నడూ వదిలిపోడు, చెయ్యి విడిచిపెట్టడు.

**14:17** "ఈయన సత్యాత్మ" – దేవుడు సత్యస్వరూపి అయిన దేవుడు (కీర్తన 31:5; తీతు 1:2). యేసుప్రభువు తానే సత్యం (1:17;14:6). పవిత్రాత్మ సత్య ఆత్మ (15:26; 16:13). ఆయన తత్వమే సత్యం. సత్యాన్ని ప్రేమిస్తాడు, సత్యమే పలుకుతాడు, సర్వసత్యంలోకి విశ్వాసులను నడిపిస్తాడు (16:13).

"లోకం" అంటే అపనమ్మకంతో, పాపం, అంధకారంలో ఉన్న ఈ లోకం అని యేసు ఉద్దేశం. దైవాత్మ, దివ్యాత్మ, జీవాత్మ, పరమాత్మ వంటి పదాలను ఈ లోకం ఉపయోగించవచ్చు గానీ దానికి ఏకైక నిజ దేవుని పవిత్రాత్మ తెలియదు. ఆయన్ను అది స్వీకరించదు. యేసు శిష్యులకు ఈ పవిత్రాత్మ తెలుసు. పవిత్రాత్మ మూలంగానే వారు కొత్త జన్మ అనుభవించారు (1:12,13). యేసు పరిచర్యలో, తమ సేవల్లో పవిత్రాత్మ నిర్వహించిన పని వారికి తెలుసు (మత్తయి 10:1,19,20; 12:28). ఆయన వారితో ఉండేవాడు. ఆయన వారిలో ఉండబోయే సమయం దగ్గర పడింది. వారి భౌతిక దేహాల్లో ఆయన నివాసం చేస్తాడు (1 కొరింతు 6:19). ఇది మనుషులందరి విషయంలో నిజం కాదు. యేసు క్రీస్తులో నమ్మకం ఉంచినవారికే ఇది జరుగుతుంది. రోమ్ 8:16; గలతీ 3:2; ఎఫెసు 4:18; యూదా 19 చూడండి. ప్రతి మనిషిలోనూ పుట్టుకనుంచి ఉండే ఆత్మ దైవాత్మ కాదు. అది దేవుడు సృష్టించిన ఆత్మ. ప్రతి వ్యక్తిలోనూ మిగతా వారందరికీ భిన్నంగా ఉండే ఆత్మ ఉంటుంది. దేవుని ఆత్మ శాశ్వతమైన ఆత్మ, సృజించబడని ఆత్మ. యేసు ప్రభువును తమ ప్రభువుగా, ముక్తిదాతగా స్వీకరించినవారిలో మాత్రమే నివసించేందుకు ఆ పవిత్రాత్మ వస్తాడు – గలతీ 3:1–5,14. లోకానికి ఆత్మ ఉంది గాని అది దేవుని ఆత్మ కాదు. ఎఫెసు 2:2 చూడండి.

యేసు దేవుని ఆత్మ గురించి మాట్లాడుతూ ఆయన "ఉంటాడు" అంటూ వ్యక్తిగత నామవాచకం వాడడం గమనించండి. పవిత్రాత్మ అంటే కేవలం దేవునినుంచి వెలువడే ఒక దివ్య ప్రభావం కాదు. తండ్రి, కుమారుల్లాగానే ఆయనొక దైవిక వ్యక్తి. స్వభావంలోనూ, లక్షణాల్లోనూ వారితో ఐక్యంగా ఉన్నవాడు. మనం యేసును "అది" అని ఎలా అనమో దేవుని ఆత్మను కూడా "అది", "వచ్చింది", "ఉంది" అంటూ మాట్లాడకూడదు.

**14:18** యేసు మరణించి తిరిగి లేచిన తరువాత వారిదగ్గరికి వచ్చాడు (20,21 అధ్యాయాలు). పెంతెకొస్తు దినాన దేవుని ఆత్మ వారిమీదికి వచ్చినప్పుడు ఒక విధంగా యేసు వారిదగ్గరికి వచ్చినట్టే (రోమ్ 8:9లో పవిత్రాత్మను క్రీస్తు ఆత్మ అని పౌలు అన్నాడు). అయితే ఒక వేళ ఇక్కడ ఆయన తన రెండో రాకడ గురించి చెప్తూ ఉండవచ్చు (వ 3).

**14:19** ఆయన సజీవంగా లేచిన తరువాత ఆయన శిష్యులు ఆయన్ను చూశారు (20:20,29; 1 కొరింతు 15:5–8). తాను ఎవరినని యేసు చెప్పుకున్నాడో నిజంగా ఆయనే అనడానికీ, ఆయన ఉపదేశాలన్నీ సత్యమనడానికీ ఇది బలమైన ఆధారం. మత్తయి 28:6 నోట్ చూడండి.

"మీరూ బ్రతుకుతారు" – రోమ్ 5:9,10; కొలస్సయి 3:3,4 పోల్చి చూడండి. ఆయన శిష్యుల జీవాన్ని గురించిన ఆశాభావానికి ఆధారం ఆయన సజీవంగా లేవడంతోనే ముడిపడి ఉంది – 5:21,26; 6:47,54; 11:25,26.

**14:20** "ఆ రోజున" – ఆయన సజీవంగా లేచిన వెంటనే వచ్చే సమయం అని అర్థం. ఆయన తమను ఎలాంటి ఐక్యతలోకి తీసుకురానున్నాడో వారప్పుడు గ్రహిస్తారు – వ 10; 17:21–23. విశ్వాసుల్లో క్రీస్తు, ఆయనలో వారు – ఇది క్రీస్తు రాయబారి పౌలు రాసిన లేఖల్లో అంతటా కనిపించే అంశం. రోమ్ 6:3–8; 8:9–11; 2 కొరింతు 13:5; గలతీ 2:20; ఎఫెసు 1:1).

**14:21** వ 15. తన విశ్వాసులకు తనతో, తండ్రి అయిన దేవునితో ఉన్న సంబంధాన్ని నొక్కి చెపుతున్నాడు. ఇది ప్రేమ సంబంధం. తమ విధేయత మూలంగా విశ్వాసులూ తనను తాను స్పష్టంగా వెల్లడి చేసుకోవడం ద్వారా దేవుడూ ఈ సంబంధాన్ని ప్రదర్శిస్తారు. దాన్ని అనుభవించిన వారికే అదేమిటో తెలుస్తుంది. తనపట్ల ప్రేమ విధేయతలు గల పిల్లలంటే దేవునికి ఒక ప్రత్యేకమైన ప్రేమ ఉంది. ఇది కుటుంబ సంబంధమైన ప్రేమబంధం, ప్రేమ చూపడంలో ఆనందం. లోకం పట్ల ఆయనకున్న ప్రేమకు ఇది భిన్నమైనది. అది నశించిపోయిన భ్రష్ట స్థితిలో ఉన్న లోకం పట్ల జాలి, కనికరాలతో కూడిన ప్రేమ.

**14:22** లూకా 6:16; అపొ కా 1:13. యేసు ఇస్రాయేల్‌వారి అభిషిక్తుడుగా గొప్ప మహిమతో యూద జాతికీ, లోకానికీ తనను తాను కనపరచుకుంటాడనీ, అధికారాన్ని హస్తగతం చేసుకుని పరిపాలిస్తాడనీ ఇతడు, మిగతా శిష్యులు ఆశించారు. లూకా 24:25,26 చూడండి.

**14:23** ఇక్కడ మళ్ళీ విధేయత ప్రాముఖ్యతను నొక్కి చెప్తున్నాడు – వ 15,21. ఈ సత్యాన్ని ప్రభువు ఎంత ప్రధానమైనదిగా ఎంచాడన్న సంగతి ఆ ఒకే సమయంలో దీన్ని

నా తండ్రి ప్రేమిస్తాడు. అతని దగ్గరకు మేము వస్తాం, అతనితో నివాసం చేస్తాం.

24 “నన్ను ప్రేమించనివాడు నా మాటలు ఆచరించడు. మీరు వింటున్న మాట నాది కాదు. నన్ను పంపిన తండ్రిదే.
25 నేను మీతో ఉంటూ ఈ విషయాలు చెప్పాను.
26 తండ్రి నా పేర పంపబోయే ఆదరణకర్త మీకు అన్ని విషయాలు ఉపదేశిస్తాడు. ఆయన పవిత్రాత్మ. నేను మీతో చెప్పినవన్నీ మీ జ్ఞప్తికి తెస్తాడు.

27 “శాంతిని నేను మీకిచ్చి వెళ్ళిపోతాను. నా శాంతినే మీకు ఇస్తున్నాను. లోకం ఇచ్చే ప్రకారం నేను మీకివ్వడం లేదు. మీ హృదయం ఆందోళన పడనియ్యకండి, భయపడనివ్వకండి.
28 ‘నేను వెళ్ళి మీ దగ్గరకు వస్తాను’ అని నేను మీతో చెప్పినది విన్నారు గదా. నేనంటే మీకు ప్రేమ ఉంటే నేను తండ్రి దగ్గరకు వెళ్ళిపోతున్నానని నేను చెప్పినందుకు మీరు ఆనందించి ఉంటారు. ఎందుకంటే తండ్రి నాకంటే పైవాడు.
29 ఇప్పుడు ఇది జరిగేముందే మీతో చెప్పాను. ఇది జరిగేటప్పుడు మీరు నమ్మాలని నా ఉద్దేశం.
30 మీతో ఇంకా ఎక్కువగా మాట్లాడను. ఎందుకంటే, లోక పాలకుడు వస్తున్నాడు. వాడికి నాలో ఏమీ లేదు.
31 అయినా నేను తండ్రిని ప్రేమిస్తున్నానని లోకానికి తెలిసిపోయేలా తండ్రి నాకు ఆజ్ఞ ఇచ్చే ప్రకారమే నేను చేస్తున్నాను. లేవండి ఇక్కడనుంచి వెళ్దాం.”

15 “నేను నిజమైన ద్రాక్షచెట్టును. నా తండ్రి వ్యవసాయదారుడు.
2 నాలో ఫలించని ప్రతి తీగెనూ

మూడుసార్లు చెప్పడంలోనే అర్థమౌతున్నది. ఇక్కడ ఆయన చేసిన వాగ్దానం బైబిలంతటిలోకీ గొప్ప వాగ్దానాల్లో ఒకటి. తన ప్రజలతో నివాసం చేయాలన్న దేవుని కోరికను ఇది తెలుపుతున్నది. నిర్గమ 25:8 నోట్‌లో రిఫరెన్సులు చూడండి. యేసుప్రభువును ప్రేమించేవారికి ఇప్పుడు ఆయన అలా చేస్తానని మాట ఇస్తున్నాడు. ఆయన్ను ప్రేమించే ప్రతి ఒక్కరి దగ్గరికీ తానూ, తండ్రి అయిన దేవుడూ ఇద్దరూ వచ్చి నివాసం చేస్తామని ఆయన చెప్తున్న మాట గమనించండి. ఇది దేవునికి మాత్రమే సాధ్యం. స్వభావరీత్యా యేసు తండ్రి అయిన దేవుని వంటివాడే. అయితే ఇక్కడ మరోసారి తనను ఒక ప్రత్యేక వ్యక్తిగా తండ్రికి వేరుగా ఉన్న విషయం సూచిస్తున్నాడు. ఫిలిప్పీ 2:6; లూకా 2:11 నోట్స్‌లో ఇతర రిఫరెన్సులు ఉన్నాయి.

**14:24** బైబిలును కేవలం చదువుతూ, బైబిలు నుంచి మంచి ప్రసంగాలు మాత్రం వింటూ క్రైస్తవులమని చెప్పుకుంటూ అసలు బైబిలు చెప్తున్నదానికి లోబడనివారి నిజ స్థితి ఏమిటో దీన్నిబట్టి మనం తెలుసుకోవచ్చు.

**14:26** క్రీస్తు ఆది శిష్యులకు ఇది ప్రత్యేకమైన వాగ్దానం. యేసు ఉపదేశించినదాన్నే ఉపదేశించేలా పవిత్రాత్మ వారికి సామర్థ్యం ఇస్తాడు (దాన్ని రాయగలిగే సామర్థ్యాన్ని ఇస్తాడు కూడా – ఇలా అని ఇక్కడ రాయకపోయినా ఇది కూడా ఈ మాటల్లో ఉంది). వారు తెలుసుకోవలసినదంతా ఆయన వారికి నేర్పిస్తాడు. యేసు చెప్పినదంతా వారికి జ్ఞాపకం చేస్తాడు. దేవుని ఆత్మ విశ్వాసులందరికీ నేర్పిస్తాడన్నది కూడా నిజమే (1 కొరింతు 2:10-13; 1 యోహాను 2:27). దేవుడే ఉపదేశకుడుగా ఉండడం గురించి కీర్తన 25:4,5 చూడండి.

దేవుని ఆత్మకు ఇక్కడ ఉన్న పేరును జాగ్రత్తగా గమనించండి. ఆయన “పవిత్ర” ఆత్మ, పవిత్ర దేవునితో ఐక్యతగల ఆత్మ. “పవిత్రత” గురించి నోట్స్ 17:17-19; లేవీ 20:7. పవిత్రాత్మ అంటే తండ్రి గానీ కుమారుడు గానీ కాదని గమనించండి. తండ్రి ఆయన్ను క్రీస్తు పేరట పంపుతాడు (వ 16). త్రిత్వం గురించి మత్తయి 3:16 నోట్ చూడండి.

**14:27** మనుష్యులు ఆందోళన చెందకుండా ఉండడానికి కారణం – యేసు శాంతి కర్త (యెషయా 9:6). దేవునికీ మనిషికీ మధ్య శాంతి కుదర్చాలని ఆయన వచ్చాడు (2 కొరింతు 5:19,20; కొలస్సయి 1:20,22). ఇక్కడైతే విశ్వాసులకు తానిచ్చే మనశ్శాంతిని గురించి ఆయన మాట్లాడుతున్నాడు (16:33; ఫిలిప్పీ 4:6,7; కొలస్సయి 3:15; 2 తెస్స 3:16). చాలామంది దేన్నైతే కోరుతూ అనుభవించలేకపోతున్నారో దాన్ని తన శిష్యులకు ఉచితంగా ఇచ్చి భయ కారణాలన్నింటినీ తొలగిస్తాడు.

**14:28** వారాయన్ను ప్రేమించారు. కానీ వారి ప్రేమ ఉండవలసిన రీతిలో ఉంటే వారు తమ గురించి కాక ఆయన గురించీ ఆయన నెరవేర్చడానికి వచ్చిన పని ముగింపు గురించీ ఆలోచించేవారు. తండ్రి సన్నిధిలో ఆయనకు లభించనున్న ధన్యస్థితిని బట్టి ఆనందించేవారు. యేసు తనను తండ్రి అయిన దేవునికి వేరుగా ఎలా చెప్తున్నాడో చూడండి. స్వభావం, లక్షణాలలో తండ్రి కుమారునికన్నా అధికుడేమీ కాదు. ఎందుకంటే ఇద్దరూ ఈ విషయంలో సమాన భాగస్తులు (వ 9; 8:24,58; 1:1; 10:30). అయితే హోదాలోనూ, అధికారంలోనూ తండ్రి అధికుడు 5:19-27; 12:49 చూడండి. చూపడం, ఇవ్వడం, పంపడం, ఆజ్ఞాపించడం తండ్రి బాధ్యత. చూడడం, పుచ్చుకోవడం, తండ్రికి విధేయుడై రావడం, ఆయన ఆజ్ఞలను నెరవేర్చడం కుమారుని బాధ్యత.

**14:29** 13:19 చూడండి.

**14:30** “లోక పాలకుడు” – 12:31. యేసుప్రభువు పాపరహితుడు. సైతాను మాటకు గానీ ప్రేరణకు గానీ ఎప్పుడూ లొంగలేదు. తనది అని సైతాను అనగలిగినది యేసులో ఏమీ లేదు. ఆయన జీవితంపై సైతాను ఏవిధంగానూ ప్రభావం చూపే విధానం ఏమీ లేదు.

**14:31** క్రీస్తుపై సాతానుకు కొంత పట్టు ఉన్నట్టుగానే అనిపించే సమయం త్వరలో రానున్నది. “అంధకార సమయం” (లూకా 22:53) వచ్చింది. మనుషులు యేసుపై దేవదూషణ నేరం మోపి నేరస్థుడిలాగా ఆయనకు మరణ శిక్ష అమలు జరపబోతున్నారు. అయితే ఇదంతా సైతాను ఆయనపై ఏదో పట్టు సంపాదించినందువల్ల కాదు గానీ యేసు తండ్రి సంకల్పానికి లోబడినందువల్లే (10:17,18). ప్రేమకు రుజువు విధేయతేనని యేసు తన శిష్యులతో చెప్పాడు (వ 15,21,23). ఇక్కడ తన సొంత జీవితంలో అందుకు ఈ రుజువు చూపిస్తున్నాడు. ఒకటి బోధించి మరొకటి చేస్తూ ఉండే అనేకమంది గురువుల్లాగా కాదు ఆయన.

**15:1** పాత ఒడంబడికలో దేవుడు ఇస్రాయేల్ జాతిని ద్రాక్షచెట్టుకు పోల్చాడు. కీర్తన 80:8-17; యెషయా 5:1-7; యిర్మీయా 2:21; యెహెజ్కేలు 15:1-8; 19:10-14; హోషేయ 10:1,2 చూడండి. కానీ అది పెరిగి పెద్దయ్యేసరికి పిచ్చి ద్రాక్షకాయలు కాసింది. దేవుడు ఆశించిన పండ్లు కాయలేదు. అది కపటమైన, పిచ్చి ద్రాక్ష చెట్లులాగా ప్రవర్తించింది. యేసు “నేను నిజమైన ద్రాక్ష చెట్టును” అనడం ద్వారా నిజమైన ఆధ్యాత్మిక జీవనానికీ, ఫలభరితమైన జీవితానికీ మూలం తానేననీ, ఆ చెడిపోయిన జాతి కాదనీ చెప్తున్నాడు. భూమిపై ఆయన్ను నాటినవాడు, “కొమ్మల” విషయం శ్రద్ధ తీసుకునేవాడు అంటే పరమ తండ్రియైన దేవుడే.

**15:2** ఈ ఉదాహరణలో వివరించిన అంశం విశ్వాసుల

ఆయన తుంచివేస్తాడు. ఫలిస్తూ ఉన్న ప్రతి తీగె మరి ఎక్కువగా
ఫలించేలా రెమ్మలు కత్తిరించి దిద్దుతాడు. 3 ఇంతకుముందే
నేను మీతో చెప్పిన వాక్కువల్ల మీరిప్పుడు శుద్ధులయ్యారు.
4 నాలో నిలిచి ఉండండి. నేను మీలో నిలిచి ఉంటాను. తీగె
దానంతట అదే ఫలించదు – అది ద్రాక్షచెట్టులో నిలిచి
ఉండాలి. అలాగే నాలో నిలిచి ఉండక పోతే మీరు ఫలించలేరు.
5 "ద్రాక్షచెట్టును నేను, తీగెలు మీరు. ఎవరైతే నాలో నిలిచి
ఉంటారో, నేను ఎవరిలో నిలిచి ఉంటానో వారు సమృద్ధిగా

---

సఫలత, గానీ వారి పాపవిముక్తి, రక్షణ కాదు (వ 4,5,8). దేవునికి ఎలాంటి ఫలాలు కావాలో యేసు ఇక్కడ వర్ణించడం లేదు. బైబిలులో ఇతర ప్రదేశాల్లో అది కనిపిస్తున్నది (మత్తయి 3:8; రోమ్ 6:22; గలతీ 5:22,23; ఎఫెసు 5:9; ఫిలిప్పీ 1:11; హీబ్రూ 6:7-10; సామెత 11:30). తమ ఉద్దేశంలో విజయవంతమైన తమ పరిచర్యను చూపుతూ ఉండే అనేకమంది క్రైస్తవ సేవకులు గర్విష్ఠులు, అపవిత్రులు, వంచకులు, నిర్దయులు, ఆధ్యాత్మికత లేనివారు. విజయవంతంగా కనిపిస్తున్న వారి పరిచర్యలను క్రీస్తు "ఫలం" అనడు. దేవుడు తన విశ్వాసుల్లో కనబడాలని ఆశించే ఫలం వారు క్రీస్తు పోలికలోకి మారాలని.

"తుంచివేస్తాడు" – నిజమైన విశ్వాసులు ఏదో ఒక సమయంలో ఫలించకపోతే తమ రక్షణను, పాపవిముక్తిని కోల్పోతారని యేసు ఇక్కడ చెప్పడం లేదు. 5:24; 6:37-40,54,56; 10:27-29 పోల్చి చూడండి. యేసుప్రభువు ఒక ఉదాహరణలో లేక ఉపమానంలో ఉపయోగించిన మాటలను వాడుకొని వేరొక చోట స్పష్టమైన భాషలో ఆయన చెప్పిన మాటలను కొట్టివేసేందుకు ఎన్నడూ ప్రయత్నించకూడదు. "తుంచివేస్తాడు" అంటే అర్థమేమిటో ఆయన ఇక్కడ వివరించలేదు. అది ఎప్పుడు ఎలా జరుగుతుందో కూడా చెప్పలేదు. ఫలించవలసిన అవసరత గురించి మాత్రమే ఇక్కడ సందేహానికి ఎంతమాత్రం తావియ్యని మాటల్లో నొక్కి చెప్పున్నాడు (వ 6). ప్రతి విశ్వాసీ కొద్దిగానైనా ఫలించేలా అతని విషయంలో పని చేస్తాడనీ చెప్పడం అతిశయోక్తి కాదు. ఒక క్రైస్తవుడికి నమ్మకం లేకపోతే అతడు నిజమైన క్రైస్తవుడు కాడు. అలాగే ఒకడు ఫలించకపోతే అతడు నిజంగా క్రీస్తులో ఉన్న కొమ్మ కాదన్న మాట. తుంచివేసిన కొమ్మకు యూదా ఇస్కరియోతు ఒక ఉదాహరణ అని మనం చెప్పలేమా? అతడు నిజమైన విశ్వాసి కాదు (6:70,71; 13:10). నిజానికి ఆధ్యాత్మిక జీవితానికి ఏకైక రుజువు సాఫల్యతే. ఒక వ్యక్తిలో పండే ఫలాలు అతడెలాంటివాడో వెల్లడిస్తాయి. మత్తయి 3:10; 7:15-20; 12:33; 13:18-23; లూకా 13:6-9. ఏ వ్యక్తి అయినా కొమ్మగా ఉండి దేవునికోసం ఏమీ ఫలాలు కాయకపోతే, అతడు నిజ క్రైస్తవుడేనా అని మనం సందేహించవలసి వస్తుంది. ఈ ద్రాక్షచెట్టు, కొమ్మలు ఉదాహరణంతా మంచివారైతేనేమీ, చెడ్డవారైతేనేమీ, క్రైస్తవులమని చెప్పుకునే వారందరితోనూ ఏర్పడిన దృశ్య సంఘాన్ని సూచించవచ్చు. పాత ఒడంబడికలో ద్రాక్షచెట్టు అంటే మంచివారని, చెడ్డవారని లేకుండా, నమ్మకం ఉన్నవారు, లేనివారు అందరితో కూడివున్న ఇస్రాయేల్ జాతికి సూచన. పౌలు రోమ్ 11:16-21లో ఆలీవ్ చెట్టు గురించి రాసినదాన్ని పోల్చి చూడండి.

"కత్తిరించి దిద్దుతాడు" – దేవుడు దీన్నెలా చేస్తాడు? ఆయన ఉపయోగించే కత్తెర ఏమిటి? ఈ కత్తెర అంటే క్రమశిక్షణ, దిద్దుబాట్లు, కష్టాలు, ఇబ్బందులు, రకరకాల బాధలు అన్నమాట. ఆయన మన హృదయాల్లో మనసుల్లో, పరిస్థితుల్లో, అనుభవాల్లో పని చేస్తూ అనవసరమైన వాటిని కత్తిరించి పారేస్తూ, మనం ఎలా ఉండాలో అలా సరిదిద్దుతూ ఉంటాడు. 2 కొరింతు 12:7-12; హీబ్రూ 12:4-11; కీర్తన 66:10-12 చూడండి. బాధలు కష్టాల గురించి యోబు 3:20 నోట్ చూడండి.

**15:3** 13:10; 17:17; ఎఫెసు 5:26; 1 పేతురు 1:22; కీర్తన 119:9,11. దేవుని వాక్కును మనసులకు, హృదయాలకు, సంకల్పాలకు, మనోభావాలకు సరైన రీతిలో ఉపయోగిస్తే అది వాటిని శుద్ధి చేస్తుంది.

**15:4** వ 9,10 పోల్చి చూడండి. నిలిచి ఉండడమంటే ఒకే చోట ఉండడం. వ 4-10లో పది సార్లు ఈ మాట కనిపిస్తుంది. ఈ సందర్భానికి ఈ మాట ఎంత ప్రాముఖ్యమో దీనివల్ల తెలుస్తున్నది. విశ్వాసులు నిలిచి ఉండవలసిన ఒకే చోటు క్రీస్తులో. ఆయన ప్రేమ అనే నేలలో మొక్కల్లాగా నాటుకుని ఉండాలి (ఎఫెసు 3:17), ఆయన శరీరంలో అవయవాల్లాగా (1 కొరింతు 12:12,13), ఆయన ఆలయంలో రాళ్ళలాగా (ఎఫెసు 2:20-22), ఆయన కుటుంబంలో సభ్యుల్లాగా (హీబ్రూ 3:6), ద్రాక్షచెట్టయిన ఆయనలో కొమ్మల్లాగా నిలిచి ఉండాలి.

తనలో నిలిచి ఉండాలని ఆయన విశ్వాసులతో చెప్తున్నాడు. అంటే విశ్వాసులు బహుశా నిలిచి ఉండరేమోనని అర్థమా? అలా అనుకోనక్కర్లేదు. దేవుడు వారలా ఉండేందుకు బలమిస్తాడని దీని భావం. అలా కాకపోతే ఈ ఆజ్ఞ ఇచ్చి ఉండేవాడు కాదు. అంతేగాక వారికున్న స్వేచ్ఛ గురించి కూడా వారు తెలుసుకోవాలని దీని భావం. క్రీస్తులో నిలిచి ఉండడం విశ్వాసులు ఇష్టపూర్వకంగా, కావాలని చేసేది. వారు తోలుబొమ్మలు, మరమనుషులు కాదు. క్రైస్తవులుగా ఉండడం అనే విషయంలో వారు తమ మనస్సు, సంకల్పం, దేవుడిచ్చేబలం ఉపయోగించాలని దేవుని కోరిక. నిజ క్రైస్తవ్యం యాంత్రికం కాదు, జీవ సంబంధమైనది, ఆధ్యాత్మికమైనది. అది క్రీస్తుకు, ఆయన ప్రజలకు పరస్పరం బలవంతాన్ని బట్టి జరిగేది కాదు, పరస్పర ప్రేమ మూలంగా సాగిపోయేదే.

విశ్వాసులు క్రీస్తులో ఉన్నారు, ఆయనలో నిలిచి ఉంటారు ఎందుకంటే అలాగని వారి కోరిక. ఆయన వారిని ఎన్నుకున్నాడు. వారు ఆయన్ను అనుసరించేందుకు నిర్ణయించుకున్నారు. వారాయన్ను ప్రేమిస్తారు. వారి స్వేచ్ఛ క్రీస్తును విడిచి పెట్టిపోయేలా వారిని చెయ్యదు, ఆయనలో నిలిచి ఉండేలా చేస్తుంది. 6:67,68 పోల్చి చూడండి. ఒక విధంగా క్రీస్తుకుచెందిన నిజ శిష్యులు కూడా ఇతరులు ఆయన్ను విడిచి వెళ్ళిపోయినట్టే వెళ్ళిపోవడానికి స్వతంత్రులు. కానీ వారలా వెళ్ళడానికి ఇష్టపడలేదు. అలా వెళ్ళిపోకుండా ఉండాలన్న దృఢ నిశ్చయాన్ని వారిలో కలిగించినది దేవుని పనే. ఫిలిప్పీ 1:6; 2:12,13 చూడండి. దేవుడు వారిలో చేసినదాన్నే తన విశ్వాసులందరిలోనూ చేస్తున్నాడు.

మనం క్రీస్తులో తప్పక నిలిచి ఉండాలని కోరుతున్నామా? ఆ మార్గం 1 యోహాను 2:24లో కనిపిస్తున్నది. ఆయన సత్యాన్ని మనలో ఉండనివ్వాలి. ఆయన వెల్లడించిన సత్యాలను నమ్మడంలో కొనసాగాలి.

**15:5** "సమృద్ధిగా ఫలిస్తారు" – వారిగుండా క్రీస్తు జీవం, ప్రభావం ప్రవహిస్తాయి కాబట్టి ఇలా జరుగుతుంది. నిజంగా ఆయనలో నిలిచి ఉండకుండా ఆయన్ను సేవించాలన్న ఏ ప్రయత్నమైనా, మత సంబంధమైన ఎన్ని కార్య కలాపాలైనా విజయవంతంగా కనిపించేవి ఎన్ని అయినా నిష్ఫలమైపోతాయి. "చేయగలిగేదేమీ లేదు" అంటే ఆధ్యాత్మికమైనది, నిజంగా దేవుడు కోరుకునేది ఏదీ చేయలేరన్నమాట. నేడు సంఘాల్లో చాలా కార్యక్రమాలు (బయట మతం పేరుతో లోకంలో జరిగేవాటిని అలా ఉంచండి) వ్యర్థం అయిపోతాయి. ఎందుకంటే అవి క్రీస్తులో

ఫలిస్తారు. నాకు వేరుగా ఉండి మీరు చేయ గలిగేదేమీ లేదు.
6 ఎవరైనా నాలో నిలిచి ఉండకపోతే అతడు తీగెలాగా
పారవేయబడి ఎండిపోతాడు. అలాంటి తీగెలను మనుషులు
పోగు చేసి అగ్నిలో పారవేస్తారు. అవి కాలిపోతాయి.
7 "మీరు నాలో నిలిచి ఉంటే, నా మాటలు మీలో నిలిచి
ఉంటే మీకేది ఇష్టమో అది దేవుణ్ణి అడుగుతారు. అది మీకు
చేయబడుతుంది. 8 మీరు సమృద్ధిగా ఫలిస్తూ ఉండడంవల్ల నా
తండ్రికి మహిమ చేకూరుతుంది. అలా మీరు నా శిష్యులుగా
ఉంటారు.
9 "తండ్రి నన్ను ప్రేమించినట్టే నేను మిమ్ములను
ప్రేమించాను. నా ప్రేమలో నిలిచి ఉండండి. 10 నా తండ్రి
ఆజ్ఞలు పాటిస్తూ నేను ఆయన ప్రేమలో నిలిచి ఉన్నాను.
అలాగే నా ఆజ్ఞలు పాటిస్తూ ఉంటే మీరు నా ప్రేమలో నిలిచి
ఉంటారు. 11 నా ఆనందం మీలో ఉండాలనీ మీ ఆనందం
సంపూర్ణంగా ఉండాలనీ ఈ సంగతులు మీతో చెప్పాను. 12 నా
ఆజ్ఞ ఇదే: నేను మిమ్ములను ప్రేమించినట్టే మీరు ఒకరినొకరు
ప్రేమించుకోవాలి. 13 తన మిత్రుల కోసం ఒకడు ప్రాణం
ధారపోయడం కంటే మించిన ప్రేమ ఎవరికీ లేదు.
14 నేను మీకిచ్చిన ఆజ్ఞల ప్రకారం చేస్తే మీరు నా మిత్రులు.
15 ఇకమీదట మిమ్ములను దాసులని పిలవను. ఎందుకంటే,
తన యజమాని ఏమి చేస్తున్నాడో దాసునికి తెలియదు. నేను
నా తండ్రిచేత వినేదంతా మీకు తెలియజేశాను గనుక

---

లేవు, ఆయన జీవం వాటిద్వారా ప్రవహించడం లేదు.

**15:6** ద్రాక్షతీగెనుంచి కత్తిరించి తీసివేసిన కొమ్మలు ఏమవుతాయో చెప్తున్నాడు. కొందరు విశ్వాసులు తనలో నిలిచి ఉండకపోవచ్చుననీ, వారు నరకాగ్నిలో కాలిపోతారనీ ఆయన అనడం లేదు. నరకం అవిశ్వాసులకు పట్టే గతి. మత్తయి 3:10,12; ప్రకటన 21:8 చూడండి. ఏ విశ్వాసి అయినా అది తనకు సంభవిస్తుందేమోనని భయపడితే అతడు క్రీస్తు ఉపదేశించిన సత్యాన్నంతటినీ గట్టిగా చేపట్టి ఆయనలో నిలిచి ఉండాలి. అప్పుడు అతడు పడిపోయే అవకాశం ఉండదు.

**15:7** "మీకేది ఇష్టమో" – 14:13,14; కీర్తన 37:4 పోల్చి చూడండి. విశ్వాసులు లోకం దృష్టిలో లక్ష్యాన్ని సాధించినవారుగా కనిపించేందుకూ, ధనికులైపోయేందుకూ, ఈ భూమిపై ఉన్న విలాసాలూ, సౌఖ్యాలు అన్నిటినీ అనుభవించేందుకు అనుసరించవలసిన పద్ధతిని యేసు ఇక్కడ చెప్పడం లేదు. ఆధ్యాత్మిక విజయానికీ, కార్యసాధకమైన ప్రార్థనకూ మార్గాన్ని సూచిస్తున్నాడు. ఒక విశ్వాసి హృదయంలో క్రీస్తు మాటలు ఏలుతూ ఉంటే అతని కోరికలు పవిత్రాత్మ అధీనంలో ఉంటాయి. క్రీస్తు అతనికి ఏం కలగాలని కోరుకుంటాడో అతడు కూడా అదే కోరుకుంటాడు. క్రీస్తు మాటలు ఎవరినైతే పరిపాలిస్తున్నాయో ఆ విశ్వాసులు క్రీస్తు నేర్పినట్టుగానే ప్రార్థిస్తారు (ఉదాహరణకు మత్తయి 6:9–13). కొలస్సయి 3:16,17; 1 యోహాను 5:14,15 పోల్చి చూడండి.

**15:8** ఫలించడం ఫలించేవాడి గౌరవంకోసం కాదు, దేవుని మహిమ నిమిత్తమే. వేరే మాటల్లో చెప్పాలంటే విశ్వాసుల్లో తన పనిద్వారా దేవునికి ఘనత కలుగుతుంది. మత్తయి 5:16; 1 కొరింతు 1:31; 4:7; 10:31; ఫిలిప్పీ 1:11 పోల్చి చూడండి. ఎవరైనా తన సాఫల్యతగా ఎంచినదాన్ని బట్టి మనుషుల గౌరవాన్ని వెదికితే దేవుడు కోరుతున్న ఫలాలను అతడు ఇవ్వడం లేదన్నమాట.

**15:9** 5:20 చూడండి.తన ప్రజలపట్ల క్రీస్తు ప్రేమ ఆయనపట్ల తండ్రి ప్రేమవంటిది గనక అది లోతైనది, వాస్తవమైనది, శాశ్వతమైనది, వర్ణించశక్యం గానంత అద్భుతమైనదని నిస్సందేహంగా భావించవచ్చు.

"నా ప్రేమలో నిలిచి ఉండండి" – యూదా 21. కావాలని మనసులో నిర్ణయం చేసుకుని ఆయన ఆజ్ఞలకు ఇష్టపూర్వకంగా విధేయత చూపడం అనేదాన్ని ఇది నిస్సందేహంగా తెలియజేస్తున్నది. విశ్వాసుల అనుదిన జీవితాల్లో దేవుడు న్యాయంగా వారిపట్ల తన ప్రేమను ప్రదర్శించే రీతిలో వారు ప్రవర్తించాలని దీని అర్థం.

**15:10** 14:15,21,23. క్రీస్తును ప్రేమించేవారు ఆయన ఆజ్ఞలు పాటిస్తారు. అలా పాటించేవారు ఆయన ప్రేమలో నిలిచి ఉంటారు. ఈ ప్రేమ వలయంలో ఉన్నవారికి ఇది చాలా అర్థవంతంగా అనిపిస్తుంది. బయట ఉన్నవారికి ఇదేమీ అర్థం కాదు. దేవుని ప్రేమ అనే ఈ నివాసంలో విశ్వాసులు స్థిరపడిపోవాలి, ఆ నివాసానికి యజమాని అయిన దేవుడు చెప్పినది చేస్తూ ఉండడం ద్వారా ఆయనతో రోజురోజుకూ పరిచయం పెంచుకుంటూ ఉండాలి. క్రీస్తే విధేయత మూలంగా తండ్రి ప్రేమలో నిలిచాడన్న సంగతి గమనించండి. విశ్వాసులు కూడా ఇదే మార్గాన ఆయన ప్రేమలో నిలిచి ఉంటారు. కొందరు విశ్వాసులు ఇతరులకన్న ఎక్కువ విధేయత చూపుతుంటారు అనడంలో సందేహం లేదు. బహుశా ఎవరూ కూడా ఎల్లప్పుడూ సంపూర్ణ విధేయత కనపరచరు, అలాగని పూర్తి అవిధేయతా కనపరచరు (యాకోబు 3:2). వారెంతవరకు విధేయత చూపుతారో ఆ మేరకు క్రీస్తు ప్రేమను అనుభవించి ఆనందించగలుగుతారు.

**15:11** యేసు దుఃఖానికి గురి అయినవాడు (యెషయా 53:3). శుభవార్తల్లో ఆయన ఏడ్చాడని రాసి ఉంది (11:35; లూకా 11:41) గానీ నవ్వాడని మాత్రం ఎక్కడా రాసిలేదు. ఆయనలో ఆనందం ఉందా? తప్పకుండా బయటి పరిస్థితులతో ఏమీ సంబంధం లేని లోతైన ఆనందం ఆయన అంతరంగంలో ఉంది (17:13; లూకా 10:21). దేవుని సంకల్పానికి పరిపూర్ణ విధేయత మూలంగా కలిగిన అనందం అది (4:34 చూడండి). తన ప్రజలంతా ఈ ఆనందాన్ని అనుభవించాలని ఆయన కోరిక. అందుకు విధేయత ఒక్కటే మార్గం. అవిధేయతను బట్టి మీ అంతర్వాణి అస్తమానం మిమ్మల్ని ఖండిస్తూ ఉంటే ఇక ఆనందమెక్కడిది?

**15:12** 13:34. వారి హృదయాల్లో నాటుకొనేందుకు మళ్ళీ చెప్తున్నాడు.

**15:13** స్వయంగా తానే ఏమి చెయబోతున్నాడో దాన్ని గురించి ఆయన మాట్లాడుతున్నాడు. 10:11,17,18 చూడండి. ఆయన శత్రువుల కోసం కూడా చనిపోయాడు (రోమ్ 5:6–10). కానీ ఇక్కడి విషయం అది కాదు. ఆయన తన స్నేహితులతో మాట్లాడుతున్నాడు. వారిపట్ల ఆయనకున్న ప్రేమకు తన ప్రాణాన్ని ధారపోయడమే అన్నిటికన్నా ఖచ్చితమైన రుజువు అని చెప్తున్నాడు. 1 యోహాను 3:16 చూడండి.

**15:14** అవతారమెత్తిన దేవుడు స్నేహితుల కోసం చూస్తున్నాడు. తనతో నిజమైన స్నేహం ఏమిటో ఇక్కడ వివరిస్తున్నాడు. అది విధేయతే. అంటే ఇది సమానుల మధ్య స్నేహం కాదు. ఒకరు పరలోకనుంచి వచ్చిన ప్రభువు, మరొకరు ఆయన్ను అనుసరించేందుకు పిలవబడిన మానవ మాత్రులు. తిరుగుబాటు, అవిధేయత ఇవి స్నేహానికి కాక దేవునితో శత్రుత్వానికే గుర్తులు. యేసు వివరిస్తున్న స్నేహంలో ఏక మనసు, ఏక హృదయం, ఏక ఉద్దేశం అవసరం.

**15:15** క్రీస్తు శిష్యులు తప్పక లొంగి ఉండవలసిన

మిమ్ములను మిత్రులు అన్నాను.
16 "మీరు నన్ను ఎన్నుకోలేదు. నేను మిమ్ములను
ఎన్నుకొన్నాను, మిమ్ములను నియమించాను. మీరు వెళ్ళి
ఫలించాలనీ మీ ఫలం నిలిచి ఉండాలనీ నా పేర మీరు
తండ్రిని ఏది అడిగితే అది ఆయన మీకివ్వాలనీ నా ఉద్దేశం.
17 ఇవి మీకు అదేశిస్తున్నాను: మీరు ఒకరినొకరు
ప్రేమించుకోవాలి.
18 "లోకం మిమ్ములను ద్వేషిస్తే, మీకంటే ముందుగా నన్ను
ద్వేషించిందని మీకు తెలుసు. 19 ఒకవేళ మీరు లోకానికి
చెంది ఉంటే లోకం తన వారిని ప్రేమించి ఉంటుంది. కానీ
మీరు లోకానికి చెందినవారు కారు. మిమ్ములను లోకంలోనుంచి
ఎన్నుకొన్నాను. లోకం మిమ్ములను ద్వేషించే కారణం ఇదే.
20 నేను మీతో చెప్పిన ఈ మాట జ్ఞాపకముంచుకోండి –
'దాసుడు తన యజమానికంటే మించినవాడు కాడు.' వారు
నన్ను హింసించారంటే మిమ్ములను కూడా హింసిస్తారు. వారు
నా మాట పాటిస్తే మీ మాట పాటిస్తారు. 21 అయితే నన్ను
పంపినవాణ్ణి వారు ఎరుగరు గనుక నా పేరుకారణంగా అవన్నీ
మీపట్ల జరిగిస్తారు. 22 ఒకవేళ నేను వచ్చి వారితో మాట్లాడి
ఉండకపోతే వారికి పాపం ఉండేది కాదు. ఇప్పుడైతే వారికి
పాపం విషయం సాకు ఏమీ లేదు. 23 నన్ను ద్వేషించేవాడు
నా తండ్రిని కూడా ద్వేషిస్తున్నాడు. 24 మరెవరూ చేయని
క్రియలు వారిమధ్య నేను చేసి ఉండకపోతే వారికి పాపం

పామరులైన బానిసలవంటివారు కారు. లోబడాలని కోరుతున్న జ్ఞానమున్న స్నేహితులు. తన ఉపదేశాలు తండ్రి అయిన దేవునినుంచి నేరుగా వచ్చినవని క్రీస్తు మళ్ళీ చెప్తున్నాడు – 7:16,17; 12:49; 17:6-8.

**15:16** "ఎన్నుకొన్నాను" – మార్కు 1:16-20; 2:14; 3:13,14 చూడండి. ఎఫెసు 1:4 పోల్చి చూడండి. కానీ క్రీస్తు అలా వారిని ఎన్నుకోవడానికి వారు ఇష్టపడ్డారు.

"నిలిచి ఉండాలని" – దేవుని నిజ సేవకులంతా కోరేది ఇదే. కీర్తన 90:17 చూడండి. క్రీస్తు ఆదేశాలానుసారంగా ఆయనలో ఫలించేది ఎప్పటికీ నిలిచి ఉంటుంది.

"నా పేర" – 14:13,14.

**15:17** వ 12; 13:34. ఇది చాలా ప్రాముఖ్యమైనదని నొక్కి చెప్పేందుకు మరోసారి చెప్తున్నాడు.

**15:18,19** "లోకానికి" – అంటే నిజ దేవునికి విధేయత చూపని అవిశ్వాస లోకం. 1 యోహాను 2:16; 5:19 చూడండి. ఆ లోకం చీకటిలో ఉంది, అక్కడే ఉండిపోవాలనుకుంటున్నది. "ద్వేషిస్తే" – లోకం ద్వేషిస్తూ ఉన్న క్రీస్తు వెలుగును క్రీస్తు శిష్యులు తీసుకువెళ్ళేవారు (3:19,20; మత్తయి 5:14). వారు దేవునికి చెందినవారు, లోకానికి చెందినవారు కారు. ఏకైక నిజ దేవుణ్ణీ ఆయనకు చెందిన అందరినీ అన్నిటినీ ద్వేషించడమే పాపానికున్న అసలు స్వరూపం. కాబట్టి క్రీస్తు శిష్యులు పట్ల లోకం విరోధ భావంతో వైరంతో ఉండడం ఆశ్చర్యం కాదు. అలా లేకపోతేనే ఆశ్చర్యపడవలసి వస్తుంది. కీర్తన 37:12; సామెత 29:27; ఆమోసు 5:10; 1 యోహాను 3:12. దేవుణ్ణీ, ఆయన కుమారుణ్ణీ ద్వేషించే లోకం దేవుని సొంత ప్రజలను ప్రేమించదు. మనం క్రీస్తు వారమని చెప్పుకుంటుంటే లోకం మనల్ని ప్రేమిస్తే మనం కంగారు పడాలి. ఎందుకంటే మనం నిజంగా క్రీస్తుకు చెందినవారం కామనీ, లోకానికి చెందిన వారమేననీ అనుకోవడానికి ఇది ఆధారం. కానీ మనం క్రీస్తు వారమని లోకం మనల్ని ద్వేషిస్తే దాన్ని ఒక గౌరవంగా ఎంచుకోవాలి (1 పేతురు 4:14-16). లోకం మనల్ని ఏ కారణాన్ని బట్టి అయితే ద్వేషిస్తున్నదో, దేవుడు ప్రత్యేకమైన ప్రేమ మనపట్ల చూపడానికి అదే కారణం అని మనం తెలుసుకోవాలి.

**15:20** 13:16 చూడండి. క్రీస్తు భరించినదాని కన్నా మంచి స్థితి తమకుండాలని తలంచే హక్కు క్రీస్తు సేవకులకు లేదు (1 పేతురు 4:1). దేవుని ప్రజలను హింసించడం ద్వారా లోకం కొన్ని సార్లు దాని ద్వేషాన్ని వెళ్ళగక్కుతూ ఉంటుంది. కానీ లోకంలో కొందరు వ్యక్తులు మాత్రం క్రీస్తు ఉపదేశాలను శిరసావహిస్తారు. అపొ కా గ్రంథంలో ఈ రెండు సత్యాలను కూడా ఉదాహరణలు చూడవచ్చు.

**15:21** లోకంలో దేవుళ్ళు, ప్రభువులు పుష్కలంగా ఉన్నారు గాని ఏకైక నిజ దేవుడు లోకానికి తెలియదు (8:19,55; 16:3; అపొ కా 17:22,23; 1 కొరింతు 1:21; ఎఫెసు 4:18). ఇలా తెలియకపోవడం అద్వైత వేదాంతంలో చెప్పిన అజ్ఞానం వంటిది కాదు. అద్వైత వేదాంతంలో మనిషి ఆత్మ, దేవుని ఆత్మ ఒకటేననీ, ఇది తెలియక మనుషులు ఆత్మసంబంధమైన దాస్యంలో ఉన్నారనీ, ఆ జ్ఞానమే వారికి విముక్తి ఇస్తుందనీ సిద్ధాంతం. ఈ ఉపదేశమంతా బైబిలు సత్యానికి పూర్తిగా విరుద్ధం. 10:30 మొ॥ కూడా చూడండి.

**15:22** "పాపం ఉండేది కాదు" – క్రీస్తు వచ్చినా రాకపోయినా మనుషులు పాపులే (రోమ్ 3:9-19,23; 5:12). ఆయన్ను తృణీకరించిన యూదులు పాపంతో నిండి ఉన్నవారు (8:24,40,44; మత్తయి 23:3,13-15,25,28,32-36). కానీ తన కుమారుణ్ణి గనక వారు నిరాకరించకపోతే వారి పాప దోషాన్ని దేవుడు తన కరుణ చొప్పున చూచీ చూడనట్టు దాటివెళ్ళగలిగి ఉండేవాడు (రోమ్ 3:25). క్రీస్తును నిరాకరించడ మంటే క్షమాపణకు ఏకైక మార్గాన్ని నిరాకరించడమే. దేవుని ప్రత్యేక ప్రజ అయిన యూద జాతి (ద్వితీ 7:6) గురించి ఆయనిక్కడ మాట్లాడుతున్నాడు. వారి పాపాలనుంచి దాటిపోయి వారిని క్షమించేందుకు ఆయన కొన్ని బలి అర్పణలను నియమించాడు (లేవీ 17 అధ్యాయాలు). కానీ ఆయన దాటిపోలేని పాపమేమంటే వారు బుద్ధిపూర్వకంగా తననే తిరస్కరించడం (లేవీ 26:18,21,23; సంఖ్యా 15:30,31; ద్వితీ 30:15-20). క్రీస్తు వారిదగ్గరికి రావడం మరింకేది బయటపెట్టలేనంత స్పష్టంగా వారి గుణాన్ని బయటపెట్టింది. చీకటంటే వారికున్న ఇష్టం, దేవునిపట్ల వారి ద్వేషం తేటతెల్లమయ్యాయి (3:19,20). వారి మతం అనే ముసుగు వారి దుర్మార్గతను దాచి ఉంచలేకపోయింది. తాము చేస్తున్నది తమకు తెలియదనేందుకు వారికి ఎలాంటి సాకూ లేదు.

వెలుగును నిరాకరించడమంటే చాలా ప్రమాదకరమైన సంగతి అని మనం నేర్చుకోవాలి. సామెత 1:24-31; లూకా 12:47,48; 2 తెస్స 2:10-12.

**15:23** ఇక్కడ తండ్రి అయిన దేవునికీ, దేవుని ఏకైక కుమారునికీ ఉన్న సంపూర్ణ ఐక్యత గురించి క్రీస్తు మళ్ళీ చెప్తున్నాడు – 10:30; 13:20; 14:9,10. వారిలో ఒకరిని ప్రేమించి సేవించేవారు మరో వ్యక్తిని కూడా ప్రేమించి సేవించినట్టే. అలానే ఒకర్ని తిరస్కరించి ద్వేషించేవారు, రెండోవ్యక్తిని తిరస్కరించి ద్వేషించినట్టే.

**15:24** మోషే, పాత ఒడంబడిక ప్రవక్తలూ గొప్ప అద్భుతాలు చేశారు గానీ యేసు చేసినవి ఎవరూ చెయ్యలేదు. అంటే గుడ్డివారికి చూపు ఇవ్వడం, పిడికెడు ఆహారంతో గొప్ప జనసమూహాలకు ఆకలి తీర్చడం, నీళ్ళమీద నడవడం మొదలైనవన్నమాట. ఆయన పరలోకంనుంచి వచ్చిన దేవుని కుమారుడని ఘోషిస్తున్న రుజువులూ సాక్ష్యాధారాలన్నీ ఉండి

ఉండేది కాదు. ఇప్పుడైతే వారు నన్నూ నా తండ్రినీ చూచి
ద్వేషించారు. 25 వారి ధర్మశాస్త్రంలో ఇలా వ్రాసి ఉంది:
‘వారు నన్ను నిష్కారణంగా ద్వేషించారు.’ ఈ మాట నెరవేరేలా
*ఈ విధంగా జరుగుతూ ఉంది.*
26 “నేను ఆదరణకర్తను మీ దగ్గరకు తండ్రినుంచి
పంపుతాను. ఆయన వచ్చినప్పుడు ఆయన నన్ను గురించి
సాక్ష్యం చెపుతాడు. ఆయన తండ్రినుంచి బయలుదేరే సత్యాత్మ.
27 మీరు మొదటినుంచి నాతో ఉన్నారు గనుక మీరు కూడా
సాక్ష్యం చెపుతారు.

**16** “మీరు తొట్రుపడకూడదని నేను ఈ విషయాలు
మీతో చెప్పాను. 2 వారు మిమ్ములను సమాజ
కేంద్రాలనుంచి వెలివేస్తారు. మిమ్ములను ఎవరైనా చంపితే తాను
దేవునికి సేవ చేస్తున్నట్టు అనుకొనేకాలం కూడా వస్తూ ఉంది.
3 వారు తండ్రినీ నన్నూ తెలుసుకోలేదు గనుక ఆ విధంగా
మీకు చేస్తారు. 4 ఆ కాలం వచ్చేటప్పుడు ఈ విషయాలు మీతో
చెప్పానని మీరు జ్ఞాపకం చేసుకోవాలని వీటిని గురించి మీతో
చెపుతున్నాను. మొదట్లో ఈ విషయాలు మీకు చెప్పలేదు.
ఎందుకంటే నేను మీతో ఉన్నాను.
5 “ఇప్పుడైతే నన్ను పంపినవాని దగ్గరకు నేను వెళ్ళి
పోతున్నాను గానీ ‘నీవు ఎక్కడికి వెళ్ళిపోతున్నావు?’ అని
మీలో ఎవరూ నన్ను అడగడం లేదు. 6 అయితే నేను ఈ
విషయాలు మీతో చెప్పినందుచేత మీ హృదయాలు
దుఃఖంతో నిండిపోయాయి. 7 అయినా నేను మీతో చెప్పేది
సత్యమే – నేను వెళ్ళిపోవడం మీకు మేలు. నేను వెళ్ళకపోతే
ఆదరణకర్త మీ దగ్గరకు రాదు. నేను వెళ్ళిపోతే ఆయనను మీకు

---

కూడా (5:31–40) యూదులు ఆయన్ను తిరస్కరించారు. ఈ ఒక్క పాపం కారణంగానే వారి ఇతర పాపాలను దేవుడు క్షమించగలగడం అసాధ్యం అయింది. తరచుగా మనుషుల భ్రష్ట హృదయాల్లో దేవునిపై ఉండే ద్వేషం దాగి ఉంటుంది గానీ వీరి విషయంలో అది బయటపడింది.

**15:25** కీర్తన 35:19; 69:4. వారికి ఆయన ఏవిధంగానూ హాని చేయలేదు. మనుషుల్ని విమోచించి వారిని దేవుని శాశ్వత దీవెనల్లోకి తీసుకురావడమే ఆయన వచ్చిన కార్యం. యేసుప్రభువును తిరస్కరించి ద్వేషించడానికి సరైన కారణం ఎన్నడూ ఎవరికీ ఉండదు గదా.

**15:26** “ఆదరణకర్త” – 14:16,17.

“పంపినప్పుడు” – క్రీస్తు దేవుడనడానికి ఇది మరో రుజువు. దేవుని ఆత్మను దేవుడు తప్ప వేరెవరు పంపగలరు? ఈ వచనంలోని త్రిత్వాన్ని గమనించండి. 14:26 పోల్చి చూడండి. మత్తయి 3:16 నోట్ చూడండి.

“సాక్ష్యం చెపుతాడు” – 16:14; రోమ్ 8:16; 1 యోహాను 5:6. దేవుని ఆత్మ మనుషుల మనసుల్లో హృదయాల్లో, అంతరాత్మల్లో సాక్ష్యం చెపుతాడు. అంతేగాక ఇతరులకు సాక్ష్యం చెప్పే వారితోనూ, వారిలోనూ పని చేస్తూ వారి సాక్ష్యాన్ని కార్య సాధకం చేస్తాడు (మత్తయి 10:20; 1 పేతురు 1:12).

**15:27** “మీరు కూడా” – క్రీస్తు తన శిష్యులను ఎన్నుకుని వారిని ఈ లోకంలో వదిలిపెట్టిన ముఖ్య కారణాల్లో ఇది ఒకటి. అపొ కా గ్రంథంలో దీని నెరవేర్పు చూడండి (అపొ కా 1:8; 2:32; 3:15; 5:32; 10:39,41; 13:31). 18–21 వచనాల్లో ఆయన చెప్పిన ద్వేషానికీ హింసకూ వారు భయపడకూడదు. మొదటి నుంచి ఆయన చేసినదంతా వారు చూశారు, చెప్పినదంతా విన్నారు. సాక్షులుగా ఉండేందుకు వారు పూర్తిగా తగినవారు (అపొ కా 1:21,22; 2 పేతురు 1:16–18).

ఈ 15వ అధ్యాయంలో క్రీస్తు శిష్యుల అధికృతలు, బాధ్యతలు ఇక్కడ మూడు సంబంధాల రూపంలో చూస్తున్నాం – వారు క్రీస్తులో నిలిచి ఉండాలి (వ 4), ఒకరినొకరు ప్రేమించాలి (వ 12), లోకానికి సాక్ష్యం చెప్పాలి.

**16:1** బాధలు వచ్చినప్పుడు వారు ఆశ్చర్యపోకుండా తమ నమ్మకంలో తొట్రుపడకుండా ఉండాలని వారికి ఏమి జరగనున్నదో ఆయన ముందే తెలియజేస్తున్నాడు. వ 33; అపొ కా 14:22; 2 తిమోతి 3:12; 1 పేతురు 4:1. ఈ హెచ్చరికలు మనకోసం కూడా.

**16:2** 9:22; 12:42 చూడండి.

“సమాజ కేంద్రం” – మత్తయి 4:23. క్రీస్తు సేవకులను హతమార్చడం దేవునికి సేవ చెయ్యడంతో సమానంగా మతస్థులు భావించడం సాధ్యమేనా? మనుషుల తలంపులు అంత వక్రంగా అయిపోవడం సంభవమేనా? అవును. యూదులు ఏమి చేస్తారని యేసు చెప్పాడో సరిగ్గా అదే చేశారు. మత్తయి 23:34; అపొ కా 7:54–60; 8:3; 26:9–11; 14:19. నాటి నుంచి ఇదే సంగతి అనేక మార్లు జరగలేదా? లెక్కలేనన్ని సార్లు జరిగింది – ఇంకా జరుగుతూనే ఉంది.

**16:3** మతం పేరట జరిగిన అనేకమైన నేరాలకు మూల కారణం ఇదే – నిజ దేవుణ్ణి ఎరుగకపోవడం. 8:19,41–44; 15:21. అనేకమందికి దేవుడు తెలియక పోయినా తెలుసుననుకుంటారు. కొందరైతే దేవుణ్ణి గురించి తమ తప్పుడు అభిప్రాయాలను నిలబెట్టుకునేందుకు ఆ అభిప్రాయాలను ఎదిరించి సత్యం చెప్పేవారిని చంపేసేటంత దూరం వెళ్తారు. ఈ విధంగా తాము దేవుణ్ణి సేవిస్తున్నామనుకుంటారు! యిర్మీయా 17:9; మత్తయి 15:19; తీతు 1:16 చూడండి.

**16:4** ఆయన వారితో ఉన్నంత కాలం మనుషులు తమ కోపాన్నీ, ద్వేషాన్నీ ఆయనమీదికి ప్రయోగించారు. ఆయన పరలోకానికి తిరిగి వెళ్ళిపోయిన తరువాత ఆ కోపం, ద్వేషం అంతా ఆయన శిష్యులమీదికి తిరుగుతుంది.

**16:5** “నీవు ఎక్కడికి వెళ్ళిపోతున్నావు?” అని పేతురు అడిగాడు (13:36) గానీ యేసు ఎక్కడికో వెళ్ళిపోతున్నాడన్న ఆశ్చర్యం మాత్రమే ఆ ప్రశ్నలో ఉంది. యేసు వెళ్తున్నదెక్కడికో తెలుసుకోవాలన్న విచారణ ఆ ప్రశ్నలో లేదు. అతడు (ఇతర శిష్యులు కూడా) యేసుతో ఎడబాటు గురించి (వ 6) మనసులో నెమ్మది లేకుండా ఉన్నాడు.

**16:7** క్రీస్తు శారీరికంగా మనతో ఉండడంకన్నా మేలైనది ఏదన్నా ఉందా? “లేదు” అనేవారే ఆయన శిష్యులు. ““ఉంది” అంటున్నాడు యేసు. కారణం? క్రీస్తు చనిపోయి, తిరిగి లేచి పరలోకానికి వెళ్ళిపోకుంటే పవిత్రాత్మ (ఆదరణకర్త – 14:26) వారిలో నివసించేందుకు వచ్చేవాడు కాదు. వారు చేయవలసిన పనికోసం వారిని బలప్రభావాలతో అభిషేకించేవాడు కాదు. 7:39 పోల్చి చూడండి. క్రీస్తు శారీరికంగా వారితో ఉండడం కంటే ఆయన ఆత్మ వారిలో ఉండడం ఇంకా మంచిది. తాను వెళ్ళిపోకముందే ఈ విధంగా వారికి ఆత్మను ఎందుకు అనుగ్రహించ లేకపోయాడో చెప్పలేదు. ఇది దేవుని నిర్ణయం, ఏర్పాటు అని తెలుసుకుంటే చాలు మనకు. ఆత్మను ప్రసాదించడం అనేది క్రీస్తు మరణం, పునర్జీవితం, ఆరోహణపై ఆధారపడి ఉందని అందరికి స్పష్టం కావాలని ఆయన ఉద్దేశం కావచ్చు.

పంపుతాను.

8 “ఆయన వచ్చేటప్పుడు పాపాన్ని గురించీ న్యాయాన్ని గురించీ తీర్పును గురించీ లోకాన్ని ఒప్పిస్తాడు. 9 వారు నా మీద నమ్మకం పెట్టడం లేదు, గనుక పాపాన్ని గురించి ఒప్పిస్తాడు. 10 నేను తండ్రి దగ్గరకు వెళ్ళిపోతున్నాను, ఇకనుంచి మీరు నన్ను చూడరు గనుక న్యాయాన్ని గురించి ఒప్పిస్తాడు. 11 ఈ లోక పాలకుడికి తీర్పు జరిగింది గనుక తీర్పును గురించి ఒప్పిస్తాడు.

12 “నేను మీతో చెప్పవలసినవి ఇంకా అనేక సంగతులు ఉన్నాయి గాని ఇప్పుడు మీరు వాటిని సహించలేరు. 13 అయితే ఆయన – సత్యాత్మ – వచ్చేటప్పుడు మిమ్ములను సర్వ సత్యంలోకి తీసుకువస్తాడు. ఆయన తనంతట తానే ఏమీ చెప్పడు. ఏవైతే తండ్రి దగ్గర వింటాడో అవే చెపుతాడు. జరగబోయేవి కూడా మీకు తెలియజేస్తాడు. 14 నా వాటిలోవి తీసుకొని ఆయన మీకు తెలియజేసి నాకు మహిమ కలిగిస్తాడు. 15 తండ్రికి చెందేవన్నీ నావి. అందుచేతే నా వాటిలోవి తీసుకొని ఆయన మీకు తెలియజేస్తాడని నేను చెప్పాను. 16 నేను తండ్రిదగ్గరికి వెళ్ళిపోతాను గనుక కొద్ది కాలానికి మీరు నన్ను ఇక చూడరు, మరి కొద్ది కాలానికి మీరు నన్ను చూస్తారు.”

17 అందుకు ఆయన శిష్యులలో కొందరు ఒకడితో ఒకడు ఇలా చెప్పుకొన్నారు: “ఆయన ‘కొద్ది కాలానికి మీరు నన్ను ఇక

---

**16:8** తాను వెళ్ళిపోవడం మంచిదనడానికి యేసు దీన్ని మరో కారణంగా ఇస్తున్నాడు. పవిత్రాత్మ వచ్చి యేసు శరీరికంగా పరిచర్య చేసిన ఒక మారుమూల ప్రాంతంలోనే గాక లోకమంతటా మనుషులను ఒప్పించే పని చేస్తాడు. పాపం, నీతిన్యాయాలు, తీర్పు గురించిన సత్యాలను వారికి నేర్పిస్తాడు. ఈ విషయాల్లో వారికున్న పొరపాటు అభిప్రాయాలను బట్టి వారిని మందలిస్తాడు. యేసును గురించి యూదుల అభిప్రాయాలు పూర్తిగా తప్పనీ, క్రీస్తు, ఆయన పరిచర్య వారు ఊహించని దానికి పూర్తిగా భిన్నమనీ లోకానికి తెలియజేస్తాడు. పవిత్రాత్మ మనుషుల్ని ఇలా ఒప్పించినదాని ఫలితం అపొ కా 2:37లో చూడవచ్చు.

**16:9** తమ అపనమ్మకంలో క్రీస్తును నిరాకరించి సిలువ వేసినవారు భయంకరమైన పాపం చేశారని పవిత్రాత్మ అంతటా ఉన్న మనుషుల్ని ఒప్పిస్తాడు. అంతేగాకుండా ఎవరైనా ఎక్కడైనా ఇష్టపూర్వకంగా ఆయన్ను నమ్మడానికి నిరాకరించడం పాపమనీ, పాపంయొక్క సారమే అనీ వ్యక్తులను ఒప్పిస్తాడు. బైబిల్లో అన్నిచోట్లా అపనమ్మకం నేరస్థాపనకూ, శిక్షకూ అర్హమని చెప్పడం చూడవచ్చు – 3:18,36; 8:24; మార్కు 16:14,16; 2 తెస్స 1:8; 2:12; హీబ్రూ 3:12,18; 4:11; 11:31; యూదా 5; ప్రకటన 21:8. అయితే పవిత్రాత్మ మాత్రమే ఈ విషయం మనుషుల్ని ఒప్పించగలడు.

**16:10** దీని అర్థం ఇది కావచ్చు – క్రీస్తు పరలోకానికి వెళ్ళిపోయిన తరువాత, క్రీస్తు మోసగాడు కాదనీ (యూదులు చెప్పినట్టు), దేవదూషకుడు కాదనీ, పూర్తిగా న్యాయవంతుడనీ పవిత్రాత్మ మనుషుల్ని ఒప్పిస్తాడు. అపొ కా 3:14,15 పోల్చి చూడండి. అంతేగాక నీతిన్యాయాల విషయంలో మనుషులకు వ్యక్తిగతంగా ఉన్న అవసరతను గురించి కూడా ఒప్పిస్తాడు. మనుషులను న్యాయవంతులుగా చేసేందుకు దేవుడు సిలువద్వారా ఒక మార్గాన్ని ఏర్పరచాడని కూడా తెలియజేస్తాడు.

**16:11** “లోక పాలకుడు” – 12:31. క్రీస్తు సిలువ పాపంపై తీర్పు. పాపం ఎక్కడెక్కడ ఉందో అన్ని చోట్లా అది భయంకరమైన శిక్షకు తగినదని సిలువ తెలియజేస్తున్నది. పాపం ఎంత ఘోరమైనదంటే మనుషులను దానినుంచి విడిపించాలంటే దేవుని కుమారుని మరణం అవసరమైంది. సైతానులో పాపమంతా రూపుదాల్చింది. అతడు మనుషుల్లో పాపాన్ని ప్రోత్సహించి దానిద్వారా వారిని ఏలుతాడు. సిలువపై పాపానికి తీర్పు తీర్చడంద్వారా సైతాను, వాడికి చెందినదంతా బహిరంగంగా తీర్పుకు గురైంది. అంటే పాపంలో నిలిచి ఉండే వారందరికీ, తనకు వ్యతిరేకంగా సైతాను పక్షం చేరే వారందరికీ దేవుడు తీర్పు తీరుస్తాడని అది చెప్తున్నది. “తీర్పు” గురించి మత్తయి 10:15; అపొ కా 17:31; రోమ్ 2:2,16; 14:10; 2 పేతురు 2:9; ప్రకటన 14:7; 20:11-15.

**16:12** క్రీస్తు తన ప్రజలను క్రమక్రమంగా దేవుని లోతైన సత్యాలలోకి నడిపిస్తాడు. సత్యమంతా ఒకే సారి చెప్తే వారు ఇముడ్చుకోలేరు గనక అలా చెప్పడు. క్రీస్తు ఈ లోకంలో ఉన్నప్పుడు చెప్పిన విషయాలను తరుచుగా ఆయన శిష్యులు అర్థం చేసుకోలేకపోయారు గదా.

**16:13** 14:17,26. దేవుణ్ణి గురించి ఆయన రాజ్యం గురించీ తన ప్రజలు తెలుసుకోవాలని ఆయన ఉద్దేశించిన దానంతటినీ పవిత్రాత్మ శిష్యులకు నేర్పించాడు. ఈ సత్యాన్ని బయటపెట్టినది క్రొత్త ఒడంబడిక గ్రంథం. పవిత్రాత్మ ఇప్పుడు దేవుని వాక్కును వాడుకొంటూ ఒక్క సారే వెల్లడి అయిన సత్యాన్ని వ్యక్తిగతంగా విశ్వాసులకు నేర్పిస్తూ ఉన్నాడు. ఆయన వారిలో ఉంటూ వారి మనస్సులను వెలిగిస్తాడు (1 యోహాను 2:27; ఎఫెసు 1:17,18). ఇలాంటి వాగ్దానాన్ని ఆధారం చేసుకుని ప్రతి విశ్వాసి కూడా దేవుని ఆత్మ ఇచ్చే జ్ఞానప్రకాశాలను వెతకాలి. దాన్ని నేర్చుకునేందుకు ఆయనపై ఆధారపడాలి. దేవుడే ఉపదేశకుడుగా ఉండడం గురించి కీర్తన 25:3,4; మొ॥ నోట్స్ చూడండి.

“జరగబోయేవి” – పవిత్రాత్మకు భవిష్యత్తులో జరగబోయేవి తెలుసు. ఏఏ భవిష్యద్ విషయాలు తన ప్రజలకు తెలియాలని దేవుడు తలచుకున్నాడో వాటిని పవిత్రాత్మ ఆ శిష్యులకు తెలియజేశాడు. వారు ఆ సంగతులను మనకోసం తమ లేఖల్లోను, ప్రకటన గ్రంథంలోను రాసిపెట్టారు.

**16:14** 15:26. యేసుప్రభువుకు మహిమ కలిగించని ఏ ఉపదేశమైనా దేవుని నుంచి వచ్చినది కాదు. మనం ఏ మత బోధన విషయంలో అయినా అది ఎలాంటిదో తెలుసుకోగలిగే మార్గం ఇదే. ఆత్మ క్రీస్తును గురించిన విషయాలను ఆయనకు చెందిన నిజ శిష్యులు అనుభవించేలా చేస్తాడు. 1 కొరింతు 2:9-16 పోల్చి చూడండి.

**16:15** పవిత్రాత్మ తండ్రి అయిన దేవుణ్ణి గురించి ఏమీ వెల్లడి చేయడు అని యేసుప్రభువు ఉద్దేశం కాదు. ఆయనకు చెందినవాటిని గురించి మాట్లాడడమంటే తండ్రికి చెందిన వాటిని గురించి మాట్లాడ్డమే. అవీ ఇవీ ఒకటే. 17:10 చూడండి. ఈ వచనంలో త్రిత్వం కనిపిస్తున్న సంగతి గమనించండి. మత్తయి 3:16 నోట్.

**16:16** ఇక్కడ రెండు అర్థాలకు అవకాశం ఉంది. యేసుప్రభువు చనిపోయి వారికి కనిపించకుండా సమాధిలో ఉంటాడు. మూడో రోజున సజీవంగా లేచి వారికి మళ్ళీ కనిపిస్తాడు. ఇది స్పష్టమే. కానీ ఒక వేళ ఆయన తాను పరలోకానికి వెళ్ళిపోయే సంగతి చెప్తున్నాడేమో. ఆ తరువాత శిష్యులు ఆయన్ను చూడరు. ఆయన రెండో రాకడ సమయంలో మళ్ళీ చూస్తారు. వ 10లోని మాటలు ఆ రెండో అభిప్రాయానికి ఆధారంగా ఉన్నట్టుంది. తరువాతి వచనాల్లో యేసుప్రభువు ఈ

చూడరు. మరి కొద్ది కాలానికి మీరు నన్ను చూస్తారు. నేను తండ్రి దగ్గరికి వెళ్ళిపోతాను గనుక' అని మనతో చెపుతున్నదేమిటి? 18 ఆయన 'కొద్దికాలం' అనడంలో అర్థం ఏమిటి? ఆయన చెప్పేది ఏమిటో మనకు తెలియదు" అన్నారు.

19 వారు తనను అడగాలనుకొంటున్నారని తెలుసుకొని యేసు వారితో ఇలా అన్నాడు: "కొద్ది కాలానికి మీరు నన్ను ఇక చూడరు. మరి కొద్ది కాలానికి మీరు నన్ను చూస్తారు అని నేను చెప్పిన దాన్ని గురించి ఒకరినొకరు విచారణ చేసుకొంటున్నారా? 20 మీతో ఖచ్చితంగా చెపుతున్నాను, మీరు ఏడుస్తారు, శోకిస్తారు గానీ లోకం సంతోషిస్తుంది. మీరు దుఃఖిస్తారు గానీ మీ దుఃఖం ఆనందంగా మారిపోతుంది.

21 "స్త్రీ ప్రసవిస్తూ ఉంటే, తన గడియ వచ్చినందుచేత బాధలు అనుభవిస్తుంది. శిశువు పుట్టినప్పుడు ఒకరు లోకంలో పుట్టడంవల్ల వచ్చిన సంతోషం మూలాన ఆ వేదన ఇంకా జ్ఞాపకం చేసుకోదు. 22 అలాగే ఇప్పుడు మీకు దుఃఖం ఉంది గాని నేను మిమ్ములను మళ్ళీ చూస్తాను. అప్పుడు మీ హృదయాలకు ఆనందం కలుగుతుంది. మీ ఆనందాన్ని మీకు లేకుండా ఎవరూ తీసివేయరు. 23 ఆ రోజున మీరు నన్ను ఏమీ అడగరు. మీతో ఖచ్చితంగా చెపుతున్నాను, మీరు తండ్రిని నా పేర ఏది అడిగినా అది ఆయన మీకిస్తాడు. 24 ఇదివరకు మీరు నా పేర అడిగినది ఏదీ లేదు. అడగండి, మీకు దొరుకుతుంది. అప్పుడు మీ ఆనందం పరిపూర్ణం అవుతుంది.

25 "అలంకారిక భాషలో ఈ విషయాలు మీతో చెప్పాను. అయితే ఒక కాలం రాబోతుంది. ఆ కాలంలో నేను అలంకారిక భాషలో మీతో మాట్లాడక, తండ్రిని గురించి మీకు స్పష్టంగా తెలియజెపుతాను. 26 ఆ రోజున నా పేర మీరు తండ్రిని అడుగుతారు. నేను మీకోసం తండ్రిని వేడుకొంటానని చెప్పడం లేదు. 27 ఎందుకంటే తండ్రి తానే మిమ్ములను ప్రేమిస్తూ ఉన్నాడు. కారణమేమంటే మీరు నన్ను ప్రేమించారు, నేను దేవుని దగ్గరనుంచి వచ్చానని నమ్మారు. 28 నేను తండ్రి దగ్గరనుంచి బయలుదేరి లోకంలోకి వచ్చాను. ఇప్పుడు లోకాన్ని విడిచి తండ్రిదగ్గరకు వెళ్ళిపోతున్నాను."

29 ఆయన శిష్యులు "ఇదిగో, ఇప్పుడు అలంకారిక భాషలో గాక, స్పష్టంగా మాట్లాడుతున్నావు. 30 నీకు అన్ని విషయాలూ తెలుసుననీ నిన్ను ఎవరూ ఏమీ అడగనవసరం లేదనీ ఇప్పుడు తెలుసుకొన్నాం. నీవు దేవుని దగ్గరనుంచి వచ్చావని

---

రెండు అభిప్రాయాలను సూచిస్తూ మాట్లాడి ఉండవచ్చు. సిలువపై తన మరణానికి ముందు శిష్యులకొక సందేశమిచ్చాడు; ఆయన రాకకోసం ఎదురుచూస్తున్న విశ్వాసులందరికీ ఒక సందేశం ఇచ్చాడు.

**16:18** అంతకుముందు అయోమయంగా అనిపించి కలవరపెట్టినవి క్రీస్తు మరణించి లేచిన తరువాత స్పష్టం అయ్యాయి.

**16:20** క్రీస్తు మరణం ఆయన మిత్రులకు తీవ్ర వేదన, శత్రువులకు సంతోషం కలిగించింది.

**16:21,22** క్రీస్తు మరణం తరువాతి దినాలు నూతన శకానికి నాంది వంటివి. శిష్యులు ఆ నవ యుగాన్ని, ఆయన్ను చూచి సంతోషిస్తారు. ఆయన ఇచ్చే ఆనందం వారిలో ఉంటుంది, శాశ్వతంగా ఉంటుంది (15:11; 20:20; లూకా 24:52; రోమ్ 14:17). ఒక విధంగా చూస్తే పరలోకంనుంచి క్రీస్తు రాకడకోసం ఇప్పుడు ఎదురుచూస్తున్న విశ్వాసులక్కూడా ఇది వర్తిస్తుంది. ఆయన రెండో రాకడ కూడా మరో నూతన శక ఆరంభంవలె ఉంటుంది. మత్తయి 24:8; రోమ్ 8:19–22 చూడండి. ఆ సమయంలో విశ్వాసులకు కలిగే ఆనందంతో పోల్చుకుంటే ప్రభువు పరలోకంలో ఉండగా వారు ఈ భూమిపై గడిపిన సమయం దుఃఖపూరితంగా అనిపిస్తుంది. మత్తయి 9:15; రోమ్ 8:18,23; 2 కొరింతు 4:17; 6:10; 1 పేతురు 1:6; కీర్తన 42:1–3.

**16:23** యేసు చనిపోయి లేచిన తరువాత వారికి అనేక సత్యాలు నేర్పించి పాత ఒడంబడిక గ్రంథాన్ని వారికి అర్థం అయ్యేలా చేశాడు (లూకా 24:44,45; అపో కా 1:3). ఇక్కడ ఇప్పటి విశ్వాసులకేదైనా సందేశం ఉందనుకుంటే అది ఇది – క్రీస్తు తిరిగి వచ్చినప్పుడు ఇంతవరకు విశ్వాసులను కలవరపెట్టిన, విభ్రాంతి నొందించినవన్నీ తేటతెల్లమౌతాయి. 1 కొరింతు 13:12 పోల్చి చూడండి.

"నా పేర" – 14:14.

**16:24** అప్పటివరకు శిష్యులు నేరుగా క్రీస్తును అడుగుతూ వచ్చారు. లేక క్రీస్తు అధికారాన్ని ఉపయోగించకుండా ఆయన్ను మధ్యవర్తిగా ఎంచకుండా నేరుగా దేవునికి ప్రార్థన చేశారు. ఇప్పుడు విశ్వాసులకు క్రీస్తు మూలంగా ఆనందం ఉంది, ఎందుకంటే దేవుడు వారి ప్రార్థనలు ఆలకిస్తాడు. ఆయన వాస్తవంగా తమతో ఉన్నాడనే విషయాన్ని, ఆయన కృప, ప్రేమలను వారు తెలుసుకోగలిగే ఒక మార్గమిది.

**16:25** తాను చనిపోయి లేచిన తరువాత శిష్యులకు తండ్రి అయిన దేవుణ్ణి గురించి నేర్పిస్తానని ఆయన భావం. ఇది ఆయనకు అమితానందం కలిగించే పని. ఆయన నెరవేర్చేందుకు వచ్చిన పనుల్లో ఒకటి (1:18; మత్తయి 11:27).

**16:26** వారి విన్నపాలను తండ్రి అయిన దేవునికి తాను రెండోసారి చెప్పవలసిన పని లేదని దీని అర్థం కావచ్చు. వారు తన పేర నేరుగా తండ్రికి ప్రార్థిస్తే చాలు. ఇతర విషయాల గురించి వారికోసం తండ్రికి విజ్ఞాపన చెయ్యనని ఆయన అనడం లేదు. రోమ్ 8:34; హీబ్రూ 7:25 చూడండి.

**16:27** "మిమ్ములను ప్రేమిస్తూ" – తన ప్రజపట్ల దేవునికున్న కుటుంబ తరహా ప్రేమను ఇది తెలియజేస్తున్నది (14:21). క్రీస్తులో తమ నమ్మకం ద్వారా విశ్వాసులు దేవుని పిల్లలై ఉన్నారు (1:12,13). అలాంటివారు నేరుగా దేవుని దగ్గరికి వెళ్ళి, దేవుడు తమ ప్రార్థనలు వింటాడని గ్రహించవచ్చు. హీబ్రూ 10:19–22 పోల్చి చూడండి. తమ విన్నపాలు దేవునికి వినిపించేందుకు క్రీస్తు సహాయం కూడా విశ్వాసులకు అవసరం లేదంటున్నాడు ప్రభువు, కాబట్టి ఇతరులింకెవరూ (పరలోకంలో పవిత్రులు గానీ యేసు తల్లియైన మరియ గానీ మరెవరూ గానీ) వారికి అవసరం లేదన్నది నిస్సందేహమే. దేవుడు వారికి ప్రేమగల తండ్రి. వారాయన చెంతకు నేరుగా వస్తే, సంతోషంగా వారికి అవసరమైనవాటన్నిటినీ ఇస్తాడు (మత్తయి 7:11; 2 కొరింతు 9:8; ఫిలిప్పీ 4:19). తన ప్రజలపట్ల దయ చూపమని తండ్రి అయిన దేవుణ్ణి ఒప్పించే భక్తులు, ఇతరులింకెవరూ అవసరం లేదు.

**16:28–30** తండ్రి తనను పంపాడనీ, తాను తండ్రి దగ్గరికి వెళ్తున్నాననీ, తాను ఈ లోకానికి చెందినవాణ్ణి కాననీ యేసుప్రభువు ఇంతకుముందు చెప్పాడు (5:36; 6:38; 8:23; 14:28). యేసు దేవుని నుంచి వచ్చాడని శిష్యులు నమ్మారు (వ 27) గానీ ఏ కారణం చేతనో ఆయన చెప్పింది వారు పూర్తిగా గ్రహించలేదు. ఇక్కడ ఆ సత్యం ఒక్క సారిగా వారి మనస్సులను తాకింది.

దీనిని బట్టి నమ్ముకొంటున్నాం” అన్నారు.
31 యేసు వారికిలా జవాబిచ్చాడు: “మీరిప్పుడు
నమ్ముతున్నారా? 32 ఇదిగో వినండి. ఒక కాలం రాబోతుంది.
అది వచ్చి ఉంది కూడా. ఈ కాలంలో మీరంతా చెదరి ఎవరి
ఇంటికి వారు వెళ్ళిపోతారు. నన్ను ఒంటరిగానే వదలివేస్తారు.
అయినా నేను ఒంటరివాణ్ణి కాను – తండ్రి నాతో ఉన్నాడు.
33 “నా మూలంగా మీకు శాంతి ఉండాలని ఈ
సంగతులు మీకు చెప్పాను. లోకంలో మీకు బాధ ఉంటుంది.
అయినా ధైర్యంగా ఉండండి. నేను లోకాన్ని జయించాను.”

17 ఆ మాటలు చెప్పి యేసు ఆకాశం వైపు తలెత్తి
చూస్తూ ఇలా అన్నాడు: “తండ్రీ, నా సమయం

**16:31,32** “వదలివేస్తారు” – వారి నమ్మకం ఇంకా దుర్బలమైనదనీ వారు కూడా ఆధ్యాత్మికంగా బలహీనులనీ యేసుకు బాగా తెలుసు. ఆ రాత్రే ఆయన చెప్పిన ఈ మాట ప్రకారం వారు చేశారు (మత్తయి 26:31,56; మార్కు 14:50). అయితే వారు ఆయన్ను వదిలిపోయినా ఆయన వారిని వదలలేదు, ప్రేమిస్తూనే ఉన్నాడు, వారికోసం ప్రార్థిస్తూనే ఉన్నాడు. మత్తయి 12:20; లూకా 22:31,32 పోల్చి చూడండి. తరువాత వారిని తిరిగి సమకూర్చి, బలపరచి, వారు ఆధ్యాత్మికంగా ఎదిగేలా తోడ్పడుతూ ఉపదేశిస్తూ వచ్చాడు. వారు చెడ్డ గొర్రెలుగా తమను తాము స్పష్టంగా కనపరచుకున్న సమయంలోనే ఆయన తనను మంచి కాపరిగా ఎక్కువ స్పష్టంగా కనపరచుకున్నాడు (10:11).

**16:33** “ఈ సంగతులు” – 14:1 నుంచి ఆయన చెప్తూ వచ్చిన సంగతులన్నీ అన్నమాట.

“శాంతి” – 14:27. శాంతి ఎక్కడ దొరుకుతుందో గమనించండి. “నా మూలంగా” అన్నాడు యేసు. శాశ్వత శాంతి మరెక్కడా దొరకదు.

“బాధలు” – 15:18-21; 16:1-4. శిష్య జీవితం తేలికగా, సుఖభోగాలతో సౌఖ్యంతో నిండిన జీవితం కాదని ఆయన వారికి తేటగా చెప్పాడు. ఇతరులకంటే శిష్యులకు ఎక్కువ కష్టాలు వస్తాయి. విశ్వాసపాత్రులైన ఆయన సేవకులు కూడా ఆయన నేర్పిన ఈ సత్యాన్ని ఈ రోజుల్లో ప్రకటిస్తారు.

“ధైర్యంగా ఉండండి” – రెండు సంగతుల మూలంగా వారు ప్రోత్సాహం, నిబ్బరం, ధైర్యం తెచ్చుకోవాలి. బాధల మధ్యలో వారికి శాంతి ఉంటుంది. అంతిమ విజయం క్రీస్తుకూ, క్రీస్తులో వారికీ చెందుతుందని వారు తెలుసుకోగలరు. ఈ లోక బాధల స్థానంలో శాశ్వత మహిమ వారికి చేకూరుతుంది (2 కొరింతు 4:17).

“లోకాన్ని జయించాను” – ఆ మరుసటి రోజే తనకు మరణ శిక్ష, సిలువ మరణం ప్రాప్తిస్తాయని ఆయనకు తెలుసు. అయినా ఇలాంటి మాటలు పలికాడు. తాను పరలోకంనుంచి వచ్చాననీ, అక్కడికే వెళ్తున్నాననీ, పాపులకోసం తన మరణం తన ఓటమి కాదు గాని విజయమనీ తెలిసిన వ్యక్తి మాటలు ఇవి. దుర్మార్గత, అంధకారం నిండిన ఈ లోకంపై తన గెలుపుకు పునాది తన సిలువ అని ఆయన ప్రకటిస్తున్నాడు. ఫిలిప్పీ 2:8-11; కొలస్సయి 2:15 పోల్చి చూడండి.

**17:1** కుమారుడైన దేవుడు భూలోకంనుంచి మనిషిగా (1:14) పరలోకంలోని తండ్రి అయిన దేవునికి ప్రార్థన చేయడం ఇక్కడ చూస్తున్నాం. అయితే 5వ వచనాన్ని బట్టి ఆయన శాశ్వతుడైన దేవ కుమారుడుగా మాట్లాడుతున్నాడని స్పష్టంగా ఉంది. ఆయన తండ్రికి వేరుగా ఉన్న వేరొక వ్యక్తి అని ఈ ప్రార్థన అంతా తేటగా తెలియజేస్తున్నది. మత్తయి 3:16,17; ఫిలిప్పీ 2:6 కూడా చూడండి. బైబిలంతటిలోకీ ఈ ప్రార్థన అత్యంత గంభీరమైన గొప్ప అధ్యాయాల్లో ఒకటి. బహుశా ఇది అన్నిటికన్నా అసాధారణమైన ధన్యకరమైన అధ్యాయం. దేవుడూ మనుషుడూ అయి ఉన్న వ్యక్తిగానూ, దేవునికీ మనుషులకూ ఏకైక మధ్యవర్తిగానూ (1 తిమోతి 2:5), తన ప్రజల ప్రముఖయాజిగానూ (హీబ్రూ 4:14-16; 7:24,25) యేసు ఈ ప్రార్థన చేశాడు.

ఈ ప్రార్థనలో ఆయన తనగురించీ (వ 1,5), తనలో విశ్వాసుల గురించీ మాత్రమే దేవునికి విన్నపాలు చేశాడు గానీ ఇతరుల గురించి కాదు (వ 9,20). తన కోసం ఒకే ఒక సంగతి అడిగాడు.

విశ్వాసుల కోసం పాపవిముక్తి, శాశ్వత ధన్యత భద్రంగా ఉండేందుకు అవసరమైన వాటన్నిటినీ అడిగాడు. తండ్రి అయిన దేవుడు వారిని కాపాడాలనీ (11-16), పవిత్రపరచాలనీ (వ 20-23), తన మహిమను చూడగలిగేలా చివరికి వారిని పరలోకంలో చేర్చుకోవాలనీ (వ 24) ప్రార్థించాడు.

క్రీస్తు కేవలం దేవుని సంకల్పం ప్రకారం మాత్రమే ప్రార్థించేవాడు కాబట్టి తండ్రి అయిన దేవుడు తన కుమారుని కోసం ఈ విన్నపాలన్నిటి ప్రకారం చేస్తాడు (11:24; 1 యోహాను 5:14,15 చూడండి). తాను ప్రార్థనలో విశ్వాసులకోసం అడిగినవన్నీ వారివేనని వారు గ్రహించి ఆనందించాలని యేసు ప్రార్థించాడు (వ 13).

క్రొత్త ఒడంబడిక గ్రంథంలో రాసి ఉన్న ఆయన ప్రార్థనల్లో కొద్దిగా దీర్ఘమైనది ఇదొక్కటే. క్రీస్తు అన్నిటిలోకీ అతి ప్రధానంగా ప్రియంగా ఎంచినవి మాత్రమే ఈ ప్రార్థనలో కనిపిస్తున్నవి. ఈ విధంగా మనం దేవుని ప్రజలను తలుచుకుని కొంతవరకు ఏమి ప్రార్థించాలో ఇక్కడ నేర్చుకోవచ్చు (అయితే మానవ మాత్రులం కాబట్టి ఈ ప్రార్థనలో కనిపించే మాటలన్నిటినీ మనం ఉపయోగించలేము గదా). ఆయన విశ్వాసులకు కలగాలని ఆశించిన వాటన్నిటినీ మనం ఆశించాలి.

“సమయంవచ్చింది” – 7:30; 12:23. “మహిమ చేకూర్చు” – యేసు తనకోసం దేవుణ్ణి వేడుకున్న ఒకే ఒక విషయం. వ 5లో దీని భావమేమిటో మరింత వివరంగా తెలియజేశాడు. విశ్వ సృష్టికి మునుపు తనకున్న మహిమలోకి తిరిగి ప్రవేశించాలనీ, తాను ఈ లోకానికి వచ్చినప్పుడు వదులుకున్న స్థితి, ఘనత హోదాలను తిరిగి పొందాలనీ కోరాడు (ఫిలిప్పీ 2:57; 2 కొరింతు 8:9 చూడండి). మరణం తరువాత తనను సజీవంగా తిరిగి లేపి పరలోక మహిమలో దేవుని కుడివైపుకు తిరిగి హెచ్చించమనీ దేవుణ్ణి అడుగుతున్నాడు. దీన్నే మరో విధంగా చూడాలంటే మహిమ చేకూర్చడం అంటే, ఒక వ్యక్తిని ఉన్నత స్థానానికి హెచ్చించి, ఘనపరచి, గొప్పవాడిగా అందరూ గుర్తించేలా చెయ్యడం. ఆ విధంగా తన నిజ స్వభావాన్ని లోకంలోని మనుషులంతా గుర్తించేలా చెయ్యమని యేసుప్రభువు దేవుణ్ణి అడిగాడు. అంటే తాను దేవుని అవతారమనీ లోక రక్షకుడనీ వారికి తెలియజేయాలని అడిగాడు. మహిమ ఘనతలను స్వార్థం కోసం సంపాదించుకోవాలని చూచే మనసు కాదిది (ఫిలిప్పీ 2:5-7 మళ్ళీ చూడండి). తనకు మహిమ చేకూర్చవలసినదని క్రీస్తు తండ్రిని అడగడానికి చాలా ప్రముఖ్యమైన కారణాలున్నాయి.

మొదటిది అందుకు తగిన సమయం ఇప్పుడు వచ్చింది. మరుసటి రోజు ఆయన మరణించనున్నాడు. క్రీస్తు పరలోకంలో తన మహిమను వదిలి పాపులకోసం బాధలు, మరణం అనుభవించి తిరిగి మహిమలోకి ప్రవేశించాలన్నది దేవుడు నియమించిన ఏర్పాటు (లూకా 24:26).

వచ్చింది. నీ కుమారుడు నీకు మహిమ చేకూర్చేలా నీ
కుమారునికి మహిమ చేకూర్చు. 2 నీ కుమారునికి
శరీరమున్నవారందరిమీద అధికారం ఇచ్చావు. నీవు ఆయనకు
అనుగ్రహించిన వారందరికీ ఆయన శాశ్వత జీవం ఇచ్చేలా ఆ
ప్రకారం ఇచ్చావు. 3 ఏకైక సత్య దేవుడవైన నిన్నూ నీవు
పంపిన యేసు క్రీస్తునూ తెలుసుకోవడమే శాశ్వత జీవం.
4 చేయడానికి నీవు నాకు ఇచ్చిన పని పూర్తి చేసి భూమిమీద
నీకు మహిమ కలిగించాను. 5 తండ్రీ, ప్రపంచం
ఉండకముందే నీతో నాకున్న మహిమ ఇప్పుడు నీ సముఖంలో
నాకు మళ్ళీ కలిగించు.
6 "లోకంనుంచి నీవు నాకిచ్చినవారికి నీ పేరును వెల్లడి
చేశాను. పూర్వం వారు నీవారు. వారిని నాకు ఇచ్చావు. వారు నీ

---

రెండో కారణం, తండ్రికి తాను మహిమ చేకూర్చగలిగేలా తండ్రిని తనకు మహిమ చేకూర్చవలసిందని అడుగుతున్నాడు. తన సొంత మహిమను తనకోసం ఆయన కోరలేదు. తండ్రికి మహిమ చేకూర్చలేని ఎలాంటి మహిమనూ ఆయన తనకు కలగాలని ఎన్నటికీ కోరేవాడు కాదు (7:18; 8:50). తన కుమారుని శత్రువులు ఆయన్ను ఓడిస్తే, మరణం ఆయన్ను సమాధిలో బంధిస్తే అది తండ్రికి ఏమాత్రం మహిమ కలిగించదు.

మూడోదిగా, దేవుడు క్రీస్తుకిచ్చిన అధికారాన్ని ఆయన ఉపయోగించి దేవుని పని (వ 2) సాధించాలంటే తండ్రి ఆయనకు మహిమ చేకూర్చడం అవసరం. తండ్రి ఆయన్ను సజీవంగా లేపి దేవుని కుడివైపున కూర్చోబెట్టకపోతే ఇలా చేయడం సాధ్యం కాదు. అందువల్ల కేవలం తండ్రికోసం మాత్రమే గాక, విశ్వాసులందరి కోసమూ కూడా ఆయనకు మహిమ చేకూరాలని కోరాడు. దేవుని మహిమ, క్రీస్తు మహిమ, ఆయన ప్రజల మేలు – ఈ మూడూ ఒకదానికొకటి దగ్గర సంబంధం గలవి.

**17:2** "అధికారం" – 3:35; మత్తయి 28:18. ఆయనకు అధికారం ఇవ్వడంలో గల ఉద్దేశం చూడండి (విశ్వాసులకు శాశ్వత జీవాన్ని ఇవ్వడం – 3:16; 5:21;6:40). ఈ లోకంలో యేసుప్రభువుకున్న అపరిమిత అధికారం చూడండి. తండ్రి తనకు ఇచ్చినవారందరికీ శాశ్వత జీవం కలగడం అనే ఫలితాన్ని సాధించడం కోసం ఆయన ఈ లోకంలోని అన్ని దేశాల్లో, జాతులమధ్య పరిస్థితులను అనుకూలంగా మార్చగలడు. మనుషుల హృదయాల్లో మనసుల్లో పని చేయగలడు.

**17:3** "శాశ్వత జీవం" – 3:16. ఇదేమిటో యేసు చెప్పినది ఇక్కడ ఒక్క చోటే. దేవుణ్ణి తెలుసుకోవడంవల్ల కలిగే ఫలితం శాశ్వత జీవం అనలేదు ఆయన. దేవుణ్ణి తెలుసుకోవడమే శాశ్విత జీవం అన్నాడు. ఈ జ్ఞానం ఎవరిలోనూ సహజంగా లేదు (15:21; 16:3; 2 కొరింతు 4:4; ఎఫెసు 4:17,18). మనుషులకు శాశ్విత జీవాన్ని ఉచితంగా ఇవ్వడంలో యేసుప్రభువు వారికి తండ్రి అయిన దేవుణ్ణీ, తననూ తెలుసుకునేలా చేస్తున్నాడు (మత్తయి 11:27 పోల్చి చూడండి). శాశ్వత జీవమంటే కేవలం అనంతకాలం జీవించడం మాత్రమే కాదు. ఇదొక విశేషమైన జీవం – అంటే దేవునితో సహవాసం చేయడం, ఆయన్ను ఎరిగి ఉండడం, ఆయనకు విధేయత చూపుతూ, ఆయనను నమ్ముతూ, ఘనపరుస్తూ, ప్రేమిస్తూ, సేవిస్తూ ఉండడం (ప్రకటన 21:3; 22:3-5 పోల్చి చూడండి). ఇలా దేవుణ్ణి తెలుసుకోవడం అనే ఈ జ్ఞానం దేవుని నుంచి నేరుగా వచ్చేది. ఇది మనోవికాసం, జ్ఞానప్రకాశాలను కలిగించే అనుభవం (2 కొరింతు 4:6).

"ఏకైక సత్యదేవుడవైన" ఇక్కడ యేసు తనను, పవిత్రాత్మను దేవత్వంలో నుంచి వేరు చేయడం లేదు. అబద్ధ దేవుళ్ళనూ, మనుషులు చేసిన విగ్రహాలనూ మాత్రమే ఆయన వేరు చేస్తున్నాడు (కీర్తన 115:3-8; యెషయా 44:6,8; 45:18).

దేవుణ్ణి తెలుసుకోవడం ఎలా శాశ్వత జీవమో తనను తెలుసుకోవడం కూడా అలానే శాశ్వత జీవమని అనడంలోనే ఆయన తనను కూడా దేవునితో కలిపి మాట్లాడుతున్నాడు (8:19; 14:8,9 చూడండి). శాశ్వత జీవం యేసులో ఉంది (1 యోహాను 5:11). అసలు శాశ్వత జీవమంటే యేసే (11:25; 14:6; 1 యోహాను 5:20). ఈ జీవం మనకు కలగాలంటే ఆయన్ను మనం తెలుసుకోవాలి. సరైన వ్యక్తిని తెలుసుకోవడమే నిజ క్రైస్తవానికి ఆయువుపట్టు – ఎఫెసు 4:17,18; 2 పేతురు 1:3; 3:18.

యేసుప్రభువు చెప్తున్న ఈ జ్ఞానం అద్వైత వేదాంతం చెప్తున్న ఆత్మజ్ఞానం లాంటిదేదీ కాదు (15:21 మొదలైన చోట్ల నోట్స్ చూడండి). ఏకైక నిజ దేవుణ్ణి నిజంగా ఎరిగినవారు తాము కేవలం మనుషులమేనని, దేవునిచేత సృష్టించబడినవారమేననీ అన్ని విధాలా దేవునికంటే చెప్పరాని రెట్లు అల్పులమేననీ తెలుసుకుని ఉంటారు.

**17:4** క్రీస్తు ఉద్దేశం ఎప్పుడూ పరమ తండ్రికి మహిమ కలిగించడమే. దీన్ని ఆయన నెరవేర్చాడు (4:34; 7:18; 8:29).

**17:5** ప్రపంచం ఉనికిలోకి రాకముందే తానున్నానని యేసు తానే ఇక్కడ స్పష్టంగా ప్రకటిస్తున్నాడు (1:1-3; మీకా 5:2 చూడండి). క్రీస్తు తండ్రికి వేరుగా ఉన్న ఒక ప్రత్యేక వ్యక్తి అని ఇది తేటతెల్లం చేస్తున్నది కూడా.

దేవుడు తన కుమారుడు చేసిన ఈ ప్రార్థనకు జవాబిచ్చాడు. అపొకా 2:32,33; 3:13-15; ఫిలిప్పీ 2:9-11 చూడండి.

**17:6** "నీవు నాకిచ్చినవారు" – తనలో నమ్మకం ఉంచినవారి గురించి ఆయన మాట్లాడుతున్నాడు. వ 6-10లో వారి గురించి తొమ్మిది సంగతులు చెప్పాడు. వ 14,18లో మరో మూడింటిని జోడించాడు. ఈ విషయాలన్నీ విశ్వాసులందరి విషయంలోనూ నిజమే. వారి పాపం, అల్ప విశ్వాసం, అసంపూర్ణమైన విధేయత గురించి ఆయన ఇక్కడ మాట్లాడ్డం లేదు. తన ప్రజల నేరాలు తండ్రికి చెప్పడు. తండ్రి ఎదుట వారి పక్షంగా వాదిస్తాడు (రోమ్ 8:33,34; 1 యోహాను 2:1). వీలైనంతవరకు వారిని గురించి క్రీస్తు ఉన్నతమైన ఆలోచనలు కలిగి తండ్రి ఎదుట వారిని సాధ్యమైనంత ఉత్తములుగా నిలబెడతాడు.

"వారికి నీ పేరును వెల్లడి చేశాను" – 1:18; మత్తయి 11:27. అంటే దేవుని స్వభావాన్నీ ఆయన లక్షణాలనూ పూర్తిగా తెలియజేశాడు. నిర్గమ 34:6,7 చూడండి. దేవుడు ఎలాంటివాడో కేవలం మాటలతో గాక చేతలతో జీవితం ద్వారా యేసుప్రభువు వారికి వెల్లడి చేశాడు. దేవుడు ఈ లోకంలో నుంచి వారిని ఎన్నుకున్నాడు. విశ్వాసులు స్వభావ సిద్ధంగా ఇతరులకన్న మంచివారేమీ కాదు. వారందరూ భ్రష్ట మానవజాతికి చెందినవారే. దేవుడు వారిని ఎన్నుకునేందుకు వారిలో మంచి గానీ పవిత్రత గానీ ఏమీ లేదు (రోమ్ 3:9,19; ఎఫెసు 2:1-3). కానీ దేవుడు వారిని ఈ లోకం విడిచి క్రీస్తు వెంట రమ్మని పిలిచాడు (గలతీ 1:3). వారు ఇక ఈ లోకానికి చెందినవారు కాదు (వ 14; ఫిలిప్పీ 3:20). మొదట వారు తండ్రి అయిన దేవునికి చెందినవారు.

ఒక విధంగా చూస్తే దేవుడు అందరినీ సృష్టించినందువల్ల మనుషులంతా ఆయనకు చెందినవారే (యెహెజ్కేలు 18:4). కానీ విశ్వాసులు ఒక ప్రత్యేకమైన రీతిలో దేవుని సొత్తు – అపొకా 18:10; 1 కొరింతు 6:19,20; ఎఫెసు 1:4;

వాక్కును పాటించారు. 7 నీవు నాకిచ్చిన మాటలు
వారికిచ్చాను. వారు వాటిని అంగీకరించారు, నేను నీ
దగ్గరనుంచి వచ్చానని వారు రూఢిగా తెలుసుకొన్నారు, నీవు
నన్ను పంపావని నమ్ముకొన్నారు, 8 కాబట్టి నీవు నాకిచ్చినవన్నీ
నీనుంచి వచ్చినవని ఇప్పుడు వారికి తెలుసు.
9 "వీరికోసం ప్రార్థన చేస్తూ ఉన్నాను. లోకం కోసం నేను
ప్రార్థన చేయడం లేదు. నీవు నాకు ఇచ్చినవారు నీవారే గనుక
వారికోసమే ప్రార్థన చేస్తూ ఉన్నాను. 10 నావన్నీ నీవి, నీవన్నీ
నావి. వీరిమూలంగా నాకు మహిమ కలిగింది. 11 ఇకమీదట
నేను లోకంలో ఉండను గానీ వీరు లోకంలో ఉన్నారు. నేను నీ
దగ్గరకు వస్తున్నాను. పవిత్రుడవైన తండ్రీ, మనం ఒక్కటిగా
ఉన్నట్టే నీవు నాకిచ్చినవారు ఒక్కటిగా ఉండేలా నీ పేర
వారిని కాపాడు. 12 నేను లోకంలో వారితో ఉన్నప్పుడు నీ
పేర వారిని కాపాడాను. నీవు నాకిచ్చినవారిని నేను

1 పేతురు 1:2 (నిర్గమ 19:4-6; ద్వితీ 7:6 పోల్చి చూడండి). లోకం ఉనికిలోకి రాకమునుపు ఆయన వారిని ఎన్నుకున్నాడు. దేవుడు వారందరినీ యేసుప్రభువుకు ఇచ్చాడు. విశ్వాసులు దేవుడు తన కుమారునికి ఇచ్చిన ప్రేమ బహుమతి. ఆయన తనతో ఉంచుకుంటూ, చూస్తూ, ఆనందిస్తూ ఉండడానికి దేవుడిచ్చిన విశేషమైన నిధి.

అలాంటప్పుడు వారిలో ప్రతి ఒక్కరూ క్షేమంగా పరలోకంలో చేరేవరకు వారిని జాగ్రత్తగా సంరక్షించడా? అవును. సంరక్షిస్తాడు – వ 11,12; 10:28 చూడండి.

విశ్వాసులు దేవుని వాక్కుకు "విధేయులయ్యారు" అంటున్నాడు క్రీస్తు. అక్షరాలా దేవుని మాటలు అయిన క్రీస్తు మాటను వారు విన్నారు. ఆయనకు లోబడ్డారు. వారు లోపం లేనివారు కారు. లోపం లేకుండా దేవుని వాక్కుకు విధేయత చూపలేదు. కానీ వారి కోరిక, జీవితాశయం పూర్తిగా విధేయత చూపడమే. క్రీస్తు వారి తప్పులను పట్టించుకోకుండా వారు "విధేయులయ్యారు" అంటున్నాడు. విశ్వాసులందరి విషయంలోనూ ఇది నిజమే. విశ్వాసులమని చెప్పుకొని కనీసం కొన్ని ముఖ్యమైన విషయాల్లోనైనా దేవుని వాక్కుకు లోబడని వారి సంగతేమిటి? వారు నిజ విశ్వాసులు కారు (8:31,47; 10:26,27; మత్తయి 7:21; 1 యోహాను 2:3,4).

**17:7,8** విశ్వాసులందరి గురించి ఈ రెండు వచనాలు మరి కొన్ని విషయాలను వెల్లడిస్తున్నాయి. కొన్ని సత్యాలను వారు గ్రహిస్తారు, స్వీకరిస్తారు, నమ్ముతారు. దేవుడు యేసును పంపాడనీ, యేసు చేసినవీ చెప్పినవీ అన్నీ దేవుని మూలంగానేననీ వారికి తెలుసు. క్రీస్తు చెప్పిన మాటలు పరమ తండ్రినుంచి వచ్చాయని వారు వాటిని సంతోషంతో అంగీకరిస్తారు. తాము నమ్మినవన్నీ యేసుక్రీస్తు తిరుగులేని అధికారాన్ని బట్టి నమ్ముతారు. వాటన్నిటికీ మార్పు చెందని ఆధారం ఆయనే అని వారికి తెలుసు.

**17:9** విశ్వాసుల గురించి ఇక్కడ చెప్పిన సత్యాలలో ఏడోది – క్రీస్తు వారిని తన ప్రత్యేక ప్రార్థన అంశంగా చేసుకుంటాడు. వారికోసం ప్రార్థించిన రీతిలో అవిశ్వాసులకోసం ప్రార్థించలేడు, ప్రార్థించడు.

**17:10** విశ్వాసుల గురించిన ఎనిమిదో సత్యం ఇది. వారిద్వారా క్రీస్తుకు మహిమ చేకూరుతుంది. ఆయన ప్రేమ, కరుణలకు ఆయన వారికోసం మరణించడం మూలంగా మహిమ కలుగుతుంది. వారికి పాపవిముక్తి ప్రసాదించి వారిని మార్చడంలో ఆయన ప్రభావం, కృపలకు మహిమ కలుగుతుంది. వారి బలహీనతలను సహించి ఊరుకోవడంలో ఆయన సహనానికి మహిమ చేకూరుతుంది. లోకానికి వారు చెప్తున్న సాక్ష్యంలో ఆయన పేరుకు మహిమ చేకూరుతుంది. వారిలో బలహీనత, భ్రష్ట స్వభావం ఉన్నాయి. అయినప్పటికీ క్రీస్తుకు వారి మూలంగా మహిమ కలుగుతుంది. వారిని ఎన్నుకోవడంలో దేవునికి ఉన్న గొప్ప ఉద్దేశాల్లో ఇది ఒకటి – ఎఫెసు 1:5,6,12. విశ్వాసుల మూలంగా తండ్రికి, కుమారునికి కూడా మహిమ చేకూరుతుంది.

మనం ఈ సత్యాన్ని మనసులో పెట్టుకుని అన్నిటిలోనూ వారిద్దరికీ మహిమ కలిగేందుకు సంతోషంతో పూనుకోవాలి (1 కొరింతు 10:31).

**17:11** దేవుడు యేసుకు తన సొంత "పేరును" ఇచ్చాడు (5:26,27 పోల్చి చూడండి). దేవుడు తన స్వభావం, అధికారం, ప్రభావం యేసుక్రీస్తుయొక్క మానవ దేహంలో ఉండేలా దయచేశాడు (కొలస్సయి 2:9).

ఈ వచనంలో యేసు విశ్వాసుల కోసం చేసిన మొదటి విన్నపం కనిపిస్తున్నది. వ 15లో దీన్నే వేరే మాటల్లో మళ్ళీ చెప్పాడు. వారు యూదా ఇస్కరియోతులాగా నశించిపోకుండా (వ 12) దేవుడు వారిని కాపాడాలనీ, దుర్మార్గతనుంచి సంరక్షించాలనీ ఆయన్ను వేడుకుంటున్నాడు. దేవుడు విశ్వాసులను కాపాడుతూ ఉండవలసిన కారణం ఒకటి ఇక్కడ కనిపిస్తున్నది. వారింకా "లోకంలో ఉన్నారు". దేవుడు వారిని లోకంనుంచి ఎన్నుకున్నాడు (వ 6). వారు లోకానికి చెందినవారు కాదు (వ 4), కానీ వారు ఇంకా లోకంలోనే ఉన్నారు. లోకం వారినింకా ద్వేషిస్తూ ఉంది. (వ 14). లోకంనిండా విషమ పరీక్షలు, దుష్ప్రేరేపణలు, మోసపుచ్చే ఆత్మలు, అపాయాలు (1 పేతురు 5:8) ఉన్నాయి. లోకం సత్యానికీ, నమ్మకానికీ, దేవుణ్ణి ప్రేమించడానికీ, విశ్వాసికి అమూల్యమైన వాటన్నిటికీ విరోధి. 1 యోహాను 5:19 చూడండి. ఆధ్యాత్మికంగా చూస్తే అది చీకటితో, మురికితో నిండిన ప్రదేశం. దాన్లో మనం అశుద్ధమైపోవడం, దారి తప్పడం తేలిక. విశ్వాసులైతే తరచుగా బలహీనులుగా, తెలివితక్కువవారుగా ఉండి తమ భ్రష్ట స్వభావాలతో పెనుగులాడుతూ ఉంటారు (రోమ్ 7:18; గలతీ 5:17; 1 యోహాను 1:8) – వారిని లోకానికీ సైతానుకూ పట్టియివ్వబూనుకునేదేదో వారిలోనే ఉంది (రోమ్ 7:23).

ఇలాంటప్పుడు విశ్వాసులు భద్రంగా ఎలా ఉండగలుగుతారు? తన కుమారుని ప్రార్థనలకు జవాబుగా దేవుడు వారిని కాపాడుతాడు కాబట్టి వారికి పూర్తి భద్రత ఉంది. లూకా 22:31; రోమ్ 5:10; హీబ్రూ 7:25 చూడండి. ఆయన సర్వశక్తి వారి పక్షంగా పని చేస్తున్నది – 1 పేతురు 1:4,5; సామెత 18:10. ఆయన వారిలో మంచి పని ఆరంభించాడు. దాన్ని ఆయనే సమాప్తం చేస్తాడు – ఫిలిప్పీ 1:6. విశ్వాసులను భద్రంగా ఉంచడంలో కుమారుడైన యేసు పరమ తండ్రితో కలిసి పని చేస్తున్నాడు. యేసుప్రభువు వారిని భద్రంగా తనతో ఉంచుకోవాలన్నది దేవుని తిరుగులేని సంకల్పం (6:39). ఈ విషయంలో దేవుని సంకల్పాన్ని యేసు నెరవేర్చకుండా ఉంటాడా? 4:34 పోల్చి చూడండి. విశ్వాసులు ఆయన సంరక్షణలో ఉన్న గొర్రెలు. ఆయన వారిని కాపాడకుండా ఉంటాడా? 10:28 చూడండి. ఆయన వారికోసం అస్తమానం ప్రార్థిస్తూ ఉన్నాడు. ఆయన ప్రార్థనలను దేవుడు వినడా? 11:42 చూడండి.

క్రీస్తు ప్రార్థనలకు దేవుడు జవాబియ్యడమన్నది విశ్వాసుల మంచి ప్రవర్తనపై ఆధారపడదు. వారి మంచి ప్రవర్తన, విశ్వాసంలో కొనసాగడం అన్నది ఆయన ప్రార్థనలపై ఆధారపడి ఉంది.

**17:12** ఈ భూమిపై ఉన్నప్పుడు యేసుప్రభువు తన

కాపాడాను. వారిలో ఎవరూ నశించలేదు. అయితే లేఖనం నెరవేరేందుకు నాశనానికి తగినవాడే నశించాడు.

13 "ఇప్పుడు నీ దగ్గరకు వస్తున్నాను. వీరిలో నా ఆనందం పూర్తిగా ఉండాలని ఈ మాటలు లోకంలో చెపుతున్నాను. 14 నేను నీ వాక్కు వారికిచ్చాను. నేను లోకానికి చెందినవాణ్ణి కానట్టే వారు లోకానికి చెందినవారు కారు. అందువల్ల వారంటే లోకానికి ద్వేషం. 15 లోకంనుంచి వీరిని తీసుకుపొమ్మని నేను నిన్ను అడగడం లేదు గానీ దుర్మార్గుడినుంచి వారిని కాపాడాలని అడుగుతున్నాను. 16 నేను లోకానికి చెందినవాణ్ణి కానట్టే వారు లోకానికి చెందిన వారు కారు. 17 నీ సత్యంచేత వారిని ప్రత్యేకించు. నీ వాక్కే సత్యం. 18 నీవు నన్ను లోకంలోకి పంపినట్టు నేను వారిని లోకంలోకి పంపాను. 19 వారు కూడా సత్యంలో ప్రత్యేకమైనవారు కావాలని నన్ను నేను ప్రత్యేకించు కొంటున్నాను.

---

విశ్వాసులందరినీ భద్రంగా కాపాడాడు. ఆయన వారిని బలహీనతనుంచి బుద్ధి హీనతనుంచి, చెడు విషయాల గురించిన ప్రేరేపణలు, విషమ పరీక్షలనుంచీ, ఆ మాట కొస్తే పాపం చేయడానికి అవకాశాలన్నిటి నుంచీ వారిని రక్షించలేదు (18:10,11; 19:25; లూకా 22:24,31,32; 24:25; మత్తయి 16:22,23; 26:69-75). వారు ఘోరమైన తప్పుల్లో పడుతూ ఉన్నప్పటికీ యేసు వారిని కాపాడుతున్నాడు. అంటే వారు పాపం చేసినా కూడా ఆయన వారిని రక్షణ స్థితిలో, ముక్తిమార్గంలో ఉంచుతూ వచ్చాడు. వారిలో బలహీనమైన నమ్మకం, అప్పుడప్పుడూ అపనమ్మకం ఉన్నా కూడా తనపై నమ్మకం చెదరకుండా ఉన్న స్థితిలోనే ఉంచాడు. యేసు తాను వారిని కాపాడిన విధంగానే కాపాడవలసిందని దేవుణ్ణి అడుగుతున్నాడు.

యూదా ఇస్కరియోతును ("నాశనానికి తగినవాడే") కాపాడలేకపోయాడా? విశ్వాసులను కాపాడ్డంలో ఒక్క యూదాను ఆయన మినహాయించాడా? అతణ్ణి విశ్వాసంలో ఉంచలేక పోయాడా? అలా కాదు. యూదాలో నిజమైన విశ్వాసం ఎప్పుడూ లేదు. దేవుడు యూదాకు పాపవిముక్తి కలిగించి అతన్ని తనకు ఇచ్చాడనీ, తాను యూదాను పోగొట్టుకున్నాననీ యేసు అనడం లేదు. వ 6-10లో నిజ విశ్వాసుల వర్ణన చూడండి. యేసుకు దేవుడిచ్చిన వారు ఎలాంటివారో చూడండి. యూదాకు ఆ వర్ణన సరిపోవడం లేదు. మొదటినుంచి కూడా యూదా గుణాలు అతణ్ణి నాశనానికి పాత్రుడుగా చేశాయి. 6:70 చూడండి. అతడొక సారి పాపవిముక్తి పొంది రక్షించబడిన తరువాత తప్పిపోయినవాడు కాదు. అందరిలోకి ఘోరమైన పాపిగా మారిపోయిన నిజ విశ్వాసి కాదు. అతడు ఎప్పుడైనా నిజ విశ్వాసిగా ఉన్నాడనడానికి ఏ ఆధారమూ లేదు. విశ్వాసులమని చెప్పుకునే వారందరినీ, విశ్వాసుల్లాగా కనిపించే వారందర్నీ యేసు కాపాడడు. నిజంగా విశ్వాసులైనవారినే కాపాడుతాడు.

"నెరవేరేందుకు" – 13:18; కీర్తన 41:9; 109:4-13; జెకర్యా 11:12,13.

**17:13** "ఆనందం" – 15:11; లూకా 10:21. యేసు చేసిన ఈ ప్రార్థనను సరిగా అర్థం చేసుకొగలిగితే విశ్వాసుల హృదయాలకు ఇదెంతో ఆనందం కలిగిస్తుంది. పౌలు 2 తిమోతి 1:12; 4:18లో చెప్పిన ఆనందం, నిబ్బరం మనకు కూడా ఉండాలి.

**17:14** 15:18,19. యేసుప్రభువు, ఆయన విశ్వాసులు కూడా దేవుని రాజ్యానికీ పరలోకానికీ చెందినవారే గానీ ఈ లోకానికి చెందినవారు కాదు.

**17:15** విశ్వాసులను లోకంలోనే ఉంచాలని ఎందుకు అడుగుతున్నాడు? వ 18; 15:27; 2 కొరింతు 4:17; 1 పేతురు 1:7; 2:9 చూడండి.

"కాపాడుమని" – వ11.

**17:17-19** యేసుప్రభువు విశ్వాసుల కోసం చేస్తున్న రెండో విన్నపం. "ప్రత్యేకించు" అని తర్జుమా చేసిన గ్రీకు పదానికి చాలా విస్తారమైన అర్థం ఉంది. దీన్ని పవిత్రపరచు అని కూడా అనువదించవచ్చు. సాధారణంగా మంచి ఉద్దేశం కోసం, లేక మత కర్మల కోసం వేరు చేయడం అని దీనికి అర్థం. పాత ఒడంబడిక గ్రంథంలో పవిత్రంగా చేయడం, ప్రత్యేకించడం అని తర్జుమా చేసిన హీబ్రూ పదం లాంటిదే ఇది కూడా (లేవీ 20:7 నోట్ చూడండి). దీనికి ప్రతిష్ఠించడం, అంకితం చేయడం అనీ, శుద్ధం చేయడం అని కూడా అర్థాలు స్థిరపడ్డాయి. యేసు ఏ భావంతో ఇక్కడ ఈ పదం వాడాడు? ఈ భావాలన్నీ ఆయన మనస్సులో ఉండి ఉండవచ్చు. కానీ బహుశా విశ్వాసుల కోసం చేసిన ఈ ప్రార్థనకు ముఖ్యమైన అర్థం దేవుడు వారిని ప్రతిష్ఠించుకోవాలనీ, తనకోసం, ఈ భూమిపై తన పనికోసం ప్రత్యేకపరచాలనీ కావచ్చు. వ 19లో ఈ అర్థం స్పష్టంగా కనిపిస్తున్నది (10:36 కూడా చూడండి). యేసును శుద్ధీకరించి, పవిత్రపరచవలసిన అవసరత లేదు గాని ఈ లోకంలో దేవుని సంకల్పం ప్రకారం చేసేందుకు తనను తాను ప్రతిష్ఠించు కున్నాడు. ఇదే రీతిలో దేవుడు విశ్వాసులను ప్రత్యేకించి ప్రతిష్ఠించాలని ప్రార్థించాడు. 13:10; 15:3లోని మాటలు చూడండి – యేసు తన శిష్యులకోసం ఇలా ప్రార్థించకముందే వారు శుద్ధులు. విశ్వాసులు దేవుని సంకల్పం ప్రకారం చేసేందుకు సంసిద్ధుల్ని చెయ్యాలంటే వారి ఆలోచనల్లో, ఉద్దేశాల్లో శుద్ధీకరణ జరగాలన్నది నిజమే. కనక ఈ విషయం కూడా వారికి జరగాలని యేసు ఈ ప్రార్థనలో అడిగాడేమో. అయితే దీని ప్రధానమైన భావం ఇదే అనిపిస్తున్నది – తన సంఘం మొత్తాన్ని, అంటే తాను శిరస్సు అయి ఉన్న విశ్వాసుల గుంపంతటినీ (ఎఫెసు 1:22; 4:15; 5:23; కొలస్సయి 1:18) దేవుని పవిత్ర ప్రజగా (1 పేతురు 2:9) ఆయన ప్రత్యేకించాలి. 17-19 వచనాల్లో ఈ ప్రత్యేకత గురించి ఏడు విషయాలు మనం నేర్చుకోవచ్చు.

మొదటిది, అది క్రీస్తు ప్రార్థనకు జవాబుగా దేవుడు చేసే పని. అందువల్ల మరి తిరుగులేకుండా ఆయన దాన్ని జరిగిస్తాడు (11:42).

రెండోది, తన పిల్లల్లో కొందరి విషయంలో క్రీస్తు చేసిన ఈ ప్రార్థనను దేవుడు వింటే అందరి విషయంలోనూ ఆయన దాన్ని వింటాడు. కొందరి విషయంలో జవాబిచ్చి వారిని ప్రత్యేకించితే అందరినీ అలా ప్రత్యేకిస్తాడు.

మూడోది, విశ్వాసులను ప్రత్యేకించడం క్రీస్తు తనను తాను ప్రత్యేకించుకొన్నదాని ఫలితం (వ 19). పాపాన్ని తీసివేసే అర్పణగా క్రీస్తు తనను ప్రత్యేకించుకున్నాడు (1:29). దాని మూలంగా విశ్వాసులు ప్రత్యేకించబడ్డారు, ఇతరులందరినుంచీ వేరై దేవునికి ప్రత్యేక ప్రజ అయ్యారు – హీబ్రూ 10:10; 13:12. పాత ఒడంబడిక ఉదాహరణ కోసం లేవీ 8:10-15,30 చూడండి.

నాలుగోది, విశ్వాసులను ప్రత్యేకించడం యేసు ప్రత్యేకించు కోవడం వంటిదే (వ 19). యేసు తనను ఎప్పుడు ప్రత్యేకించు కొన్నాడు? 10:36-38; హీబ్రూ 10:5-7 చూడండి. విశ్వాసులు ఎప్పుడు ప్రత్యేకించబడ్డారు? భూమిపై దేవుని ఆలయంగా మారేందుకు నమ్మకంద్వారా క్రీస్తుతో ఐక్యమైనప్పుడు (ఎఫెసు 2:21; 1 కొరింతు 3:16).

ఐదోది, విశ్వాసులను ప్రత్యేకించడానికీ, ఈ లోకంలో

20 “నేను ప్రార్థన చేస్తున్నది వీరికోసం మాత్రమే కాదు గాని వీరి మాటల మూలంగా నామీద నమ్మకం ఉంచబోయేవారి కోసం కూడా. 21 వారందరూ ఒక్కటిగా ఉండాలని నా ప్రార్థన. తండ్రీ, నీవు నన్ను పంపావని లోకం నమ్మేలా నేను నీలో, నీవు నాలో ఉన్న విధంగా వారు మాలో ఒక్కటిగా ఉండాలని ప్రార్థిస్తున్నాను. 22 మనము ఒక్కటిగా ఉన్నట్టే వారు ఒక్కటిగా ఉండేందుకు నీవు నాకిచ్చిన మహిమ వారికిచ్చాను. 23 నీవు నన్ను పంపావనీ నన్ను ప్రేమించినట్టే వారిని ప్రేమించావనీ లోకం తెలుసుకోవాలి గనుక వారిలో నేను, నాలో నీవు ఉండడంవల్ల వారు సంపూర్ణంగా ఒక్కటి

క్రీస్తుసంఘం పనికీ సంబంధం ఉంది (వ 18; 20:21). వారిని లోకంలోనుంచి పిలవడం జరిగింది. (వ 6). వారు లోకానికి చెందినవారు కారు (వ 14). కానీ దేవుడు వారిని ప్రత్యేకించి తిరిగి లోకంలోకి పంపుతాడు.

ఆరోది, విశ్వాసులను దేవుడు ప్రత్యేకించడం సత్యంలో (లేక సత్యం వల్ల. ఇక్కడున్న గ్రీకు పదానికి ఈ రెండు భావాలూ ఉన్నాయి). సత్యం అంటే ఏమిటో ఇక్కడ గమనించండి. అది దేవుని వాక్కు. దేవుని వాక్కు ఎక్కడుంటుంది? బైబిల్లో మాత్రమే. దేవుడు విశ్వాసులను ప్రత్యేకించేందుకు వాడే సాధనం సత్యం, వారు ఉంటున్న నివాసం సత్యం. మన అంతరంగంలో క్రీస్తు కోరుతున్న శుద్ధత, పవిత్రత గురించి నోట్స్ కోసం మత్తయి 5:8; రోమ్ 6:11-14; 8:12,13; 2 కొరింతు 7:1; ఎఫెసు 4:22-24; 5:3-7; హీబ్రూ 12:14; 1 పేతురు 1:14-16,22; 1 యోహాను 3:3 చూడండి.

ఏడోది, క్రీస్తు తన విశ్వాసులకు జరగాలని ప్రార్థించిన ఈ ప్రత్యేకత అత్యంత అవసరం. అలా కాకపోతే క్రీస్తు ఈ విధంగా ప్రార్థించేవాడు కాదు. విశ్వాసులకు ఏది అవసరమని దేవుడు నియమించాడో వాటికోసమే ఆయన ప్రార్థించాడు.

**17:20** అన్ని తరాలలో విశ్వాసులందరి కోసమూ యేసుప్రభువు ముందుగానే ప్రార్థించాడు. అప్పట్లో తన శిష్యులకు ఏది ఉండాలని ఆశించాడో ఇప్పుడున్న మనకూ అదే ఉండాలని ఆయన కోరిక.

**17:21-23** వ 11. నిజ విశ్వాసులందరి గురించి ఆయన చేసిన మూడో విన్నపం – ఐక్యత. వ 20-23లో దీన్ని గురించి ఈ క్రింది సంగతులను మనం నేర్చుకోవచ్చు.

మొదటిది, ఇది క్రీస్తు ప్రార్థనకు జవాబుగా దేవుడు ఇచ్చేది (11:42). ఇది మనుషులు చేకూర్చేది కాదు. క్రైస్తవ సంఘాల నాయకులు కలిసి స్థాపించగలది కాదు. అలా చెయ్యాలని ఆ నాయకులకు క్రీస్తు చెప్పలేదు.

రెండోది, ఇది ఒకే కోవకు చెందినవారి ఐక్యత మాత్రమే. వ 6-10లో వర్ణించబడిన నిజ విశ్వాసులకే ఈ ఐక్యత ఉందన్నమాట. ప్రతి దేశంలోనూ క్రైస్తవ సంఘాల్లో ఉండే నామకార్థ క్రైస్తవుల సమూహాలన్నిటినీ కలిపి మనుషులు సమకూర్చే సంస్థాగతమైన ఐక్యత కాదు.

మూడోది, విశ్వాసులు ఏ తరంలో జీవించినవారైనా, ఏ సంఘానికి చెందినవారైనా, ఏ దేశానికి ఏ జాతికి చెందిన వారైనా వారందరినీ ఒకటి చేసే ఐక్యత ఇది (వ 21 – “వారందరూ”).

నాలుగోది, కొన్ని విషయాల్లో తండ్రి అయిన దేవునికీ కుమారునికీ ఉన్న ఐక్యత లాంటిదే ఈ ఐక్యత (వ 21). అంటే అది పరిపూర్ణమైన ఐక్యం, జీవంలో, స్వభావంలో ఏకత్వం.

ఐదోది, ఈ ఐక్యత నిజానికి తండ్రిలోనూ, కుమారునిలోనూ ఉంది. ఇది సంస్థాగతమైన ఐక్యతకు పూర్తిగా భిన్నమైనది. దానికంటే అంతు లేనంత ఉత్తమమైనది. దేవుడు క్రీస్తులో, క్రీస్తు దేవునిలో ఉన్నట్టు విశ్వాసులంతా వీరిద్దరిలో ఉన్నారు (వ 21. 1 తెస్స 1:1; రోమ్ 6:5 చూడండి). క్రీస్తు ఇక్కడ ప్రార్థించిన ఐక్యత ఈ ఐక్యత మాత్రమే.

ఆరోది, క్రీస్తు తన విశ్వాసుల్లో ఉన్నాడు కాబట్టే ఈ ఐక్యత ఉంటుంది (వ 23). విశ్వాసులు అనంత కాలం ఆయనతో, ఒకరితో ఒకరు ఏకమై ఉంటారు. ఆయన వారిలో లేకపోతే ఆయన ప్రార్థించిన ఐక్యతను సాధించేందుకు మనుషులేమీ చేయలేరు.

ఏడోది, ఈ ఐక్యత లోపరహితమైనది, పరిపూర్ణమైనది (వ 22).

ఎనిమిదోది, క్రీస్తు విశ్వాసులకు ఇచ్చిన మహిమతో ఇది ముడిపడి ఉంది (వ 22). ఈ మహిమ ఏమిటో ఆయన వివరించలేదు గాని దేవుని పిల్లలుగా భూమిపై ఆయన ప్రతినిధులుగా ఉండగలిగిన ఘనత కావచ్చు. లేదా, మహిమ పొందిన క్రీస్తులో వారు ఉండడం కారణంగా వారికి కలిగిన ఘనత కావచ్చు (వ 1,5. ఎఫెసు 2:5,6; కొలస్సయి 3:3,4 చూడండి). విశ్వాసులకు తనలో మహిమ కలిగించాలని వారిని క్రీస్తు ఎన్నుకొన్నాడు. ఈ సత్యమే వారు ఒక్కటిగా అయ్యేలా సాధ్యం చేసింది. క్రీస్తు చేసిన ఈ ప్రార్థనకు దేవుని జవాబు కోసం 1 కొరింతు 12:12,13 చూడండి. (1 కొరింతు 6:15,17; రోమ్ 12:5; ఎఫెసు 1:22; 4:15,16; 5:29-32 కూడా చూడండి). పవిత్రాత్మ వచ్చి విశ్వాసులందరినీ క్రీస్తు ఆధ్యాత్మిక దేహంలోకి బాప్తిసమిచ్చి, ఆయనతో వారందరిని ఐక్యత గలవారుగా చేశాడు. ఒక వ్యక్తి క్రీస్తుపై నమ్మకం పెట్టినప్పుడు క్రీస్తు చేసిన ఈ ప్రార్థనకు జవాబు మళ్ళీ వస్తుంది. పవిత్రాత్మ ప్రతి విశ్వాసినీ ఇప్పటికీ క్రీస్తుతో, సజీవ దేవుని నిజ సంఘమనే క్రీస్తుశరీరంతో ఐక్యపరుస్తూ ఉన్నాడు. ఈ ఐక్యతను మనుషులు గుర్తించగలరు గానీ సృష్టించలేరు, మెరుగుపరచలేరు, చెడగొట్టలేరు, నాశనం చేయలేరు.

తొమ్మిదోది, ఈ ఐక్యత కొన్ని ఫలితాలను చూపుతుంది (వ 21,23). “లోకం నమ్మేలా”, “తెలుసుకోవాలి” – దేవుడు అంతకు ముందు విశ్వాసుల విషయంలో సృష్టించిన ఐక్యత ఫలితం ఇది కాదనీ, దీని కోసం వేరే రకమైన ఐక్యత అవసరమనీ అనేకమంది అభిప్రాయపడ్డారు. ప్రపంచ క్రైస్తవులంతా (వారు విశ్వాసులైనా అవిశ్వాసులైనా) ఒకే క్రైస్తవ సంఘ సంస్థలో బహిరంగ ఐక్యం కావడం అవసరమని వారి ఉద్దేశం. కానీ ఇలా జరిగితే దేవుడు క్రీస్తును పంపాడని లోకం నమ్ముతుందని అనుకోవడానికి సరైన కారణం ఏదీ లేదు. అయితే క్రీస్తు చేసిన ఈ ప్రార్థన ఫలితం అంతరంగ ఐక్యం. ఆయన ఈ మాటలు పలికినప్పుడు ఇస్రాయేల్ తప్ప బయటి ప్రపంచం ఆయన్ను గురించి విన్నది చాలా తక్కువ. ఒక్క తరంలో ఆయన శిష్యులు రోమ్ సామ్రాజ్యమంతటా, ఇంకా ప్రపంచంలో ఇతర దేశాల్లో శుభవార్త ప్రచారం చేశారు. క్రీస్తును నమ్మిన మనుషులు గొప్ప సమూహాలుగా ఉన్నారు. సత్యాన్ని బోధించడానికి క్రీస్తు ప్రజలు కలిసి నిలిచిన చోటెల్లా ఈ రోజుకూ ఇది కొనసాగుతూనే ఉంది. ఇది ఇంకా ముగిసిపోలేదు. ఆయన రెండో రాకడ సమయంలో లోకానికి తెలియాలని ఆయన అనుకున్నదంతా పూర్తిగా వెల్లడి అవుతుంది.

పదోది, విశ్వాసులు తమకున్న ఈ ఐక్యతను గుర్తించి దాన్ని ప్రదర్శించాలి. ఈ సత్యం ఇక్కడ చూచాయగా మాత్రమే కనిపిస్తున్నది గాని వేరే చోట్ల మరింత స్పష్టంగా నేర్పించడం జరిగింది – ఎఫెసు 4:1-6 చూడండి. అపొ కా 4:32; 1 కొరింతు 1:10-12; 3:1-4; 12:12-27 కూడా చూడండి.

**17:23** దేవుడు తన కుమారుడైన యేసుక్రీస్తును

కావాలని ఆ మహిమ వారికిచ్చాను. 24 తండ్రీ, నీవు నాకు ఇచ్చినవారు నీవు నాకిచ్చిన మహిమను చూచేలా నేను ఎక్కడ ఉంటానో వారు నాతో అక్కడే ఉండాలని నా కోరిక. ఎందుకంటే, జగత్తు పునాదికి మునుపే నీవు నన్ను ప్రేమించావు.

25 "న్యాయవంతుడవైన తండ్రీ, లోకం నిన్ను తెలుసుకోలేదు, గానీ నీవు నాకు తెలుసు. నీవు నన్ను పంపావని వీరు తెలుసుకొన్నారు. 26 నామీద నీకు ఉన్న ప్రేమ వారిలో ఉండాలనీ నేను కూడా వారిలో ఉండాలనీ నీ పేరును వారికి తెలియజేశాను, ఇంకా తెలియజేస్తాను."

**18** యేసు ఈ మాటలు చెప్పిన తరువాత తన శిష్యులతో కూడా కెద్రోను లోయ దాటివెళ్ళాడు. అక్కడ ఒక తోట ఉంది. ఆయన, ఆయన శిష్యులు దానిలోకి వెళ్ళారు. 2 యేసు ఆయన శిష్యులను తరచుగా అక్కడ కలుసుకొనేవాడు గనుక ఆయనను శత్రువులకు పట్టి ఇచ్చే యూదాకు ఆ స్థలం తెలుసు.

3 అప్పుడు యూదా, సైనికుల గుంపునూ ప్రధాన యాజులూ పరిసయ్యులూ పంపిన దేవాలయ ఉద్యోగులనూ కొందరిని అక్కడికి తీసుకువచ్చాడు. వారికి దివిటీలతో, దీపాలతో, ఆయుధాలు ఉన్నాయి. 4 తనమీదికి జరగబోయేది అంతా తెలిసి యేసు ముందుకు వెళ్ళి "మీరు వెదకుతున్నది ఎవరిని?" అని వారితో అన్నాడు.

5 "నజరేతువాడైన యేసును" అని వారు ఆయనకు జవాబిచ్చారు.

యేసు వారితో "నేనే ఆయనను" అన్నాడు.

ఆయనను పట్టి ఇచ్చే యూదా వారి మధ్య నిలబడి ఉన్నాడు. 6 యేసు "నేనే ఆయనను" అనగానే వారు వెనక్కు తగ్గి నేలమీద పడిపోయారు.

7 "మీరు వెదకుతున్నది ఎవరిని?" అని ఆయన వారిని మళ్ళీ అడిగాడు.

వారు "నజరేతువాడైన యేసును" అన్నారు.

8 "నేనే ఆయనని మీకు చెప్పాను గదా. నన్నే గనుక మీరు వెదకుతూ ఉంటే వీరిని వెళ్ళిపోనియ్యండి" అని యేసు బదులు చెప్పాడు. 9 నీవు నాకు ఇచ్చిన వారిలో నేను ఎవరినీ పోగొట్టుకోలేదు అని ఆయన చెప్పిన మాట నెరవేరేందుకు అలా అన్నాడు.

10 సీమోను పేతురు దగ్గర ఖడ్గం ఉంది. దానిని ఒరనుంచి దూసి అతడు ప్రముఖయాజి సేవకుణ్ణి కొట్టి అతడి కుడిచెవి తెగనరికాడు (ఆ సేవకుడి పేరు మల్కు).

11 "ఖడ్గం ఒరలో పెట్టు. తండ్రి నాకు ఇచ్చిన గిన్నెలోది నేను త్రాగనా?" అని యేసు పేతురుతో చెప్పాడు.

---

ప్రేమించినంతగా విశ్వాసులను కూడా ప్రేమిస్తున్నాడు! రోమ్ 5:8; ఎఫెసు 2:4; 1 యోహాను 3:1,16 చూడండి.

**17:24** విశ్వాసుల పక్షంగా క్రీస్తు చేస్తున్న నాలుగో విన్నపం ఇది. విశ్వాసులంతా భద్రంగా తన సన్నిధి చేరి ఆయన మహిమను చూడగలిగేలా చెయ్యవలసిందని దేవుణ్ణి అడుగుతున్నాడు. క్రీస్తు చేసిన ఇతర ప్రార్థనలన్నీ దేవుడు అంగీకరించినట్టుగానే ఈ ప్రార్థన కూడా అంగీకరించాడు, దాని ప్రకారం చేస్తాడు. క్రీస్తు ప్రార్థనలంటే నెరవేరేందుకు గానీ నెరవేరకపోయేందుకు గానీ అవకాశం ఉన్నవి కాదు. ఇలా జరిగితే బావుణ్ణు అని వెలిబుచ్చిన ఆశలు కావు. అవి దేవుని సంకల్పానికి అనుగుణంగా ఆయన ప్రియ కుమారుడు చేసిన విన్నపాలు, గనక తప్పక నెరవేరుతాయి.

"మహిమ" – ఇది విశ్వాసుల రక్షణ విధానంలో ఆఖరు మెట్టు. క్రీస్తు దీనికోసం ప్రార్థించాడు కాబట్టి అది జరిగిపోయినట్టే దేవుడు లెక్కిస్తున్నాడు. రోమ్ 8:29,30; ఎఫెసు 2:6. ఈ వచనంలో లోక సృష్టికి మునుపే తండ్రి అయిన దేవుడు కుమారుడైన క్రీస్తును ప్రేమించిన విషయం చూడండి. తండ్రి, కుమారుడు వేరువేరు వ్యక్తులనీ, వారి మధ్య శాశ్వత ప్రేమ ఉందనీ మళ్ళీ చూస్తున్నాం.

**17:25** బైబిలంతటా కనిపించే రెండు సత్యాలను క్రీస్తు ఇక్కడ చెప్తున్నాడు. దేవుడు కేవలం న్యాయవంతుడు, మనుషులకు సాధారణంగా ఆయనను ఎరుగరు (1:10; 8:19,55; 15:21; 16:3).

**17:26** క్రీస్తు తన విశ్వాసుల్లో నివసించడానికీ, తండ్రి అయిన దేవుని గురించి ఆయన వారికి వెల్లడించిన దానికీ సంబంధం ఉంది. ఒకటి లేకుండా వేరొకటి లేదు. ఇలా వెల్లడి చేసిన విషయం గురించి వ 6; మత్తయి 11:27 చూడండి. క్రీస్తు పట్ల దేవునికున్న ప్రేమ విశ్వాసుల్లో కూడా ఉన్న సంగతి కూడా గమనించండి (రోమ్ 5:5; 2 కొరింతు 5:14; 1 యోహాను 2:5; 4:12,16).

**18:1** కెద్రోను లోయ జెరుసలంకు తూర్పున నగరానికీ, ఆలీవ్ కొండకూ మధ్యన ఉంది. ఇక్కడ చెప్పిన తోట గెత్‌సెమనే తోట (మత్తయి 26:36). అక్కడ జరిగిన ఇతర సంఘటనల కోసం మత్తయి 26:36–40 చూడండి.

**18:3** మత్తయి 26:47. మత్తయి 26:48,49లో చెప్పిన సంఘటన ఇప్పుడైనా జరిగి ఉండాలి, లేదా 8వ వచనంలో యేసు పలికిన మాటల తరువాతైనా జరిగి ఉండాలి.

**18:4** "తన మీదికి" – 3:14; 6:64; 13:1,3,11,18; మత్తయి 16:21.

**18:5** ఆయన పారిపోయే ప్రయత్నమేమీ చెయ్యలేదు. ధైర్యంగా తన శత్రువుకు ఎదురు నిలిచాడు. తన సమయం వచ్చిందని ఆయనకు తెలుసు (7:30; 17:1). ఆయన స్వచ్ఛందంగా తనకు తాను తన ప్రాణాన్ని ఇస్తున్నాడు (10:17,18).

"నేనే ఆయనను" – మూల భాషలో "నేను ఉన్నాను", లేదా "నేను ఉన్నవాడను." 8:24, 58 నోట్స్ చూడండి.

**18:6** క్రీస్తుతో దేవుని బలప్రభావాలు ఉండి సైనికులను వెనక్కు పడవేయకపోతే వారలా పడిపోయేవారు కాదు. యేసు తాను తలచుకుంటే శత్రువులను అవలీలగా ఓడించి తప్పించుకోగలిగేవాణ్ణని ఇక్కడ చూపించాడు. మత్తయి 26:53 పోల్చి చూడండి.

**18:8** ఈ గొప్ప పరీక్ష సమయంలో ఆయన తన శిష్యుల గురించి శ్రద్ధ వహించాడు (13:1 పోల్చి చూడండి).

**18:9** 6:39; 17:12 చూడండి. అక్కడ ఆయన మాటలకు అర్థం వారిని ఆధ్యాత్మికంగా కాపాడడం, వారు దారి తప్పి నాశనం కాకుండా చూడడం. ఇక్కడైతే శారీరకమైన ప్రమాదం, పరీక్షనుంచి ఆయన వారిని కాపాడిన అర్థం వస్తుంది. కానీ ఇదేమీ ఒకదానికొకటి వ్యతిరేకం కాదు. తన ప్రజలను ఆధ్యాత్మికంగా తప్పిపోయి నాశనం కాకుండా ఉంచడం కోసం వారు సహించలేనంత విషమ పరీక్షలు, దుష్ప్రేరణలనుంచి కాపాడుతుంటాడు (1 కొరింతు 10:13).

**18:10** మత్తయి 26:51–54.

**18:11** మత్తయి 26:39,42.

12 అప్పుడు ఆ సైనికుల గుంపు, వారి అధిపతి, యూదుల
ఉద్యోగులు ఆయనను పట్టుకొని బంధించారు. 13 మొట్టమొదట
కయపకు మామ అయిన  అన్నా అనేవాడి దగ్గరికి ఆయనను
తీసుకువెళ్ళారు. ఆ సంవత్సరం కయప ప్రముఖ యాజిగా
ఉన్నాడు. 14 ప్రజలకోసం ఒక్కడే చావడం మేలు అని
యూదులకు సలహా చెప్పినది ఈ కయపే.

15 సీమోను పేతురు, మరో శిష్యుడు యేసువెంట వెళ్ళారు.
ఆ శిష్యుడు ప్రముఖ యాజికి తెలుసు, గనుక ప్రముఖయాజి
ముంగిటిలోకి యేసు వెంట వెళ్ళాడు. 16 పేతురైతే బయట
ద్వారం దగ్గర నిలిచాడు. అందుచేత ప్రముఖ యాజికి తెలిసిన
ఆ శిష్యుడు బయటికి వచ్చి ద్వారానికి కాపలా  ఉన్న ఆమెతో
మాట్లాడి పేతురును లోపలికి తెచ్చాడు. 17 ద్వారం కావలి
కాస్తున్న ఆ పనిపిల్ల పేతురుతో “మీరు కూడా ఆ మనిషి
శిష్యులలో ఒకరు కదూ!” అంది.

అతడు “కాను” అన్నాడు.

18 దేవాలయం ఉద్యోగులూ పని మనుషులూ అక్కడ
నిలబడి ఉన్నారు. చలిగా ఉంది గనుక మంట వేసుకొని
చలికాచుకొంటున్నారు. పేతురు వారితో నిలుచుండి
చలికాచుకొంటున్నాడు.

19 ఇంతలో, ప్రముఖయాజి ఆయన ఉపదేశాన్ని గురించీ
శిష్యులను *గురించీ* యేసును ప్రశ్నించాడు.

20 యేసు అతడికిలా జవాబిచ్చాడు: “నేను బాహాటంగా
లోకానికి చెప్పాను. యూదులు ఎప్పుడూ సమకూడే సమాజ
కేంద్రాలలో, దేవాలయంలో ఉపదేశం చేశాను. చాటుగా నేనేమీ
చెప్పలేదు. 21 మీరు నన్ను ప్రశ్నించడమెందుకు? నా బోధ
విన్నవారిని నేను వారికి చెప్పిన దాని *గురించి* అడుగు. నేను
చెప్పినది వారికి తెలుసు.

22 ఆయన ఈ మాటలు చెప్పినప్పుడు, దగ్గర నిలుచున్న
అధికారి ఒకడు ఆయనను అరచేతితో చెంపదెబ్బ కొట్టి
“ప్రముఖ యాజికి ఇలా జవాబిస్తున్నావేమిటి!” అన్నాడు.

23 యేసు జవాబిస్తూ “నేను చెప్పినదానిలో దోషం ఉంటే
ఆ దోషం ఏదో సాక్ష్యం చెప్పు. అది సరిగా ఉంటే నన్ను
కొట్టడం ఎందుకు?” అన్నాడు.

24 అప్పుడు అన్నా ఆయనను కట్లతోనే ప్రముఖయాజి
అయిన కయప దగ్గరకు పంపాడు.

25 సీమోను పేతురు ఇంకా నిలచుండి చలి
కాచుకొంటున్నాడు. అక్కడున్నవారు అతనితో “మీరు కూడా
ఆయన శిష్యులలో ఒకరు కారా?” అన్నారు.

అతడు ఒప్పుకోలేదు, “నేను కాదు” అన్నాడు.

26 పేతురు ఎవడి చెవి నరికివేశాడో అతడి చుట్టాల్లో
ఒకడు ప్రముఖయాజికి సేవకుడుగా ఉన్నాడు. అతడు
పేతురుతో “మీరు తోటలో ఆయనతో *ఉండడం* నేను
చూడలేదా?” అన్నాడు. 27 మరోసారి పేతురు కాదన్నాడు.
తక్షణమే కోడి కూసింది.

28 యూదులు యేసును కయప దగ్గరనుంచి రోమన్
అధిపతి భవనానికి తీసుకువెళ్ళారు. అప్పటికి ఉదయం
అయింది. వారు మాత్రం అపవిత్రం కాకుండేలా భవనంలో
ప్రవేశించలేదు. ఎందుకంటే, పస్కాను తినాలని ఉన్నారు.
29 అందుచేత రోమన్ అధిపతి పిలాతు బయటికి
వారిదగ్గరకు  వచ్చి  “ఈ మనిషిపై మీరు మోపే నేరం
ఏమిటి?” అని అడిగాడు.

30 “ఇతడు నేరస్థుడు కాకపోతే ఇతణ్ణి మీకు
అప్పగించేవారం కాము” అని వారు అతనికి బదులు చెప్పారు.

31 పిలాతు వారితో “మీరే అతణ్ణి తీసుకువెళ్ళి మీ

---

**18:12,13** యేసును కయప దగ్గరికి తీసుకుపోకముందు అన్నా దగ్గరికి తీసుకువెళ్ళిన సంగతి యోహాను మాత్రమే రాశాడు. అన్నా కూడా ప్రముఖ యాజిగా ఎంచబడ్డాడు (లూకా 3:2; అపొ కా 4:6).

**18:14** 11:49-52 చూడండి.

**18:15** ఈ మరో శిష్యుడెవరో బైబిలు మనకు చెప్పడం లేదు. కానీ ఇతడు యోహానని అనేకమంది బైబిలు పండితులు నమ్ముతారు. 20:2,3,4,8 చూడండి.

**18:17** 13:38; మత్తయి 26:69-75.

**18:19** యేసుపై నేరం మోపేందుకు ఏదో ఒక వంకకోసం చూస్తున్నాడు. ఈ ప్రముఖ యాజి యూద ధర్మశాస్త్రం ప్రకారం ఈ న్యాయ విచారణ జరపడం లేదు. ముందుగా నేరం మోపబడినివాని పక్షంగా సాక్ష్యం పలికేవారిని పిలవాలి. ఆ పైన నేరం మోపేందుకు సహకరించే సాక్షులను పిలవాలి.

**18:20,21** వారు యూద న్యాయ నియమానికి కట్టుబడి సాక్షులను పిలవాలని యేసు ఉద్దేశం. ఆయన బహిరంగంగానే ఉపదేశించాడు. చాలమంది విన్నారు. ఆయన తన శిష్యులకు మాత్రమే ఏకాంతంగా చెప్పిన సంగతులు కూడా ఆయన బహిరంగంగా చెప్పినవాటికి భిన్నమైనవి కావు.

**18:22** ఇది కూడా చట్టానికి వ్యతిరేకమే.

**18:23** ధర్మశాస్త్రానికి సంరక్షకులమని చెప్పుకొనేవారు దాని ప్రకారంగానే విచారణ జరిపించాలని యేసుప్రభువు మళ్ళీ చెప్తున్నాడు.

**18:24** కయప అదే భవనంలో వేరొక భాగంలో ఉండి ఉంటాడని అనుకోవచ్చు. ఆ భవనం ప్రముఖ యాజి నివాసం (వ 15).

**18:25-27** మత్తయి 26:71-75.

**18:28** మత్తయి 27:1,2.

“పస్కా” – నిర్గమ 12 అధ్యాయం. ఈ యూదుల కపట బుద్ధి చూడండి. వారు దేవుని కుమారుణ్ణి హతమార్చడానికి కుట్ర పన్నారు. ఆయనపై నేరం రుజువు చేసేందుకు తమ ధర్మశాస్త్రానికి విరుద్ధంగా ప్రవర్తించారు. కానీ ఇక్కడేమో యూదుడు కానివాడింట్లో ప్రవేశిస్తే మైలబడిపోతామని కంగారు పడుతున్నారు (యూదులు రోమ్‌వారినీ యూదేతరులందరినీ వారి గృహాలనూ “అశుద్ధం”గా ఎంచేవారు. అపొ కా 10:28 పోల్చి చూడండి). హృదయంలోని పాపం మూలంగా అంటుకునే భయంకరమైన అశుద్ధతకన్నా ఇలాంటిదాని గురించే వారికి ఎంతో ఎక్కువ శ్రద్ధ (మత్తయి 15:1,2,16-20; 23:25-28 పోల్చి చూడండి). సరిగ్గా ఇలాంటివారే నేడు చాలామంది మతస్థులు ఉన్నారు. ఆచారాల విషయంలో బహు నిష్ఠగా ఉంటారు. కానీ నీతి నిజాయితీ విషయంలో నిర్లక్ష్యంగా ఉంటారు. యెషయా 1:11-17 కూడా చూడండి.

**18:29** “నేరం ఏమిటి” – తీర్పుకోసం వారు యేసును పిలాతు దగ్గరికి తెచ్చారు గనక పిలాతు ఇలా అడగడం సమంజసమే.

**18:30** ఇది అర్థం లేని జవాబు. ఇసుమంతైనా రుజువు లేకుండా ఈ కపట భక్తులు యేసుప్రభువును ఏమంటున్నారో చూడండి – “నేరస్థుడు”.

**18:31** దేశాన్ని పరిపాలించే రోమ్‌వారు కొన్ని రకాల నేరస్థులను యూదులే విచారించే అధికారం వారికి ఇచ్చారు గానీ

ధర్మశాస్త్రం ప్రకారం అతనికి తీర్పు తీర్చండి” అన్నాడు.

అందుకు యూదులు అతనితో “ఎవరికీ మరణశిక్ష విధించడానికి మాకు అధికారం లేదు” అన్నారు. 32 తాను ఎలాంటి మరణానికి గురి అవుతాడో దాని విషయం యేసు సూచించి చెప్పిన మాట నెరవేరేలా అది జరిగింది.

33 అప్పుడు పిలాతు అధిపతి భవనంలోకి మళ్ళీ వెళ్ళి యేసును పిలిపించి ఆయనను ఇలా అడిగాడు: “యూదులకు రాజువు నీవేనా?”

34 “మీ అంతట మీరే ఆ మాట అంటున్నారా? లేదా, ఇతరులు నా విషయం మీతో చెప్పారా?” అని యేసు అతనికి జవాబిచ్చాడు.

35 “నేను యూదుడినా ఏం! నాకు నిన్ను అప్పగించినది నీ సొంత ప్రజలే, ప్రధాన యాజులే గదా. నీవు చేసినది ఏమిటి?” అని పిలాతు బదులు చెప్పాడు.

36 యేసు ఇలా జవాబిచ్చాడు: “నా రాజ్యం ఈ లోక సంబంధమైనది కాదు. నా రాజ్యం ఈ లోక సంబంధమైనదే గనుక అయితే నన్ను యూదులకు పట్టి ఇవ్వడం జరగకుండా నా సేవకులు పోరాడేవారే. కానీ ఇప్పుడు నా రాజ్యం ఇక్కడిది కాదు.”

37 అందుకు పిలాతు “అయితే నీవు రాజువా?” అని ఆయనను అడిగాడు.

యేసు జవాబిస్తూ “నేను రాజునని మీరు చెప్పిన మాట నిజమే. సత్యాన్ని గురించి సాక్ష్యం చెప్పడానికి నేను జన్మించాను, ఈ కారణం చేత ఈ లోకానికి వచ్చాను. నేను చెప్పేదానిని సత్యంతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరూ నా స్వరం వింటారు” అన్నాడు.

38 అందుకు పిలాతు “సత్యం అంటే ఏమిటి?” అని ఆయనతో అన్నాడు. అలా అని బయటికి యూదుల దగ్గరికి తిరిగి వెళ్ళి “అతనిలో ఎలాంటి దోషమూ నాకు కనిపించలేదు. 39 అయితే పస్కా పండుగలో నేను ఎవడైనా ఒక ఖైదీని మీకు విడుదల చేసే వాడుక మీకు ఉంది గదా. నేను యూదుల రాజును మీకు విడుదల చేయడం మీకిష్టమా?”

40 అందుకు వారు “ఈ మనిషిని కాదు, బరబ్బను విడుదల చేయండి” అని మళ్ళీ అరిచారు. బరబ్బ బందిపోటు దొంగ.

**19** అప్పుడు పిలాతు యేసును స్వాధీనపరచుకొని కొరడాలతో కొట్టించాడు. 2 సైనికులు ముండ్లతో కిరీటం అల్లి ఆయన తలమీద పెట్టారు. ఊదారంగు వస్త్రం ఆయనకు తొడిగించారు. 3 అప్పుడు “యూదుల రాజా, శుభం!” అన్నారు. ఆయనను చేతులతో కొట్టారు.

4 మరోసారి పిలాతు బయటికి వెళ్ళి యూదులతో ఇలా అన్నాడు: “చూడండి. ఇతనిలో నాకు ఎలాంటి దోషమూ కనిపించలేదని మీరు తెలుసుకోవాలి, గనుక ఇతణ్ణి బయటికి మీ దగ్గరికి తెప్పిస్తున్నాను.”

5 ముండ్ల కిరీటం, ఊదారంగు వస్త్రం ధరించినవాడై యేసు బయటికి వచ్చినప్పుడు పిలాతు వారితో అన్నాడు “ఇదుగో ఈ మనిషి!”

6 ఆయనను చూడగానే ప్రధాన యాజులూ యూదుల

---

నేరస్థుల్ని సిలువ వేసే అధికారం ఇవ్వలేదు. రోమ్‌వారు యేసును నేరస్థుడుగా తీర్చి సిలువ మరణశిక్ష ఆయనకు విధించాలని ఈ యూదులు కోరారు.

**18:32** 3:14; 8:28; 12:32,33.

**18:33** యేసు తనను తాను రాజుగా నిలుపుకొని యూదయలో రోమ్ పరిపాలనకు వ్యతిరేకంగా తిరగబడే ప్రయత్నం చేస్తున్నాడని యూదులు ఆయనపై నేరం మోపారు (లూకా 23:1,2). అందుకే ఈ ప్రశ్న వేశాడు పిలాతు.

**18:34** పిలాతు తన ప్రశ్న మరింత స్పష్టంగా వెయ్యాలని యేసు ఉద్దేశం. పిలాతు అడిగినది యేసు రోమ్ పాలనను కూల ద్రోసే ఉద్దేశంతో ఇహలోక సంబంధంగా రాజయ్యే ప్రయత్నం చేస్తున్న విషయమా, లేక వేరొక రకంగా రాజయ్యే ప్రయత్నం చేస్తున్న విషయమా?

**18:35** యూదులు తనకు చెప్పినది తప్ప తనకు మరేమీ తెలియదని పిలాతు అంటున్నాడు – రుజువు ఏమీ లేకుండా వారి నేరారోపణను అంగీకరించడం అతనికి ఇష్టం లేదు గనుక ఈ విధంగా యేసును ప్రశ్నిస్తున్నాడు.

**18:36** “నా రాజ్యం” – తన రాజ్యం పరలోకానికి చెందినది, ఆత్మ సంబంధమైనదే గానీ రాజకీయ, సైనిక రాజ్యం కాదని యేసు చెప్తున్నాడు (మత్తయి 4:17 నోట్ చూడండి). అందుకు ఆధారంగా యూదులు తనను పట్టి బంధిస్తూ ఉంటే తన శిష్యులేమీ అడ్డుపడలేదన్న సంగతి చెప్తున్నాడు. అంతేగాక యూదులే తనను బంధిస్తే తాను యూదులపై రాజకీయ నాయకుడెలా కాగలడు?

“ఇప్పుడు” – ప్రకటన 19:11-16 పోల్చి చూడండి.

**18:37** దేవుని ఆధ్యాత్మిక రాజ్యంలో రాజుగా ఆయన తన సత్యాన్ని పంపిస్తాడు. సైన్యాన్ని కాదు. ఆధ్యాత్మిక ప్రభావంతో మనుషుల హృదయాలను ఆయన స్వాధీనం చేసుకోగోరు తున్నాడు గానీ సైనిక బలాన్ని ఉపయోగించి వారి దేశాలను కాదు.

“సత్యం” – యోహాను శుభవార్త అంతటా సత్యాన్ని ఈ విధంగా నొక్కి చెప్పడం కనిపిస్తున్నది (1:14,18; 3:21; 4:24; 8:32; 14:6,17; 16:13; 17:17). ఇక్కడ ప్రభువు చెప్తున్నది చూడండి – సత్యాన్ని కోరేవారంతా, సత్యమంటే ప్రీతి కలిగి ఆచరించేవారంతా క్రీస్తు మాటలు విని ఆయన చెప్పేది చేస్తారు. ప్రతి ఒక్కరూ అలా చేస్తారు. దీనికి వ్యతిరేకం కూడా నిజమే. సత్యమంటే ఇష్టం లేనివారు ఆయన మాట వినరు. 8:47; 2 తెస్స 2:10 పోల్చి చూడండి.

**18:38** పిలాతు జవాబుకోసం ఎదురు చూడలేదు. అసలు ఈ ప్రశ్నకు జవాబు అతనికి అక్కర్లేదు. సత్యం గురించి అతనికేమన్నా పట్టింపు ఉందనుకోవడానికి కారణమేమీ లేదు. పిలాతు విషయంలో విచారకరమైన సంగతి ఇదే ( ఈ నాడు అనేకమంది విషయంలో కూడా). యేసు ఏ నేరమైనా చేశాడనేందుకు రుజువేమీ లేదని పిలాతుకు బాగా తెలుసు (19:4,6; మత్తయి 27:18,23; లూకా 23:4,13,14).

**18:39,40** మత్తయి 27:15-21; లూకా 23:19 చూడండి.

**19:1** పిలాతుకు సత్యం పట్ల ఉన్న శ్రద్ధ ఎంతో ఇక్కడ కనిపిస్తున్నది. పూర్తిగా నిర్దోషి అని తానెరిగిన వ్యక్తికి శిక్ష అమలు జరిపాడు.

**19:2,3** మత్తయి 27:27-30.

**19:5** రోమ్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు నడుపుతున్నాడని యేసుపై నేరం మోపడం ఎంత అర్థంలేని పనో అందరికీ చూపించాలని పిలాతు ఉద్దేశం. కాబట్టి యేసును బలహీనుడుగా, నిస్సహాయుడుగా వారి ఎదుట ప్రదర్శించి, ఆయనపై జాలి పడేలా గాని, నేరం మోపి సిలువ వేయడం తగదని చూపించే ప్రయత్నం చేస్తున్నాడు.

**19:6** జాలి చూపేందుకూ న్యాయాన్ని కోరేందుకూ ఆ

అధికారులూ “సిలువ వెయ్యండి! సిలువ వెయ్యండి!” అని
అరిచారు.
పిలాతు “మీరే అతణ్ణి తీసుకుపోయి సిలువ వేయండి. నాకు
అతనిలో ఏ దోషమూ కనబడలేదు” అని వారితో చెప్పాడు.
7 అందుకు యూదులు “మాకో చట్టం ఉంది. మా చట్టం
ప్రకారం అతడు చావాలి. ఎందుకంటే, తాను దేవుని కుమారుణ్ణి
అని చెప్పుకొన్నాడు” అని జవాబిచ్చారు.
8 ఆ మాట విని పిలాతు మరి ఎక్కువగా భయపడ్డాడు.
9 అధిపతి భవనంలోకి తిరిగి వెళ్ళి “నీవు ఎక్కడనుంచి
వచ్చావు?” అని యేసును అడిగాడు. యేసు అతడికి ఏ
జవాబూ ఇవ్వలేదు. 10 పిలాతు ఆయనతో అన్నాడు, “నీవు
నాతో మాట్లాడవా? నిన్ను విడుదల చేయడానికి, లేదా సిలువ
వేయడానికి నాకు అధికారం ఉందని నీకు తెలియదా?”
11 అందుకు యేసు “ఆ అధికారం పైనుంచి నీకు
ఇవ్వబడితేనే తప్ప నామీద నీకు అధికారమేమీ ఉండదు. కనుక
నన్ను నీకు అప్పగించినవానికే ఎక్కువ పాపం ఉంది” అని
జవాబిచ్చాడు.
12 అప్పటినుంచి ఆయనను విడిపించడానికి పిలాతు
ప్రయత్నం చేశాడు, గానీ యూదులు ఇలా అరిచారు: “ఒకవేళ
మీరు ఈ మనిషిని విడుదల చేస్తే మీరు సీజరుకు స్నేహితులు
కారన్నమాటే! తాను రాజునని చెప్పుకొనేవాడెవడైనా చక్రవర్తికి
వ్యతిరేకంగా మాట్లాడేవాడే!”
13 ఈ మాటలు విని పిలాతు యేసును బయటికి తెప్పించి
న్యాయపీఠం మీద కూర్చున్నాడు. ఆ స్థలానికి ‘రాళ్ళు పరచిన
స్థలం’ అని పేరు. హీబ్రూ భాషలో గబ్బతా అంటారు. 14 ఆ
రోజు పస్కా పండుగను సిద్ధం చేసే రోజు. ఉదయం సుమారు
ఆరు గంటలయింది.
“ఇదుగో మీ రాజు!” అని పిలాతు యూదులతో
చెప్పాడు.
15 అందుకు వారు “ఇతణ్ణి చంపండి! చంపండి! అతణ్ణి
సిలువ వేయండి!” అని అరిచాడు.
“నేను మీ రాజును సిలువ వేయాలా?” అని పిలాతు
వారిని అడిగాడు.
అందుకు ప్రధాన యాజులు “సీజరు తప్ప మాకు వేరే రాజు
లేడు” అని జవాబిచ్చారు.
16 అప్పుడు సిలువ వేయడానికి ఇతడు ఆయనను వారికి
అప్పగించాడు. అందుచేత వారు యేసును పట్టుకొని బయటికి
తీసుకుపోయారు. 17 తన సిలువను తానే మోసుకొంటూ

కఠినాత్ములైన పాపుల మనస్సులను ఏదీ కరిగించలేదు. మీరే యేసును సిలువ వేసుకోండి అన్న పిలాతు మాటల్లో కోపం, వ్యంగ్యం ధ్వనిస్తున్నాయి. ఎవర్నైనా సిలువ వేసేందుకు వారికి అధికారం లేదని పిలాతుకు తెలుసు, వారికీ తెలుసు (18:31).

**19:7** సత్యాన్ని గడ్డిపోచలాగా తీసిపారేసేవారి గుణం దీన్ని బట్టి కూడా అర్థమౌతున్నది. ఇక్కడ వారు చెప్తున్న ధర్మశాస్త్రం అంశాన్ని వక్రం చేసి చెప్తున్నారు (లేవీ 24: 16). యేసు (వేరెవరైనా కూడా) నిజంగా తాను దేవుని కుమారుడు కాకపోయినా అలా చెప్పుకుంటే అతడు దేవదూషకుడనీ, మరణానికి తగినవాడన్నదీ నిజమే కానీ యేసు నిజంగా దేవుని కుమారుడని సాక్ష్యాధారాలన్నీ రుజువు చేస్తున్నాయి. అది నిజం కాబట్టి ఆయన చెప్పుకోకూడదని నిషేధించే చట్టమేమీ లేదు. 5:18; 10:31-36; మత్తయి 26:63-66 కూడా చూడండి.

**19:8** మొత్తంగా రోమ్‌వారు మూఢ నమ్మకాలున్న వ్యక్తులు. అనేకమంది దేవుళ్ళలో వారికి నమ్మకం. దేవుళ్ళు కొన్ని సార్లు మనుషుల్లాగా వచ్చి ఈ లోకంలో తిరుగుతుంటారని, అలాంటి సందర్భాల్లో వారిని గుర్తుపట్టడం అంత తేలిక కాదని నమ్మేవారు. నిర్దోషియై మౌనంగా, సహనంతో, గంభీరత్వాన్ని ప్రదర్శిస్తున్న యేసు ఎవరో ఒక దేవుడేమోనని పిలాతు భయపడనారంభించి ఉండవచ్చు.

**19:10** పిలాతు అహానికి దెబ్బ తగిలినట్టుంది. తరచుగా ఈ లోకాన్ని పరిపాలించేవారు తామేదో గొప్పవారమనీ ప్రభావం గలవారమనీ తమకిష్టం వచ్చినట్టు ప్రవర్తించవచ్చనీ అనుకోవడానికి ఇష్టపడుతుంటారు.

**19:11** పిలాతు తప్పుగా అర్థం చేసుకొన్న విషయాలను గురించి యేసు మౌనం వహించలేదు. “పైనుంచి” అంటే పరలోకంనుంచి, దేవుని నుంచి అని అర్థం. భూమి అంతటికీ మహారాజు దేవుడే. ఆయన అనుమతిస్తేనే గాని పిలాతు ఏమీ చెయ్యలేడు. కీర్తనలు 2వ అధ్యాయం; 47:1,2; యెషయా 40:21-23; దానియేలు 4:34,35 పోల్చి చూడండి. దీనంతటిలో పిలాతు గొప్ప పాపం ఒడిగట్టుకున్నాడు. కానీ పిలాతుకు యేసును అప్పగించినవాడు (ప్రముఖ యాజి కయప – 18:28) మరింత ఘోర పాపం చేశాడు. పాపాల్లో కొన్ని మిగతావాటి కంటే చెడ్డవి. లూకా 12:47,48 పోల్చి చూడండి.

**19:12** యేసు కనీసం దేవుని మనిషి ఒకడని పిలాతుకు నమ్మకం కుదిరినట్టుంది. ఆయనకు మరణశిక్ష విధించే విషయంలో ఆందోళన పడుతున్నాడు. పిలాతును యూదయ ప్రాంతానికి అధిపతిగా నియమించినది రోమ్ సామ్రాజ్యానికి చక్రవర్తి సీజరు. పిలాతు తనకు వ్యతిరేకంగా పని చేస్తున్నాడని గానీ ఏదైనా తిరుగుబాటును ప్రోత్సహిస్తున్నాడని గానీ సీజరుకు తలంపు వచ్చిందంటే అంతటితో పిలాతు పని ఆఖరు. పిలాతుకు ఈ సంగతి బాగా తెలుసు.

**19:15** “సీజరు తప్ప. . .రాజు లేడు” – ఈ యూదుల నాయకుల కపట బుద్ధి, భ్రష్ట మనసు మళ్ళీ బయట పడుతున్నాయి. తమ దేశంపై రోమ్‌వారి పరిపాలన వారికి అసహ్యం. అదీగాక తమ ధర్మశాస్త్రం ప్రకారం ఇస్రాయేల్‌పై రాజు దేవుడేనని వారికి తెలుసు (నిర్గమ 19:3-6; ద్వితీ 33:5; 1 సమూ 8:7; కీర్తన 10:16; 149:2). యేసుప్రభువును సిలువ వేయించేందుకు ఎంత విపరీతమైన మాట అయినా పలికేందుకు వారు సిద్ధమే. అయితే ఇలా అనడంలో వారికి తెలియకుండా వారే ఒక సత్యాన్ని పలుకుతున్నారు. తమ జీవితాల్లో వారు దేవుని పరిపాలనను పూర్తిగా విసర్జించారు. వారి హృదయాల్లో దేవుడు రాజు కాదు.

**19:16** యేసు నిర్దోషి అని పిలాతుకు తెలుసు. తానొక భయంకరమైన తప్పు చేస్తున్నానేమో అని భయపడ్డాడు. న్యాయంగా తీర్పు తీర్చడం అతని బాధ్యత, కానీ అతని తెలివితేటలు, భయాలు, బాధ్యత అంతా అతనికి ఉన్న మరో భయం ఎదుట దిగదుడుపు అయిపోయాయి. అదేమంటే సీజరుకు అభ్యంతరం కలిగించి తన పదవికి ముప్పు వస్తుందేమోనన్న భయం. ఆ భయం గుప్పెట్లో ఉన్న పిలాతు మనసులో సత్యానికి, న్యాయానికి నిలువ నీడలేకుండా పోయింది (సామెత 29:25 పోల్చి చూడండి). అలాంటి భయాన్ని దూరం చేసే దేవుని భయం పిలాతులో లేదు. దేవునికంటే మనుషులకు ఎక్కువగా భయపడే వారెవరైనా, సత్యం న్యాయాల కన్నా తన పదవికే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చే వారెవరైనా భయంకరమైన ఆధ్యాత్మిక ప్రమాదంలో ఉన్నారు. దేవుని తీర్పుకూ శిక్షకూ గురి అయ్యే అపాయంలో ఉన్నారు.

**19:17-22** మత్తయి 27:31-38. యేసు తన సిలువను

‘కపాలస్థలం’ అనే చోటికి ఆయన వెళ్ళాడు. హీబ్రూ భాషలో దానిని గొల్‌గొతా అంటారు. 18 అక్కడ వారు ఆయనను సిలువ వేశారు. యేసును మధ్యలో ఉంచి ఆయనకు ఇరుప్రక్కల ఇంకా ఇద్దరిని సిలువ వేశారు. 19 పిలాతు ఈ వ్రాత వ్రాయించి సిలువకు పైగా పెట్టించాడు:

**“నజరేతువాడైన యేసు, యూదుల రాజు”**

20 అది హీబ్రూ, గ్రీకు, రోమన్ భాషలలో వ్రాసి ఉంది. యేసును సిలువ వేసిన స్థలం నగరానికి దగ్గరగా ఉంది, గనుక యూదులు అనేకులు ఆ పై వ్రాతను చదివారు.

21 అప్పుడు యూదుల ప్రధాన యాజులు పిలాతుతో ఇలా అన్నారు: “యూదుల రాజు అని వ్రాయకండి. నేను యూదుల రాజునని అతడు అన్నాడు అని వ్రాయండి.”

22 పిలాతు “నేను రాసినదేదో రాశాను” అని బదులు చెప్పాడు.

23 యేసు సిలువ వేసిన తరువాత సైనికులు ఆయన బట్టలు తీసుకొన్నారు. ఒక్కొక్క సైనికుడికి ఒక్కొక్క భాగం వచ్చేలా నాలుగు భాగాలుగా చేశారు. ఆయన అంగీ కూడా తీసుకొన్నారు గాని అది కుట్టు లేకుండా పైభాగంనుంచి పూర్తిగా నేసినది కావడంచేత 24 వారు “మనం దానిని చింపెయ్యకూడదు. అది ఎవడికి రావాలో దానికోసం చీట్లు వేద్దాం” అని చెప్పుకొన్నారు. “నా వస్త్రాలను తమలో తాము పంచుకొని నా అంగికోసం చీట్లు వేస్తున్నారు” అనే లేఖనం నెరవేర్పు ఇలా జరిగింది. సైనికులు అలా చేసినది అందుకే.

25 యేసు తల్లి, ఆయన తల్లి సోదరి, క్లోపా భార్య మరియ, మగ్దలేనే మరియ ఆయన సిలువ దగ్గర నిలుచున్నారు. 26 యేసు తన తల్లి, తాను ప్రేమించిన శిష్యుడు దగ్గర నిలుచుండడం చూచి “అమ్మా! అడుగో, నీ కొడుకు” అని తన తల్లితో అన్నాడు. 27 అప్పుడు ఆ శిష్యుడితో “అదిగో, నీ తల్లి” అన్నాడు. ఆ కాలంనుంచి ఆ శిష్యుడు ఆమెను తన ఇంట్లో చేర్చుకొన్నాడు.

28 ఆ తరువాత, సమస్తమూ అప్పటికే అయిపోయిందని తెలిసి లేఖనం నెరవేరడానికి యేసు “నాకు దప్పి అవుతూ ఉంది” అన్నాడు. 29 పులిసిపోయిన ద్రాక్షరసంతో నిండిన ఒక పాత్ర అక్కడ ఉంది. కాబట్టి వారు ఒక స్పంజి నిండా పులిసిపోయిన ద్రాక్షరసాన్ని పట్టించారు. దానిని హిస్సోపు మొక్క కాడకు తగిలించి ఆయన నోటికి అందజేశారు.

30 ఆ పులిసిపోయిన ద్రాక్షరసం తీసుకొన్న తరువాత యేసు “సమాప్తమయింది” అన్నాడు. అప్పుడు తల వంచి ప్రాణం విడిచాడు.

31 ఆ రోజు పస్కాను సిద్ధం చేసే రోజు. మరుసటి రోజు

---

తానే మోసుకువెళ్ళాడని యోహాను రాశాడు. ఆ విధంగా మోస్తూ బయలు దేరాడు గానీ దారిలో సిలువను మరో వ్యక్తి మోసేలా సైనికులు అతణ్ణి బలవంతపెట్టారు. యేసుపై మోపిన నేరం మూడు భాషల్లో రాసి ఉన్న సంగతి, అందులో ఉపయోగించిన మాటలకు యూదులు అభ్యంతరం తెలియజేసిన సంగతి యోహాను మాత్రమే రాశాడు. పిలాతుకే అర్థం కాని ఒక సత్యాన్ని దేవుడు అతనిచేత రాయించాడు. యేసు నిజంగా ఇస్రాయేల్‌వారి అభిషిక్తుడు. పాత ఒడంబడిక గ్రంథంలో దేవుడు వాగ్దానం చేసిన రాజు (మత్తయి 1:1 నోట్).

**19:23,24** “చీట్లు వేద్దాం” – కీర్తన 22:18.

**19:25** బహుశా సోదరి అంటే మార్కు 15:40లో చెప్పిన సలోమి, మత్తయి 27:56లో చెప్పిన జెబెదయి కొడుకుల తల్లి కావచ్చు – అంటే యోహాను తల్లి అన్నమాట.

“మగ్దలేనే” – 20:10-18; లూకా 8:2; మత్తయి 28:1.

**19:26,27** “తాను ప్రేమించిన శిష్యుడు” – 13:23. యేసు ఘోర బాధలు అనుభవిస్తూ, లోక పాపాలకోసం మరణిస్తూ ఉన్న ఆ సమయంలో కూడా వేరొకరి అవసరాల గురించి ఆయన ఆలోచిస్తున్నాడు. “అదిగో నీ తల్లి” అని ఆయన ఈ శిష్యుడితో అనడంలో అర్థం మరియ దేవుని ప్రజలందరికీ “మాత”, లేదా “ఉపకార మాత”, “ఆశ్రయ మాత” అని కాదు. మరియకు ఇల్లు, పోషణ అవసరమని ఆయనకు తెలుసు. నమ్మకస్థుడైన ఒక శిష్యుని ఆశ్రయం కింద ఆయన ఆమెను ఉంచుతున్నాడు అంతే. అప్పటికి మరియ భర్త యోసేపు చనిపోయినట్టుంది.

**19:28,29** కీర్తన 69:21. క్రీస్తు సిలువ బాధలలో, మరణంలో పాత ఒడంబడిక గ్రంథంలోని భవిష్యద్వాక్కులు అనేకం నెరవేరాయి. ఏదీ అకాలంగా, అకస్మాత్తుగా, యాదృచ్ఛికంగా జరగలేదు. ప్రతిదాని వెనకా దేవుడు ఉద్దేశించిన ప్రయోజనమొకటి ఉంది. యేసు పాపుల స్థానంలో బాధలు పడుతూ వారి శిక్షను భరిస్తున్న సంగతి గుర్తుంచుకోండి (వ 30 దగ్గర రిఫరెన్సులు). సిలువపై ఆయనకు దాహం వేయడం అందులోని భాగమే. లూకా 16:22-24 పోల్చి చూడండి. విశ్వాసులకు జీవజలం దొరకాలనీ (4:14; 7:37,38; ప్రకటన 22:17), అనంత కాలం వారికి దాహం వేయకుండా ఉండాలనీ (ప్రకటన 7:16,17) యేసు దప్పిగొన్నాడు.

**19:30** సమాప్తమైనదేమిటి? తాను ఈ లోకానికి రావడంలో గల ఉద్దేశమంతా సిద్ధించిందని ఆయన భావమై ఉండాలి (4:34). ఈ ఉద్దేశాన్ని ఆయనే ఆయా సమయాల్లో వెల్లడి చేశాడు – 3:14-17; 6:51; 10:10,11,15,17; 12:23,24,31-33; 17:4; 18:11 (మత్తయి 26:39); మత్తయి 20:28. బాప్తిసమిచ్చే యోహాను దీన్ని ఈ విధంగా తెలియజేశాడు – “ఇదుగో లోక పాపాన్ని మోసి తీసివేసే దేవుని గొర్రెపిల్ల” (1:29).

క్రొత్త ఒడంబడిక రచయితలు దీన్నే వేరే మాటల్లో వెల్లడి చేశారు. రోమ్ 3:25; 5:8; 1 కొరింతు 15:3; 2 కొరింతు 5:15,19; గలతీ 1:4; ఎఫెసు 5:2; ఫిలిప్పీ 2:8; కొలస్సయి 1:20,22; 1 తిమోతి 1:15; హీబ్రూ 1:3; 2:14,17; 9:12,14,15; 10:10,14; 13:12; 1 పేతురు 2:24; 3:18; 1 యోహాను 4:9,10; ప్రకటన 1:5,6 చూడండి. సమాప్తమైంది అంటే పాపం కోసం తాను పడవలసిన బాధలు, చేయవలసిన బలి అర్పణ పూర్తి అయింది అని అర్థం. లోక పాపాన్ని ఆయన తీసివేశాడు. తన ప్రజలను తన రక్తంతో విమోచించాడు. ప్రతి ఒక్కరికి పాపం నుంచి విడుదల, రక్షణ అందుబాటులోకి తెచ్చాడు. ఈ పని సంపూర్తి అయింది. పాపవిముక్తి పొందేందుకు పాపి చేయవలసిందల్లా పశ్చాత్తాపపడి శుభవార్తను విశ్వసించి యేసుప్రభువుమీద నమ్మకం పెట్టుకోవడమే (మార్కు 16:15,16; లూకా 24:46,47).

తాను అక్కడ చేయడానికి వచ్చిన పని పూర్తి అయిపోయింది కాబట్టి సిలువపై బాధలు అనుభవిస్తూ ఉండిపోవలసిన అవసరం ఇక లేదు. కాబట్టి స్వచ్ఛందంగా తనకు తానే తన ప్రాణం విడిచాడు. 10:17,18; లూకా 23:46 పోల్చి చూడండి.

**19:31** వ 14; ద్వితీ 21:22,23. మృతదేహం సిలువపై రాత్రంతా ఉండడం ద్వారా భూమి అశుద్ధం కాకూడదని వారి

యూదులకు మహా విశ్రాంతి దినం. ఆ విశ్రాంతి దినం మృత దేహాలు సిలువమీద ఉండకూడదనీ వారి కాళ్ళు విరగ్గొట్టించి వారిని సిలువనుంచి తీయించాలనీ యూదులు పిలాతును అడిగారు. 32 కనుక సైనికులు వచ్చి ఆయనతో కూడా సిలువ వేయబడ్డ మొదటివాని కాళ్ళు, రెండో వాని కాళ్ళు విరగ్గొట్టారు. 33 గానీ యేసు దగ్గరకు వచ్చి, అప్పటికే ఆయన చనిపోవడం చూచి ఆయన కాళ్ళు విరగ్గొట్టలేదు. 34 అయితే సైనికులలో ఒకడు ఈటెతో ఆయన ప్రక్కను పొడిచాడు. వెంటనే రక్తమూ నీళ్ళూ కారాయి. 35 అది చూచినవాడు సాక్ష్యం చెప్పాడు. అతని సాక్ష్యం నిజం. మీరు కూడా నమ్మేలా అతడు సత్యం చెపుతున్నాడని అతనికి తెలుసు.

36 ఈ లేఖనం నెరవేరేలా ఇవి జరిగాయి: "ఆయన ఎముకలలో ఒకటైనా విరగగొట్టబడదు" 37 మరో లేఖనం ఇలా అంటుంది.: "తాము పొడిచినవానివైపు వారు చూస్తారు."

38 ఆ తరువాత అరిమతయి గ్రామం వాడైన యోసేపు యేసు మృత దేహాన్ని తీసుకుపోవడానికి పిలాతును అడిగాడు. పిలాతు అనుమతించాడు. యోసేపు యేసుకు శిష్యుడు గాని యూదులకు భయపడి రహస్యంగా శిష్యుడుగా ఉన్నాడు. అతడు వచ్చి యేసు మృత దేహాన్ని తీసుకువెళ్ళాడు. 39 నీకొదేము కూడా వచ్చాడు. ఈ నీకొదేము అంతకు ముందు రాత్రివేళ యేసుదగ్గరకు వచ్చినవాడు. అతడు బోళంతో కలిపిన అగరు సుమారు నలభై అయిదు కిలోగ్రాములు తెచ్చాడు. 40 వారు యేసు దేహాన్ని తీసుకొని యూదుల భూస్థాపన ఆచారం ప్రకారం ఆ సుగంధ ద్రవ్యాలు పెట్టి అవిసెనార గుడ్డలు చుట్టారు. 41 ఆయనను సిలువ వేసిన స్థలంలో తోట ఉంది. తోటలో కొత్త సమాధి ఉంది. దానిలో అదివరకు ఎవరినీ ఉంచడం జరుగలేదు. 42 ఆ సమాధి దగ్గరగా ఉండడంచేత, ఆ రోజు యూదులకు పస్కాను తయారు చేసే రోజు గనుక వారు ఆయనను దానిలో పెట్టారు.

20 ఆదివారం నాడు పెందలకడ ఇంకా చీకటిగా ఉండగానే మగ్దలేనే మరియ సమాధి దగ్గరకు వచ్చింది. సమాధి ద్వారానికి ఉన్న రాయి అప్పటికే తీసివేసి ఉండడం చూచింది. 2 గనుక ఆమె సీమోను పేతురు దగ్గరకూ యేసు ప్రేమించిన ఆ మరో శిష్యుని దగ్గరకూ పరుగెత్తి వెళ్ళింది. "వారు ప్రభువును సమాధిలో నుంచి తీసుకు పోయారు. ఆయనను ఎక్కడ ఉంచారో మాకు తెలియదు" అంది.

3 అందుచేత పేతురు, ఆ మరో శిష్యుడు సమాధి దగ్గరకు

---

ఉద్దేశం. దేవుని కుమారుణ్ణి హత్య చేసే తామే అతి నీచంగా మైలబడిపోయిన సంగతి వారికి పట్టింపు లేదు. 18:28; మత్తయి 23:24 చూడండి. సాధారణంగా రోమ్‌వారు సిలువ మరణం పొందినవారి శవాలను ఇతరులకు హెచ్చరికగా అలానే వదిలేసేవారు.

"తీయించాలని" – సిలువపై ఉన్నవారి కాళ్ళు విరగ్గొడితే మరణం త్వరగా వస్తుంది. కాళ్ళకు పట్టులేక దేహాలు వేళ్ళాడి రొమ్ము కుంచించుకుపోతుంది. ఇందువల్ల ఊపిరి తీసుకోవడం చాలా కష్టమై మరణం సంభవిస్తుంది. యేసు ఆ సాయంత్రంలోగా చనిపోయేలా చూడాలని యూదుల ఉద్దేశం.

**19:33** అందరూ ఊహించినదానికంటే ముందుగానే యేసుప్రభువు చనిపోయాడు. మార్కు 15:44,45 చూడండి.

**19:34** యేసులో ఏ మూలనో కాస్త కొన ఊపిరి మిగిలి ఉన్నట్టు సైనికులకు అనుమానం కలిగినట్టుంది. ఆయన మరణించాడని రూఢి చేసుకోవాలనుకున్నారు. ఒక వేళ అంతకుముందే ఆయన చనిపోకపోయినా ఇలా ఈటెతో పొడవడంతో ఆయన తప్పక చనిపోతాడు.

ఇక్కడ చెప్పినట్టు మృతదేహం నుంచి రక్తం, నీరు కారడం మామూలు సంగతి కాదు. ఈ సంఘటన యేసు ఇచ్చే జీవజలాన్నీ (4:34; 7:37,38), సిలువపై ఆయన కార్చిన రక్తం మాత్రమే ఆ జలాన్ని మనకు అందుబాటులోకి తెస్తుందనీ జ్ఞాపకం చేయవచ్చు. అంతేగాక పాత ఒడంబడికలో రక్తం ప్రాయశ్చిత్తానికి (లేవీ 17:11), నీరు శుద్ధీకరణకు (సంఖ్యా 19:11; మొ॥) ఉపయోగించారని కూడా మనం గ్రహించాలి. 1 యోహాను 5:6–8 కూడా పోల్చి చూడండి.

**19:35** ఈ శుభవార్త రచయిత తన గురించే ఈ మాట రాస్తున్నట్టుంది. జరిగిన దాన్ని ప్రత్యక్షంగా చూచినవాడుగా యేసు చనిపోయాడనీ, ఈ అసాధారణ సంఘటన జరిగిందనీ ప్రకటిస్తున్నాడు.

**19:36** నిర్గమ 12:46; సంఖ్యా 9:12; కీర్తన 34:20.

**19:37** జెకర్యా 12:10.

**19:38–42** మత్తయి 27:57–60; మార్కు 15:42–46; లూకా 23:50–54 చూడండి. యేసు జీవించిన కాలంలో యోసేపు తన నమ్మకాన్ని రహస్యంగా ఉంచుకున్నాడని యోహాను మాత్రమే రాశాడు.

"నీకొదేము" – 3:1,2; 7:50,51. క్రీస్తు సన్నిహిత శిష్యులెవరూ ఆ ఛాయలకు కూడా రాలేదు (వ 19 పోల్చి చూడండి). కానీ తమ నమ్మకాన్ని దాచిపెట్టేందుకు ప్రయత్నించినవారు ఇప్పుడు బయటికి వచ్చారు. యేసు సిలువపై ఉన్న సమయంలో వారు చూచినవీ విన్నవీ యేసులో వారి నమ్మకాన్ని అభివృద్ధి చేసి ఉండవచ్చు.

పెద్ద మొత్తంలో తెచ్చిన ఈ సుగంధ ద్రవ్యాలు చాలా ఖరీదైనవి (వ 39). యేసుప్రభువు పట్ల నీకొదేముకున్న ప్రేమకూ అపారమైన గౌరవానికీ ఇది సూచన.

**20:1** అన్ని శుభవార్తల రచయితలు క్రీస్తు చనిపోయి సజీవంగా లేచిన ఘన సత్యాన్ని రాశారు. అయితే నలుగురూ ఒకే విధమైన మాటలు ఉపయోగించలేదు. అందరూ ఒకే వివరాలు రాయలేదు. ఒక శుభవార్తలో కనిపించే వ్యక్తులందరి గురించీ అందరు శుభవార్త రచయితలూ రాయలేదు. ఉదాహరణకు ఇక్కడ మగ్దలేనే మరియ సమాధి దగ్గరికి రావడం గురించి యోహాను రాశాడు. మత్తయి అయితే వేరొక మరియ ఆమెతో ఉందని రాశాడు. సలోమి కూడా వెంట వెళ్ళిందని మార్కు రాశాడు. లూకా కొందరు స్త్రీలు వచ్చారని రాస్తూ యోహన్న అనే ఆమె పేరు కూడా చెప్పాడు. వీటిలో ఏది నిజం? అన్నీ నిజమే. వారిలో ఒకామె సమాధి దగ్గరికి వచ్చిందని రాస్తే మరి ఇతరులెవరూ రాలేదని అర్థం కాదు.

**20:2** "మాకు" – ఆమెతో వచ్చిన ఇతర స్త్రీలతో కలుపుకుని మాట్లాడుతున్నది. యేసుప్రభువు సజీవంగా లేస్తాడని వారు అర్థం చేసుకోలేదు. ఎవరో శత్రువులు ఆయన దేహాన్ని ఎత్తుకుపోయారు అనుకున్నారు. నిజానికి ఆయన శిష్యుల్లో ఎవరూ ఆయన మాటల్ని గానీ ఆయన పునర్జీవితం గురించి పాత ఒడంబడిక లేఖనాలలను గానీ అర్థం చేసుకోలేదు.

**20:3** యేసు దేహాన్ని శిష్యులు ఎత్తుకు పోలేదని వారికి తెలుసు, కాబట్టి ఏమి జరిగిందో తెలుసుకోవాలని ఆత్రుతగా

వెళ్ళడానికి బయలుదేరారు. 4 ఇద్దరూ కలిసి పరుగెత్తుతూ
ఉన్నారు గాని ఆ శిష్యుడు పేతురుకంటే త్వరగా పరుగెత్తి
మొదట సమాధి చేరాడు. 5 అతడు వంగి సమాధిలో ఆ
అవిసెనార గుడ్డలు ఉండడం చూశాడు గాని లోపలికి
వెళ్ళలేదు. 6 అప్పుడు అతడి వెనకాలే సీమోను పేతురు
వచ్చాడు. అతడు సమాధిలో ప్రవేశించి అక్కడ ఉన్న అవిసెనార
బట్టలు చూశాడు. 7 యేసు తలకు చుట్టిన గుడ్డ కూడా
చూశాడు. అది ఆ అవిసెనార బట్టలతో గాక వేరే చోట
చుట్టిపెట్టి ఉంది. 8 అప్పుడు, మొదట సమాధి దగ్గరికి చేరిన
ఆ మరో శిష్యుడు కూడా లోపలికి వెళ్ళి చూచి నమ్మాడు.
9 ఆయన చనిపోయినవారిలోనుంచి సజీవంగా లేవడం
తప్పనిసరి అనే లేఖనం అప్పటికి వారు గ్రహించలేదు.

10 అప్పుడు ఆ శిష్యులు మళ్ళీ తమ ఇండ్లకు వెళ్ళారు.
11 మరియ సమాధి బయట నిలుచుండి ఏడుస్తూ ఉంది. అలా
ఏడుస్తూ వంగి సమాధిలోకి చూచింది. 12 తెల్లని వస్త్రాలు
ధరించిన ఇద్దరు దేవదూతలు ఆమెకు కనబడ్డారు. యేసు
మృతదేహం మునుపు ఉన్న స్థలంలో తలవైపు ఒకరూ కాళ్ళవైపు
మరొకరూ కూర్చుని ఉన్నారు. 13 వారు ఆమెతో ఇలా అన్నారు:
“అమ్మా! ఎందుకు ఏడుస్తూ ఉన్నావు?”

ఆమె “వారు నా ప్రభువును తీసుకుపోయారు. ఆయనను
ఎక్కడ ఉంచారో నాకు తెలియదు” అంది.

14 ఆమె అలా చెప్పి వెనక్కు తిరిగింది. యేసు అక్కడ
నిలుచుండడం ఆమెకు కనిపించింది గాని యేసని ఆమె
గుర్తుపట్టలేదు.

15 యేసు ఆమెతో “అమ్మా, ఎందుకు ఏడుస్తూ ఉన్నావు?
ఎవరిని వెదకుతున్నావు?” అన్నాడు.

ఆయన తోటమాలి అనుకొని ఆమె ఆయనతో ఇలా అంది:
“అయ్యా, ఆయనను మోసుకుపోయినది మీరే గనుక అయితే
ఆయనను ఎక్కడ ఉంచారో నాతో చెప్పండి. నేను ఆయనను
తీసుకుపోతాను.”

16 అప్పుడు యేసు ఆమెతో “మరియా” అన్నాడు.

ఆమె ఆయనవైపు తిరిగి ఆయనతో “రబ్బోనీ!” అంది. ఆ
మాటకు “గురువు” అని అర్థం.

17 యేసు ఆమెతో ఇలా అన్నాడు: “నన్ను అంటిపెట్టుకొని
ఉండబోకు. ఎందుకంటే నేను ఇంకా నా తండ్రిదగ్గరకు పైకి
వెళ్ళలేదు. అయితే నా సోదరుల దగ్గరకు వెళ్ళి ఈ విధంగా

---

ఉన్నారు. ఇప్పుడు దీన్ని గురించిన యథార్థాన్ని తెలుసుకునేందుకు అందరు కూడా ఆసక్తి కలిగి ఉండాలి.

**20:6-8** యేసు దేహానికి యోసేపు, నీకొదేము ఆ బట్టలు చుట్టారు (19:40). ఎవరైనా ఆయన మృత దేహాన్ని దొంగిలించేందుకు వస్తే ఆ గుడ్డలన్నిటినీ ఓపిగ్గా విప్పరు. ఆయన తలకు చుట్టిన గుడ్డ మళ్ళీ చుట్టిపెట్టరు. అలాంటివారు హడావుడిగా అలానే గుడ్డలు చుట్టిన దేహాన్ని అదే విధంగా ఎత్తుకుపోయేవారు, లేదా ఆ గుడ్డలను గబగబా చింపేసి ఎక్కడ పడితే అక్కడ పారేసేవారు గదా. యోహాను దీన్ని చూచిన వెంటనే అర్థం చేసుకున్నాడు. యేసు సజీవంగా లేచిన సంగతి గురించిన నోట్ కోసం మత్తయి 28:6 చూడండి.

**20:9** కీర్తన 16:10; యెషయా 53:10-12; 1 కొరింతు 15:4.

**20:11** ఈమె మగ్దలేనే మరియ (వ 18). శిష్యుల వెనకే ఆమె మళ్ళీ సమాధి దగ్గరికి వచ్చింది. యేసుప్రభువు చనిపోయి సజీవంగా లేచిన తరువాత మొదటిసారిగా ఆయన్ను చూచినది ఆమె. ఆయన మొట్టమొదటిగా తన తల్లికి గానీ తన శిష్యుల్లో ఎవరికైనా గానీ కనిపించకుండా ఆమెకు కనిపించడం వింతగా అనిపిస్తుంది. తక్కువ తెలిసి, నమ్మకం బలహీనంగా ఉండి, ప్రేమ మాత్రం బలంగా ఉన్న ఆ స్త్రీ పై ఆయనకు జాలి కలిగింది.

**20:12** మొదట మరియతో వచ్చిన స్త్రీలు ఒకే దేవదూతను చూశారు. అతడు సమాధి బయట రాయిపై కూర్చుని ఉన్నాడు. (మత్తయి 28:1-7). మరియ చూచిన ఇద్దరు దేవదూతలు సమాధి లోపల ఉన్నారు. పేతురు, ఈ మరో శిష్యుడు లోపలికి వెళ్లినప్పుడు వారక్కడ లేరు. వారి ఆకారం బహుశా మనుషుల్లాగా ఉందేమో. దేవదూతల గురించి నోట్ ఆది 16:7 చూడండి.

**20:13** చనిపోయినవారిని తగిన విధంగా సమాధి చేయడం గురించి యూదులకు బాగా పట్టింపు. సమాధి దొంగలు వచ్చి యేసు దేహాన్ని ఎత్తుకుపోవడం ద్వారా ఆయన దేహానికి ఇవ్వవలసిన మర్యాదను భంగపరిచారని అనుకుని మరియ దుఃఖపడుతుంది.

**20:14** 21:4; మత్తయి 28:17; లూకా 24:16,37. యేసు సజీవంగా లేచిన తరువాత ఆయన ఆకారం చనిపోకముందు ఆకారానికి కొంత భిన్నంగా ఉన్నట్టుంది. అందువల్ల మరియ వెంటనే ఆయన్ను గుర్తించలేదు. అంతేగాక తాను ఆయన్ను అలా చూస్తానని ఎంతమాత్రం ఊహించి ఉండదు. పైగా ఆమె తల వంచుకుని ఏడుస్తూ ఉండడంవల్ల ఆయన ముఖంకేసి చూడలేదోమో.

**20:15** దీనికి జవాబు యేసుకు బాగా తెలుసు. 6:5,6; 11:34 పోల్చి చూడండి. ఈ ప్రశ్నలో సున్నితమైన మందలింపు ధ్వనించడం లేదా? లూకా 24:5 పోల్చి చూడండి. (దేవుడేమి చేస్తున్నాడో తెలియక కొన్ని సార్లు క్రీస్తు శిష్యులు ఆనందించవలసిన సందర్భాల్లో ఏడుస్తుంటారు).

“తోటమాలి” – ఆ సమాధి ఒక తోటలో ఉంది (19:41). ఆ ప్రాంతాల్లో తోటమాలి ఉంటాడని మరియ అనుకొని ఉంటుంది.

**20:16** ఆమె ఆయన్ను గుర్తుపట్టలేదు గానీ ఆయన స్వరం తెలుసు. పరిచయం లేని వ్యక్తి ఎవరూ తననలా పేరుతో పిలవరని కూడా ఆమెకు తెలుసు. ఆయనవైపు తిరిగి మరింత శ్రద్ధగా ఆయన వంక చూచినప్పుడు ఆయన్ను గుర్తు పట్టింది.

**20:17** “అంటిపెట్టుకొని ఉండబోకు” – బహుశా మరియ నేలపై పడి ఆయన పాదాలు పట్టుకొని ఉండవచ్చు. మత్తయి 28:9 పోల్చి చూడండి. యేసు ఇచ్చిన జవాబుకు అర్థం ఇదై ఉండవచ్చు– “నన్ను నీవు గట్టిగా పట్టుకోనక్కర్లేదు. నేను ఇంత త్వరలో ఎక్కడికీ వెళ్ళిపోను. నన్ను మళ్ళీ చూచే అవకాశం నీకు కలుగుతుంది”, లేదా “నన్ను ఈ లోకంలోనే ఉంచెయ్యాలని చూడవద్దు. మనుషుల విముక్తి కోసం దేవుడు చేసిన ఏర్పాటు పూర్తిగా నెరవేరాలంటే నేను పరలోకానికి వెళ్ళిపోవలసి ఉంది” అని ఆయన అర్థం కావచ్చు.

“సోదరులు” – శారీరకంగా తన తమ్ముళ్ళ (2:12; 7:3,5,10) గురించి కాదు గాని తన శిష్యులను ఉద్దేశించే ఈ మాట చెప్పాడని అనుకోవడంలో సందేహం లేదు. మత్తయి 12:47-50; హీబ్రూ 2:10-12 పోల్చి చూడండి.

“వెళ్ళిపోతున్నాను” – 14:28; మార్కు 16:14; లూకా 24:51; అపో కా 1:9-11.

“నా తండ్రి. . .మీ దేవుడు” – “మన తండ్రి, మన దేవుడు” అనలేదు యేసు. దేవుడు విశ్వాసులకు తండ్రి గానీ యేసుకు వేరే విధంగా తండ్రి. యేసు శాశ్వతుడైన దేవకుమారుడు (1:1,14,18). విశ్వాసులు దుర్బలులైన మానవమాత్రులే. వారు నూతన జన్మద్వారా, దేవుని కృపవల్ల మాత్రమే దేవుని సంతానం అయ్యారు (1:12,13).

చెప్పు: నా తండ్రి, మీ తండ్రి దగ్గరకు, నా దేవుడు, మీ దేవుని దగ్గరకు పైకి వెళ్ళిపోతున్నాను.”

18 మగ్‌దలేనే మరియ వెళ్ళి తాను ప్రభువును చూశాననీ ఆయన తనతో ఆ విషయాలు చెప్పాడనీ శిష్యులకు తెలియజేసింది.

19 ఆ రోజు – ఆ ఆదివారం నాడు – సాయంకాల సమయాన శిష్యులు ఒక గదిలో సమకూడి ఉన్నారు. యూదులకు భయం కారణంగా తలుపులు మూసి గడియ వేసుకొని ఉన్నాయి. అప్పుడు యేసు వచ్చి వారి మధ్య నిలుచుండి వారితో “మీకు శాంతి *కలుగుతుంది గాక!*” అన్నాడు. 20 అలా చెప్పి వారికి తన చేతులనూ ప్రక్కనూ చూపెట్టాడు. ప్రభువును చూచి శిష్యులు ఆనందించారు.

21 యేసు మళ్ళీ వారితో ఇలా అన్నాడు: “మీకు శాంతి *కలుగుతుంది గాక!* తండ్రి నన్ను పంపిన ప్రకారం నేను మిమ్ములను పంపుతున్నాను.” 22 ఆ విధంగా చెప్పి ఆయన వారిమీద ఊది “పవిత్రాత్మను స్వీకరించండి. 23 మీరు ఎవరి పాపాలు క్షమిస్తారో వారు క్షమాపణ పొందారు. ఎవరి పాపాలు ఉండనిస్తారో అవి అలాగే నిలిచి ఉన్నాయి” అన్నాడు.

24 యేసు వచ్చినప్పుడు పన్నెండుమందిలో ఒకడైన తోమా లేడు. (ఇతణ్ణి ‘దిదుమ’ అంటారు.) 25 కాబట్టి తక్కిన శిష్యులు “మేము ప్రభువును చూశాం” అని అతనితో చెప్పారు.

అతడైతే వారితో “ఆయన చేతులలో మేకుల మచ్చ నేను

---

**20:18** యేసు సజీవంగా లేవడం గురించి ఇతరులకు తెలియపరచిన మొదటి సాక్షి మగ్‌దలేనే మరియ.

**20:19** “భయం కారణంగా” – అంతకుముందే యేసును శత్రువులు సిలువ వేయడం వారు చూశారు. యేసుప్రభువు సంగతి ఏమౌతున్నదో వారికి తెలియదు. ఇది వారిలోని భయాన్ని తొలగించివేసి గొప్ప ధైర్యాన్నిచ్చే సంఘటన, అంటే వారిలో పవిత్రాత్మ నిండడం అన్నది ఇంకా జరగలేదు.

“యేసు వచ్చి” – చనిపోయి లేచిన క్రీస్తు దేహం మూసి తాళం వేసి ఉన్న తలుపుల గుండా కూడా పోగలదు. ఆ దేహం అంతకుముందున్న దేహమే (వ 20,27), కానీ చాలా మార్పు చెందిన దేహం. ఇష్టం వచ్చినట్టుగా ప్రత్యక్షం అయ్యాడు, మాయం అయ్యాడు (లూకా 24:31,36,37). 1 కొరింతు 15:42-44; ఫిలిప్పీ 3:21 చూడండి.

“శాంతి” – ఆయన ఈ లోకానికి రావడంలోని ఉద్దేశానికి అనుగుణమైన పదం (లూకా 2:13,14; 14:27).

**20:20** వ 27. తాను నిజంగా వారి యేసుప్రభువునేననీ సిలువ మరణం అనుభవించిన తన దేహంతోనే సజీవంగా లేచానని ఆయన వారికి రుజువు చేస్తున్నాడు. లూకా 24:36-43 పోల్చి చూడండి. వారాయన్ను చూచినప్పుడు వారికి కలిగిన ఆనందం ఆయన 16:20-22లో వారికి చెప్పిన మాటలకు నెరవేర్పు. ఆయన మరణంలో వారి ఆనందం, ఆశాభావమంతా మరణించింది (లూకా 24:21) ఆయన సజీవంగా లేవడంలో వాటికి ఊపిరి వచ్చింది. 1 పేతురు 1:3 పోల్చి చూడండి.

**20:21** “పంపుతున్నాను” – 17:18; మత్తయి 28:18-20; మార్కు 16:15; లూకా 24:46-48 చూడండి. ఆయన తాను తండ్రికి ప్రతినిధిగా వచ్చినట్టే, తన శిష్యులను తనకు ప్రతినిధులుగా అధికారమిచ్చి పంపుతున్నాడు. ఆయన ప్రకటించిన శుభవార్తనే వారు తీసుకు వెళ్ళారు. ఆయనలాగే వారు దేవుని ఆత్మతో వెళ్ళారు (వ 22).

**20:22** ఒక సంకేతంగా ఉన్న ఈ పని వారికి జీవం, బలప్రభావాలు, పవిత్రాత్మ సన్నిధి వచ్చేది యేసునుంచే అని సూచిస్తున్నది. ఆయన వారిని పంపుతున్నాడు. వారు చేయవలసిన పనికి ఆత్మ సంబంధమైన సామర్థ్యతను వారికిస్తాడు. ఈ వచనాన్ని ఆది 2:7తో పోల్చి చూస్తే బావుంటుంది. వీరు ఇక్కడ ఒక విధంగా పవిత్రాత్మను పొందారన్నట్టు అనిపిస్తున్నది. అంటే అంతకు ముందు వారితో పవిత్రాత్మ లేడని కాదు. పాత ఒడంబడిక కాలంలో సైతం దేవుని ఆత్మ సన్నిధిని గురించీ పని గురించీ విశ్వాసులకు కొంత తెలుసు (నిర్గమ 31:3; న్యాయాధి 3:10; 1 సమూ 10:6; 16:13; 2 సమూ 23:2; కీర్తన 51:11; మొ౹౹). అయితే ఇప్పుడు యేసుప్రభువు ఒక కొత్త రీతిలో దేవుని ఆత్మను వారికిస్తున్నాడు. ఈ సమయంలో వారికి ప్రత్యేకమైన జ్ఞానాన్ని, లేఖనాల విషయంలో గ్రహింపును ఇచ్చాడని అనుకోవచ్చు (లూకా 24:45 పోల్చి చూడండి). ఆయన పవిత్రాత్మను వారిలో నివాసముండే సన్నిధిగా ఇచ్చాడని అనుకోవచ్చు (7:39; 14:17). తన ప్రతినిధులుగా పరిచర్య చేసేందుకు వారికి అధికారాన్ని ఇస్తున్నాడన్నది స్పష్టమే. తరువాత ఆయన వారికి ఆత్మను మరింత ధారాళంగా ఇవ్వనున్నాడు (అపొ కా 1:4,5; 2:1-4).

**20:23** మత్తయి 16:19; 18:15-18 పోల్చి చూడండి. యేసుప్రభువు తన సంఘ స్థాపకులతో (అంటే మానవపరంగా), ప్రతినిధులతో మాట్లాడుతున్నాడు. అంటే భూమిపై ఉన్న ఆయన సంఘం (క్రీస్తు విశ్వాసులందరితో ఏర్పడిన సంఘం) దేవుని ఆత్మను పొంది ఎలాంటి మనుషులకు క్షమాపణ దొరుకుతుందో, ఎవరికి క్షమాపణ లేదో ప్రకటించగలుగుతుంది. పాపాలను క్షమించేదీ, క్షమించకపోయేదీ దేవుడే (మార్కు 2:7 నోట్. కీర్తన 103:3; 130:4 కూడా చూడండి). ఎలాంటివారిని క్షమించాలో ఎలాంటి వారిని క్షమించకూడదో నిర్ణయించేది కూడా దేవుడే. ఆయన దీన్ని ఇదివరకే నిర్ణయించాడు – లూకా 24:46,47; అపొ కా 10:43; 13:38,39; ఎఫెసు 1:7; 1 యోహాను 1:9. పశ్చాత్తాపపడి క్రీస్తులో నమ్మకం పెట్టుకునేవారినే దేవుడు క్షమిస్తాడు. క్షమాపణ ఆయన ఉచితంగా ఇచ్చేదే. ఈ సత్యాన్ని ప్రకటించడం క్రీస్తు సంఘం చెయ్యవలసిన పని. పాత ఒడంబడిక గ్రంథంలో ఇలాంటిదాని కోసం 2 సమూ 12:13 చూడండి.

పాత ఒడంబడిక ప్రవక్తలు ఫలానా విషయాలు చేస్తారని దేవుడు చెప్పినప్పుడు వారు వాటిని ప్రకటిస్తారని అర్థం. క్రీస్తు రాయబారులు చేసినది సరిగ్గా ఇదే. క్రీస్తు శుభవార్తను ప్రకటించడం ద్వారా నమ్మేవారందరికీ క్షమాపణ ద్వారాన్ని వారు తెరిచారు. నమ్మని వారందరికీ దాన్ని మూసివేశారు. పాపాలను క్షమించే దేవుని వైపుకు వ్యక్తులను మళ్ళించారు. మత్తయి 6:12; లూకా 11:4లో మనం పాపక్షమాపణ కోసం ఎవర్ని అడగాలో యేసు నేర్పించాడు.

క్రీస్తుసంఘం గానీ అందులోని సభ్యుడెవరైనా గానీ ఈ భూమిపై ఎవరితోనైనా ఇలా అనవచ్చు “నీవు యేసుప్రభువుపై నమ్మకం ఉంచితే నీ పాపాలన్నిటికీ క్షమాపణ ఉంది”. విశ్వాసులందరితో వారు ఇలా అనవచ్చు, “మీ పాపాలను మీరు ఒప్పుకుంటే ఆయన మిమ్మల్ని క్షమించి అన్యాయమంతటి నుంచీ మిమ్మల్ని శుద్ధి చేస్తాడు”. క్రీస్తు క్రైస్తవుల్లో నుంచి ఏ ప్రత్యేక గుంపునూ గురువులుగా, యాజులుగా నియమించలేదు, ఇలాంటి సత్యాన్ని కేవలం వారే ప్రకటించాలని ఎవరినీ ఎన్నుకోలేదు.

**20:25** అందుకే ఇతణ్ణి కొన్నిసార్లు “సందేహి అయిన తోమా” అంటారు. ఇతర శిష్యుల సాక్ష్యాన్ని అతడు నమ్మేందుకు సమ్మతించి ఉండవలసింది.

చూడకపోతే, ఆ మేకుల మచ్చలో నా వ్రేలు పెట్టకపోతే, ఆయన
ప్రక్కన నా చేయి పెట్టకపోతే నేను నమ్మను" అన్నాడు.
26 ఎనిమిది రోజుల తరువాత ఆయన శిష్యులు మళ్ళీ ఆ
గది లోపల ఉన్నారు. తోమా వారితో కూడా ఉన్నాడు.
తలుపులు మూసి *గడియ వేసి* ఉన్నాయి. యేసు వచ్చి వారి
మధ్య నిలిచి "మీకు శాంతి *కలుగుతుంది గాక!*" అన్నాడు.
27 అప్పుడు తోమాతో "నీ వ్రేలు ఇటు చాచి నా చేతులు
చూడు! నీ చేయి చాచి నా ప్రక్కన పెట్టు. అవిశ్వాసంతో
ఉండకుండా నమ్ము!" అన్నాడు.
28 అందుకు తోమా ఆయనతో "నా ప్రభూ! నా దేవా!"
అని ఆయనకు జవాబిచ్చాడు.
29 యేసు అతనితో "తోమా, నీవు నన్ను చూచి నందుచేత
నమ్మావు. చూడకుండానే నమ్మేవారు ధన్యులు" అన్నాడు.
30 యేసు సూచనకోసమైన అద్భుతాలు ఇంకా అనేకం తన
శిష్యుల సమక్షంలో చేశాడు. అవి ఈ పుస్తకంలో వ్రాసినవి
కావు. 31 కానీ యేసు అంటే అభిషిక్తుడూ దేవుని కుమారుడూ
అని మీరు నమ్మాలనీ నమ్మి ఆయన పేరు మూలంగా జీవం
కలిగి ఉండాలనీ ఇవి వ్రాసి ఉన్నాయి.

21 ఆ తరువాత తిబెరియ సరస్సు ఒడ్డున యేసు తనను
తన శిష్యులకు మరోసారి ప్రత్యక్షం చేసుకొన్నాడు.
ప్రత్యక్షమైన విధం ఏమంటే, 2 సీమోను పేతురు, దిదుమ అనే
పేరు ఉన్న తోమా, గలలీలోని కానావాడైన నతనియేలు,
జబదయి కొడుకులు, ఆయన శిష్యులలో మరి ఇద్దరు అంతా
పోగయ్యారు.
3 సీమోను పేతురు వారితో "చేపలు పట్టుకోవడానికి నేను
వెళ్తాను" అన్నాడు.
వారు "మేము నీతో కూడా వస్తాం" అన్నారు.
వెంటనే వారు వెళ్ళి పడవ ఎక్కారు. ఆ రాత్రి వారు పట్టినది
ఏమీ లేదు. 4 ప్రొద్దు పొడిచే సమయంలో యేసు ఒడ్డున
నిలుచున్నాడు గాని ఆయన యేసని శిష్యులు గుర్తుపట్టలేదు.
5 కనుక యేసు "అబ్బాయిలూ! తినడానికి మీదగ్గర ఏమైనా

---

**20:26** వ 19.

**20:27** బలహీనమైన నమ్మకం గలిగి సందేహించే శిష్యులపట్ల కూడా ప్రభువు ఎంత జాలి, ప్రేమ చూపిస్తున్నాడో చూడండి. ఆయన తోమాకు (వారందరికీ) సిలువ మరణం అనుభవించిన నిజమైన దేహాన్ని చూపించాడు. ఆ దేహం సిలువ వేయబడిందని దానిలో స్పష్టమైన గుర్తులు ఉన్నాయి. ఆయన సజీవంగా లేచాడని ఆ సాక్ష్యాధారాన్నీ ఆ రుజువునూ తోమా నమ్మాలని గట్టిగా చెప్పాడు. "అవిశ్వాసాన్ని విడిచిపెట్టి నమ్ము" అని ఈ రోజున కూడా మనందరికీ ఆయన చెప్తున్నాడు.

**20:28** తన ప్రజల తప్పులను దేవుడు మేలుగా మారుస్తాడు. తోమా సందేహం మూలంగా క్రీస్తు తనను తాను వెల్లడి చేసుకొన్నందువల్ల తోమా ఈ విధంగా తన నమ్మకాన్ని ప్రకటించిన ఈ ఉత్తమమైన మాటలు మనకు లభించాయి. తోమా యూదుడు. పాత ఒడంబడిక గ్రంథాన్ని అభ్యసించాడు. యేసుప్రభువు ఉపదేశాలను మూడేళ్ళపాటు విన్నాడు. ఒకే ఒక దేవుడు ఉన్నాడనీ ఇతర దేవుళ్ళెవరైనా ఒక వ్యక్తికి ఉండడం అన్ని పాపాల్లోకీ అతి హీనమైనదనీ అతనికి బాగా తెలుసు (మత్తయి 4:10; నిర్గమ 20:1-4; ద్వితీ 6:4,5; యెషయా 43:11; 44:6; 45:5 చూడండి). అతడు యేసును "నా ప్రభూ, నా దేవా" అన్నప్పుడు యేసు పాత ఒడంబడిక గ్రంథంలో వెల్లడైన సత్యయేక దేవుడు యెహోవా అవతారమని తన దృఢ విశ్వాసాన్ని ప్రకటిస్తున్నాడన్న మాట. 1:1,14,18; 5:17,18; 8:24,58; 10:30-33 చూడండి. లూకా 2:11; ఫిలిప్పీ 2:6 నోట్స్‌లో ఇతర రిఫరెన్సులు చూడండి.

**20:29** యేసుప్రభువు అతని మాటలకు అంగీకరించాడు. తాను ప్రభువనీ దేవుడనీ యేసుకు తెలిసి ఉండని పక్షంలో ఆయన ఇలా ఏమాత్రమూ అంగీకరించేవాడు కాదు. మానవమాత్రులు వారు మంచివారై న్యాయవంతులై ఉంటే ఇలా దేవునికే చెందవలసినవాటిని స్వీకరించరు (అపో కా 14:13-15 పోల్చి చూడండి).

"ధన్యులు" – తోమా నమ్మినట్టు, యేసు చనిపోయి సజీవంగా లేచాడనీ, ఆయనే ప్రభువు, నిజ దేవుడనీ, ఆయన మన దేవుడనీ నమ్మిన ప్రతి ఒక్కరికీ కూడా ఈ నాడు ఈ ధన్యత కలుగుతుంది (రోమ్ 10:9,10 పోల్చి చూడండి). ధన్యత గురించి ఆది 12:3; సంఖ్యా 6:23-27; కీర్తన 1:1-3; 119:1; మత్తయి 5:3-10 నోట్స్ చూడండి. దీనికి వ్యతిరేకం కూడా నిజమే. నమ్మనివారు ధన్యులని దేవుడు చెప్పడు. 3:18,36; మార్కు 16:16 చూడండి.

**20:30** "అనేక" – 21:25. వీటిలో కొన్ని ఇతర శుభవార్త పుస్తకాల్లో రాసి ఉన్నాయి. యేసు చేసిన సూచకమైన అద్భుతాల్లో కొన్నింటిని యోహాను ప్రత్యేకంగా ఒక ప్రత్యేక ఉద్దేశంతో ఏరి ఇందులో పొందుపరచాడు. ఇలాంటి సూచనల గురించి నోట్ 2:11.

**20:31** ఇక్కడ మూడు అతి ప్రధాన సత్యాలున్నాయి.

మొదటిది, నమ్మడానికి చాలా అద్భుతమైనది ఇక్కడ కనిపిస్తున్నది – ఇస్రాయేల్ వారి అభిషిక్తుడుగా, లోకానికి ముక్తిప్రదాతగా దేవుడు అభిషేకించినది యేసునే; ఆయన దేవుని కుమారుడు, దేవుని స్వభావంలో భాగస్వామి (మత్తయి 1:1 మొదలైన చోట్ల నోట్స్ చూడండి).

రెండోది దీన్ని నమ్మేందుకు చక్కని ఆధారాలు ఉన్నాయి – చనిపోయి సజీవంగా లేవడంతో సహా యేసు చేసిన సూచకమైన అద్భుతాలు.

మూడోది దీన్ని నమ్మడం వల్ల కలిగే ఫలితాలు – జీవం, ఆయన పేర శాశ్వత జీవం (3:16,36; 5:24; 6:47). ఈ విధంగా యోహాను ఈ శుభవార్తలోని అతి ప్రాముఖ్యమైన కొన్ని సత్యాలను టూకీగా రాశాడు.

**21:1** "తిబెరియ" – గలలీ సరస్సు. యేసు తన శిష్యులను గలలీ వెళ్ళాలని చెప్పాడు (మత్తయి 28:7,10). చనిపోయి సజీవంగా లేచిన తరువాత యేసు నలభై రోజులు తన శిష్యులతో ఆయా ప్రదేశాల్లో గడిపాడు (అపో కా 1:3).

**21:2** జెబెదయి కొడుకులు యాకోబు, యోహాను (మత్తయి 10:2).

**21:3** ఆ రోజుల్లో యేసు శరీరంతో అస్తమానం వారితో లేదు. శిష్యులు పని చేసి పొట్టపోసుకోవలసిన పేదలు (మత్తయి 4:18-22; అపో కా 3:6). యేసుప్రభువు తమకు కనిపించాలని ఎదురుచూస్తున్న సమయంలో తమ ఖర్చుల నిమిత్తం కొంచెం డబ్బు సంపాదించడం పేతురు ఉద్దేశం కావచ్చు. ప్రభువు అప్పగించిన పనిని విడిచి పెట్టెయ్యాలన్న తలంపు వీరిలో ఎవరికైనా ఉన్నట్టు ఎలాంటి ఆధారమూ ఈ వచనాల్లో కనిపించదు. శుభవార్త ప్రకటించేవారు తమ పోషణకోసం వేరే పని చేసుకోవడం పొరపాటేమీ కాదు. అసలు, అది మంచి పద్ధతే (అపో కా 18:3; 20:34,35; 2 తెస్స 3:7-10).

**21:4** 20:15; లూకా 24:17.

**21:5** "అబ్బాయిలారా" – 13:33 పోల్చి చూడండి.

ఉందా?” అని వారితో అన్నాడు.

“లేదండి” అని వారు ఆయనకు బదులు చెప్పారు.

6 అప్పుడాయన “పడవ కుడిప్రక్క వల వేయండి. మీకు చేపలు దొరుకుతాయి” అని వారితో చెప్పాడు. వారలా వల వేసినప్పుడు బోలెడన్ని చేపలు పడడం చేత వల లాగలేక పోయారు.

7 అందుచేత యేసు ప్రేమించిన ఆ శిష్యుడు “ఆయన ప్రభువే!” అని పేతురుతో చెప్పాడు.

ఆయన ప్రభువని సీమోను పేతురు వినగానే, మునుపు తీసివేసిన తన పై బట్ట వేసుకొని సరస్సులో దూకాడు. ఒడ్డు అక్కడికి చాలా దూరంలో లేదు – సుమారు రెండు వందల మూరల దూరం. 8 కనుక తక్కిన శిష్యులు చేపలున్న వల లాక్కొంటూ ఆ చిన్న పడవలో వచ్చారు. 9 ఒడ్డుకు చేరగానే అక్కడ నిప్పు, దానిమీద చేపలూ రొట్టెలూ వారికి కనిపించాయి.

10 యేసు “ఇప్పుడు మీరు పట్టిన చేపలలో కొన్నిటిని ఇటు తీసుకురండి” అని వారితో అన్నాడు. 11 సీమోను పేతురు పడవ ఎక్కి వల ఒడ్డుకు లాగాడు. వల పెద్ద చేపలతో నిండి ఉంది – మొత్తం నూట యాభై మూడు చేపలు. ఇన్ని ఉన్నా వల పిగలలేదు.

12 యేసు “వచ్చి భోం చేయండి” అని వారితో అన్నాడు. ఆయన ప్రభువని శిష్యులకు తెలుసు గనుక “మీరెవరు?” అని ఆయనను అడగడానికి ఎవరూ తెగించలేదు. 13 యేసు వచ్చి రొట్టెలు చేతపట్టుకొని వారికి పంచి ఇచ్చాడు, అలాగే చేపలు కూడా ఇచ్చాడు. 14 చనిపోయినవారిలో నుంచి సజీవంగా లేచిన తరువాత యేసు తన శిష్యులకు కనుపరచుకోవడం ఇది మూడో సారి.

15 వారు భోజనం చేసిన తరువాత సీమోను పేతురుతో యేసు ఇలా అన్నాడు: “యోనా కొడుకైన సీమోనూ! నీవు వీరికంటే నన్ను ఎక్కువగా ప్రేమిస్తున్నావా?”

---

**21:6** ఇలాంటి అద్భుతమే లూకా 5:4-10లో ఉంది. సముద్రంలో ప్రతి చేప ఎక్కడుందో, ఆకాశంలో ప్రతి నక్షత్రం ఎక్కడుందో యేసుప్రభువుకు తెలుసు (యెషయా 40:26). మనుషుల్ని పట్టే జాలరులకు (మత్తయి 4:19) ఇక్కడొక మంచి పాఠం ఉంది. క్రీస్తు వారి ప్రయత్నాలకు మార్గదర్శకుడుగా ఉంటూ దీవించకపోతే వారి కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరే. రాబోయే కాలంలో విశ్వాసులయ్యే వారంతా ఎక్కడున్నారో వారిని చేరుకోవడమెలాగో ఆయనకు తెలుసు.

**21:7** గతంలో జరిగిన ఆ అద్భుతం తరువాత పేతురులో కనిపించిన మనస్తత్వానికీ ఇప్పటికీ చాలా తేడా ఉంది (లూకా 5:8). ఈ మధ్య కాలంలో తన గురించీ యేసుప్రభువు గురించీ అతడెన్నో సంగతులు నేర్చుకున్నాడు.

**21:9** పరలోకంనుంచి వచ్చిన ప్రభువు తన శిష్యుల కోసం ఆహారం సిద్ధం చేశాడు. 13:3-5; మత్తయి 20:28 పోల్చి చూడండి. లూకా 12:35-37 కూడా చూడండి.

**21:11** శిష్యులు ఆ చేపలను అమ్మి ఖర్చులకు డబ్బు సంపాదించుకోగలిగేవారు. ప్రభువు ఆ వల పిగిలిపోకుండా చేశాడు కూడా. అప్పటినుంచి అన్ని తరాల్లోనూ, అద్భుతమైన రీతుల్లో ప్రభువు తన సేవకులను పోషించాడు. మత్తయి 6:31-33; ఫిలిప్పీ 4:19 ఎప్పటికీ నిలిచివుండే సత్యాన్ని తెలియజేస్తున్నాయి. 1 రాజులు 17:3-9 కూడా చూడండి.

**21:12** “భోం చేయండి” – ప్రకటన 3:20 పోల్చి చూడండి. చనిపోయి సజీవంగా లేచిన దేవుని కుమారుని సమక్షంలో శిష్యులు అద్భుతాశ్చర్యాలతో తల మునకలైపోతూ, ఏమి మాట్లాడాలో తోచక మిన్నకుండి ఉంటారు.

**21:13** ప్రభువు భోజనం వండడమే కాదు, వారికి వడ్డించాడు కూడా. మనుషులకు పరిచర్య చేయాలన్న ఆయన అభిలాష ఆయన మరణించి సజీవంగా లేవడంతో అంతమైపోలేదు (హీబ్రూ 13:8).

**21:14** “మూడో సారి” – తన ఆది శిష్యుల గుంపుకు కనిపించాడన్నమాట. స్త్రీలకు, ఇతరులకు కనిపించిన సందర్భాలు ఇంకా కొన్ని ఉన్నాయి.

**21:15-17** పేతురు ప్రభువును మూడుసార్లు ఎరగనని అబద్ధం చెప్పాడు (18:17,25,27). అందుకు అతడెంత వేదనపడ్డాడో మత్తయి 26:75ను బట్టి మనం అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు అతని ప్రేమను గురించి మూడుసార్లు అతణ్ణి యేసు ప్రశ్నిస్తున్నాడు. తాను యేసెవరో తెలియదని చెప్పిన మూడుసార్లు పేతురుకు గుర్తుకు వచ్చి ఉండాలి. అతడు తనను తాను ఎదుర్కొని తన బలహీనతను, అజ్ఞానాన్ని, పాపాన్ని గుర్తించగలిగితే అతనికి మంచిది. సైతాను “జల్లించినది” ప్రత్యేకంగా పేతురునే (లూకా 22:31). అందువల్ల ప్రభువు ప్రత్యేకంగా పేతురు సంగతి చూస్తున్నాడు. పేతురుతో ఇలా మాట్లాడ్డం ద్వారా ఆయన ఇతర శిష్యులకు (మనకు కూడా) చాలా ప్రాముఖ్య సత్యాన్ని నేర్పిస్తున్నాడు. పేతురు దుఃఖాన్ని ప్రభువు తిరిగి మేల్కొల్పినప్పటికి అది ఆయన ముఖ్యోద్దేశం కాదు. ఆయన ముఖ్యోద్దేశం పేతురును బలపరచి తిరిగి అతనికి తన పనిని అప్పగించడం.

“వీరికంటే” – గ్రీకులో (ఇంగ్లీషులో కూడా) ఈ మాటను బట్టి యేసు “వీరికంటే” అంటున్నాడా “వీటికంటే” అంటున్నాడా అని తెలుసుకోవడం కష్టం. కాబట్టి ఈ మాటను మూడు విధాలుగా వివరించవచ్చు. “ఈ శిష్యులు ప్రేమించినంతకంటే ఎక్కువగా నీవు నన్ను ప్రేమిస్తున్నావా?”, లేక “ఈ శిష్యులను నీవు ప్రేమించినదానికంటే నన్ను ఎక్కువగా ప్రేమిస్తున్నావా”, లేక “చేపలు, చేపలు పట్టడం కంటే నన్ను ఎక్కువ ప్రేమిస్తున్నావా?” ఈ మూడింటిలో మొదటిది సరైన వివరణ అనుకునే అవకాశం ఉంది. క్రీస్తు పట్ల తనకున్న ప్రేమానురాగాలను ఇతరులందరికంటే పేతురే ఎక్కువగా చెప్పాడు (13:37), ఇతర శిష్యులకంటే తాను గొప్పవాణ్ణి అన్నట్టు పోలిక చెప్పాడు (మత్తయి 26:33). “సరే, నీ చేదు అనుభవం తరువాత, నీ బలహీనత నీకు తెలిసివచ్చిన తరువాత ఇప్పుడు వీరందరికంటే నీవే నన్ను ఎక్కువగా ప్రేమిస్తున్నావని చెప్పగలవా?” అని ఈ ప్రశ్నకు అర్థం అన్నట్టుంది.

రెండో వివరణకు అంత అవకాశం కనిపించదు. కానీ మత్తయి 10:37,38 పోల్చి చూడండి. పరలోకం ప్రభువును ప్రేమించినదానికంటే ఇహలోకంలో స్నేహితులను ఎక్కువగా ప్రేమించడం కూడా సాధ్యమే.

పైన ఇచ్చిన మూడో వివరణను తీసుకుంటే ఇలా చెప్పుకోవచ్చు : “నాకంటే, నా విధానాల కంటే నీ పాత జీవితం, దాని విధానాలే నీకెక్కువ ఇష్టమా?” (వ 19; మత్తయి 4:18-20; 19:27).

ఏ అర్థం మనం తీసుకున్నా ఒకటి మాత్రం స్పష్టమే. యేసుప్రభువుతో ఒక శిష్యునికి ఉండే సంబంధంలో ఒకటి మాత్రం అన్నిటికంటే అత్యంత ప్రాముఖ్యం – ఆయనపట్ల ప్రేమ. 1 కొరింతు 13:1-3; 16:22 పోల్చిచూడండి. ఆయనపై మనకున్న ప్రేమకు అనుగుణంగానే మనం ఆయనకిష్టమైన రీతిలో ఆయన్ను సేవించగలం

అతడు “అవును, ప్రభూ! నేను నిన్ను ప్రేమిస్తున్నానని నీకే తెలుసు” అని ఆయనతో చెప్పాడు.

ఆయన అతనితో “నా గొర్రెపిల్లలను మేపు” అన్నాడు. 16 మళ్ళీ ఆయన “యోనా కొడుకైన సీమోనూ! నీవు నన్ను ప్రేమిస్తున్నావా?” అని రెండో సారి అతనితో అన్నాడు.

అతడు “అవును, ప్రభూ! నేను నిన్ను ప్రేమిస్తున్నానని నీకే తెలుసు” అని ఆయనతో చెప్పాడు.

ఆయన అతనితో “నా గొర్రెలకు కాపరిగా ఉండు” అన్నాడు. 17 ఆయన అతనితో మూడో సారి ఇలా అన్నాడు: “యోనా కొడుకైన సీమోనూ! నీవు నన్ను ప్రేమిస్తున్నావా?”

“నీవు నన్ను ప్రేమిస్తున్నావా?” అని మూడో సారి తనతో చెప్పినందుచేత పేతురు నొచ్చుకొని ఆయనతో “ప్రభూ! అంతా నీకు తెలుసు. నిన్ను ప్రేమిస్తున్నానని నీకు తెలిసే ఉంది” అన్నాడు.

యేసు అతనితో ఇలా అన్నాడు: “నా గొర్రెలను మేపు. 18 నేను నీతో ఖచ్చితంగా చెపుతున్నాను, నీ యువప్రాయంలో నీ నడుము నీవే బిగించుకొని నీ ఇష్టప్రకారం తిరిగేవాడవు. కానీ, ముసలివాడవైనప్పుడు నీ చేతులు చాపుతావు. వేరొకడు నీ నడుము బిగించి నీకు ఇష్టం కాని స్థలానికి నిన్ను తీసుకుపోతాడు.” 19 అతడు ఎలాంటి చావుకు గురి అయి దేవునికి మహిమ కలిగిస్తాడో దానిని సూచించడానికి ఆయన ఆ మాటలు చెప్పాడు. ఆయన అలా చెప్పి “నన్ను అనుసరిస్తూ ఉండు” అని అతనితో అన్నాడు.

20 పేతురు వెనక్కు తిరిగి, యేసు ప్రేమించిన ఆ శిష్యుడు తమ వెంట రావడం చూశాడు. పస్కా భోజన సమయంలో యేసు ఛాతీని ఆనుకొని “ప్రభూ, నిన్ను ఎవడు పట్టి ఇస్తాడు?” అని చెప్పినవాడు ఇతడే. 21 అతణ్ణి చూచి పేతురు యేసుతో “ప్రభూ, ఇతని సంగతి ఏమిటి?” అన్నాడు.

22 యేసు “నేను తిరిగి వచ్చేంతవరకు అతడు ఉండిపోవడం నాకిష్టమైతే అది నీకేమిటి? నీ మట్టుకు నీవు నన్ను అనుసరిస్తూ ఉండు” అని అతనితో చెప్పాడు.

23 అందుచేత ఆ శిష్యుడు చనిపోడనే మాట సోదరులలో ప్రాకిపోయింది. అయినా అతడు చనిపోడని యేసు అతనితో చెప్పలేదు గానీ “నేను తిరిగి వచ్చేంతవరకు అతడు ఉండిపోవడం నాకిష్టమైతే అది నీకేమిటి?” అన్నాడు. 24 ఈ సంగతులను గురించి సాక్ష్యం చెపుతున్నది, వాటిని వ్రాసినది

---

“మేపు” – దేవుని వాక్కుతో పేతురు కొత్తగా విశ్వాసులైన వారిని, అనుభవం లేనివారిని పోషించాలన్నమాట. ప్రేమ కార్యరూపంలో బయట పడాలి. 14:15,23 చూడండి. మనం క్రీస్తును ప్రేమిస్తే ఆయన ప్రజలను కూడా ప్రేమిస్తాం (1 యోహాను 4:20).

**21:16** “కాపరిగా ఉండు” – కేవలం “మేపడం” కంటే మరింత ఎక్కువ అర్థం ఇందులో ఉంది. క్రీస్తు ప్రజలను ప్రేమగల కాపరిగా ఉండి, అన్నివిధాలా వారి సంక్షేమాన్ని, ముఖ్యంగా ఆధ్యాత్మిక విషయాల్లో చూచుకుంటూ ఉండాలని దీని అర్థం. ఇలా చెప్పడంలో యేసు పేతురును ఇతర శిష్యులకంటే అధికంగా హెచ్చిస్తున్నాడా? లేదు. వారు, ఇంకా అనేకమంది కూడా, ఉపదేశకులుగా కాపరులుగా దేవుని మందను మేపేవారుగా ఉండాలి – అపో కా 20:28; ఎఫెసు 4:11–13; 1 పేతురు 5:1–4. క్రీస్తు ఒక్కడే ప్రముఖుడైన కాపరి.

**21:17** “మూడో సారి” – ప్రభువును మూడుసార్లు ఎరగననడం గుర్తుకు వచ్చి పేతురు ఇలా నొచ్చుకొన్నాడనడంలో మనకు సందేహం ఉందా?

“అంతా నీకు తెలుసు” – 2:24,25; హీబ్రూ 4:13 పోల్చి చూడండి. ఇలా అనడంలో యేసు దేవుని అవతారమని పేతురు పూర్తిగా నమ్మి ఉండాలి. దేవుడు తప్ప అంతా తెలిసిన వారెవరున్నారు?

“గొర్రెలను” – వ 15తో సరిచూడండి. వీరు అనుభవం ఉన్న విశ్వాసులు కావచ్చు. ఆహారం అవసరం లేనంతగా ఏ విశ్వాసీ ఎదిగిపోడు.

**21:18,19** పేతురు ముసలివాడైపోయి చనిపోతాడని ప్రభువు సూచిస్తున్నాడు. ఆ ఆది శిష్యులు బ్రతికివున్న కాలంలోనే ఏ క్షణంలోనైనా క్రీస్తు తిరిగి రాగలిగేవాడని కొంతమంది బోధించే సిద్ధాంతంతో దీన్నీ పొసగేలా చెయ్యడం తేలిక కాదు. ఈ భవిష్యద్వాక్కు పలికిన తరువాత ప్రభువు పేతురు వృద్ధుడై చనిపోకముందే తిరిగి రాగలిగేవాడా?

“దేవునికి మహిమ” – ఇంతకు ముందు యేసును తానెరుగనన్నాడు పేతురు. కానీ మరణంలో అతడు స్థిరంగా ఉండి చివరికి తన మాట నిలుపుకుంటాడు (13:37). పారంపర్యంగా వచ్చిన విషయాన్ని బట్టి పేతురు సిలువ మరణం పొందాడంటారు. ఇక్కడ క్రీస్తు పేతురుతో చెప్పిన చివరి మాట అతనితో చెప్పిన మొదటి మాటలాగానే ఉంది (మత్తయి 4:18,19). శిష్యుడుగా అతణ్ణి పిలిచిన సత్యాన్ని ఇది స్థిరపరచింది.

**21:20** 13:23. “యేసు ప్రేమించిన శిష్యుడు” కూడా చేపలు పట్టేందుకు వెళ్ళిన ఏడుగురిలో ఉన్నాడు (వ 2,3). ఇతడు పేతురు కాదని మనకు తెలుసు. యోహాను తప్ప ఇతడు వేరే ఎవరైనా అయి ఉండే అవకాశం ఉన్నట్టు లేదు.

**21:21** “ఇతడి భవిష్యత్తు ఏమిటి? ఇతడు కూడా ముసలివాడైపోతాడా? ఇతనికిష్టం లేనిచోటికి ఇతణ్ణి కూడా తీసుకువెళ్తారా? నేను బలాత్కరంగా మరణం పొందితే నా సోదరుడు యోహాను కూడా అలాంటి మరణమే పొందుతాడా?” అని ఈ ప్రశ్నలో భావంలా ఉంది.

**21:22** దేవుని సేవకులందరికీ హెచ్చరికగా ఉండవలసిన మందలింపు మాటలివి. ప్రభువుపట్ల పేతురుకు ఉన్న ఇప్పటి బాధ్యతే అతడు చూచుకోవాలి గాని వేరొకరి భవిష్యత్తు సంగతి కాదు. సహ విశ్వాసుల పట్ల ప్రేమపూర్వకమైన ఆసక్తి మనకు ఉండకూడదని యేసు చెప్పడం లేదు (13:34; 1 కొరింతు 12:25,26; గలతీ 6:2 పోల్చి చూడండి). అయితే ఇతరుల పట్ల క్రీస్తుకున్న ఉద్దేశాలను తెలుసుకోవాలని మనకు తగని ఆశ కలగవచ్చు. ఇతరులు ఏమి చేస్తున్నారో చూడడంతోనే పొద్దుపుచ్చుతూ, కేవలం ప్రభువునే అనుసరించాలన్న మన బాధ్యత నిర్లక్ష్యం చేసే అవకాశం లేకపోలేదు.

**21:23** “అన్నాడు” – యేసు మాటలకు అర్థం చెప్పడంలో మనం ఎంత జాగ్రత్తగా ఉండాలో గదా! యేసుప్రభువు మామూలుగా చెప్పిన ఒక మాటను కొందరు ఎంతగా అపార్థం చేసుకుంటారో, అక్కడ లేని తలంపులు దానికి కలిపి దాని అర్థాన్ని ఎలా తప్పుదారి పట్టిస్తారో ఇదొక మంచి ఉదాహరణ. సరిగ్గా యేసు పలికిన మాటనే యోహాను ఎలా నొక్కి చెప్తున్నాడో గమనించండి. సామెత 30:5,6 పోల్చి చూడండి.

**21:24** యేసు ప్రేమించిన శిష్యుడెవరో (వ 20) ఇక్కడ మనకు తెలిసిపోతున్నది. అతడు ఈ శుభవార్త రచయిత. ఇతడు క్రీస్తురాయబారి యోహాను అనేందుకు సాక్ష్యాధారాలున్నాయి గానీ మరి ఏ ఇతర శిష్యుడనుకునేందుకూ ఆధారాలు లేవు.

ఆ శిష్యుడే. అతని సాక్ష్యం సత్యమని మాకు తెలుసు.
25 యేసు చేసిన ఇతర కార్యకలాపాలు అనేకం. ఒకవేళ
వాటిలో ప్రతిదానినీ వివరంగా వ్రాస్తే, వ్రాసిన పుస్తకాలను పెట్టడానికి ఈ లోకమే చాలదనుకొంటాను. తథాస్తు.

---

"మాకు" – ఇక్కడ బహువచనంలోకి ఎందుకు దిగవలసి వచ్చిందో చెప్పలేము. యోహాను రాసినదానికి మరో శిష్యుడు ఈ వాక్యాన్ని గనక కలిపి ఉంటే ఆ శిష్యుడెవరో మనకు తెలియదు. అదెలాగైనా ఇది కూడా దేవుని వాక్కే అని మా నమ్మకం.

**21:25** "ఇతర కార్యకలాపాలు" – 20:30; మత్తయి 8:16; 9:35; మొ॥

"పుస్తకాలు" – అలాంటివి ఎంతో విలువగలవి అయినా, అవన్నీ మనకు అవసరం లేదని దేవునికి తెలుసు. మనకేది అవసరమని ఆయన భావించాడో అదంతా మనకు ఉంది. ఆయన మనసులో ఉన్న ఉద్దేశానికి ఆయన మనకిచ్చినది సరిపోతుంది. ఆయన ఇచ్చినదాని కోసం ఆయనకు కృతజ్ఞతలు చెప్పి మన జీవిత కాలమంతా మన పఠనంలో దాన్ని ముఖ్య భాగంగా చేసుకుని ఆయన కృపవల్ల దాన్ని ఆచరణలో పెట్టేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తుంటే చాలు.